భారతి

డిసెంబరు, 1986

వెల : 4 రూపాయలు




వెన్నెల లోతుల్లో నారాయణబాబు
-డా॥ యు.ఎ. నరసింహమూర్తి

అమ్మ కోసం ఓ రోజు
- అశోక మిత్రన్


భావ కవులు - ఛందో వైవిధ్యం
శివలెంక ప్రకాశరావు

గెలవండి! రూ. 20,000/-ల విలువైన బహుమతులు!



కలువబాల చందాదారులకు లక్కీడిప్:

ఈ అవకాశం జనవరి 31 వరకు



మొదటి బహుమతి
★ ఒక కలర్ టి.వి.

రెండవ బహుమతులు
★★ రెండు బ్లాక్ అండ్ వైట్ టి.వి.లు

మూడవ బహుమతులు
★★★ మూడు "కిచెన్ మెషిన్"లు (మిక్సర్‌లు)

నాలుగవ బహుమతులు
★★★★ నాలుగు "లేడీస్ రిస్ట్ వాచీ"లు

రు. 60లు సంవత్సర చందా కట్టగానే అందమైన 'కలువబాల' పత్రిక నెలకి రెండుసార్లు మీ యింటికి అందుతుంది. అదిగాక మీరి క్రింది బహుమతులు గెలుచుకోవచ్చు.

"చిరుకానుక" తప్పకుండా అందరికీ వుంటుంది.

మీరేం చెయ్యాలి? చేయవలసిందల్లా 'కలువబాల'కు ఏడాది 'చందాదారులుగా' చేరడమే! కాకపోతే మీ 'చందా' ఫైకంతో పాటు యిక్కడ యిచ్చిన కూపన్ పూర్తి చేసి పంపాలి!

అంతేకాదు ఈ బహుమతి పథకంలో పాల్గొన్న చందాదారులందరికి 'కలువబాల' నుంచి ఒక 'చిరుకానుక' కాలక్రమంలో అందుతుంది.

"లక్కీడిప్" 31-1-1987 లేదా ఆ లోపల కట్టే చందాలకి మాత్రమే వర్తిస్తుంది.

కూపన్‌లు, చందాలు పంపవలసిన చిరునామా:

కలువబాల,
కేరాఫ్: ఆంధ్రపత్రిక,
గాంధీనగరం, విజయవాడ-3.

---- కత్తిరించాలి ----



నిజమయితే ✓
కాకపోతే ×
అని గుర్తు పెట్టాలి

ఆంధ్రపత్రిక బొంబాయి నుంచి వెలువడుతూ వుండేది. ( )

దినపత్రిక కన్నా వారపత్రిక ముందే పుట్టింది. ( )

"భారతి" సాహితీప్రియుల పక్ష పత్రిక ( )

బాలరంజని పిల్లల పత్రిక ఆంధ్రపత్రిక ప్రచురణ ( )

కలువబాల చందాదారుల 'లక్కీడిప్' చందా కట్టిన వారి పూర్తి పేరు: ....

....

చిరునామా ....

....

....

ఎమ్. ఓ. పంపిన తేదీ
లేదా
డి. డి. జత చేయడమైనది

సంపుటము : 63 డిసెంబరు, 1986 సంచిక : 12

భారతి

సాహిత్య మాసపత్రిక

సంస్థాపకుడు
కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

సంపాదకుడు
శివలెంక శంభుప్రసాద్
(1938-1972)

విషయానుక్రమణిక

ముఖచిత్రం : నర్తకి కుమారి మినావల్లియప్పన్

స్వవిషయం

ఈనెల భారతిలో శ్రీ అశోక మిత్రన్ తమిళ కథకి అనువాదం ఒకటి వేస్తున్నాము. కన్నడం, తమిళం, హిందీ, ఒరియా, బెంగాలీ, మరాఠీ భాషలనుంచి తెలుగు చేసిన కథలు ఇంతకి ముందు ఎన్నో భారతిలో పడ్డాయి. ఇతర భాషలనుంచి కూడా అనువాదం చేసిన కథలు ప్రచురించే అవకాశం కలుగగలదని ఆశిస్తున్నాము...

★ ★ ★ ★ ★ ★ ★

చిన్న నవలల పోటీలో మూడవ బహుమతి పొందిన "నది" ప్రకటించినట్లే భారతి డిసెంబరు సంచికలో ప్రచురించబడుతోంది. ప్రతినెలా ఒక చిన్న నవల వెయ్యాలని మా ఆశ!

కీ. శే. నారాయణబాబుగారు విజయనగరానికి చెందిన వారు. ఆయనమీద వ్యాసం రాసిన డాక్టరు యు. ఎ. నరసింహమూర్తి కూడా విజయనగరంలోనే అధ్యాపకులుగా పని చేస్తున్నారు...


డాక్టరు శివలెంక ప్రకాశరావు "భావ కవులు – ఛందో వైవిధ్యం." అనే వ్యాసం ఎటువంటి చర్చలకి దారితియ్యగలదో చూడాలి...

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

నవంబరు "రాశి ఫలాలు"లో కుంభరాశి శీర్షిక అచ్చు కాలేదు! పొరపాటు జరిగినందుకు చింతిస్తున్నాము.

ఏడి పత్రిక వెల : నాలుగు రూపాయలు

నాగేశ్వరరావు ఎస్టేట్స్ ప్రయివేట్ లిమిటెడ్ తరఫున ముద్రాపకుడు, ప్రచురణకర్త : శివలింక నాగేశ్వరరావు;
ముద్రణ : ఆంధ్రపత్రికప్రెస్, గాంధినగరం, విజయవాడ-3, సంపాదకుడు : శివలింక రాధాకృష్ణ.
ఫోన్లు :- బిజినెస్ : 61247, 61248; ఎడిటోరియల్ : 75667



హయగ్రీవరావ్ మెట్లు ఎక్కుతూనే వున్నారు. ఇంకా ఎన్ని?... ఆయాసం వచ్చేస్తోంది ఇంకా మీదకి.... ఇంకా మీదకి... మెట్లు ఇక మరి కనపడడం లేదు. మరొక మెట్ల వరస అల్లంత దూరాన కన పడుతోంది కాని ఈ వరసమీదనుంచి ఆ వరసమీదకు వెళ్ళడం ఎలా? ఎగిరి గంతేసే?

క్రింద పడితే మరేమయినా ఉందా? సరిగా అంత ఎత్తున వున్న ఆ మెట్ల మీదకి దూకడం సాధ్యమే?

క్రిందనున్న మెట్లు ఒకటీ ఒకటీ అదృశ్యమైపోతున్నాయి. మరి తవెలా నుంచున్నాడు.

ఇక దూకెయ్యక తప్పదు. చెంగున గెంతాడు. కాని అవతల వరస మెట్లు దూరంగా జరిగిపోయాయి.

అతను క్రింద పడిపోతున్నాడు. మీదకి విసరిన రాయిలా దబ్బున కాదు దూదిపింజలా గాలివాటానికి ఎగిరి కొట్టుకుపో న్నాడు.

చటుక్కున తెలివి వచ్చింది. ఒళ్ళంతా చెమట ... దాహం.

కిరణ్మయి ఏదీ?

గుండె దడదడా కొట్టుకుంటోంది. టేబిల్ సొరుగు చూశాడు. చీటీ ఏదీలేదు

ఎక్కడికి వెళ్ళి వుంటుంది? గోడ గడియారం ఐదుగం చూపిస్తోంది. మసక మసకగా వుంది బయట.

పక్కగదిలో ముసలాళ్ళిద్దరూ మంచి నిద్రలో ఉన్న న్నారు.

బాత్‌రూమ్‌లో దీపం వెలుగుతోంది. కాని తలుపు తె వుంది.

అంత ఉదయాన్నే బయటికి వెళ్ళాల్సిన అవసరం ఏమో వుంటుంది?

"అమ్మా!" తలుపు దగ్గర నిలబడి పిలిచాడు.

"ఆఁ!... ఏంరా అబ్బాయ్! ఇంత పెందరాడే లేచావ్.... కోడలు ఏం చేస్తోంది?" యధాలాపంగా అడిగింది కాంతమ్మ.

"కిరణ్మయి ఎక్కడికి వెళ్ళి వుంటుంది?"

"వెళ్ళదమ్మా?... పూలు కోయడానికేమో!"

గబగబా మెట్లు దిగి నందివర్ధనం చెట్టూ, తులసిమొక్కా చుట్టూ తిరిగి చూసి ఆయాసపడుతూ మెట్లెక్కి వచ్చింది కాంతమ్మ.

"అత్తయ్యగారు దేవతలాంటి మనిషి..." తను చెప్పగా మరెవరికీ తెలియకుండా కోడలు దాని తల్లికి రాసిన ఉత్తరంలోని మాటలు నెమరువేసుకుంది కాని కాంతమ్మకి చిరు చెమటలు పట్ట సాగాయి.

రగిలే పర్వతాలని గుండెల్లో ఇముడ్చుకోవడం స్వభావంగా మారిపోయిన ఈ రోజెందుకో గుండె పీచు పీచుమంటోంది.

రావ్‌జీ ముఖం ఎర్రగా వాచిపోయింది. తేనెతుట్ట దగ్గర తేనె టీగలు ఝుమ్మని రేగి ముఖం వాచేటట్లు కుట్టడంవల్ల మాత్రమే అలా అవుతుందని కాంతమ్మకి తెలుసు. మరి తేనెటీగలేవీ? ఇరుగు పొరుగు వాళ్ళూ, చుట్టుపక్కలవాళ్ళూ తేనెటీగలు కారూ? సూటిపోటి మాట లతో తననీ కొడుకునీ కుట్టడంలేదూ?

రావ్‌జీ మనసులోనే బాధ పడుతున్నాడా? ఏమయితేనేం తన ప్రతిభవల్ల కోడలికి పగ్గాలు వేయించగలిగింది. తమని ఇంట్లోంచి వాడు వెళ్ళగొట్టలేదు. ముందొచ్చిన కొమ్ములని వెనకొచ్చిన చెవులు ఏం చెయ్యగలవ్?

ఎక్కడికి వెళ్ళగలదు ఈ కోడలుపిల్ల? వెళ్ళిందో చచ్చిందో! ఇంకా గొడవలు పెట్టడానికి బోల్డు అవకాశం వస్తుంది.

కాని తన బిడ్డ పార్వతి ఎలా ఉందో? ఇద్దరు మగబిడ్డల తరు వాత పుట్టిన లేక లేక కలిగిన ఆడపిల్ల.

ఎలా వుందో, ఏం బాధపడుతుందో!

తనయి వెళ్ళి చూసి రాలెదు. బస్‌స్టాప్‌లో ముక్కూ మొగమూ తెలియని ఊళ్ళో తననీ, చిన్నాడినీ కుళ్ళపొడిచారే... నడుం నటుక్కు మని పోయింది.. ఎలా వెళ్ళడం?

కట్నమయితే ఇవ్వలేదు కాని ఇల్లు గుల్ల చేసి కూతురి కాపురా నికి ఎంత పెట్టిందవీ....

వెళ్ళాలనే వుంది....కాని ఈసారి ప్రాణాలతో వదులుతారా?

అయినా చిన్నాడి సంగతి అంతే...పీకల మీదికి తెస్తాడు. ఆవేశంతో వస్తూ, పై కనడు. చెల్లెలి కాపురం కోసం ప్రాణమైనా ఇస్తానని చేసినదేమిటి?

చిటికెలో కాగితం రాసిపడేసి బావయ్య ఉద్యోగానికి ఎసరు పెట్టేలాడే! అవతలవాళ్ళు కోడలిపిల్లలా చేతకానివాళ్ళా పడి వుండ డానికి?

తన కూతుర్ని తను చూడకుండా వుండలేదు. చూడలేదు. ఉత్తరం ముక్కయినా రాయనివ్వడం లేదు అవతలవాళ్ళు.

కూతురికి పెళ్ళి చేస్తే అలా అయింది. కోడలొచ్చిన ముహూ ర్తాన్నయినా సంసారం కుదుటపడుతుందేమో ననుకుంటూ ఉంటే...

ఇప్పటికే తనేమో ఇంటికి జెష్ట, పొరుగ్గి శివాలక్ష్మి అయి పోయింది. ఎవరి నోటవిన్నా 'కాంతమ్మలాంటి మనిషి వుందా! అంటారు. కాని తనవాళ్ళందరికీ తను రాక్షసి ...తనతో ఎంతో చను వుగా తిరిగి పనులు చేయించుకున్న వాళ్ళందరూ పైవాళ్ళే!...వాళ్ళు తన వెనక తన గయ్యాళితనాన్ని, మూర్ఖత్వాన్నీ చర్చించుకుని నవ్వు కుంటున్న విషయాలు కొద్ది కొద్దిగా బయటపడుతున్నాయి.

ఊళ్లోవాళ్ళ మెహర్బానీ కోసం భర్తని కాదని స్నేహితులన్న వాళ్ళందరికీ నానా చాకిరీ చేస్తోంది....మంచికోసమే కదా!

కొడుకులకి నిజంగా తనంటే అసహ్యమా? నిజంగా తను అంత చెడ్డమనిషా?

కోడలు ఎందుకు తనంటే భయపడిపోయింది? నిజంగా ఇల్లు వదలి వెళ్ళిపోయిందా? నిముషంలో మరొక పెళ్ళి చేసి కోడలుపిల్లను మరొకర్తెని తీసుకొస్తానని అనేసిందే! నిజంగా ఆ పని చెయ్యడం సాధ్యమే? పనిమనిషి వచ్చి కోడలేదంటే ఏం చెప్పాలి?

తన మాట చిన్నవాడు వినడు. పెద్దవాడు ఇంటిలోనుండి వేరు వెళ్ళనివ్వడు. ఇంట్లో సుఖంగా ఉండనూ ఉండనివ్వడు. ఈ కాలంలో పిల్లలే అంతేమో!

కిరణ్మయి చదువుకుందని అహంకారం....అంతేకాదు తాము తమ అల్లుడికి చేసిన అవమానం గురించి తెలిశాక కోడలిని సులువుగా తెచ్చేశాననే ఆనందం కాస్త తన దగ్గరనుంచి ఎగిరిపోయింది.

మూడు నెలల్లోనే ఆ అమ్మాయి మనస్సు విడిపోయిందా? నిజమే - విరిగిపోవడంలో ఆశ్చర్యం లేదు.

మరేం చేతకాకపోయినా ఊచకోత పెట్టడం ఆ ముసలాడికి తెలుసు. తనా ఏమిటి - చదువూ సంధ్యా లేక పడివుండడానికి!

పుట్టి పెరిగి ఇరవయ్యేళ్ళు వద్నాక వేళ్ళు సహితం పెకలించు కొని అత్తవారింట్లోకి వచ్చిన ఏ ఆడపిల్లకయినా తబ్బిబ్బు సహజమే.

కాని - "నీ తండ్రి వెధవ....నీ తల్లికి మర్యాద తెలీదు. అల్లుణ్నెలా చూడాలో...వియ్యాలవారిని ఎలా గౌరవించాలో తెల యని చదువుకున్న మూర్ఖులు...డిగ్రీలయితే వున్నాయి కాని సంస్కారం మీ నాన్నకి లేదు!" అని ఇంటిల్లిపాదీ మొహం మీద తిడుతూ వుంటే, ఒకరు తిడుతున్నప్పుడు ఇంకోరు తాళం వేస్తూ ప్రతి చిన్న విషయంలోనూ పుట్టింటివారిని దుయ్యబడుతూ వుంటే' దబ్బు మనుషులంటూ వుంటే ఏ ఆడపిల్లయినా పడి వుండగలదు?

ఇంతకీ వియ్యాలవారు చేసిన తప్పేమిటి!

ఈ మాట పిల్లలతో చెప్పి లాభం లేదు...భర్తతో అందామా అంటే అవకాశమే ఇవ్వడు. అటుపక్క మనుషులు ఏం చేసినా, ఏం

మాటాడినా ఏం రాసినా పెడార్థాలూ, విపరీతార్థాలూ తీసి ఊరికే నోరు పారేసుకుంటాడు. ఆయన అన్నదానికల్లా చిన్నవాడు వంత పాడుతాడు. అగ్నికి ఆజ్యం తోడవుతుంది. చిచ్చు రగులుతుంది. చిన్నవాడికదే సంతోషం కాబోలు.

ఇంతకీ ఇంటిలో ఎవరూ తెలుసుకోలేకపోయేదేమిటంటే పెద్ద కోడలుగా ఆ పిల్ల చేతిమీదుగా అన్నీ జరగాలి. ఇవాళ ఎందు కయితేనేం పడివుంటుంది. మరి నాలుగేళ్ళ తరువాత.

ఏ ఆడపిల్లయితే మాత్రం తల్లినీ తండ్రినీ నిర్హేతుకంగా తూలనాడుతుంటే ఎన్నాళ్ళని భరించగలదు? అసలు ఇన్నాళ్ళూ ఆ అమ్మాయి తట్టుకోగలగటమే వింత.

ఇల్లాంటిదేదో కొంప మునుగుతుందని తనకు ఎప్పుడో తెలుసు.

చిన్నవాడు తొణకకుండా నిండుకుండలా వున్న ఈ పిల్ల తల్లితండ్రుల నేం చెయ్యగలడు?

ఇంతకీ ఇదంతా ఏదో శాపంలా ఉంది - స్వామీజీకి చెయ్యాల్సిన సేవలు చేసిందే...అందుకేనా ఆయనకు తనమీద, తన సంసారం మీదా ఇంత కినుక?

తన భర్త ఆయన వెనక అన్నమాటలు, తపస్సంపన్నులు, ఆయన చెవికి సోకాయా? ఆయన ఎలాగూ మంచానపడి అనుభవిస్తూనే ఉన్నారు.

ఇప్పటికే సంసారం గుట్టు రట్టయింది. ఇక తల ఎత్తుకుని ఎలా తిరగడం?

వియ్యపురాలిని తనే అంది అనరాని మాటలు.... పెట్టుపోతలు ఆశించడం ఎంత నీచమైన పని! ఇంటి గుమ్మం ఎక్కవద్దని అల్లుడు తెగవేసి చెప్తే వాళ్ళు ఏం చెయ్యగలరు?

తన బిడ్డని కొత్త కోడల్లో చూసుకుందామనుకుంటే కొంప తీసి ఏ నూతిలోనో దూకలేదు కదా ...

పార్వతి ...తన బిడ్డ తనువుకొచ్చింది. ఏ క్షణాన్న దాని గురించి దుర్వార్త వినవలసి వస్తుందో అని అనుకుంటూ వుంటే ఇలా జరిగింది.

గుండె చెరువయిపోయింది.

"ఆవిడంతేలేరా! తండ్రిననీ, తల్లిననీ. తమ్ముడిననీ, అన్ననననీ ...చెల్లెళ్ళననీ తొణకదు. ఎంత కవ్వించినా జవాబు చెప్పలేదు. ఎంత ధైర్యం? నువ్ కాబట్టి అలా పడివున్నావ్....నేనే అయితేనా చీల్చి చెండాడేవాణ్ని..." చిన్నాడు రొప్పుతున్నాడు.

కాంతమ్మ ఒళ్ళు జలదరించి భయంతో గజగజలాడిపోయింది.

"ఎవడితోనో లేచిపోయిందేమో!" చిన్నాడు బిగ్గరగా అరిచాడు.


"ఎవడితో లేచిపోతుందిరా నీచుడా ...నువ్ మొదటినుంచీ కళ్ళలో నిప్పులు పోసుకుంటూనే ఉన్నావు..." రావ్‌జీ మండిపడిపోయాడు.


"వాడి మాటలు పట్టించుకోకురా పెద్దా ...అన్నంటే వాడికి దైవసమానం... "

"అన్న! అన్న ఎవడు వీడికి....అందరూ నాతో సహా, దాన్ని చిత్రహింసలపాలు చేశాం...నా పెళ్ళాం ఎవడితోనో లేచిపోయిందంటాడా...." పెద్దాడు ఉవుక్కున ఉమ్మేశాడు.

"వాడిననకురా! వాడిది వెర్రి ఆవేశం...." ముసలాయన ఉండబట్టలేకపోయాడు.

"చెల్లి ఊసుకాని, ఈ వెధవ మంచివాడని కాని మళ్ళీ ఎప్పుడయినా నా దగ్గర అన్నారో నే ఉరేసుకు చస్తా ...పోతేపొండి... అర్థం శుభం తెలియని ఆడపిల్లని మీరు ఆడించమన్నట్టు ఆడించి ఈ స్థితికి తీసుకొచ్చాను... మా మామ నా ఆత్మాభిమానం మీద దెబ్బ తీశాడన్నారే . మీకు ఆత్మాభిమానం వుంటే మరిక్కడ ఉండకండి! బయట చావండి. మీరూ నేనూ తిట్టినంత మాత్రాన - అవమానించి.





నంత మాత్రాన ఆతగాడి పలుకుబడి తగ్గదు. ఆయన డిగ్రీయూ చెరిగి పోవు... ఇవాళ కాకపోతే రేపు ఆయనకు జరిగినదంతా తెలియకుండా పోదు. నాకు శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదు .. మీరు ఇల్లు , వదలి పోవాలి...లేక నేనూ దానితోపాటు ఇల్లు వదలిపోవాలి...మానసికంగా నేనెప్పుడో చచ్చిపోయాను...."

రావ్‌జీ ఝుంఝూమారుతంలా లేచాడు.

సంతోషం చూడలేనట్టే పాపం ముసలాడు దుఃఖాన్నీ, ఆవేశాన్నీ - కామాన్నీ సంబాళించుకోలేడు - లేవబోయాడు. భార్య తన క్షేమం కోసం అర్చన చేయిస్తానంటే కోవెలకు వెళ్లేది వేరే మర్మంతో అని పెడార్థాలు తీస్తాడు "నాకు గురువులూ, బాబాలూ, స్వాములూ- వీళ్ళమీద నమ్మకం లేదు. ఈ ముండ నాకోసం కాదు వెళుతుంటి. దాని సొద దానిది. నువ్ గుమ్మం దిగడానికి వీల్లేదు....నాకు నడుం రాయి...అని నిలదీస్తాడు.

ముసలాడు సగం లేచి వెనక్కి వాలిపోయాడు. కాని నోరు మాత్రం ధాటీగానే వుంది.

"ఆదికాదురా అబ్బాయ్! దానికి మొదటినుంచీ నీమీద ఇష్టం లేదు. దాని తల్లీ తండ్రీ దాన్ని నీకు ఎలాగో కట్టేసి వదిలించేసుకున్నారు. అదే అలా అందని నువ్వే చెప్పావుగా... చదువుకున్న పిల్ల కావాలని పప్పులో కాలేశావ్. ఆదర్శాలన్నావ్, నిలబెట్టుకున్నావా! కట్నం తీసుకోనన్నావ్, మానేశావా? ప్రేమించి పెళ్ళాడతానన్నావ్! నిన్నెపుడయినా ప్రేమించిందా, ఒంటిపీక వెధవా! నన్ను పొమ్మనడానికి నీకెన్ని గుండెలు?"

"మీరు ఊరుకుంటారా లేదా! మన బిడ్డని మనం ఏమనుకుంటే ఏం లాభం?" కాంతమ్మ వారించబోయింది.

"మరెవరిననేది? అది పోయిందిగా?"

"ఊరుకోండి! అదెక్కడికీ పోదు... మన కుటుంబానికి వెలుగు తీసుకొస్తుంది... "

"ఒసేయ్ కాంతం, నీ మనసులో వున్నది వేరు-నువ్ చెప్పేదీ వేరు - చేసేది మరొకటి! నువ్ నోరు మూసుకో. ఎవరిని ఎలా లొంగదీయాలో నాకు తెలుసు...."

"ఆ తెలుసు....మీరేం తక్కువ మనుషులేమిటి? మీ కుళ్ళుబోతుతనం నా బిడ్డలకి డిగ్రీలు రాకుండా ఆపగలిగిందా-" కాంతమ్మ ఉండబట్టలేక అనేసింది.

రావ్‌జీ కాస్త తమాయించుకున్నాడేమో మెల్లగా ప్రారంభించాడు. తనమీద తనకే జాలి-అసహ్యం రెండూ వేస్తున్నాయి.

"మీరు ఎప్పుడూ ఇలాగే - నువ్ జంతువ్వి అంటే నువ్ పశువ్వి అంటూ ఘర్షణ పడుతూ ఇక్కడే కాలక్షేపం చెయ్యడం ఇక కుదరదు...నా బ్రతుకు పాడైపోయింది. మొగుడూ పెళ్ళాలని విడదీశారు....తలుపులు వేసుకుంటే వేసుకున్నామని ఏడిచారు. తీసి ఉంచే దాన్ని చిత్రహింసలు పెట్టి కుళ్ళబొడిచారు...పనిపాటలు రావన్నారు...చేతకానిదన్నారు. పొగరన్నారు. గర్వమన్నారు... మీకందరికీ జబ్బులున్నాయని దాన్ని జబ్బు మనిషన్నారు ...ఆ చిన్న వెధవకి మనుషుల్ని బురదలోకి తొయ్యడమెలాగో తెలుసు. మంచిగా మాటలాడుతున్నట్టే మాటాడి మన సంగతి ఏమాత్రం తెలియని నా అత్తమామల మీద నానా రకాల మాటలూ పుట్టించాడు...వాళ్ళు ఆపేక్షతో, ఆదుర్దాతో, ఆవేశంతో రాసిన ఉత్తరాల్లో ప్రతి మాటకీ విపరీతార్థాలు తీసి, తర్జన భర్జనలు చేసి మా మనసులు విరిచేశాడు. తల్లి అంటే అసహ్యించుకునేటట్లు చెయ్యాలని ప్రయత్నం చేశారు. మనకయితే ఇలా కొట్టుకోడాలూ, రొప్పుకుంటూ రొజుకుంటూ బురదలో పందుల్లా ఒకరిమీద ఒకరు కేకలేసుకోడం అలవాటు ఎన్నాళ్ళని సహిస్తుంది? ఆలోచని కలది కాబట్టి ఇన్నాళ్ళు నిభాయించుకుంది. తల్లికి ఉత్తరం ముక్క రాయకూడదని ఆంక్ష పెట్టినా, తండ్రి ఇంటికి వస్తే ముఖం కనపడనియ్యకూడదని శాసించినా ఊరుకుంది ... ఇప్పుడేం చేస్తారో, ఏం చెయ్యమంటారో బుర్రలు బద్దలు కొట్టుకుని ఆలోచించండి.

నాకయితే జైలుకి పోవడమే తెలుసు. ఇంతకంటె ప్రశాంతంగానే వుంటుందక్కడ! - మీరు కంటికి కనపడరు కాబట్టి. నా తప్పు నాకు తెలియడానికి అవకాశం లేకుండా - మనం చేస్తున్నవన్నీ ఘనకార్యాలనీ, మనంత గొప్పవాళ్ళు ఎవరూ లేరని....మనకంటె తెలివయినవారెవరనీ నన్నిలా తయారుచేశారు. ఇక ఏమయినా చింత లేదు...."

గదిలోకి వెళ్ళి తలుపు వేసుకొన్నాడు రావ్‌జీ.

"ఒరేయ్ పెద్దాడా! నీ తల్లిని, నీకంటే ఎక్కువ బాధపడుతున్నదాన్ని. నే చెబుతున్నా విను. చిన్నదాని బ్రతుకు కొంతలో కొంత నిలబెట్టినవాడివి నువ్వు....ఇప్పుడేం చెయ్యాలో ఆలోచించరా! మనలో మనం కొట్టుకుని వీధిలో పడితే ఏం ప్రయోజనం...ఇంటి గుట్టు రచ్చకెక్కకుండా ఏం చేస్తే బాగుంటుందో చూడు!"

కాంతమ్మ లబోదిబో మంది.

"ఎక్కడికి వెళుతుందే వెర్రిబాగులదానా....మనం ఇంట్లో ఉండడం ఇష్టంలేక మనల్ని పొమ్మనే ధైర్యమూ లేక, మొగుడూ, పెళ్ళాం ఇలా నాటకమాడుతున్నారు....వాళ్ళిద్దరూ ఎప్పుడూ ఒకటేనే" ముసలాయన అందుకున్నాడు.

"అవును వాళ్ళే నాటకమాడుతున్నారు....మీరేం తక్కువ వాళ్ళా! నన్ను నిముషం నమ్మకుండా... మగబుద్ధికేం లోటు లేదు మీకు....మీకు అనుమానం సంకటం మండిపోను!"

"కాదే కాంతం! నిన్ను వదలి వుండలేక ...ఎదురూబొదురూ కూచుని నీతో మాటామంతీ ఆడుకుంటుంటే బాగుంటుందని.... అయినా మనమిద్దరం వేరే పోవడమే మంచిది. వాళ్ళూ మనమూ కూడా చిలకా గోరింకల్లా...."

"నోరు మూసుకోండి...మీ ముచ్చట మండినట్టుంది.

హయగ్రీవరావ్‌కి ఈ సంభాషణ వినపడుతూనే వుంది. కోడ లేమైపోయిందోనన్న ఆలోచనే లేదేం వీళ్ళకి! కిరణ్మయి నివురుగప్పిన నిప్పన్నమాట! భగ్గుమంచే అందరినీ బుగ్గి చేస్తుంది.

ఇప్పుడెలా! ఏం చెయ్యాలి? ఎక్కడికి వెళ్ళాలి?

"ఏంరా! మమ్మల్ని పొమ్మంటావా? ఇప్పుడే చెప్పు... "నా శవం మీదనుంచి వెళ్ళండి! అన్నావే ...అది వెళ్ళిపోయింది.... మమ్మల్నీ పొమ్మంటే చెప్పు, ఇప్పుడే పోతాం! ఒకటి మాత్రం నిజం....అది వాళ్ళ వాళ్ళ ఇంటికి వెళ్ళడం జరగని పని...."

"మీరు ఊరుకోండి! అసలు అదలా కట్టుగుడ్డలతో వెళ్ళి పోయిందా? ఏమయినా పెట్టె సర్దుకుని తీసుకుని వెళ్ళిందా?" కాంతమ్మ అడిగింది.

లోపలనుంచి జవాబు లేదు.

తలుపు దబదబా బాదింది. తలుపుకేసి తల బాదుకుంది.

"డిగ్రీలూ, సర్టిఫికేట్లూ తీసుకెళ్ళింది .... అంతే నువ్ చేయించిన గొలుసూ, ఉంగరమూ ఇక్కడే వున్నాయి....ఇక నేను బ్రతికి ఉండడం దండగ!" రావ్‌జీ భోరుమన్నాడు.

"అదేమిట్రా నీకేమిటి లోటు! దానికి యోగ్యత లేకపోతే పోయింది....నీకు మరొకర్తి వస్తుంది" చిన్నవాడు ధైర్యం చెప్ప బోయాడు.

"నువ్ నోర్ముయ్!"

"పోనీ వాళ్ళ నాన్నకి టెలిగ్రాం ఇస్తే?" కాంతమ్మ అంది.

"నీ మొహంలా వుంది. ఆయన వెంటనే పోలీసు రిపోర్టు ఇస్తాడు....మనమంతా ఝ్యాన్ ఎక్కాల్సి వస్తుంది!" రావ్‌జీ కంగారుగా లోపలనుంచి అరిచాడు.

కిరణ్మయి ఇలా ఎందుకు చేసింది? తనని తను శిక్షించు కుంటూ తమందరినీ క్షమించిందా? లేక తమనందరినీ శిక్షించడానికి ఇదొక్కటే మార్గమనుకుందా?

ఎలా అయినా కిరణ్మయి కాంతిపుంజమే! దానికి చీకటి అంటు కోదు. చీకటిని చీల్చడమే దాని లక్ష్యం! లక్షణం.

తల మోకాళ్లలో పెట్టుకుని మంచంమీద కూలబడ్డాడు హయ గ్రీవరావ్!

సీరియల్

మరో రాజశేఖర చరిత్ర

బలివాడ కాంతారావు

(గతసంచిక తరువాయి)

15

రెండేళ్ళు పైబడింది పల్లెజీవితం. పచ్చని మైదానంలో ఒక గరికపూచలా వున్నాననుకున్నాడు. నదీతలంపైనించి చూస్తే యీ విశాలమైన అవనిలో దారి తప్పిపోతానేమోనన్న భ్రమ. ఏంచెయ్యడానికీతోచదు. తోచినా అవకాశాలులేవు. రమాదేవి అత్తయ్య రాపిడికి తట్టుకోలేక మేడమీద గదిలో మారుమూలకు చేరిగి యేడ్చుకున్నప్పుడు యెంతహాయిగా వుండేది. తాతయ్య చావుకు శ్మశానంలో కన్నా తరవాత స్కూల్లో ఒకగదిలో ఒకమూల యేడ్చుకున్నప్పుడు యెంత హాయి. దేనికైనా ఒకమూలి- ఒక కార్నర్- తనదన్న ఆ కార్నర్ దొరికితే- అక్కడినించి ఆ కిటికీ కాస్త తెరచి జగన్నాటకాన్ని చూసేవాడే!

ఆలోచించి వెంకటేశ్వర్రావుపేర ఒక ఉత్తరం రాశాడు. తనదగ్గర యైదురూపాయలు అప్పుతీసుకున్నదగ్గరనించి యీనాటివరకు జీవితం ఉద్యోగాన్వేషణలో వున్నట్టు రాసాడు. వారంరోజుల్లో వెంకటేశ్వర్రావుదగ్గరనించి జవాబువచ్చింది. "నీ ఉత్తరం ఒక పత్రికకు పంపిస్తే అచ్చవుతుంది. అదొక ఆకట్టుకున్న కథలావుంది" అని రాస్తూ యింగ్లీషుపత్రికల్లోనించి రెండు కటింగులు పంపించాడు. అందులో తను టిక్‌మార్కుచేసిన ఉద్యోగాలు దరఖాస్తులు పంపమన్నాడు. దేనిమీదనైనా ఆశపెట్టుకుంటుంటే అది దక్కదన్న ఒక నమ్మకం యీమధ్య మనసులో ధృవపడటంవలన యీ ఉద్యోగాలమీద ఆశపెట్టుకోకుండా మనసు మళ్ళిస్తున్నాడు.

నెలరోజుల్లో విశాఖ ఓడరేవులో గుమాస్తా ఉద్యోగంకోసం పరీక్షకు హాజరుకమ్మని ఉత్తరంవచ్చింది. రైలుదిగి తిన్నగా బుద్ధవరపువారింటికే వెళ్ళాడు.

"నివ్వు వస్తావని నాకుతెలుసు" అన్నాడు వెంకటేశ్వర్రావు. పరీక్షలో యెలాంటి ప్రశ్నలు రావచ్చో యిద్దరూ మాటాడుకున్నారు. ఇదివరకు పరీక్షల్లో యిచ్చిన పేపర్లు యెలాసంపాదించాడో ఆకీతి తిరిపీదయ్యాడు.

వెంకటేశ్వర్రావు తల్లి రాజునుచూసి "ఫస్టుగా పాసయ్యేవాడివి ఎంతవరకు చదువు చదివినా నెగ్గుకొచ్చేవాడివి కానీ...." అంటూ సగంలో మాటలు ఆపి విచారించింది.

ఒక్క బాలరాజు తప్పించి మిగతా తన ముగ్గురుమిత్రులు కాలేజీలో చదువుతున్నారు బాలరాజు తండ్రి కొడుక్కి వెంటతిప్పుకుని మిలటరీవాళ్ళకు తాటాకులసించీ, తాజా సప్లయిలవరకూ కంట్రాక్టుచేసి బాగాగడించాడు. ఇప్పుడు బాలరాజు చిన్నవాడైనా బిజినెస్‌లో బాగా పాతుకపోయాడు. మిత్రులను కలుసుకోవటంతో రాజులో కొత్తవూహలూ అవూహలు ఆశలు రేకెత్తించాయి.

ఆశపడకూడదనుకున్నా ఆశను చంపుకోకుండా పరీక్షరాసి, యింటర్వ్యూలో కూడా బాగా నెగ్గుకొచ్చాడు. అక్కడుండగానే ఫలితాలు తెలిసాయి. ఉద్యోగంలో ఆ వారంరోజుల్లో చేరాడు. ఉద్యోగంవచ్చాక తనప్రమేయం యిందులోయేమీ లేనట్టు వెంకటేశ్వర్రావు తప్పుకున్నాడు.

"స్నేహితునిగా మాయింట్లోవుంటే సంతోషిస్తాను" అన్నాడు.

రాజు ఆలోచించాడు. వాళ్ళది పెద్దఇల్లు. కొద్దిగా ఆఫీసుకు, హోటలుకు దూరం. తన కార్నర్ తను చూసుకోవాలి అనే ధ్యాసతో "ఇంకొకలా అనుకోకు. అప్పుడప్పుడూ కలుసుకుందాం" అన్నాడు. వెంకటేశ్వర్రావుకు అర్థమైంది. రాజు చెంగల్రావుపేటలో పదిరూపాయలకు ఒక గది అద్దెకుతీసుకున్నాడు. ఇంటివాళ్ళు పెరటివున్నారు. తన గది వరండాలోవున్నది. బాత్‌రూమ్ వగైరా నలుగురితోపాటే!

మొదటినెల జీతం రాకమునుపే తండ్రిదగ్గరనించి ఉత్తరంవచ్చింది.

"ఈనెల మాకు డబ్బుపంపవద్దు. నీ అవసరాలకు మించి మిగిలితే ఒక చీర రవికెలగుడ్డ కొని స్వయంగావెళ్ళి రమాదేవి అత్తయ్యకు అందజెయ్యి."

ఆ యింటివేపు వెళ్ళడమంటే వణుకుపుట్టోంది. వెళ్ళక విధిలేదు. తిడ్తే తిట్టుంది. చీర విసరికొట్టే కొట్టుంది. తాస్సేపు బాధపడ్తాను" అనుకొని నాన్న వ్రాసినట్టే చీర జాకట్టు ఖట్టుకొన్నాడు. ఆవిడకు యిష్టమైన రంగులు తనకు తెలుసు. ఆవిడ యిష్టాయిష్టాలు అన్నీ తెలుసు, ఎంత దగ్గరగావుండేవాడో అంత దూరమైనా అవేవీ మరచిపోవటం అంత సులువుకాదు. ఆమెపెట్టిన తిండివలన యెప్పుడూ ఆరోగ్యంగావున్న తన శరీరం చేవజేరింది.

మెల్లగా సాయంత్రం అటువేపు కదిలాడు. "ఇదిగో యిక్కడే.... ఆవేళ .... ఆ వర్షంరోజు ఆగిపోయాను. జ్యోతితెచ్చిన గ్రుడ్లుపట్టుకొని.... ఇలానే మెల్లగా...." యిప్పుడూ ఆలాంటినేరం యేదోచేసి నడుస్తున్నట్టు నడుస్తున్నాడు.

ఇల్లు ప్రత్యక్షం. గుండె వడిగా కొట్టుకుంటోంది, బలవంతాన అడుగులు వేస్తున్నాడు అంగటి తలుపు తెరిచేవుంది. లోపలికి వెళ్ళగానే ఆఫీసుగదిలో రమణయ్య కనిపించాడు. రాజు నమస్కారంచేసాడు. ప్రతినమస్కారంచేస్తూ-

"ఎవరూ... ?"

"రాజును మామయ్యా...."

"నివ్వెప్పుడొచ్చావోయ్?"

"ఇక్కడ పోర్టులో ఉద్యోగంలోచేరాను"

"పద లోపలికి..." అంటూ లేచి వెంటవచ్చాడు. సంచి బుజాన అలా వుండే లోనికివెళ్ళగానే కనిపించిన రమణయ్య చిన్నకొడుకును యెత్తుకోడానికి వెళ్తే వాడు విదలించుకుని వెళ్ళిపోయాడు. వంటయింట్లో రమాదేవి వుంది. రమణయ్య లోపలికి వెళ్ళాడు గదిలో యింకా వెల్తురుగానే వుంది. ఎదరగా యెన్‌లార్జిచేసిన జ్యోతి పెద్ద ఫొటో గోడకు వ్రేలాడుతోంది.

రమాదేవి వంటయింటినించి గడిదాటి వరండాలోనికి వచ్చింది.

"నమస్కారం అత్తయ్యా" అన్నాడు.

ఆవిడ చిక్కిపోయివుంది. ఈ కూతురే సర్వస్వం అన్నట్టు యేడ్చుకుంటూ వెర్రిదాసిలా మారినట్టుంది.

"కూర్చో రాజూ" అంటూ కుర్చీచూపించింది.

రమణయ్య ఆవిడప్రక్కనే నిల్చున్నాడు.

"నా తొలి ఆర్జనతో..." అంటూ సంచిసించి చీరా జాకెట్టుగుడ్డ తీసి ఆమెచేతికి అందిచ్చాడు. ఆమెకళ్ళల్లో గ్రిరున నీరు తిరిగిపోయాయ్. అందుకుంటూ "కడుపుశోకంతో ఆరోజు యేదో అనేసాను మాకు అదృష్టంలేదు- అది పోయింది."

తరవాత నిశ్శబ్దం గాఢనిశ్శబ్దం.

'కాస్త కాఫీతాగివెళ్ళు రాజూ" అంది.

"ఇంకా అలాంటి అలవాట్లు రాలేదు అత్తయ్యా' అన్నాడు.

ఇల్లు ఆలాగేవుంది. ఏమీ మారలేదు. ఆమెలో యిదివరకున్న సంచలనం,

వార్తాటి యేమాత్రం లేకపోగానే ఆశ్చర్యపోయాడు. కలవుతీసుకుని తిరిగివచ్చినా యింకా ఆ యిల్లే. ఆ గోడకున్న ఫొటోయే కళ్ళకు కట్టోంది. ఆ ఫొటోలో జ్యోతి యెంతో యెదిగిపోయినట్లు కనిపిస్తోంది.

హోటలుభోజనం. రేషనుభోజనం. గడ్డిలావుంటోంది. జొత్తుఅన్నంలా అన్నం యెరుపురంగు. ఒకోసారి పన్ను విరిగినట్లు రాయి నోట్లోపడ్తుంది. హోటలుమార్చినా అన్నిహోటల్లూ ఒక్కలాగేవున్నాయి. ఒకప్పుడు రుచికి శుభ్రతకు పేరుపడ్డ హోటల్లు. తిండికివచ్చిన వాళ్ళకు అతిధుల్లా గౌరవించిన హోటల్లు యిప్పుడు అసహ్యంగా తయారయ్యాయి. ఇదీ ఒక కత్తీవ్యాపారంలా అయిపోయింది.

సాయంత్రం యే సముద్రపొడ్డుకో యెక్కడకో ఒకచోట తిరిగి కొన్సేపు మెయిన్‌రోడ్డుమీదనున్న రీడింగ్‌రూమ్‌లో యేదోఒక పేపరో పత్రికో చదివి హోటలుకుపోయి సహించినమట్టుకు తిని తనగూటికి చేరుకోవటం నిత్యం అలవాటైంది. ఉద్యోగంలో పని నేర్చుకుంటున్నాడు. నేర్చుకుంటున్న పని నేర్పుగా చెయ్యగలనన్న విశ్వాసంతో చేస్తున్నాడు. అయితే అందులో యేం కొత్తదనం లేదు.

ఒకరోజు నేర్చుకున్న పని మరుచటిరోజుకే పాతదైపోతున్నది.

పాతకాని కొత్తను బహుశః అన్వేషించడంవలనకామోసు మూడు నెల్లో యీ పరిసరాలూ మామ్మూలు పరిసరాలుగానే తోచాయి. ఏంచేసినా తృప్తిగా లేదు. ఆ చేసిందైనా చెయ్యని దాంతో సమానమన్నట్లు తోస్తోంది. ఈకలపడా కొట్టివేతలూ నాలుగు డ్రాఫ్టులూ ప్రభలమెత్తడానికి అవసరమూ కడుః అవసరమైన సరైన భోజనం దొరకడంలేదు. మనసుకు ఆహ్లాదపరచే సంఘటనలూ జరగలేదు. కళ్ళెదరగా చీకటి. చీకటిలో మెరుపు మెరుస్తుందని చూస్తు వాడికి చప్పవ ఉషస్సు గోచరించదు.

అదే.... ఒకరోజు సాయంత్రం రీడింగురూముకు వెళ్ళి అలవాటుకొ కొత్తపత్రికలేమైనా వచ్చాయేమోనని తిరగవేసాడు. ఆవేశపచ్చింది చిత్రగు



గమ్ముత్తుగా పేజీలు తిరగవేస్తుంటే మధ్యపేజీలో చుట్టూ బోర్డరుతో "సుప్రసిద్ధ రచయిత రాజశేఖరం నవల "జ్యోతి" వచ్చేసంచికనించి ధారావాహికంగా వెలువడుతోంది. మీ కాపీ రిజర్వుచేసుకోండి."

గబగబ రీడింగురూము మెట్లు దిగిపోయాడు. ఎదరగావున్న బుక్‌స్టాల్‌లో ఒక కాపీ చిత్రగుప్త కొన్నాడు. కనపడ్డ ప్రతి మిత్రుడికి చిత్రగుప్త విప్పి చూపించి "నా నవల వస్తోంది. చదువు. చూడుయేంరాసానో!" హోటల్లో తిండి తినిపించలేదు. అక్కడ నిత్యంకలిసే బోర్డర్సుతోకూడా చెప్పేసాడు. ఇంటికి ఆలస్యంగావెళ్ళినా వాకిట యింకా యింటిగలావిడ కూర్చుంటే "అమ్మాజమ్మగారూ.... చిత్రగుప్తలో నా నవల వస్తోందండి... వచ్చే సంచికనించి"

"అయ్యో నవల్లంటే నాకు పిచ్చి. ఆయన పోయాక కాలక్షేపానికి కొవ్వలి నవలలు చదివే దుఃఖం మరచాను."

గబగబ సంచిక విప్పి చూపించాడు. సంచిక వెంటనే యింట్లోకి వెళ్ళిపోయింది. కోడలు ఆవిడ ముగ్గురుకూతుళ్ళు సంచిక తిప్పేస్తున్నారు.

"చదివి రేపుయిస్తాంబాబూ" అని ఆవిడ సంచిక తిరిగ యివ్వకపోతే యెంత చిరాకువేసిందోగానీ మర్యాదకు వూరుకున్నాడు. గదిలో యెంతరాత్రి వరకో ప్రయత్నించినా నిద్దరపట్టలేదు. తనవూహాలు యెందరో పంచుకుని తన పక్షం చేరుతారు. ఎంత హెచ్చుమందిని తనవేపు త్రిప్పుకుంటే అదే ప్రబల మైత్రదం? ఎత్తుగా ఎదగడం?" అనుకుని

గబగబ ఉత్తరంరాయడానికి కాగితం కలం తీసాడు. ఇద్దరిలో ముందు యెవరికిరాయాలి? ఒకటి పోష్టుచెయ్యలేని ఉత్తరం, యింకొకటి పోష్టుచెయ్యవలసిన ఉత్తరం. ఇద్దరికీ తను ఋణపడిఉన్నాడు. ముందుగా ప్రేరేపించినది జ్యోతియే... జ్యోతికి కృతజ్ఞతతెలిపి..., ఒకవిధంగా ఆమెకు అందులో నా అంకితం అన్నట్టు రాసి . తరువాత సౌదామిని అత్తయ్యకు ఉత్తరం రాసాడు. ఆవిడతీసుకున్న శ్రద్ధవలనే యిలా నవలపడే అవకాశం కలిగిందని తన కెంతైనా ఋణపడిఉంటానని రాసేడు. తండ్రికిరాసిన కవరులో ఆ ఉత్తరంపెట్టి సౌదామిని అత్తయ్యకు అందజెయ్యమని కోరాడు.

16

లేకలేక యేదో వానజల్లుపడినంత హాయిగావుంది రాజుకు! ఈ నవల్లో తను యేం రాసాడో అంతా మళ్ళీ మళ్ళీ గుర్తుకుతెచ్చుకోడానికి ప్రయత్నిస్తున్నాడు ఈ నవల్లో యేంచెప్పాను అని ఆలోచిస్తున్నాడు. ఉన్నవాడి మదాన్ని లేనివాడు వున్నతాశయంతో మరమ్మత్తు చేసాడుకదా! సంఘాన్ని మరమ్మత్తు చెయ్యడమే రచయితగా తన ప్రధానలక్ష్యం అనుకున్నాడు.

తనచుట్టూ కనిపించే అన్యాయంలో యేది కథావస్తువు అవుతుందని వెతుక్కుంటున్నాడు. పుట్టెడు ఆలోచనలోంచి పనికివచ్చే ఆలోచన యెంచుకోవటం యెంతోకష్టమనిపించింది ఇంకా నవల పడలేదుగానీ ఆ వుత్సాహం వూహలతో యెత్తి ముంచేస్తోంది. ఆ వూహలను తింటూ అసలు తిండికి నిర్లక్ష్యంచేస్తున్నాడు.

తన స్వంత కార్నరు యీ వుద్యోగంవలన నిర్మించుకున్నాడు. ఉద్యోగరీత్యా తను చెయ్యవలసిన గుమాస్తాగిరికి కిటికీసందునించి చూడక్కర్లేదు. రచయితగా అలా చూసే అవసరంవుంది. రంగుల ఆటఆడేవాళ్ళు, నగ్నంగా బాతురూంలో స్నానంచేసేవాళ్ళు యితను చూస్తున్నట్టు పోల్చుకోకూడదు. పోలిస్తే కృత్రిమంగా సంచరిస్తారు. కృత్రిమంగా సంచరిస్తే అది నటన అవుతుందిగానీ జీవితంకాదు.

ప్రాణాలు బతకడం ఒక సమస్యఅయిపోయింది. ప్రాగ్యులైన పెద్దకొడుక్కు మంచి ఉద్యోగంతో విలువరాగానే కట్నాలబజారులో వేలంపాటకు పెట్టింది అమ్మాజమ్మ. ముప్పయివేలిచ్చి మొగుడ్ని కొనుక్కున్న కోడలు కాంచన అత్తారింటికి రాగానే అత్తగారి అధికారాలు లాక్కుని, మొగుడ్ని మోహంతో ముంచెత్తి మెడలో బెల్టుకట్టి గొలుసుపట్టి తిప్పుతోంది. ఈ నిజపరిస్థితిని కిటికీ సందునించి చూసిన రాజశేఖరం కిటికీ మూసి ఆలోచించి దీన్నే ఒక పెద్ద కథగా మలిచాడు. కథకు బింకంపొంకం రాడానికి కల్పన పెంచినా అసలు యీకథ చెప్పడంలో వుద్దేశాన్ని మరచిపోలేదు. బాధ్యత తీసుకోవలసిన కోడలు యింత కటువుగా ప్రవర్తిస్తుంటే ఆ కటుత్వానికి బదులు ఆమెను యెంతో మంచిగా, గొప్ప యిల్లాలిగా చూపించి, బాధ్యతను తీసుకున్నట్టు చూపించాడు. మంచి ప్రక్కన చెడులేకపోతే కథ నడవదుకదా. ఆ కటుత్వం రెండోకోడల్ని సృష్టించి ఆమెపరంచేసాడు. రెండోకోడలు రాపాడిస్తే పెద్దకోడలు ఆడపిల్లలను రక్షిస్తుంది.

ఈ కథ ప్రచురణకు పంపడం చిత్రగుప్తలో తన నవల పూర్తవడం జరిగింది. అంత అట్టహాసపడ్డాడే. దీనికేనా దేశమంతా వినిపించేటట్టు అరిచాననుకున్నాడు. చదువుతుంటే తనకే యెంత చిలిపిగావుందని నవ్వువచ్చింది. సిగ్గుకూడావేసింది. కొవ్వలినుంచి అప్పుడే శరత్‌వరకు వచ్చేసాడు కాబట్టి యిలా అనిపించింది. ఈ నవల తొలిమెట్టు. కాస్త పైమెట్టుమీదినించి చూస్తే అది సిగ్గువేస్తుంటుంది. ఆమెట్టు లేకపోతే యీమెట్టు యెక్కలేకపోయేవాడేమో? నిజంగా ప్రసిద్ధ రచయితనయ్యాననే అంత వుబలాటపడి అలా గర్వపడ్డాడే? అంత ప్రసిద్ధ రచయిత కాకపోతే ప్రజనవ్వరూ? బహుశః యీ నవల చదివిన కొందరు మంచి అభిరుచివున్న పాఠకులు ఆ సంపాదకుడు యీ రచయితకు ప్రసిద్ధుడు అన్న విశేషణం తగిలించినందుకు వేళాకోళంచేస్తూవుంటారు. కానీ ఆ సంపాదకుడెవడో? ఈగకాదు. తేనెటీగ అనుకుని 'జ్యోతి' నవలలో యేం చెప్పదలిచాడో యింకోసారి నెమరువేసుకున్నాడు. ఇదివరకు పేదవాడు కలవాడ్ని మరమ్మత్తుచేసాడని అనుకున్నాడుకదా! నిజానికి యీ దేశభక్తుడు పెద్దవాడైపోబట్టి పెద్దవాడ్ని మరమ్మత్తు చెయ్యగలిగాడు. ఒకడ్ని మరమ్మత్తు చెయ్యబోయి యింకోమరమ్మత్తు అవసరంవున్న మనిషిని సృష్టించాననుకున్నాడు. నవల రాసినప్పుడు అలా తోచలేదు.

ఇంతలో ఒక విశేషంజరిగింది. అమ్మాజమ్మ కుటుంబాన్ని దృష్టిలో పెట్టుకుని రాసిన పెద్దకథ అచ్చయింది పత్రికలో. ఒక కాపీ వాళ్ళకోసమేనని కాని సగర్వంగా అమ్మాజమ్మకు ప్రెజెంట్‌చేసాడు. ఆవిడ ఆరాత్రే చదివేసినట్టుంది. ఉదయం ఆవిడ ముఖంచూస్తుంటే ఆకథ చదివి యెంత యేడ్చిందో యేమో ముఖం పొంగినట్టుంది. రాజుకు తనకథ ప్రయోజనం సాధించిందని సంబరపడి ఆఫీసుకి వెళ్ళిపోయాడు. ఆవేళ సాయంత్రం ఆఫీసులో యిక్కడా అక్కడా ఆ కథను మెచ్చుకున్నవాళ్ళను చూస్తుంటే ఏనుగెక్కిన సంబరంలాగుంది. సాయంత్రం యింటికివెళ్ళకుండా రీడింగురూమ్ బయట రోడ్డుమీదనిల్చొని యెందరు ఆ పత్రిక కొంటున్నారో, యెందరు తన కథ నడుస్తూనే చదువుతున్నారోనని చూస్తున్నాడు. అంత గొప్పకథ రాసిన రచయిత యీవూరివాడే అతన్నిప్రక్కనించే పోయామని అనుకోరే! హోటల్లో నాలుగుమెతుకులు నమిలేసి యింకా యెవరైనా కనిపిస్తారేమో తన కథనించి మాటాడుతారేమోనని నిల్చుంటే తన ఆఫీసు గుమాస్తా ఇంకోసెక్షన్నుంచి కొత్తగా బదలీమీద వచ్చారు. తనకన్నా పదిహేనేళ్ళయినా పెద్ద. తనంటే యిష్టమట. ఆఫీసుపని తను బాగాచేస్తారట. తన పని అయితే యెదుటవాళ్ళకు సహాయపడ్తాడట. ఊరకనే కూర్చోడట. ఈ వారంరోజుల్లో తను సీనియర్‌యైనా తనకు తెలియని పని రాజు చేసిపెట్టాడని

"ఏదైనా విశేషంవుందా?"

"ఏమీలేదు. ఈ హోటల్లోతింటే ముడుకులు పడిపోతాయి, అప్పుడప్పుడూ కాస్త చితకా మెతుకూ కలిసిపడితే సత్తువ. అలా నవుతావేంటోయ్... పెళ్ళి చేసుకోవా? అప్పుడు లొడలొడలాడిపోయావో పెళ్ళాం నిన్నో చాతకాని దద్దమ్మని చేసి బయటికి అనకపోయినా - లోపల నానాశాపాలు కురిపించుకుంటుంది అడ దానికి పుస్తెకట్టి, అన్ని సంతోషాలూ వురేసిలాక్కుని, యీ ఒక్కసంతోషమైనా యివ్వకపోతే మహాపాపం..."

ఎవరో రచయిత మిత్రులొస్తున్నారని

"సరేలే జనార్ధనం.... తరువాత కలుద్దాం?"

"రేపొస్తానని.... చేతులో చెయ్యేయ్యి... "

చేయ్యేస్తేగానీ వీడ్ని వదిలించుకోలేనని చెయ్యివేసేసాడు.

"రాత్రి యెనిమిదికి చూస్తుంటాను ..." అని వెళ్ళిపోయాడు. వచ్చిన రచయిత మిత్రులు తన కొత్త కథగురించి మాటాడారు. రచయితల నోట్లో పడిందీఅంటే రచయితలకు రచయిత అయ్యే అవకాశం వున్నదన్నమాట. అందులో ఓకాయన

"శరత్‌ను గుర్తుకుతెస్తున్నారు" అన్నాడు.

శరత్ అంతవాడినైపోయే అవకాశం వుందనుకుని - ఓ క్షణం పొంగిపోయాడు. అంతలో శరత్‌బాబు తనలో అప్పుడే ప్రవేశించాడని యింటికివెళ్తే తనకోసమే అమ్మాజమ్మ కాసుక్కూర్చునట్లు నిల్చుంది. తలుపుతీసుకుని గదిలోనికివెళ్ళి దీపం వెలిగించగానే

"పోనీకదాఅని - మంచివాడివిలా కనిపిస్తున్నావని.... గది అద్దెకిస్తే యిదాపని?"

"నేనేం తప్పుచేసానండీ?"

"మాయింటి భాగోతమే వీధిలోపెట్టావయ్యా?"

"నేనేం తప్పురాసానండీ? '

మెల్లగా యింటివేపుచూసి కోడలు మేడమీద తన యేకాంతమందిరంలోనికి పోయిందని నిర్ధారించుకున్నాక మెల్లగా "నిజంరాసావు నాయనా! కథ చదువు తుండే యేడుపువచ్చేసింది. ఎంత బాగారాసావు. కానీ నామాట యెక్కడ సాగుతాది? ఇది వచ్చి వాడిముక్కుకు తాడుకట్టేసింది... వెర్రెత్తిపోతోంది."

కోడలు మెట్లుదిగుతున్న చప్పుడువిని గొంతుకెత్తి "ఏమయ్యా - ఇది నీకు న్యాయమా? మా పరువు వీధిలో పెట్టావయ్యా - రేపే యిల్లు ఖాళీచేసే...."


"ఒక వారంరోజులు టైమివ్వండి"

"ఒక వారంకాదుకదా ఒక్కరోజుకుమించి యిక్కడ వుండటానికి వీల్లేదు"

"అలాగేలెండి .. "

అంటూ ఆమె వెళ్ళిపోగానే తలుపు వేసుకున్నాడు. మరుచటిరోజు ఆ చుట్టుపట్ల యింటికోసం వెతికాడు. అంత సులువా దొరకటం? అందులో బ్రహ్మచారి. అద్దెలుకూడా పెరిగిపోతున్నాయి. ఖాళీచేస్తే అద్దె పెంచేస్తున్నారు. కారణాలెన్ని చెప్పుతున్నా రూపాయికొనుగోలు విలువ తగ్గిపోతోంది అదీ అసలు గొడవ. సాయంత్రం యింటికేళ్తే అమ్మాజమ్మకాదు కోడలు కాంచన విసవిస లాడవచ్చు. కాస్త వేగంగా టీడింగురూమునించి జనార్ధనంయింటికి వెళ్ళాడు. బహుశః జనార్ధనం దృష్టిలో యెక్కడైనా యిల్లు వుంటుందేమోనని. వెళ్ళేసరికి దీపాలు ముట్టించేవున్నారు. ఇంటి అంగటి అరుగుమీద వాచీ రిపేరుషాపు వుంది. అది యెవరిదో అనుకున్నాడు రాజు. జనార్ధనం లైటువెలుగులో ఒక కంటికి భూతద్దం పెట్టుకుని ఒక వాచీ రిపేరుచేస్తున్నాడు.

"హోమోపతి డాక్టరువే అనుకున్నాను. వాచీల డాక్టరువికూడానా?"



"చెప్పు. ఆ జీతపురాళ్ళతో వారానికింత మాంసంచితకయినా తినగలవా? అంతెందుకు? డాక్టరు పేరు తగిలించుకోకముందు ఆఫీసులో గ్లాసుతో మంచి నీరిమ్మంటే బంట్రోతు తెచ్చుకోవయ్యా అన్నాడు. ఆరోజులో నాకు మందు అలవాటులేదు. ఇప్పుడో మందుమీదున్నా నాపాదాలు ముట్టుకుంటాడు. ఎందుకు? చేతిలో విద్యవుంది. నీ చేతిలోనూ విద్యవుంది. మంచి కథ రాసావటగా... కాస్త మందు అలవాటుచేసుకుంటే మరీ బాగ రాస్తావు .. "

"ఈ మంచికథ చిక్కుతెచ్చిపెట్టింది అందుకే యిల్లు మార్చడానికి ఉదయంనించి తిరుగుతున్నాను. ఎక్కడా దొరకలేదు. నీదృష్టిలో యేదైనా ఒక గది వుంటే...."

"ఏంజరిగింది?

జరిగినదంతా రాజు ధనాధన్‌తోచెప్పాడు. చేస్తున్న పని ఆపి "పద... అమ్మాజమ్మకు నాకుతెలుసు. ఒకసారి మందుకొచ్చింది."

"కోడలు ఒప్పుకోదు"

"ఆ ఒప్పుకోకపోవడం యేంటో చూద్దాం పద"

"అక్కడ అనవసరం గొడవ చెయ్యక"

"మందేసుకున్నాళ్ళంతా గొడవచేసినోళ్ళేనా? మందెయ్యనివాళ్ళంతా మహాత్ములా? ఆ మహాత్ముడు గొడవచెయ్యబట్టే స్వరాజ్యం వస్తోంది పదపద.." అంటూ కొట్టుకట్టేసి బయలుదేరాడు. రాజువెంటపడ్డాడు. రోడ్డుమీదుండగానే.....

"అమ్మాజమ్మగారూ" అని గట్టిగా కేకేసాడు.

కోడలు కాంచనకూడ అత్తగారితోపాటు ప్రత్యక్షమైంది. అంగటి వరండాలో నిల్చొని

"రాజశేఖరం నేనూ ఒక ఆఫీసులోనే పనిచేస్తున్నాం. మావాడే - చాల మంచివాడు. చిన్నవయసైనా చాలా పెద్దమనిషి. అందుకే నీతికథ రాసాడు!"

"ఏంటయ్యా నీతి?" అంది కాంచన పెడసరంగా.

"అమ్మలూ! అలా కోపంతెచ్చుకోకు. మెత్తగావున్న మగాడ్ని యెప్పుడూ నమ్మకు అని ఆవిడకు మాటాడేఅవకాశం యివ్వకండా "మెత్తనోడు చాపకింద నీరు, నీటిలోపాతిన కొయ్య, నింగిలోతిరిగే మబ్బు— అంటే నీటికన్నా పల్చన, దూదికన్నా తేలికైన మనిషన్నమాట?

"ఎందుకా లెక్చర్లు?"

"ఆ పల్చని మనిషి ఆ తేలికైన మనిషి యీ రాజశేఖరం కాదమ్మా... నీ భర్త"

"మావారిగురించి నాకు తెలుసున్లే"

"నీకు కొద్దిగైనా తెలీదు. ఈ చీకటికొట్లో కూర్చున్నావ్. కిటికీయైనా తెరిచావుకాదు. మావాడు కిటికీతెరిచి వున్నదున్నట్టు చెప్పకండా కాస్తసున్నితంగా చెప్తే నీకు కోపంవచ్చేసి నిముషాలమీద యిల్లు ఖాళీచేసిమన్నావ్" అంటూ రాజశేఖరంవేపు కోపంగాచూస్తూ "అలా నిల్చుంటావేం? తలుపుతియ్యి - ఇల్లు ఖాళీచెయ్యి. ఈ భర్తగాలి నీకు సోకిందంటే అతగాడిలా ఆఫీసు అమ్మాయంట స్క్రైట్‌గా సినిమాలకి ... లాడ్జిల్లోనూ తిరుగుతూకూర్చుంటావ్... పదపద...." అంటూ అప్పటికే జడిసి తలుపుతీసేసిన రాజశేఖరం గదిలోనికివెళ్ళి గబగబ ఆ రోజాయిచుట్టేసి, ఆ బట్టలపెట్టి తనే పట్టుకొని బయటకు వచ్చేసాడు.

"మీకేం అద్దె బాకీలేదుగదా - చూస్కోండి. మీగదెవడిక్కావాలి?" అని తనుదిగిపోయి నడిచిపోతుంటే రాజశేఖరం గొడవ వస్తుందని వెనక్కుతిరక్కుండా వెంటపడ్డాడు. త్రోవలో

"ఎందుకలా అబద్ధం ఆడావ్?"

"నివ్వు వేడికి చలవచేద్దామవి ఆ కథలో చల్లని సీతికబుర్లు చెప్పావ్. ఆవిడగారు లొంగుతుందా? వేడికి వేడే విరుగు. ఇక కొట్టుక చావనీ?'"

"ముందు నాసంగతిచూడు!"

"నాది మేకపోతు గాంభీర్యం అనుకున్నావా? అన్నిసంగతులు ఆలోచించి నోరే పులిలా వురుకుతాడు ... పదపద."

తిన్నగా తీసుకవెళ్ళి తనకొట్టు విప్పాడు.

"ఇదిగో గది. ఇందులో యీ గదిలో యీ బీరువా యీ టేబిలూ యీ వాచీల అద్దాలడొక్కు .. నివ్వన్న డబుల్‌డాక్టరు వస్తువులు. మిగతా జాగాఅంతా నీది. నీయిష్టంవచ్చినన్నాళ్ళు వుండు అద్దెగిద్దె నైజాన్తా...."

ఆ కొట్టు గదికన్నా యిది విశాలంగావుంది. సరిగ్గా వూపిరిపీల్చుకోవచ్చు. ఈ మొగమాటస్తునికి మాటాడే అవకాశం యివ్వండా వడ్డించమన్నాడు. రెండు పీటలువేసారు. రెండు విస్తరాకులు కోడిమాంసం కొబ్బరిఅన్నం పెరుగులో వుల్లి తరుగు. వేడి వేడి గారెలు. అరటిపళ్ళు. కొత్తిమీర పచ్చడి.

"అమ్మో...యింతే"

"ఏదీ వదిలేకండా తినాలి"

"బాబోయ్. ఇంత తినలేను. ముందు తీసేయండి. కావలిస్తే వేసు కుంటాను

"అసలు యీ తిండిలోనే మందుందయ్యా-కోడి మాంసం వేడికి పెరుగు, కొత్తిమీర పచ్చడి విరుగు. ఇంతా వేడి వుండిపోతే అరటిపళ్ళు చల్లారుస్తాయి. అయినా వేడక్కని ఒళ్ళు మగాళ్ళకు మంచిది కాదు. తిను తిను - ముందుకు పెళ్ళి చేసుకోబోతావు...."

అయినా రాజు జనార్ధనం తల్లికి పళ్ళెం అడిగి కొంత తీసేస్తుంటే

"మా అమ్మ. మా ఆవిడ కసీసం యిల్లు దాటి సినిమా యెరుగను గానీ- మా అమ్మ మా బాబున్నప్పుడు వీధిలోకైనా తొంగి చూడలేదు ...మా బాబుకున్న పట్టుదల నాకు లేదు. మా అమ్మకున్న సత్తువ మా ఆవిడకు లేదు. ఈ అర్జునంటా దేనికి? తిండికేనా? అందం గిందం చూడక. బాగా పండిందే పెళ్ళం. ఇంటందరినీ చుట్టాలనీ బాగా మేపుతాది."

"నివ్వు అదేపనిగా మాటాడుతుంటే బాబు అనుమానిస్తున్నాడురా" అంది ధనాధన్ తల్లి.

"వాగడం మందు లక్షణం. ఈ మందుతో వున్నానని తెలిస్తేగానీ నా దగ్గరకు హోమోపతి మందుకు రారు. మందులో వుంటే కరెక్టు హౌడెప్పి యెంచుతానని పేరు పడ్డాను. కాండక్టు రూల్సు అని ఆఫీసుకు మందుతో రానివ్వక పోవటంనించి కదా - ఆఫీసులో అలా డల్‌గా వుంటాను. అమ్మా ఆఫీసులో నా పనంతా యీ రాజశేఖరం చేసేస్తాడమ్మా.,"

తిండి అయిపోయింది. ఇంట్లో భార్యా, పిల్లలు అంతా ఖదేరహో జనార్ధనం యింట్లో డిక్టేకరే. భోజనాలయ్యాక రెండు కిళ్ళీలు తెచ్చాడు.

"నాకు అలవాటు లేదు"

"కాఫీ టీలు తాగవు-స్మోకింగ్ చెయ్యవు. డ్రింకింగ్ లేదు. పోనీ కిల్లీ కూడా తినలేవు. ఇవన్నీ యిన్‌స్పిరేషను యిచ్చేవి. ఇన్‌స్పిరేషనుతో రాయలేని వాడివి-చప్పటి కథలు రాస్తావు. చప్పటి కథలతో డబ్బేం చేసుకుంటావ్?"

"నేను డబ్బుకోసం రాయటం లేదు"

"మరి దేనికోసం యిదంతా? ఈ ఒళ్ళు పాడు వేసుకోవటం కీర్తికోసమా? అయ్యోరామా? మనిషికి ప్రాణం తరువాత ముఖ్యం ఏమిటి? డబ్బు ...ఎందు కంటావ్? డబ్బు లేకపోతే యీ ప్రియాతి ప్రియమైన ప్రాణాన్ని కాపాడుకోలేవు. నీ కీర్తి ప్రాణాన్ని కాపాడదు. ప్రాణాన్ని తోడేస్తుంది."

ఆ వేళకి ఉత్తేజం గురించి, డబ్బు కీర్తి గురించి ధనాధన్ లెక్చరు పూర్తయ్యాక "యెన్నాళ్ళకు కడుపు నిండిన తిండి, అపురూపమైన తిండి" అని కాస్త కడుపు యెక్కుపెట్టినా తృప్తితో నిద్దరపోయాడు రాజశేఖరం.

17

తొలి స్వాతంత్ర్యదినం. మూడు రోజులపాటు వుత్సవాలు హడావుడిగా విశాఖపట్నంలో జరిపారు. ఇలానే వుత్సవాలు ప్రతిచోట జరిగినట్టు రేడియో లోనూ పేపర్లో వార్తలు వచ్చాయి. ఎలానూ రావలసింది వచ్చింది. వచ్చింది యెటు వెళ్ళిపోతుంది? ఈ పట్నంలో యిదివరకు రక్తపాతం చూడలేదు. పెద్దగా చెప్పుకునే స్వాతంత్ర్య సమరం జరగలేదు. అందుకే కామోసు స్వాతంత్ర్యం కొందరికి కల్పవృక్షమైతే మరికొందరికి యేడాదికొకసారి వచ్చే పండగల్లో ఒకటిగా తీసుకున్నారు. ఏదో మొక్కుబడి చెల్లించుకునే విధంగా అధికారులు కార్యకలాపాలు జరిపించారు. ఇంకా యీ రోజు ఉపన్యాసాలు విందు భోజనాలు కాలేదు.

ఈ కోలాహలం చూడ్డానికి తనతోబాటు తిరిగిన జనార్ధనం ఆ రాత్రి కాస్త మందుమీదే రాజశేఖరాన్ని ప్రశ్నించాడు.

"స్వతంత్రం అంటే యేమిటి?" అని

జవాబు చెప్పకపోగానే

"ఈవేళనించి భారతీయులంతా స్వతంత్రులు అంటావు. అంతేనా?"

ఈయన మందుమీద మాటాడుతున్నాడు. అలా మిటుక మిటుకమని చూస్తుంటే....

"మోస్టు యిండిపెండెంట్ పీపుల్ ఆర్ వుమన్ అని యింగ్లీషులో అంటూ "ఇప్పుడైనా నేనేం మాటాడుతున్నానో అర్థమైందా?"

దగ్గరగా క్రాపు చేసుకున్న నల్లని జుత్తు. ఎత్తుగా వున్న నుదుటిమీది కనుబొమల మధ్య బొట్టులా వున్న మచ్చ. చిన్నప్పుడు పడ్డాడట. దానివలన తెలివితేటలు హెచ్చాయో తగ్గాయో యెవరూ చెప్పలేకపోయారట. తాగుడుకి మించిన తిండివలన మనిషి కండలు తిరిగి వస్తాదులానే వున్నాడు.

"స్వతంత్రులు ఆడవాళ్ళతో సమానం అని నీ ఉద్దేశమా?" అన్నాడు రాజు.

"మగాడు కొండలెక్కగలడు. విమానం మీదనించి గెంతగలడు. కానీ అన్నిటికన్నా మగాడికి అతి కష్టమైన పనేంటో చెప్పు చూద్దాం?"

"నివ్వే చెప్పూ?"

"పెళ్ళాన్ని కంట్రోల్ చెయ్యడం"

రాజు నిట్టూర్చాడు.

"పెళ్ళి చేసుకుంటావు కదా! చెప్పు పెళ్ళాన్ని యెలా కంట్రోల్ చేస్తావో?"

"సున్నితంగా మాటాడి...కాస్త ప్రేమ కబుర్లాడి"

"అలా చేస్తే అదిగో ఆ అమ్మాజమ్మ కొడుకులా తయారవుతావ్?"

"మరి యెలా చెయ్యాలి?"

"ఇద్దరిమధ్య ఒక హద్దుగీత వుంటుంది. అది కనుక్కోవటం గొప్ప కష్టం"

"అంత కష్టమా?"

"కష్టమా కష్టంన్నరా? ఏది అసలు గీతో, యేది నకిలీగీతో పోల్చుకోడానికి...."

"ఏం చెయ్యాలి?"

"ముందు పెళ్ళాన్ని అర్థం చేసుకోవాలి...."

"అది అందరూ చేస్తారు"

"ఉఁ....చేస్తారూ? తప్పుగా అర్థం చేసుకున్నోళ్ళే అంతా...అంతటితో సరికాదు. నివ్వు ఆవిడగారికి అర్థం కావాలి. అది మరీ ముఖ్యం. అంధుకే బాబూ ఇంటిలో మొగుడు ముఖ్యం. వాడిమీదే బరువు అంతా వుంది. మోసినవాదే మొగుడు. బరువెత్తినోడు బలవంతుడు. ఈ బలవంతుడు ఆ అమ్మాజమ్మ కొడుకులా ఆడదానిలా సంచరిస్తే...మరి ఆ పెళ్ళం మొగుడిలా చలాయించదూ?"

"అయితే నాలుగు వడ్డించాలా?"

"నో-నో-నో. ఎప్పుడూ పెళ్ళంమీద చెయ్యెత్తి మహా పొరపాటు చెయ్యక"

"మరి వినకపోతే-"

"ఎప్పుడూ నాగుపాము మీద పొరపాటునైనా కర్రెత్తక. మంచి సమయం చూసుకుని కాటేస్తాది. ఆడది రౌద్రరూపిణి. ఆ హద్దు దాటిందంటే సిడి కాదు."

"మరి ఆ హద్దు యెలా కనుక్కోవాలి?"

"ఒక్కో మొగుడు ఒకోలా కనుక్కుంటాడు. ఇదేంటి? అంతరంగాలు తెలుసుకొని కథలు రాసినోడివి నివ్వు. నీలాంటి తెలివైనోడికి యీ తాగినవాడు లెక్చర్లు దంచుతున్నాడు. మహాపరాధం" అంటూ బుగ్గలుమీద లెంపలేసుకున్నాడు.

ఈ యింట్లో పిల్లల గొడవ. పేషెంట్ల గొడవ వున్న యిలాంటి లెక్చర్లు వినసొంపుగా వున్నాయని రాజశేఖరం యింకో యింటికి మారాలన్న ధ్యాసలో లేదు. ఏం మిగిలినా మంచిదేనన్న ధోరణిలో వున్నాడు. ఎంతో క్లుప్తంగా జరుపుకుంటూ వీలైనంత హెచ్చు డబ్బు తండ్రికి పంపుతున్నాడు. కథలు అడపా తడపా పడుతున్నాయ్. డబ్బిచ్చేవాళ్ళు తక్కువ. ఒకోసారి కథ పడిన మేగజీను కాపీ కూడా కొనుక్కోవలసి వస్తోంది. ఒక పది రూపాయలు కథకు వచ్చిందంటే అది గొప్ప విషయమే.

ఒక రాత్రి రేపటి ఉదయానికి కాఫీ హోటల్కి వెళ్ళడానికైనా డబ్బుల్లేవు. ఇంకా జీతం అందడానికి నాలుగు రోజులుంది. అనుకోని విధంగా కొందరు మిత్రులు కలవడం వలన యిలా తారుమారైపోయాయి. ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకొని బయటకు పోదామని కమీజు వేసుకుంటే జేబులో యైదు రూపాయల నోటుంది. ఇదెక్కడనించి వచ్చిందని అనుకొని చప్పున ధనాధన్ యెదుటివాళ్ళ మనసును తెలుసుకున్న డాక్టరు కూడా అయ్యాడే అనిపించింది.

జీతాలు అందాయి. ఇంటికి పంపవలసింది పంపి యెవరికివ్వవలసినవి వాళ్ళకిచ్చి ఒక సాయంత్రం యేదో ఆలోచించుకుంటూ రీడింగురూమ్కని వెళ్తూంటే ఒక సందు మలుపులో చప్పున తిరుగుతూ చూసుకోకండా ఓ అమ్మా యిని ఢీకొన్నాడు రాజు. ఢీకొన్నాక సారీ చెప్పినా ఆ అమ్మాయి కళ్ళు ... అన్నట్లు కొరకొర చూసింది. ఈ అమ్మాయి చేతిలో ఒక వారపత్రిక వుం... అందులో తన కథ వుంది. బహుశః ఆ కథ రెండుసార్లయినా చదువుతుందేమో... తనే ఆ కథకుడని తెలిస్తే తిరిగి "ఫరవాలేదులెండి" అనేదేమో? ఈ అ... చెక్కిన చక్కదనంతు చెరగని కోపం నప్పలేదు. ధనాధన్ యింటి యెదు... మీద యీ అమ్మాయిని యిదివరకు చూసాడు. ఈ సంఘటనతో యీ కో... కొరివిలా కళ్ళల్లో యింకా మెరిపిస్తోంది. తన కళ్ళకి ఆలోచనలతో ముఖ్య... కమ్మితే ఆ అమ్మాయి కళ్ళకేం వచ్చింది? చూసుకొని నడవకూడదూ?

ఈ అమ్మాయి ఇలా వుంటే ఇంకో అమ్మాయి రోజూ ఉదయ... సాయంత్రం యింటిముందునించే వెళ్తుంది. కబురందుకుని వచ్చినట్లు ఒకసా... యీ యింటి యెదరగా యేదో ఒక చేష్ట చేసి ఆగి రాజు వుంటే ఒకసారి చి... నవ్వు వెలగబోసుకుంటుంది. ఈ అమ్మాయికి కథలంటే యిష్టమేమో? ... ఫలాన కథలు రాసే రాజశేఖరం అని తెలుసునేమో? దీపాల్లాంటి కళ్ళు, రెప్ప... కొట్టుకోవటంతో యేవో కోరికల వెలుగులను పంపుతున్నాయనిపిస్తుంది. రెం... వాలుజడలకున్న రెండే సంపంగి పువ్వులు కనపడడానికి చప్పున ముందు... విసురుతుంది. దానితో ఆమె పువ్వువంటి సొగసు నవ్వుతుంది. రాజశేఖ... యెప్పుడైనా టౌనుహాలు బీచిలో కూర్చుంటే యీ సంపెంగ జడ అమ్మా... ఆ దగ్గరలో కూర్చొదమో కదలదమో కద్దు.

అటు చిరాకు పడ్తున్న చిన్నది. ఇటు మందహాసంతో మూగబాసలా... తున్న ముగ్ధ. ఈ యిద్దరినీ ఒకచోట చేర్చి, తనలాంటి పిరికి మనస్తత్వం వున్న... వాడిని నాయకుడ్ని చేసి కథ అల్లితే ...ఈ కోపంతోనున్న అమ్మాయిని మ... మ్మత్తు చేస్తే, కొత్త తళుకుతో వెలుగుతుంది. అప్పుడు సంపెంగ పువ్వుకనా గులాబీవేపే యీ నాయకుడు మొగ్గు చూపడూ?

ఈ గులాబిముళ్ళు ఇంకా గుండెకే గ్రుచ్చుతున్నట్లుంది. మరమ్మ... చెయ్యాలని కాంచన కోపానికి గురయ్యాడు. మరమ్మత్తు చెయ్యడానికి సుత్తి... దెబ్బ కొట్టినట్లే కొట్టాడేమో? సూటిగా తగలటం వలన మరమ్మత్తు అయ్యేబదులు పగిలి కూర్చుందేమో?

ఇలా తర్జన భర్జనలు బుర్రలో తిరుగుతూ రాయబోయే పెద్ద కథ ఆ... రాన్ని సృష్టించుకుంటున్నాడు. ధనాధన్ మందుల డాక్టరు పని ముగించి, వాచీ డాక్టరు పనిలో వున్నాడు. మందుమీదున్నా మోతాదు మించలేదు.

"ఏం కథ రాస్తున్నావ్?" అన్నాడు.

"ఒక అమ్మాయి మా గీర్వాణం చూపిస్తోంది. మరమ్మత్తు చేద్దామని అను... కుంటున్నాను."

"నీ దగ్గర యిలాంటి భూతద్దం వున్నదా?" అంటూ తన కంటికున్న భూతద్దం తీసి చూపించాడు.

"ఇదెందుకు? వాచీలు రిపేరు చెయ్యడానికి కావాలిగానీ"

"రిపేరు వచ్చిన మనుషులూ రిపేరొచ్చిన వాచీలతో సమానమయ్యా దేముడా?"

"అలానా?"

"అన్ని కథలు రాసి అలానా అంటావేమిటి? ఈ మెకానిజమ్ యెంత జాగ్రత్తగా హేండిల్ చెయ్యాలో తెలుసా? రిపేరొచ్చిన మనిషికి అంతకు డబల్ జాగ్రత్తగా చూడాల. మరి జాగ్రత్తగా యెప్పుడు చూడగలవు?"

"ఎప్పుడు?"

"నా ప్రశ్నలు నాకే తిరగేస్తున్నావే? ఈ మెకానిజమ్ నీకు అర్థం కావాల. అర్థం కాకపోతే ముట్టుకోలేవు. అర్థం కాకండా ముట్టుకున్నావో పూర్తిగా తగలబెట్టేస్తావ్! ఇంక నీ కథలోనికి వద్దాం. నివ్వు మరమ్మత్తు చేస్తానన్న అమ్మాయి తత్వం అర్థం చేసుకున్నావా? ఎక్కడ పాల్టున్నదో తెలుసుకున్నావా?"

"తెలుసుకున్నాను!"


"తెలుసుకున్నానంటున్నావు. ఫాల్టు తెలుసుకుంటే సరిపోదు. దాన్ని రిపేరు చెయ్యటం చేతనవ్వాలి. దాన్ని యేవంటారు?"

"ప్రజ్ఞ"

"అంత పెద్ద మాటలెందుకు వాడతావ్? కథల్లో పెద్ద మాటలు వాడినా పెద్ద కబుర్లు చెప్పినా అర్థం కావు. సులువుగా మాటాడినట్టే సులువుగా రాయాలి చేతనవటం అంటే గేరంటీగా వాచీ నడిపించేటం. అలా గేరంటీగా నడిపించటం అంటే చెయ్యి బాగా తిరగాలన్నమాట. అందే అభ్యాసం కూసువిద్య అన్నారే మన పెద్దలు. రాయగా రాయగా కరణం పొరగా పొరగా మరణం. యిప్పుడర్థం అయ్యిందా మరమ్మత్తు చెయ్యటమంటే యేంటో?"

"ఇంకా సరిగ్గా అర్థం కాలేదు" అన్నాడు రాజు. అక్కడతో ధనాధన్ ఆపటం యిష్టంలేక.

"అర్థం కాలేదా? మరమ్మత్తు చేస్తానని నివ్వొక్కడివే అనలేదులే. మన ఆఫీసరూ అంటుంటాడు. వాడిమీదోడు అంటుంటాడు. పేపర్లలో కూడా మహా పెద్దోళ్ళు అంటుండటం వింటుంటాం. ఇలా అన్నోళ్ళ దగ్గర మరమ్మత్తు ఎక్కడ చెయ్యాలో తెలుసుకోడానికి వాళ్ళ దగ్గర అసలు యీ భూతద్దం వుండదు. అవి వుంటే అరె బాబురే మరమ్మత్తు సెయ్యటమంటే కొత్తది పుట్టించటంకన్నా కష్టం అని జాగ్రత్తగా మాటాడతాడు. భూతద్దం పెట్టి నిదానంగా చూసి ఒక వాచీగ్గానీ, ఒక మనిషిక్గానీ, సంఘాన్నిగానీ, ప్రెపంచాన్నిగ్గానీ ఫాల్టేదో తెలుసుకోవాల. భూతద్దం దొరికినంత మాత్రాన ఫాల్టు దొరికిపోదు. అసలు ఫాల్టు యేంటో తెలుసుకోవాలంటే వాచీ మిషను ప్రతి పార్టు సంగతి తెలియాలి. అదెలా పని చేస్తుందో తెలియాలి. లాకాయి లూకాయి మనిషి కాదు మనిషిని పుట్టించింది.



బ్రహ్మదేవుడు పుట్టించాడు. ఫాల్టు తెలుసుకుని మరమ్మత్తు చెయ్యాలంటే బ్రహ్మ దేముడంతోడవ్వాల! అందులో సగమైనా వున్నావా? కథలు యెందుకు రాస్తా రంటే?"

"ఎందుకా?

"నిన్నడగలేదు. నిన్నడిగితే లోకాన్ని మరమ్మత్తు చెయ్యడానికంటావు. ఈ మహాప్రపంచంలో మూడొంతులు ముప్పాతిక సముద్రం. ఈ లోకంలో అంత కన్నా హెచ్చు కన్నీరే. నీ పుణ్యముంటుంది. కన్నీరు తెప్పించే కథలు రాయక సరదాగా నవ్వించే కథలు రాయి. బాగా చెల్లుతాయి. నీకు నాలుగురాళ్ళు కూడ తాయి. అర్థమయిందా?"

"హాఁ అయ్యింది" అన్నాడు. ఈ కథ రాస్తూన్నప్పుడు యీ చివరి లెక్చరు రాజుకి జ్ఞాపకం వుంది. ఈ పెద్ద కథ పూర్తయి ఫెయిర్ చేసి ప్రచురణకు పంపించిన వారం రోజులనాడే సాయంత్రం రీడింగురూంలో కూర్చున్నాడు. ఆరుగంటల యింగ్లీషు న్యూస్ వినటం అలవాటు వార్తలు వినగానే కాళ్లు చేతులు వణికిపోయాయి. గబగబ మేడ దిగిపోయాడు. ఇదివరకు తాతయ్య చావులా యీ వార్త కళ్ళల్లో నీరు కార్పించింది. కొద్ది క్షణాల్లో కారుచిచ్చులా ప్రాకిపోయింది. రోడ్డుమీదే యెందరో యేడ్చుకుని వెళ్ళిపోతున్నారు. అలా మెయిన్‌రోడ్డుమీదే యిటూ జనసమూహంలో తిరుగుతున్నాడు. ఎక్కడికక్కడ లౌడు స్పీకర్లలో రేడియో ద్వారా వచ్చే వార్తలు, విషాద సంగీతం వినిపిస్తోంది. ముప్పయి జనవరి 1948. గాంధీజీని హత్య చేసిన రోజు అది. ప్రజల్లో యింత సంచలనాన్ని కలిగించే ఘట్టం యిదివరకు రాజు చూడలేదు కొట్లు మూసివేయటం వలన ఆ మెట్లపై కూర్చునే కొందరు యేడవటం చూసాడు. అదుక్కునే వాళ్లుకూడా రోదిస్తూ పోతున్నారు.

ఇంటికి వెళ్ళేసరికి జనార్ధనం యింకా మోతాదులో వున్నాడు. అంత వరకూ యేడుస్తున్నవాడు రాజశేఖరాన్ని చూడగానే వరండామీదే గట్టి స్వరంతో.

"ఆ దొరలు హద్దు కనుక్కుని పాలించారు. అందుకే దేశమంతా తిరిగినా మహాత్మునిమీద యీగ వాలనివ్వలేదు. అధికారం వచ్చింది మనకి - ఏం లాభం? హద్దు యెక్కడుందోనని వెతుక్కుంటున్నాం..."

కాస్సేపు మౌనం. ఏడుపు. తరువాత మళ్ళీ ఒక పట్టుపట్టాడు. ఈసారి, తొలిసారి తను చూడగా మోతాదు మించేసాడు.

"తాగకపోతే నా గుండె ఆగిపోతాది. అందుకే తాగాను....రాజశేఖరం ఆఫీసులో నా పనంతా విసుక్కోకండా చేస్తావ్. ఇప్పుడు నా పని ఛేస్తానని ఒట్టెయ్యి."

"ఒట్టెందుకు? చెప్పు?"

"ఒట్టేస్తావా లేదా? తమాషాలనుకున్నావా? నా గుండె పగిలిపోతే నీకు వేళాకోళంగా వుందా?"

వీధిలో వెళ్ళిపోతున్నవాళ్ళు ఆగి చూస్తున్నారు. మేడమీదనించి తన కథలోని గులాబి కూడా చూస్తోంది. రాజశేఖరం చెయ్యి పట్టుకుని లాగుతూ జనార్ధనం

"నన్ను ఢిల్లీ తీసుకెళ్తావా లేదా?"

"నెవ్వెళ్ళినా ఆ ముఖం కనపడదయ్యా జనార్ధనం" అని రోడ్డుమీదనున్న మనుషుల్లో తనకు తెలిసిన వాడెవడో అంటే

"అన్నిటికీ హద్దులున్నట్లు ఏలడానికీ హద్దులున్నాయయ్యా? ఏలినవారు ఆ లక్ష్మణరేఖ కనుక్కోలేదు - అందుకే గాంధీబాబు బలవంతంగా పోయాడు. ఆ రేఖ నేను చూపిస్తాను. మరి అంత ఘోరం యెప్పుడూ జరగదంటే జరగదు ..."

ఇలా అరుస్తున్నాడు. రాజశేఖరంకు చిరాకెత్తి గది లోపలకు వెళ్ళిపోతే తనతో లోనికి వచ్చాడు. జిడ్డులా వదలటం లేదు. చిరాకెత్తుతోంది. ఏం చేసినా

యేం అన్నా తప్పించుకోలేకపోతున్నాడు. ఇంట్లో పెళ్ళాం, తల్లి పిల్లలు యెవరూ కిక్కురుమనకండా వూరుకున్నారు. రమాదేవి నిందిస్తే యింటినించి వెళ్ళి పోయాడు. సీతు తాగి యిలా అల్లరి చేసినా ఆ క్షణంలో యింటినించి కదల్లేక పోతున్నాడు. అలా వాగి వాగి యెంత రాత్రికోగానీ నిద్దరపోలేదు.

ఉదయమే తన గదిలోనికి వచ్చాడు జనార్ధనం. గతరాత్రి బహుశః ఏం జరిగిందీ తల్లి చెప్పిందేమో?

"పొరపాటైపోయింది" అన్నాడు.

రాజశేఖరం చిన్న నవ్వు నవ్వేసాడు. అంతే. ఇక్కడ యీ రణగొణ ధ్వనిలో, యీ పిల్లల పెద్దల గొడవల్లో, ఏ రాత్రిపూటైనా మందుల కోసం తలుపు కొట్టేవాళ్ళమధ్య తను అమ్మాజమ్మ యింట్లో భద్రంగా యేర్పరచుకున్న లాంటి కార్నర్ రాయడానికి వీలైన మాటలను కోల్పోయాడు.

ఎలాగో రెండు నెలలు గడిపి దగ్గరలోనున్న కాదంబరివారి వీధిలో ఒక యిల్లు చూసాక జనార్ధనంతో చెప్పాడు

"ఈ ఏడాది మా తమ్ముళ్ళను చదువుకు తేవాలనుకుంటున్నాను. పది హేను రూపాయలకే ఒక చిన్న యిల్లు దొరుకుతోంది, వంటకు, పడకకు సరి పోతుంది. నీకు అభ్యంతరం లేకపోతే అక్కడకు మారిపోతాను"

"తమ్ముళ్ళంటున్నావ్. ఇంక పెళ్ళి చేసుకోవా?"

"అప్పుడే"

"నీ వయసులో నాకు బిడ్డా పాపా...."

"నాకెందుకు పెళ్ళి?"

"ఏం? పెళ్ళికి పనికివచ్చే యంత్రం కావా నువ్వు?"

రాజశేఖరం నవ్వి

"చాల బాధ్యతలున్నాయ్"

"దేనికోవ దానిదే. కిళ్ళీకొట్టు కిళ్ళీకొట్టే. కిరాణాషాపు కిరాణాషాపే. ఆ కిళ్ళీ లేకపోతే జరగదు - ఇటు ఆవాలు లేకపోయినా జరగదు. వయసు పెళ్ళొద్దన్నోడు యెలాంటివాడంటావ్?"

"ఎలాంటోడు?"

"నా ప్రశ్న నాకే జవాబుకు-వదుల్తావ్. ఇది మంచి అలవాటు కా సుమా? రేపొద్దున్న పెళ్ళాం వేసిన ప్రశ్నలు...."

"ఏం ప్రశ్నలేస్తుంది?"

"నోరు విప్పి నాథా అని చెప్పదు. పెళ్ళాం కళ్ళల్లోనే కాదు, నాలిక పై కాదు నవ్విన నవ్వులోనూ, చిర్రున చీదినా అందులో ప్రశ్నలుంటాయి, దేవు ఆ ప్రశ్నలకు జవాబులన్నట్టు నివ్వు మెసలకపోతే నివ్వొక చవట అని బయట అనకపోయినా లోపల గుండెలో దాచుకుంటుంది గుండెలో మనసులో ం చవట అన్న బిరుదు అంటుకుంటే - ఆ మొగుడు ఏ దారంటే గోదారి ప పలసిందే?"

"ఇంతకీ వయసులో పెళ్ళొద్దన్నోడు యెలాంటివాడు?"

"దెయ్యం పట్టిన మనిషిలాంటోడు. అందుకే పెళ్ళి వద్దనకు. వే చేసుకో. కార్తిలో పడిన విత్తనం యేసి కాలం యెరిగిన కొడుకును కను... దేముడు వరంతో పుట్టినా పెసిమిడి వరమే అనుకొని నిన్ను దేముడిగా చేసి పెళ్ళాం కొలుస్తోంది...."

ఇదే ఆఖరి లెక్చరు వినడమని యిల్లు మార్చాడు రాజు.

(ఇంకా ఉంది)

డా. యు. ఎ. నరసింహమూర్తి

వెన్నెల లోతుల్లో నారాయణబాబు

"లలూన్ నెగర్డ్ ఓఁకూన్ రఁకూన్" అనే ఒక ఫ్రెంచి పద్యపాదాన్ని అవ్వలస్వామిగారు నారాయణబాబుకు చెప్పేరు. "చంద్రుని వల్ల ఎప్పుడును చెడువు సంభవించదు" అని ఆ పాదానికి అర్థం వివరించబడింది. నారాయణ బాబు అభిరుచిని గమనించి మనసు నాకళించుకుని అవ్వలస్వామిగారు ఈ పద్యాన్ని చెప్పారో- అవ్వలస్వామిగారు చంద్రిడి గురించి పాడుతూండడం వల్ల నారాయణబాబుకు అభిరుచి ఏర్పడిందో నేను చెప్పలేను గాని చంద్రుడు నారాయణబాబు కవిత్వానికి ఒక ప్రేరణ అని మాత్రం చెప్పగలను. రుధిర జ్యోతిలోని 40 కవితలలో 29 కవితలలో చంద్రుడు కనిపిస్తాడు. వెన్నెల విరిసినప్పుడు నారాయణబాబు సంతోషించడం కనిపిస్తుంది. వెన్నెల లేనప్పుడు నారాయణబాబు ఊహలు బీభత్సాన్ని సృష్టిస్తాయి. నారాయణ బాబు చంద్రిడి ప్రభావానికి చెందినవాడవడం ఇందుకు కారణం కావచ్చును.

మనిషికి రెండు భిన్నరీతుల భావనాదృష్టి ఉంటుందని నీషే చెప్పేడు. అందులో ఒకటి అపోలోకు చెందిన స్వప్న ప్రపంచ సంబంధమైనది. అక్కడ మానవుడికి ప్రశాంతత - వ్యవస్థ ఆదర్శాలుగా ఉంటాయి. అతడు ప్రతి విషయాన్ని స్పష్టంగా ప్రత్యేకంగా చూస్తాడు. రెండవది దయోనాకు చెందిన మాదక ప్రపంచం. ఇక్కడ ఉద్రేకాలు. పారవశ్యాలు అధికం. ఇక్కడ ప్రశాంతతకు - స్పష్టతకు చోటులేదు. వింతైన ఇంద్రియజ్ఞాన సంబంధమైన శక్తి. మాదక ప్రభావం వుంటాయి. అని మనిషి తనను తాను పూర్తిగా విస్మరించి ప్రకృతితోనూ - మానవ సంఘంతోనూ వాటి యొక్క వివేకహీనమైన - అధికారమైన సహజభావనలతోనూ పారవశ్యం పొందేలా చేస్తాయి. ఆధునికులు దయోనాకు సంబంధించిన దృష్టికి అభి ముఖంగా పయనిస్తున్నారని వివరిస్తాడు సి. ఎమ్. బౌరా, ఇందులో నారాయణబాబు దయోనాకు చెందిన భావ ప్రపంచంలో వున్నాడు. చంద్రుడి ప్రభావం అతని కవితలలో ఎలా వుందో చూద్దాం.

రుధిరజ్యోతి సంకలనంలో మొదటిగేయం "సామిధేని". యాగంలో అగ్నిని జ్వలింప జేసేటప్పుడు చదివే ఋక్కును సామిధేని అంటారు. ఈ శీర్షిక నారాయణబాబుకు గల సంప్రదాయ పరిజ్ఞానాన్ని తెలియజేస్తూనే అతని లక్ష్యాన్ని వ్యంగ్య మర్యాదతో సూచిస్తూంది. ఇందులో వెన్నెల ప్రస్తావన ఇలావుంది.

కాలం నాగు / విను వీధులలో
వెన్నెల పడగ / విప్పింది

కవి ఇక్కడ విప్లవోన్ముఖంగా ఉన్న సమాజాన్ని దర్శిస్తున్నాడు సమకాలీన సమాజం వినీలాకాశంలా వుంది. అందులో సామ్యవాద సంస్కరణాభిలాష అనే వెన్నెల ప్రసరించడం ప్రారంభమయింది. నాగుపాము పడగ భయాన్ని కలిగిస్తూంది, కాని ఆ పడగను వెన్నెల పడగ అంటున్నాడు కవి. వెన్నెలను అంతా అనుభవించాలనుకుంటారు. భయంకరమైన దైనా పాము పడగలో ఒక అందం, ఆకార్షణా వుంటాయి. చూడాలనే కోరిక అందరికీ వుంటుంది. సామ్యవాదం అందరూ కావాలనుకునేదే. కాని అప్పటికింకా దాని వేపు తేరిపారచూసే ధైర్యం చాలమందికి లేదు. అందుకే అది వెన్నెల పడగలా కనిపించింది కవికి. కాలం నిష్ఠురమైనది. అందుకే దానిని నాగు అన్నాడు కవి ఇది తిక్కన చెప్పిన "దారుణప్రియదర్శనం"లా కనిపిస్తుంది.

"కవీః" అన్న గేయంలో ఆకాశంవుంది. చంద్రుడు లేదు కాబట్టి చుక్కలు స్ఫుటంగా వున్నాయి.

నల్లని త్రాచు కోరలు / తెల్లని మశూచి కుండలు
గగనమ్మున తారలు.

ఒళ్లు తెలియని / పుళ్ల బాధతో / వెక్కివెక్కి
ఏడ్చినది / చుక్కల యాకాశం.

నక్షత్రాలను తాచుపాము కోరల్లా, మశూచి కుండల్లా గజ్జి పుళ్ళలా ఊహించడం కొత్త. ఈ గేయంలో సామాజిక దురన్యాయానికి బలైన స్త్రీని గురించి దయనీయంగా భయంకరంగా చెప్తాడు కవి. ఆ నిర్వహణలు ఈ కొత్త అభివ్యక్తులు పుట్టుకొచ్చేయనవచ్చును. కాని నారాయణబాబుకు చంద్రుడు లేని, వెన్నెలలేని చీకటి రాత్రులు ఇలాంటి ఆలోచనలను రేపుతాయేమో నని అనిపిస్తుంది. ఎందు చేతనంటే అతని ఆలోచనలు చంద్రుడు కనిపించి నప్పుడొకలాగ, లేనప్పుడింకొకలాగ వుంటాయి.

"ఏమండి"? అనే గేయంలో "వెన్నెల విహారములకు" అనే చోట వెన్నెల ప్రస్తావన వున్నా దానికి ప్రత్యేకతలేదు. అది పాతకవిత్వాన్ని పరామర్శిస్తూ చెప్పిన మాట.

"కావాలి" అనే గేయంలో మబ్బులు కమ్మిన వెన్నెలరాత్రి కనిపిస్తుంది కవికి కావలసింది పుచ్చపువ్వులాంటి వెన్నెల. మసక వెన్నెల కాదు. మసక వెన్నెల అతనిలో కలిగించిన అలజడి ఈ కింది భావనలో కనిపిస్తుంది.

"ఆరిన చితిలో / బూడిద వెన్నెల / జారిన ముక్కుపుడక ఒకటే
చుక్క"

"సమాధిలో / మృత శిశువట్టుల / జలదాంతర శశిః"

అంటాడు. పూర్వం రాజశేఖరుడు చంద్రుణ్ణి చితా చక్రం అన్నాడు. అయినా అక్కడి వాతావరణం వేరు. ఈ గేయంలో నారాయణబాబు శ్మశానాన్ని ఆకాశంగా మారుస్తున్నాడు. చితి మంటలు సంధ్యారాగం. చితిలో బూడిద వెన్నెల. శవాలకోసం వాలిన రాబందులు శరన్మేఘాలు. సమాధిలో దాగిన చనిపోయిన చంటి బిడ్డలా మబ్బులచాటున చంద్రుడు. అది శివుడు ప్రళయతాండవం చేసే విలయవేళ. దానికి తగిన పాటలుపాడే కవులుండే కావాలి. ఇతరులతో పనిలేదని కవి అభిప్రాయం. ఇందులోని ధ్వని ఏమిటన్నది చెప్పుకోనక్కరలేదు. చంద్రుడు కనబడకుండా, పిండారబోసినట్టు వెన్నెల విరియ కుండా వున్న ప్రకృతి కవి చేత ఇలాంటి బీభత్సవాతావరణాన్ని సృష్టింపజేసింది.

"కదన కుతూహలరాగం"లో కూడా చీకటిరాత్రి ప్రభావం కవి మీద ఎలా పని చేస్తుందో కనిపిస్తుంది.

"నీలి తావుల / చావు పూవులే / మొలిపిస్తాను
నిర్మల నభంపు / నీల పాళికల / వెన్నెల కత్తి / ఝళిపిస్తాను.
నోరులేని తారలచే / కీలాలం కక్కిస్తాను."

నక్షత్రాలను దావుపూవులన్నాడు. తన చుట్టూ ఆవరించుకుని వున్న చీకటిని చీల్చడానికి వెన్నెల కత్తిని ఝళిపిస్తాడట. నోరులేని తారలు తెల్లనివి వాటి కాంతి కూడా తెల్లనిదే. అయినా ఆకాంతి చీకటిని - ఛేదించడం లేదు. వెన్నెల కత్తితో ఛేదిస్తే తారలు రక్తం కక్కుతాయి. అప్పుడు వెలిగేది రుధిరజ్యోతి. ఇక్కడ కవి లక్షించిన అభ్యుదయ చింతన ఎలాగున్నా అతని మనస్సు పొరల్లో వెన్నెల విరియనప్పుడు కలిగే చికాకు మనకు కనబడుతుంది.

"ఊరవతల" అనే గీతంలో చంద్రోదయం కవికి ఎలాంటి ఉత్సాహాన్నిస్తుందో కనిపిస్తుంది.

"బ్రహ్మచెముడు / కంచె మధ్య / పూర్ణిమ సంధ్యల్లోను

ఘడియైన ఉదయాద్రికి / రుధిర జ్యోతై వెలిగే / జాబిల్లి".

తాను "రుధిరజ్యోతిర్లల నా ప్రియుడు' నని నారాయణబాబు కంఠోక్తిగా చెప్పుకున్నాడు. రుధిరజ్యోతి అతని ప్రధాన ప్రతీక. ఇక్కడ జాబిల్లి రుధిరజ్యోతై వెలిగిందంటాడు. పున్నమినాడు ఉదయించే చంద్రుడు-ఎఱ్ఱగా వుంటాడు. అదీ నిండా ఒక ఘడియ విలువని ఎఱుపు. కాని ఆ తర్వాత రాత్రి అంతా వెన్నెలే. ఇక్కడ బ్రహచెముడు కంచె ఆ వ్యవస్థకు నెలవైన సమాజం. పూర్ణిమ సంధ్య విప్లవ చైతన్యంలో మారుతూన్న సామాజికావగాహన. రుధిరజ్యోతై వెలిగిన జాబిల్లి విప్లవం, ఆ తర్వాత వచ్చే వెన్నెల సామ్యవాదం. అదే రుధిరజ్యోతిర్లలన. ఆ వెన్నెలకు ప్రియుడు నారాయణబాబు అని అతనే చెప్పుకున్నాడు. ఈ ఊహ కంతటికీ ఉన్నంత సేపూ వెన్నెల్లో ముంచెత్తే పున్నమి చంద్రుని పట్ల కవి అంతర్యంలో వుండే అభిరుచి ప్రేరణ.

"ఢంకాబజాలే" అనే గీతంలో చీకటి కవిని బాధించే తీరు కనిపిస్తుంది.

"చీకటి కళ్ళు విప్పి / చుక్కలు

కాలపాంధుని / కళ్లకు / ముళ్లబాధ"

ఇక్కడి కాలపాంధుడు నారాయణబాబే. వెన్నెల లేని రాత్రి అతని అంతరంగం పొందే అలజడే "కళ్లకు ముళ్లబాధ"గా వ్యక్తమయింది.

"రాజాజీ!" అన్న సంబోధనలో చంద్రుణ్ణి కూడ ఉద్దేశించేరు కవి. ఇందులో వున్నవాడు కృష్ణ పక్షపు అర్ధ చంద్రుడు. ఒంటి గంటకు కవి చంద్రుణ్ణి చూసేరు. అంతవరకు అతనికి ఆకాశం అడవిలా వుంది. చంద్రుడు కనిపించిన తర్వాత కవి చుక్కల్ని చూసిన తీరు చూడండి.

అకాశమ్మున / అగరువత్తులే / వెలిగినవి / వేనవేలు / చుక్కలు

విహాయన / విపినవాటుల / విహరించె / ఐరావతపు వంది

అర్థ చంద్రుడు."

కవి చంద్రుడు లేనప్పుడు చుక్కల్ని చూసినతీరు భీభత్సంగా వుంది. ఇప్పుడు అ చుక్కలే అగరువత్తుల్లా కనిపించేయి. అవి క్రమంగా చిన్న వెన్నెల్లో కరిగిపోతున్నాయి. దంతపువన్నె అర్థ చంద్రుడు కవికి పూర్తిగా ఊరటను కల్పించలేదు. కవికి "అందపు చందమామ" కావాలి. అందుకే

"సంధ్యారక్తస్రావం / చీకటిలాఠీదెబ్బలు / చిక్కి నగంబైనావె

స్వచ్ఛమైన నీ మోము / మచ్చపడెను; — అని ఆక్రోశిస్తాడు. చంద్రుడు సగం కావడానికి కవి ఇక్కడ చూపిన కారణాలు ప్రకృతి నుండి పుట్టుకొచ్చేయి. ప్రకృతార్థానికి కవి అంతరంగ మథనానికి ప్రకృతి కనిపించే తెరపట్టింది.

"భగత్‌సింగు శాపము" అనే గీతం కూడ కవికి వెన్నెలమీద గల ఆసక్తిని, చీకటంటే వున్న చీదరను తెలుపుతుంది.

"వెన్నెల పీలికగాని / సన్నని గాలులు గాని / లేనే లేవు.

చీకటి / కదనకుతూహలరాగం / చిందులు ద్రొక్కి

చుక్కల చూపులు కూడ / సురిగిన / మొండిరాత్రి అది".

వెన్నెల పీలిక అనడంలో ఏ పాటి వెన్నెల కోసమైనా తహతహ మనను కనిపిస్తుంది. అదే తీవ్రత చీకటిని కదన కుతూహల రాగ భావించడంలో వ్యక్త మౌతూంది.

నారాయణబాబుకు వెన్నెలంటే ఎంతప్రీతో "ఫిడేలు నాయుడ వేళ్ళు" అనే గీతంలో పూర్తిగా కనిపిస్తుంది. నాయుడుగారు ఉక్కు నొక్కితే

"బ్రహ్మహృదయమే / వెన్నెల బయలయి / కనిపిస్తుంది".

అని ఆ గీతాన్ని ముగిస్తాడు. వెన్నెల బయలు అన్నాడిక్కడ. దృగావరణ మంతటా విశాలమైన సమతలం నిండా వెన్నెల పరుచుక కలిగే అనుభూతిని అవి ఈ ప్రయోగంతో అందిస్తున్నాడు. అంత వె పరుచుకున్నవేళ అతని మనస్సు బ్రహ్మానందాన్ని పొందుతుందన్న మాట ఆనందాన్ని నాయుడిగారి ఫిడేలువాద్యంలో నారాయణబాబు పొందగలిగేః ఇక్కడ నాయుడుగారు ప్రదర్శించేది కళ. వెన్నెల ప్రకృతి గత మైన నారాయణబాబు మనసు సహజంగా ప్రకృతిలో పండువెన్నెల అం ఆనందం వల్ల స్పందిస్తుంది. కాని అది అనుకున్నప్పుడల్లా దొరికేది : అందుకని తన మనసుని పారవశ్యంలో ముంచెత్తే కళాసంబంధమైన కికానందంలో కూడా తన పూర్వానుభవాన్ని పునరను సంధానం చేస కవి ఇక్కడ బ్రహ్మానందాన్ని అందుకో గలుగుతున్నాడు. అది వె బయలు.

"తెలుగురాత్రి"లో కవి సమాజంలో స్త్రీకి జరుగుతూన్న అన్యాయ వినిపిస్తాడు ఆమె పడేపాట్లు చూపిస్తాడు. ఈ రాత్రిలో చంద్రుడు అది శుక్లపక్షపు విదియ. అది విదియనాటి విభావరి. అందుకే కవి మ కలకబారి వుంది.

"నెలవంక / సంఘం వంక!"

అంటాడు. సాంఘిక దురాచారాన్ని నెలపొడుపులో సూచించేడు అప్పుడతనికి కనిపించిన చుక్క పేదవాడి కడుపుమంట కానిపేలి పో "కోర్కె" ఆ రాత్రి రేగినది చీకటి దుమ్ము. దీనిని బట్టి కవికి చీకట వున్న వైముఖ్యం ఎంతో తెలుస్తూంది.

తన కవితను వెన్నెల మడుగుగా, అంటు మామిడి పండుగా నారా బాబు భావించినతీరు "నాగీతి" అనే ఖండికలో కనిపిస్తుంది.

"కుండెడుపాలలో / మజ్జిగచుక్క

ఒక దీపమె చాలు / నా దరిని మెరయు

వెన్నెల మడుగు / వెలవెల చోవ" — వెన్నెల మహి అనుభవించి ఎరిగినవారికి ఇలాటి సున్నితమైన భావాలు పారవశ కలిగిస్తాయి. వెన్నెల అందాన్ని. వెలుగుని దాని వల్ల కలిగే హాయిని అనుభవించే తీరు ఇక్కడ కనిపిస్తుంది. వెన్నెలరాత్రి కవికి ఆడు కౌగిలిలా వుంటుంది.

"నల్లగా మెల్లగా హాయిగా / ఆడుదాని కౌగిలిలా రాత్రిలే" అం "విశాఖపట్టణం" అన్న గేయంలో పల్లెటూళ్ళలో లాగా పట్టణాల్లో వె ప్రసరించదు. మేడలు మిద్దెలు అడ్డుగా వుంటాయి. అందుచేత విధ వెన్నెల ప్రాకడానికి కొంత సమయం పడుతుంది. నారాయణబాబు అ దాకా నిరీక్షించి సాయంత్రం : చందమామ / సినిమా చూశాకే / వె

స్తాడు" అని గొప్పగా చెప్పుకుంటాడు. ఎప్పుడో అప్పుడు చంద్రుడూ వెన్నెలా ఉంటే చాలన్నట్లుగా.

నారాయణబాబుకు వెన్నెల కావాలి. అతని లోకానికి వెన్నెలకావాలి. వెన్నెల లేనప్పుడు తన కవితను వెన్నెలగా దర్శించే ప్రయత్నంచేస్తాడా వి.

"జగమంతా కన్నయితే / చీకటి కజ్జలమైతే / నా గీతం / చూపు" చూపు అంటే వెలుగు. చీకట్లో వెలుగునిచ్చేది వెన్నెల. కంటికి వెలుగు నిచ్చేది వెన్నెల. కంటికి వెలుగు నిచ్చేది చూపు. చీకట్లో మునిగిన లోకానికి వెలుగు నిచ్చేది వెన్నెల. అంటే తన కవితం వెన్నెల కాయించి కవి లోకంలోని చీకటిని తరిమి కొడతాడన్నమాట.

"దరిద్ర సంగీతం" అనే గీతం కూడా రాత్రికి సంబంధించిన ఆలోచనలతో నిండినదే. ఇందులో నారాయణబాబు అధునికత పరాకాష్టకు పోయిందేమో ననిపిస్తుంది. అతని కవిత ఇక్కడ ఇంద్రియ వ్యాపారాలను అధః కరించి, అతీంద్రియస్పృహలో తనకున్న శక్తిని చవి చూపిస్తుంది. ఇందులో నారాయణబాబు చుక్కలను దరిద్రంతో ముడిపెట్టి చూసిన చూపు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

"బిగించిన / పిడికిలి / చీకటి

బియ్యపు గింజలు / చుక్కలు"

ముష్టి వేసేవారి పిడికిట్లోని బియ్యపు గింజలు చీకట్లోని చుక్కలుగా కనబడ్డాయి కవికి. ఆత్మాభిమానం గల వ్యక్తి దరిద్రానికిలోనై ముష్టికి సిద్ధ పడ్డప్పుడు ఆ పిడికిలి ఆ బియ్యం అతని కెంత పరితాపాన్ని కలిగిస్తాయో; వెన్నెలకు దూరమైన రాత్రి - చీకటీ, చుక్కలు నారాయణబాబును అంతలా మధనపడేలా చేస్తాయి. ఇది కవి వ్యక్తి లక్షణమన్నమాట. కవి సాయంత్రం నుండి ఎదురుచూడగా చూడగా ఎప్పటికో చంద్రుడు కన్పించిన తీరు ఈ గీతంలో అంతర్లీనంగా వుంది. ఆకాశం అంటుకున్నట్లుండడం, నీరుల్లి కరిగినట్లుండడం. మసక మసకగా వుండడం, చీకటి కమ్ము కోవడం—

"అర్థించగ / అర్థించగ ఆకాశమె నయం"

అనడం కవి నిరీక్షణను తెలుపుతున్నాయి. కాని చంద్రుడొచ్చే సమయానికి కవి అలిగినట్లు కనిపిస్తుంది. "దుకాణాలు మూసారె / ఇప్పుడెందుకు: అంటాడు. ఇంకా

"నా కెందుకు / చెల్లని రూపాయి / తెల్లని జాబిల్లి శ్రుతికటువగు/ మచ్చతో.

శ్రవణ పేయంగా / రజతరావ / సంగీతం

రోదసి నిండెను/అదే పదివేలు" - అంటూ గేయాన్ని ముగిస్తాడు. చెల్లే రూపాయి చెల్లని రూపాయికి గల తేడా మనకు తెలుస్తుంది. దాని ముఖం వేరు. ఇక్కడ రూపాయికి మారక ద్రవ్యంగా చూస్తాడు. కావలసిన వెన్నెల దొరుకుతున్నప్పుడు ఇంకా ఈ మారక ద్రవ్యం ఎందుకన్నట్లు అలకతో పలుకుతాడు. చెల్లనిరూపాయి కాంతి హీనంగా వున్నట్లు చంద్రుడిలోని నల్లనిమచ్చ ఆ త ని కి మకిలిగా కలిపించింది. కాని అది శ్రుతికటువుగా వుందట. అంటే వినడానికి వీల్లేనిదిగా వుందంటాడు అలకతో పెదముఖం పెట్టి నేత్రేంద్రియాన్ని మరలించినా చంద్ర సంబంధమైన స్పృహ పోలేదన్నమాట. అందుకే శ్రోత్రేంద్రియంతో చంద్రస్పర్శను పొందడం జరిగింది. చంద్రుడి మీద అలిగినా వెన్నెల మీది వలపు వదులుకోలేదు: వెన్నెల రోదసి నిండడమే అతనికి పదివేలట. అంటే అంతకంటె అతను కోరుకో దగ్గది లేదన్నమాట. ఆ వెన్నెలను అతను వింటాడు. అది "రజతరావ సంగీతం అంటాడు. అదెలా: ఆ రోజుల్లో వెండి రూపాయి బిళ్ళలుండేవి. వెండిరూపాయి బిళ్ళను మధ్యవేలి మీద నిలబెట్టి బొటనవేలితో టింగుమని ఎగరవేస్తే ఒక చప్పుడు వస్తుంది. వెండి రూపాయి నుండి వెలువడ్డ ధ్వని ప్రకంపనాలు ఎలా వ్యాపిస్తాయో వెండి రూపాయి బిళ్ళలాంటి చంద్రుడి నుంచి వెలువడిన కాంతి తరంగాలను ఆ విధంగా భావించి కవి వింటున్నాడన్న మాట. వెన్నెల వెండి చప్పుళ్ళ పాటగా అతనిని లాలిస్తుందిక్కడ. ఇక్కడ చంద్రుణ్ణి - వెన్నెలను చూడడానికి బదులు వినడమనే వింత ధోరణి కవి ప్రతీకావ్యగ్రతను, పారవశ్యాన్ని, అంతీద్రియాను భూతిని వ్యక్తంచేసే సాధనంగా కనిపిస్తుంది.

చంద్రుడిలో మచ్చ నారాయణబాబుకు ఎంత కటువుగా వినిపిస్తుందో "దరిద్ర సంగీతం" అనే గీతం చెప్తే, దానిని అతడు ఎంత భరించలేడో, అది లేక పోతే బాగుండునని ఎలా ఆరాటపడతాడో "తత్వమసి" అనే గేయం చెప్తుంది.

"ఎవరా అతను: / చంద్రునిలోని మచ్చను.

మందులా నాకేసిన / మహానుభావుడు"

అంటాడీ గేయంలో. మందు చేదుగా వుంటుంది. చంద్రుడిలో మచ్చలేకుండా వుండే పరిస్థితిని ఊహించుకుని కవి ఈ చరణాలు కూర్చేడు.

"వెన్నెల లోతుల్లో" అనే గీతంలో చంద్రుడిని గూర్చి ప్రజలకుండే అపనమ్మకాలను కవి ఛేదించు కుంటూ పోతాడు. చంద్రుడు తారను వరించడం, ఉన్మత్తుడు - కునిష్టి క్షయా పాతకుడు కావటం వంటి నమ్మకాలు ఈ గీతంలో ప్రస్తావించబడ్డాయి. వెన్నెలపిట్ట అయిన తీతువు కూత చావు పిలుపుగా భావించే నమ్మకాన్ని గురించి కూడా ఈ గీతం ప్రస్తావిస్తుంది. అయితే ఇవేవీ పరిగణించ దగ్గవి కావని "నిశలో వెన్నెల / నిత్య పునిత్రి" అని అంటాడు. చంద్రుడివల్ల ఎప్పుడూ చెడుపు సంభవించదంటూ అప్పలస్వామి పాడే క్రెంచి పాటను పునశ్చరణ చేస్తూ గీతాన్ని ముగిస్తాడు కవి. అంటే చంద్రుడంటే తన మనసులో వున్న వల్లమాలిన అభిమానంతో అతన్ని గూర్చి లోకంలో వ్యాపించివున్న చెడుగు లన్నింటిని తుడిచి పారెయ్యాలని చూస్తున్నాడన్నమాట కవి.

"లెండో య్ ఋషులు" అనే గీతంలో

"సురవిలాసవతులు / చూచుకునే / అద్దం

చంద్రుని/బద్దలు కొట్టండి"- ఈ గేయంలో సాధ్యం కాని విషయాలను గూర్చి చెప్పడం జరిగింది. భూమిని చాపలా చుట్టడం, సముద్రాన్ని అవతల పారపొయ్యడం ఎలా సాధ్యంకావో చంద్రుణ్ణి బద్దలుకొట్టడం కూడా అలాగే సాధ్యం కానిది. సురవిలాసవతులు చూచుకునే అద్దం" అన్నది పాతకాలపు ఊహ. నారాయణబాబు సాధరణంగా ఇలాంటి పాత ఊహల పొంతకుపోడు. కాని ఈ ఊహ అతణ్ణి బంధించింది. అందులోనే పౌరాణిక కల్పనల మీద తిరుగుబాటును సైతం సూచిస్తాడు కవి.

ఇప్పటి వరకు చూసిన ఉదాహరణల వలన నారాయణబాబు కవిత్వానికి చంద్రుడు - వెన్నెల ప్రేరణలు అని ఊహించే అవకాశం కనిపిస్తుంది. చీకట్లో అతని ఊహలు భీభత్సాన్ని చేదు కుంటాయి. వెన్నెల దూరే వేళల్లో అతని ఊహలు అభ్యుదయాన్ని కాంక్షించే ఆనంద చెరువులుగా వినిపిస్తాయి. అతనే చెప్పుకున్నట్టు అతని "ఎముకల మూలుగుల్లో చాంద్రోదయం" అవుతూ వుంటుంది.

ఈ మాసం - మీ నక్షత్రఫలం
డిసెంబరు 1986

1. మేషం

అశ్విని మొదటి 15 రోజులు కార్యానుకూలత, ఆరోగ్యం, ధనలాభం, సంసార కుటుంబ సౌఖ్యం. సర్వకార్యములందును విజయం, మాటపలుకుబడి, మొదలగు మంచి ఫలములు కలుగును. 16 వ తేదీనుండి శుభకార్యాలలో స్థిరాస్తి వ్యవహారాలలో చిక్కులు కలుగును. ఆర్థిక విషయాలలో కష్టనష్టాలను ఎదుర్కోవలసి వచ్చును. కుటుంబంలో అనుకోని మార్పులు, సంఘటనలు మనస్సుకి వ్యధ కలిగించును. కుటుంబంలో అకారణ కలహాలు ఏర్పడును. భరణి ఇంతకాలం వరకూ వేధిస్తున్న శని పీడ చాలవరకూ తొలగిపోయినా 1-17 తేదీవరకు ఇంకా చిన్న చిన్న చిక్కులు కొన్ని కలుగును. అయినా, ఇంతవరకు నెరవేరని పనులు ఒక్కొక్కటే సానుకూలపడును. శుభకార్యాలు అనుకూలించును. మానసికంగా శ్రమ హెచ్చును. సోదర సోదరీ విరోధము, వ్యవహారాలలో ఆకస్మిక ప్రతిష్ఠంభన జరుగును. నీచులతో సంబంధం వలన ధనలాభం, కించిత్ అపవాదులు కలుగును. మొత్తంమీద శుభాశుభ మిశ్రఫలం కలుగును.

కృత్తిక 1 వ పా. 14 వ తేదీవరకు శారీరకశ్రమ, బంధువుల వల్లను, భాగ్యపోది వ్యవహారాదుల వల్లను స్వల్పంగా చిక్కులు పడుట మొ॥ కించిత్ ప్రమాదములు కల్గును. 17 వ తేదీనుండి శుభఫలం ప్రారంభమగును. రాజకీయ నాయకులతో పలుకుబడివలన ఎన్నో కార్యములను సులభంగా సాధించుకొంటారు. ఎన్నెన్ని విధాల కలసివచ్చినా శని బలం ప్రతికూలంగా ఉండుటవల్ల తగినంత సంతృప్తి వుండదు. విద్యార్థులకు, వర్తకులకు, రాజకీయవాదులకును అన్నివిధాలా అనుకూలంగా వుండును.

2. వృషభం

కృత్తిక 2, 3, 4, పా. వారికి మొదటిపాదం వారికన్న అధిక శుభఫలం కలుగును. వ్యవహారాలన్నీ అనుకూలంగా వుండును. ఉద్యోగులకు, వర్తకులకూ బాగా మేలు కలుగును. కుటుంబంలో సుఖశాంతు లేర్పడును. శుభకార్యాలు అనుకొన్నట్లు నిర్విఘ్నంగా నెరవేరును. పుణ్యకార్యములు, దైవపూజలు, తీర్థయాత్రాదులు బాగుగా నెరవేరును. ధనాదాయం బాగుగా నుండును; సువర్ణాభరణ ప్రాప్తి అగును. బంధుమిత్రాదులతో, సాటివారితో అన్నివిధాలా మైత్రి, సుఖసంతోషాలూ కల్గును. రోహిణి నెలలో పదిహేనురోజులు సంపూర్ణ శుభయోగం. శరీరంలో అధికశ్రమ. కుటుంబంలో సుఖసంతోషాలు, జ్ఞాతి దాయాదుల మాత్సర్యానికి గురికావడం కూడా జరుగును. చిన్న చిన్న విఘ్నాలు కలిగినా శుభకార్య ప్రయత్నాలు ఫలించును. ముఖ్యంగా రాజకీయపు పలుకుబడి పెరుగును. విద్యార్థులకూ, ఉద్యోగులకూ అన్నివిధాల శుభయోగం కలుగును. వర్తకులకూ, వ్యవసాయదారులకూ, కాంట్రాక్టు పనులు చేసేవారికి కూడా బాగుగా కలిసివచ్చును. మృగశిర 1, 2 పా. గతంకంటె అన్నివిధాలా మేలు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత. కొత్త బంధుమిత్రుల సంబంధంవల్ల అనుకోని విధంగా సుఖసంతోషాలు కలుగును. వ్యాపార విషయంలో క్రొత్త శాఖలు అనగా వ్యాపార విస్తరణ జరుగును. ఉద్యోగులు, లాయర్లు, డాక్టర్లు వివిధ వృత్తులవారికి కూడా బాగుగా కలిసివచ్చును. వ్యవసాయదారులకు సమృద్ధిగా పాడిపంటలు, ధనలాభం సుఖసంతోషాలను కలిగించును.

3. మిథునం

మృగశిర 3, 4 పా. గ్రహబలం మధ్యమంగా ఉన్నది. భార్య లేదా కుటుంబంలో అనారోగ్యం, ధనవ్యయం, ఉద్యోగ వ్యవహారాలలో స్వల్ప చిక్కులు ఏర్పడుట, ధనాదాయం బాగానే వున్నా పూర్తిగా ఒక్కసారి చేతికి రాకపోవుటా, వచ్చినదానిలో హెచ్చుభాగం పనికిమాలిన ఖర్చు అగు... ఆత్మీయులతో వాగ్వాదమూ, మనస్సులో ఏవేవో పనికిమాలిన ఆలోచనలుచేయు... మొదలగు ఫలములతో గడచును శుభాశుభ మిశ్రఫలం కలుగును. ఆర్ద్ర వారికి కూడ మిశ్రమఫలమే కలుగును మనోవైకల్యం హెచ్చుగా నుండును. వ్యవహార ప్రతిష్ఠంభన జరుగును శుభకార్య ప్రయత్నములో చిన్న చిన్న పేచీలు ఏర్పడును. శ్రమ, బడలిక హెచ్చును. శరీరంలో ఉష్ణాధిక్యం కలుగును. వ్యాపారస్థులకీ, ఉద్యోగులకూ, విద్యార్థులకూ బాగుగా ఉండును. రాజకీయవాదుల శ్రమ హెచ్చుగా నుండును. కావలసినవారితో మాటపట్టింపులు వచ్చును. పుణ్యకార్యములు, దేవతా పూజలు, సాధుసజ్జనగోష్ఠి మొ॥వానిలో పాల్గొనుట జరుగును. పునర్వసు 1, 2, 3 పా. వారికి శరీరశ్రమ హెచ్చు. ధనలాభం బాగా వుండును. ఉద్యోగులకు మంచి అభివృద్ధి కలుగును. ఇదివరకు తెగని సమస్యలు ఈ నెలలో పరిష్కారం కాగలవు. అయితే ప్రతి చిన్న విషయంలోను అత్యధికంగా శ్రమపడవలసి వచ్చును. బంధుమిత్రాదుల రాకపోకలు అధికంగా వుండును. శుభకార్యాలలో పాల్గొనుట జరుగును. విందులూ, వినోదాలు మొదలైన వానితో సుఖంగా గడచును. ఆర్థికంగా అన్ని రంగాల వృత్తి వ్యాపారములందు ఉన్నవారందరికీ కలిసి వచ్చును.

4. కర్కాటకం

పునర్వసు 4 పా. వారికి నెల అంతా శ్రమ. మనస్సులో పనికిమాలిన ఆందోళనలు, ప్రతి విషయంలోనూ, పిరికితనం, శారీరకంగా, మానసికంగా బలహీనత కలుగును. ధనాదాయమూ, దానికి మించిన ఖర్చూ వుంటాయి. పితృవర్గ బంధువులతో మాటపట్టింపులు వచ్చును. శుభకార్య ప్రయత్నాలు కొంత వరకు వాయిదాపడును. మొగమాటములకు పోయి కొన్ని బాధ్యతలను నెత్తిన వేసుకొని వాటిని నెరవేర్చలేక, తమ పనులకు హాజరుకాలేక బాధపడుట జరుగును. పుష్యమి వారికి ధనాదాయం, గౌరవం, పరపతీ, హోదా పెరుగును గాని, మానసికంగా స్తిమితం వుండదు. ప్రతి విషయంలోనూ మొదట చిక్కులూ, శ్రమా చివరలో కార్య విజయం కలుగుచుండును. బయటికి గంభీరంగా, ఆడంబరంగా వున్ననూ, లోలోపల ఏదో విషయమైన అసంతృప్తి బాధిస్తూ వుంటుంది. అయితే పెద్దవారితో పరిచయం, పలుకుబడి మూలకంగా, పరిస్థితులన్నింటినీ నెట్టుకుని వస్తారు. నెలాఖరునాటికి అన్నీ అనుకూలం కాగలవు. ఆశ్లేష ఈ నెల 16 వ తేదీవరకు అనేకవిధాల వత్తిడులు, ఒడుదుడుకులూ, ఈతిబాధలు వుంటాయి. 17 వ తేదీనుండి క్రమక్రమంగా నెలాఖరుకి అన్ని పరిస్థితులూ సర్దు...

ంటాయి. శరీరశ్రమ కూడా అధికంగానే వుండును. వ్యవహారాలలో ఒక్కొక్కసారిగా చిక్కులు చుట్టుముట్టుకొని, కొంచెం పరిస్థితిని ఉక్కిరి బిక్కిరి చేసి క్రమంగా నెలాఖరునాటికి ఒకొక్కటే చక్కబడగలవు. నమ్మినవారి మోసానికి గురికావడం జరుగుతుంది. ప్రయాణాలు అధికం. తన్మూలకంగా వ్యయప్రయాసలు కూడా హెచ్చు అగును.

5. సింహం

మఘ వారికి 16వ తేదీవరకూ అన్నీ అనుకూలంగా వుంటాయి. ధనాదాయం బాగుంటుంది. దైవపూజలలో, శుభకార్యాలలో ఆధ్యాత్మికప్రసంగాల్లో పాల్గొంటారు. నెల 3, 4 వారాలలో అధికశ్రమా, శరీరంలో అతివేడిమీ బడలికా కలుగుతాయి. కావలసినవారు కబుర్లు మంచిగా చెప్పి, అవసర సమయాల్లో తప్పుకుంటారు. కోర్టు, ఉద్యోగ వ్యవహారాలు కొంచెం తికమక పెడతాయి. మనస్సుకి ప్రశాంతం తక్కువగా వుంటుంది. పుబ్బ వారికి నెల అంతా అనుకూలంగా వుంటుంది. కుటుంబంలో సుఖసంతోషాలూ, కార్యసిద్ధీ, ధనాదాయం, స్థిరాస్తి సంపాదనా కల్గుతాయి. ముఖ్యంగా రాజకీయవాదులకు సర్వత్రా విజయం కలుగుతుంది. ఉద్యోగులకు ప్రమోషనుతోపాటు ధనాదాయమూ, సువర్ణాభరణ సంపాదనమూ కలుగుతుంది. సంఘంలో మంచి గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. మాట పలుకుబడి వలన పదుగురికి ఉపకారం చేయగలరు, శుభకార్యాలలో విశేషంగా పాల్గొంటారు.

ఉత్తర 1వ పా. వారికి యోగం బాగున్నా, చిక్కులూ, మనఃఖేదం, శరీరశ్రమా కుటుంబంలో చిన్న చిన్న కలతలూ కలుగుతూ వుంటాయి. శని గ్రహంవులకు జపశాంతులు చేయించుట మంచిది. ఉద్యోగ, వ్యాపార, రాజకీయ వ్యవహారాలలో ఉన్నవారికి కొన్నింటిలో అనుకూలత వున్నా, మరికొన్నిటిలో అనుకోనివిధంగా చిక్కులు, వృధాగా ఖర్చులు, పలుకుబడి క్షీణించుట స్వల్పంగా, అవమానమూ మొదలగువానివలన మనఃఖేదము, వ్యథ కల్గును.

6. కన్య

ఉత్తర 2, 3, 4 పా. వారికి అచ్చటచ్చటా కొన్ని చిక్కులు కలిగినా మొదటిపాదం వారికన్న అధికయోగమూ, శుభఫలితమూ కలుగును. వ్యవహారములలో విజయం కలుగును. బంధువిరోధము కలుగును. శుభకార్యములలో పాల్గొనుట, శుభకార్య ప్రయత్నములకై ధనవ్యయము చేయుట జరుగును. జ్ఞాతి దాయాదుల మూలకంగా కొన్ని చిక్కులను ఎదుర్కొనవలసి వచ్చును.

హస్త వారికి ఈ నెల అంతా శుభయోగము. సంతానమునకు వివాహాది శుభకార్య ప్రయత్నములు ఫలించును. బంధుమిత్రులతో మాటపట్టింపులు వచ్చును. సువర్ణ వస్త్రాభరణ ప్రాప్తియగును. సాంకేతిక, వైద్య విద్యార్థులకు ఉన్నత విద్యావకాశము, పరీక్షలలో విజయము కలుగును. ఉద్యోగులకును, వర్తకులకు, వ్యవసాయదారులకు ధనలాభం కలుగును. చిత్త 1, 2 పా. వారికి నెల అంతా బాగుగానే యుండును. మాతృ బంధువర్గంతోను, భార్యా బంధువర్గంతోను మాటపట్టింపులు వచ్చును. వ్యవసాయరంగంలో పెట్టుబడికి తగినదే తప్ప అధికంగా ఫలం రాదు. వ్యాపారరంగంలో వారికి కూడ స్వల్ప లాభం. విద్యార్థులకూ, ఉద్యోగులకూ, అధికారులతో ఘర్షణలు, అయినా ఈ నక్షత్రం 1, 2 పాదముల వారందరికీ ఉత్సాహం, ఉల్లాసం. సుఖభోగాలు, విందు భోజనాలు, మానసికంగా సంతృప్తి మొదలి కలుగును.

7. తుల

చిత్త 3, 4 పా. వారికి నెల అంతా సుఖభోగ కాలం. పుష్కలంగా

ధనాదాయం వుండును. బంధుమిత్రుల సహాయ సహకారాలు అన్నివిధాలా కలుగును. నూతన వ్యాపారం విస్తరిస్తుంది. అనేక రంగాలలో పేరు ప్రఖ్యాతులు కల్గుతాయి. సంఘంలో మంచి పేరు ప్రతిష్ఠలూ, మాటపలుకుబడీ, సర్వులనుండి గౌరవం లభిస్తాయి. సద్గోష్ఠి, శుభకార్యాలలో పాల్గొనుటా, సాధుసజ్జన సాంగత్యం కలుగుతాయి. సువర్ణాభరణ ప్రాప్తి, భూగృహాది లాభం, కోర్టు ఉద్యోగ వ్యవహారాలలో విజయం కలుగుతాయి.

స్వాతి వారికి సర్వకార్య జయం, అన్ని రంగాలలోను ఎదురులేని, అనగా మాటకు మంచి విలువైన ఆదరం, పలుకుబడీ కలుగుతుంది. పట్టినదల్లా బంగారం కాగలదు ఎన్నో మంచి పనులు, శుభకార్యాలూ, ప్రారంభోత్సవాలూ, ఈ నక్షత్రంవారి చేతిమీదుగా జరుగుతాయి రాజకీయవాదులకి, విజయం చేతులలో వుంటుంది. ఎందరికో మేలు కలిగించే పనులు గొప్ప కోసమైనా చేయగలరు. ప్రజలలో మంచి ఆదర గౌరవాలు కలుగుతాయి. ముమ్ముందు లభించే పదవీ గౌరవానికి తగిన పునాది ఏర్పడుతుంది. ధనం కూడా అన్నివిధాలా కలసివస్తుంది. విశాఖ 1, 2, 3 పా. వారికి ఇంతవరకూ, అచ్చటచ్చటా పీడిస్తున్న ఆర్థికపు తొట్రుపాటు తొలగిపోగలదు. వ్యవసాయ వ్యాపార-ఉద్యోగ రంగాలలో వున్నవారికి మంచి అభివృద్ధి కలుగుతుంది. వివాహ, నూతన గృహారంభాది ప్రయత్నాలు బాగా కలసివస్తాయి విద్యార్థులకి ఉన్నతవిద్యలో తమ ప్రతిభకు తగిన అవకాశాలు ఏర్పడుతాయి. అనుకోనకుండా పెద్దలతోను, అధికారులతోను మైత్రి ఏర్పడి, పనులు సునాయాసంగా నెరవేరడమే కాకుండ, ఆర్థికంగా కూడా బాగా లాభిస్తుంది.

8. వృశ్చికం

విశాఖ 4 వ పా. వారికి కూడా అన్ని రంగాలవారికీ బాగుగానే వున్నా, శరీరశ్రమ మాత్రం హెచ్చుగా వుంటుంది. ప్రతి చిన్న పనికీ, అనవసరంగా హెచ్చు ప్రయత్నం. శ్రమా, కాలహరణం జరుగుతాయి. పెద్దల సాంగత్యం అన్నింటిలోనూ విజయం కలిగిస్తుంది ఇంతవరకు నెరవేరని శుభకార్యాలన్నీ అప్రయత్నంగా నెరవేరుతాయి. ఆర్థిక లాభం కూడా బాగా కలసివస్తుంది, అన్ని వ్యవహారాలలోను, విజయం, ఉల్లాసాహం కల్గుతాయి

అనూరాధ వారికి ధన మిత్ర తారలలో గ్రహబలం బాగా వున్నది. నూతన ఉద్యోగము, క్రొత్త వ్యాపారము, అనుకూల గృహం మార్పిడి, కుటుంబంలో సుఖసంతోషాలూ అన్నీ అనుకూలంగా వుంటాయి. విద్యా, విజ్ఞాన రంగాలలో వ్యాసంగం బాగుంటుంది అన్ని రంగాలవారికి ప్రజా సహకారం బాగుండి, నూతన ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, శక్తిని కలిగిస్తుంది. ఆర్థికలాభం కూడా బాగుంటుంది. తలచిన పనులన్నీ, శ్రమ లేకుండానే నెరవేరుతాయి. అనువైన కాలం. జ్యేష్ఠ వారికి ఇతర విషయాలు అన్నీ బాగానే వున్నా, శరీరంలో నలత, శ్రమ, కుటుంబంలో స్వల్పంగా నలతయూ, కలతయూ, మనస్సునకు ఒకవిధంగా విశ్రాంతి లేకుండా చేస్తాయి. ఆర్థిక వ్యవహారాలు మాత్రం సంతృప్తికరంగానే వుంటాయి ఉద్యోగులకీ, విద్యార్థులకీ, వృత్తిపనులవారికీ, రాజకీయవాదులకీ అన్నివిధాలా ప్రోత్సాహం లభిస్తుంది. దైవకార్యాలలో విరివిగా పాల్గొనడం జరుగుతుంది నెల మూడవవారంనుండి అభివృద్ధి బహుముఖంగా చేకూరుతుంది

9. ధనుస్సు

మూల వారికి అధికశ్రమా, స్వల్ప ఫలితంతోనే నెలంతా గడుస్తుంది. ఎప్పటికప్పుడు ప్రతి విషయంలోనూ, ఊహించనివిధంగా చిన్న చిన్న చిక్కులూ, ఆటంకాలూ ఏర్పడి ప్రయత్నం అంతా తిరిగి మొదటికి వస్తుంది. శుభకార్య ప్రయత్నాలలో త్రిప్పటా, ధనవ్యయం, శ్రమా అధికం. ఫలితం అనిశ్చితంగా ప్రశ్నార్థకంగానే వుంటుంది. అయితే బంధుమిత్రుల, అధికారుల చేయూతా, సహాయ సహకారాలూ, సానుభూతి కొంత తృప్తిని కలిగిస్తాయి.

పూర్వాషాఢ వారికి ఇప్పుడిప్పుడే దైవబలం, అనుకూల గ్రహ కలిసివస్తుంది అనుకొన్న వ్యవహారాలు ఇకనుండి క్రమంగా విజయవంతం తాయి. దూరప్రదేశాలవారితో బంధుత్వ సంబంధాలు ఏర్పడుతాయి. ప్రయాణ మూలకంగా ధనవ్యయం జరిగినా తగినంత ఫలితం కూడా వుంటుంది వి విజ్ఞాన రంగాలలో కృషి జరుగుతుంది ఆర్థికంగా కూడా కలిసివస్తుంది. కార్య ప్రయత్నాలు ఫలిస్తాయి. దైవసంబంధ కార్యక్రమాలలో పాల్గొన జరుగుతుంది. బంధుమిత్రుల రాకపోకలు అధికం కావడంవలన ఖర్చువెచ్చా అధికంగా వుంటాయి.

ఉత్తరాషాఢ 1 వ పా. వారికి గ్రహబలం అనుకూలంగా లేదు. పెట్టిన పనులు వాయిదా పడుతూ ధనవ్యయం జరుగుతూ వుంటుంది. ప్రతి వ హారంలోనూ కాలహరణం తప్పదు ఆరోగ్యం కూడా అంతంతమాత్రం వుండును. ఏ వ్యవహారమూ పరిష్కారం కాకపోయినా, ఎప్పటికప్పుడు విజ అరచేతిలో వున్నట్లు ఆశ మాత్రం బాధిస్తూ వుంటుంది. మనస్సులో పనికిమా పరిపరివిధాల ఆలోచనలు హెచ్చుగా వుంటాయి. యోగం సామాన్యం.

10 మకరం

ఉత్తరాషాఢ 2, 3, 4 పా. వారికి మొదటిపాదం వారికన్నా కొ మేలుగా ఉంటుంది. ఆరోగ్యభంగం, శరీరంలో శ్రమా వుంటాయి. అయితే వారితో స్నేహ సంబంధాలు ఏర్పడి పనులు సాధించుకోడం జరుగుతుంది లాభం బాగా వుంటుంది. వస్తు వాహనాలు, స్థిరాస్థి సంపాదనా జరుగును ఉద్యో లకీ, వర్తకులకీ, వ్యవసాయదారులకీ, వైద్యం, ఇంజనీరింగు మొదలయిన వృ పనివారలకు అన్నివిధాలా చాలా లాభం కలిసివస్తుంది. శ్రవణం వారికి ఇ మించు గ్రహాలన్నీ అనుకూలంగానే వున్నాయి. తలంచిన పనులన్నీ నిర్విఘ్న నెరవేరుతాయి. ధనాదాయం కూడా బాగానే వుంటుంది. భూ, గృహ, సు వస్త్రాభరణాది సంపాదన జరుగుతుంది. బంధుమిత్ర సమాగమం, సుఖమ సంసారభోగ సౌఖ్యమూ కలుగుతాయి. విద్యార్థులకు ఉన్నతశ్రేణి విజయ ఉన్నత విద్యావకాశమూ కలుగును. ఉద్యోగులకు ప్రమోషను, వ్యవసాయదార్ల మంచి లాభం. వర్తకులకు విశేష ధనాదాయం కల్గును. ధనిష్ట 1, 2 పా వారికి కూడా సర్వవిధాలా శుభ యోగం కలిగించును. ఉద్యోగులకూ, వర్త లకూ, విద్యార్థులకూ, ముఖ్యంగా రాజకీయవాదులకీ అన్నివిధములా లాభ విజయం, అభివృద్ధీ, ప్రజాగౌరవమూ బాగా వుండును. శుభకార్యాలు ని ఘ్నంగా నెరవేరును. పెద్దలతో, అధికార్లతో పరిచయం ఏర్పడును. సంసా సౌఖ్యం, కుటుంబ సంతానసౌఖ్యం వృద్ధి పొందును. సంఘంలో మంచి కీర్తి ప్ర ష్ఠలు గౌరవం కలుగును.

11. కుంభం

ధనిష్ట 3, 4, పా. వారికి మొదటి 15 రోజులూ శారీరక మానసి శ్రమ, ఖర్చు వెచ్చాలకి కొంచెం కటకట. శుభకార్య వ్యవహారాలను వాయిదా వే కోవడం మంచిది. 16 వ తేదీనుండి అన్నివిధాలా యోగదాయకంగా వుంటుం ధనం పుష్కలంగా అందుతుంది. బంధుమిత్రులతో మంచి అనుకూలతా, మై బంధం ఏర్పడును. పనులన్నీ ఒకదానితర్వాత మరొకటి చొప్పున క్రమం విజయవంతం కాగలవు. మాట విలువ పెరుగును. పదుగురికి ధనరూపే వ్యాగురూపేణా సహాయపడుట జరుగును. శతభిషం వారికి 15 వ తేదీవర శరీరశ్రమ, అధికతాపం, తీవ్రమైన వేడిమీ కలుగును. ధనాదాయం బాగుండున ఉద్యోగులకి ప్రమోషన్ కలుగును. విద్యార్థులకి ఉన్నత విద్యావకాశం లభించున ప్రతిభను ప్రదర్శించి ప్రశంసలను పొందుట జరుగును. వ్యవసాయదారుల బాగా లాభించును. రాజకీయవాదులకి పలుకుబడి, మాటగౌరవం హెచ్చి అన్ని విషయాలలోనూ విజయం కలుగును. ధనం కూడా బాగుగా కలసివచ్చును.

మధుర స్మృతి

నీ తేజోమయ
దివ్య దర్శనం
పాప విమోచనం
పావనం పావనం॥

నా తమ్ములలో
నీవూ ఒక్కడివని
కౌగిలించుకున్న రాముడివి నీవైతే-
గుహుడను నేను॥

తన్నుతామరచి
అరటి తొక్కనిచ్చినా
ఆదరించిన కృష్ణుడివి నీవైతే-
విదురుఁడను నేను॥

భగవాన్!
నీ దర్శనభాగ్యం
కల్గిన ఆ క్షణాలు
కలలా కరగిపోయినా-

నీ మధురస్మృతి
నావెన్నంటి-వెన్నుతట్టి
జీవితాంతం నన్ను
నడిపించగలదు-ఇది సత్యం

శ్రీ కాణిపాకం లింగన్న

సుందరి సిగ్గు

నేనొక శిధిల శిల్పాన్ని
కాకతీయ కళాజీవన కల్పాన్ని
యవన కర్కశదంష్ట్రిల చిక్కిన కాలయవనికను,
ఆనందపుటందలాలలో ఊగించిన ఒక మధూహను
శిల్పి రామప్ప హృదయస్పందనకు ప్రతిస్పందనను
జాలువారిన రాగానికి ప్రతిరూపాన్ని
ఆలయప్రాంగణాన అడుగుపెట్టిన
ప్రతివారినీ ఆకర్షించే పాపాన్ని
కళామయ జీవితాలనే బలిగొన్న శాపాన్ని
నాప్రారబ్ధం కట్టి కుడిపింది నన్ను
ఫలితంగా ఆలయమే చరిత్రపుటలలో మరుగుపడింది
ఎంతో అందంగా తీర్చబడ్డానని
ఒకప్పుడు నాకు ఉండేది గర్వం
మొండిచెయ్యి వ్రేలాడటంతో
హరించుకుపోయింది స్వరం
చెప్పద్దూ! నన్నుచూస్తే నాకే సిగ్గేస్తోంది ఇప్పుడు
అయినా నన్ను చూడవద్దనీ
నావంకకు రావద్దనీ
ఎవరిని శాసించను! ఎవరిని దూషించను!
కొన్నింటితోపాటు భూగర్భంలోకిపోతే
కాలగర్భంలో కలిసిపోతే ఎంత బాగుండేది:
అందుకే-ప్రాధేయపడి అడుగుతున్నాను
నన్ను ఇక్కడనుంచి తీసెయ్ సోదరా!
ఏమూలో అదృశ్యంగా పారెయ్!

శ్రీ శివప్రకాష్

పూర్వాభాద్ర 1, 2, 3 పా. వారికి వ్యయం హెచ్చుగా వున్ననూ, అందుకు తగిన ధనం కూడ కలసివచ్చును. దైవభక్తి, పరమార్థచింతనమూ, పుణ్యధర్మ కార్యాలలో పాల్గొనుటా, శుభకార్యాలు చేయుటా మొదలగునవి ఈ నెలలో హెచ్చుగా వుండును. 16 వ తేదీనుండి శరీరశ్రమ, మనస్సులో ఆలోచనలూ హెచ్చును. ఉద్యోగులూ, విద్యార్థులూ, వర్తకులూ, వ్యవసాయదారులూ, వృత్తి విద్యలవారూ మొ॥గు అందరకీ సుఖసంతోషాలూ, అన్నివిధాల అభివృద్ధీ కలుగును.

12. మీనం

పూర్వాభాద్ర 4 వ పా. వారికి సంసారంలో నలతలూ, కలతలూ, చిన్న చిన్న ఒడుదుడుకులూ కల్గినా ధనాదాయం బాగుండును. అందుకు తగిన ఖర్చువెచ్చాలు కూడ పెరుగును. కళలూ, సాహిత్యం, సంగీతం మొదలగువానిలో పాల్గొనుట జరుగును వ్యవహారాలలో కొంత మాంద్యం జరిగినా నెల చివరి వారంలో అవన్నీ జయప్రదం కాగలవు. ఉన్నత వ్యక్తులతోను ఆప్తబంధువుల తోనూ, వాగ్వాదాలూ, మాటపట్టింపులూ వచ్చును. అయితే ఈ నెల అంతా శుభాశుభ మిశ్రఫలంతో గడచును. ఉత్తరాభాద్ర వారికి శరీరసౌఖ్యం తక్కువ. సంసారంలో ఈతిబాధలెక్కువ. ఎన్నోవిధాల ధనం ప్రవాహరూపంలో వచ్చినా, రాబడికి మించిన ఖర్చులు పెరిగి తొట్రుపాటు కూడ పడవలసి వచ్చును. అనవసర వ్యయం పెరుగుతుంది. కుటుంబంలో నలతలు కల్గును. పెద్దవారి దగ్గర పలుకుబడి వున్నా, సమయానికి అది పనికిరాదు. మానసికంగా శ్రమ హెచ్చుతుంది. గాలిమేడలు కడుతూ, ఊహాలోకాల్లో విహరించుట జరుగుతుంది. మిశ్రమయోగం రేవతి వారికి శుభాశుభ మిశ్రమకాలం, బయట పదుగురులోనూ గౌరవాదరాలున్నా, ఇంట్లో సుఖం తక్కువ, తలకు మించిన ఖర్చు. మర్యాద కోసం, గౌరవం కోసం, డాబు దర్పాలకోసం, తలకు మించిన వాగ్దానాలూ, దాతృత్వమూ ప్రదర్శించుటవల్ల, మాట నిలుపుకొనడానికి ఎన్నో అవస్థలు పొందవలసివచ్చును. మిత్రులూ, బంధువులూ, అనువు చూచి వీలయినంతకాలం తిని, అడిగి తీసికొని వెళ్ళెదరు, ఎంత రాబడి వచ్చినా మితిమీరిన ఖర్చులవల్ల ఏమీ మిగలదు. వీలయినంతవరకూ ఏ విషయంలోనూ బంధుమిత్రులతో అతిగా సంబంధం పెట్టుకొనకుండుట మంచిది.

సర్వేజనాస్సుఖినోభవంతు

—సిద్ధాంతి నిష్ఠల వేంకట సత్యసుబ్రహ్మణ్యం

సీరియల్

సృష్టి

ఇచ్ఛాపురపు రామచంద్రం

(గత సంచిక తరువాయి)

10

జయదేవ్‌కి తెలుసు ఆ కాగితాలు ప్రస్తుత కాలంలో డిగ్రీలలాగ వ్యర్థమని.

అయినా ఏదో ఆశ.

ఏడు గంటలు దాటింది కనుక నగరంలో కొన్ని రోడ్లు విశ్రాంతి తీసుకుందుకు సిద్ధపడదామా అని ఆలోచిస్తున్నట్లున్నాయి. నైట్‌డ్యూటీ చేసే బారులూ, వ్యభిచార వీధులూ సినిమా సెంటర్లూ తప్ప - డే డ్యూటీ చేసిన వీధులు అలిసిపోయినట్లే వున్నాయి

పక్కన పద్మ వున్నా జయదేవ్ ఆమెతో మాట్లాడటం లేదు. ఆలోచనలలో వున్నాడు. అతని దృష్టి ఎక్కువగా డ్రయివింగ్ మీద కూడా లేదు. నిజానికతను పద్మ గురించే ఆలోచిస్తున్నాడు.

రేపు రాత్రిలోగా పద్మ బిడ్డ నెత్తుకోకపోతే - ఆత్మహత్య చేసుకుంటుంది. ఆలస్ టెలిఫోనయితే చేసింది కాని ఏమీ చెప్పలేదు. ఏమీ చెప్పలేదు కనుక తను ఆశ పడుతున్నాడు - తమ ప్రణాళికలు ఫలిస్తాయని. ఆమెకు చెప్పాలని తహతహగా ఉంది - యీ రహస్యం నిజానికి పద్మ కెంతమాత్రమూ తెలియదు... తను తన బిడ్డకి తల్లి కాబోతూందని చెప్పినా సమ్మదేమో. పైగా ఎక్సైట్ అవుతుంది. అదెలా సంభవమంటుంది. ఆమె ప్రశ్నలకు తనవద్ద సమాధానాలు లేవు. అందుచేత - కదపకపోవడమే మంచిది.

టర్న్ తీసుకుందుకు - యాంత్రికంగా హారన్ యిస్తూ... కారుని చేసేంతలోనే...ఎదురుగుండా—

ఒక్కసారి రెండు కళ్ళల్లోకీ అమితమయిన కాంతిపుంజాలు. ఆర్క్‌లాం
లాంటి కాంతులు. అంతే. అతను ఏమీ చూడలేకపోయాడు. అంతా అంధ
మయమై పోయింది. ఆ లారీ కారుని గుద్దెయ్యడానికే అన్నట్లు...మీ
వచ్చేస్తూ—

అతనేం చేస్తున్నాడో అతనికే తెలియదు. అరవబోయాడు గట్టిగా.
పెగలలేదు. గట్టిగా కళ్లు మూసుకుని...స్టీరింగ్ మీదకి వొరిగిపోయాడు.

చచ్చిపోయాననే అనుకున్నాడు.

కాని ...అలా జరిగినట్లనిపించక ...

అతను కళ్ళు తెరిచాడు.

లారీ - దాటిపోయిన శబ్దం.


ఏమీ కనిపించడంలేదు. అంతా చీకటి. గుడ్డితనం వొచ్చెయ్యలేదు క
ఒక్కసారి రెటీనా? (కంటితెర) మీద ఎక్కువ కాంతిపడితే - రెటీనా మాడిపో
అంధత్వం వచ్చేస్తుందది. అందుకే ఆర్క్ లాంపులవద్ద, వెల్డింగ్ పనులూ చే
వారు కళ్ళకి దళసరి రంగు అద్దాలు పెట్టుకుంటారుట. సైన్సు మాష్టారు చెప్పా
చిన్నప్పుడు.

"రాస్కెల్...ఆ లారీ డ్రయివరుకెంత పొగరు! టర్న్‌లో హారన్
లేదు. లైట్లు బ్లింక్ చెయ్యలేదు. స్టుపిడ్ ...లారీ డ్రయివర్లు చాలామట్టుకు పొ
మోతులే." ముంజేతి వెనుక భాగంతో కళ్ళు తుడుచుకున్నాడు.

అదృష్టం బాగుండి ప్రమాదం తప్పింది. రాష్ డ్రయివింగ్ చేసింది
వాడే అయినా తనూ పద్మా ప్రమాదంలో చనిపోయేవాళ్ళు. అసలు - వాడె
కంత వేగంగా టర్న్ తీసుకోవాలి?

ఆ!....నల్లపిల్లి ఎదురయింది కదా? ... ఆ శకునం ప్రభావమే యి
అదృష్టవశాత్తూ త్రుటిలో తప్పింది ప్రాణగండం. కళ్ళకేమయిందో తెలియ
లేదు. బ్లాక్ క్యాట్!...ఇంతటితో సరిపెట్టావా సరే, ఇంకేమయినా జరిగింది
నిన్ను వేటాడి మరీ చంపుతాను రేపు. బివేర్!

మరోమారు కళ్ళు తుడుచుకున్నాడు.



కొంచెం నయం. కళ్లు మసక మసకగా కనిపిస్తున్నాయి.

"పద్మా! ప్లీజ్....డ్రయివ్ చేస్తావా! కళ్ళల్లో కాంతిపడి..." ఇంక వివ
చలేదామె కంగారు పడుతుందని.

"ఏమైంది?"

"అసౌకర్యంగా ఉంది కారు నడిపేందుకు, అందుకని"

అతనామెకు స్టీరింగ్ యిచ్చేశాడు - పక్కకి జరిగి.

ఆమె స్టీరింగ్ తీసుకుంది.

అతను కళ్ళు మూసుకుని సీటుకి చేరబడ్డాడు.

ఎందుకో అతనికి భయంగానూ ఆతృతంగానూ వుంది.

"ఎక్కడికి వెళ్ళాలి మనం?"

"ఆలిస్.... మేరీ నర్సింగ్ హోమ్‌కి..."

* * *

ఆలిస్.... సుషమ ..! యిద్దరూ తనకోసం... పద్మని రక్షించడం కోసం
క్కువ శ్రమ తీసుకోవడం లేదు. చివరికేమౌతుంది?

పద్మ-నిజంగా మూర్ఖురాలూ మొండీ కూడా ...ఒక్కొక్క విషయంలో.
వేళ తను ఆమె మనోభావం తెలుసుకోవాలని....

"పద్మా! నువ్వే విడుదల చేసిన అండమూ... నా శోణితమూ కలిసి
ర్పడిన పిండం నీ గర్భంలోకాక బయట పెరగవలసి వచ్చిందనుకో.
హాస్పిటల్‌లో....లాబొరేటరీలో....అలాగ నువ్వు మన బిడ్డని పొందే అవకాశం
ందనుకో.... ఊరికే అనుకుందాం...."

"వద్దు. నేనే కనాలి నా బిడ్డను. నేను కంటేనే నా బిడ్డ అవుతుంది."

"కాని...ఆ పిండం నీ రక్తమాంసాలు పంచుకుని పుట్టిందేగా? మన
డ్డేగా?"

"నా గర్భంలో పెరగాలి. నేను కనాలి."

నిన్ను భగవంతుడు కూడా రక్షించలేడు. నీ గర్భాశయం ఎదగలేదు. నీ రక్తమాంసాలు పంచుకుని బిడ్డ ఏర్పడగలదు కానీ - దానిని నువ్వు నీ గర్భంలో పెంచి పెద్ద చెయ్యనూలేవు, ప్రసవించనూ లేవు. ఎంత మూర్ఖపు మొండి పట్టుదల నీది!

ఆలిస్‌కి చెప్పాడు పద్మ పట్టుదల గురించి.

ఆమె నిర్ఘాంతపోయింది.

జైగోట్ నాలుగు వారాలవరకూ పెరిగేది టెస్ట్‌ట్యూబ్‌లోనే అయినా తరువాత అది బదిలీ చేయబడవలసిన గర్భాశయం కూడా యీ నాలుగు వారాల లోనూ పిండాన్ని గ్రహించేందుకు కొంత సమాయత్తం కావాలి. టెస్ట్‌ట్యూబ్ లోని బేబీకి సెల్స్ ఆఫ్ సెర్టొలీ ఫీడ్ చెయ్యాలి.

అన్నీ సక్రమంగా చేస్తూ వచ్చారు.

ఆ వేళ జయదేవ్‌ని కూడా రమ్మంది. నాలుగు వారాలూ అయి...ఆ జైగోట్‌ని దయామయి గర్భంలో ప్రవేశపెట్టవలసిన సమయం ఆసన్నమై పోయింది, తగిన ఉష్ణోగ్రతలో ఉంచబడిన టెస్ట్‌ట్యూబ్‌ని జయదేవ్‌కి చూపించి... "టెస్ట్‌ట్యూబ్ గర్భాశయమైతే అందులో పీచులు దారాలు చుట్టుకున్నట్లు కనపడుతూంది చూశారా చిన్న పదార్థం (మాస్)? అదే-మీ బిడ్డ....భవిష్యత్ బిడ్డ...." అంది.

నాలుగు వారాలకి పిండం కనపడుతుంది మైక్రోస్కోప్ సహాయం అక్కరలేకుండానే. జయదేవ్‌కి దాన్ని చూసి ఏమీ అనిపించలేదు, కొంచెం అసహ్యం తప్ప.

అప్పటికే సుషమ వచ్చి...."పేషంట్‌ని సిద్ధం చేశాను. ఆమె యుటిరస్ ఎంబ్రియోని స్వీకరించడానికి సిద్ధంగా ఉంది" అంది.

ఆలిస్ టెస్ట్‌ట్యూబ్ పట్టుకొని వెళ్ళిపోయింది.

జయదేవ్‌కి ఇంకేం చేయాలో తోచనట్లు ఆలిస్ గదిలో కూర్చుని మాగజైన్ తిరగేయసాగాడు. ఒక మంచి వ్యాసం దొరకడంతో అతను కాలగమనమే మరచిపోయాడు .. అది చదువుతూ.

"మై గాడ్" అంటూ వచ్చింది ఆలిస్. ఆమె వెనుకే సుషమ.

"ఏమయింది?"

"ఇంక ఫరవాలేదు జైగోట్‌ని దయామయి గర్భంలో ప్రవేశపెట్టేశాం. ఇకనుంచి ఆ పిండం బాగోగుల బాధ్యతంతా ఆ గర్భాశయమే తీసుకుంటుంది. మనం చేయవలసింది అతి తక్కువే - ప్రసవం ఆసన్నమయ్యేవరకూ. చూశారా జయదేవ్ ...ప్రకృతికీ మనిషికీ తేడా?"

"ఏమిటి?"

"ఒక జీవిని సృష్టించడానికి యిన్ని పాట్లు పడవలసి వచ్చింది. కాని ... ప్రకృతి సిద్ధంగా యీ పని ఎంత సహజంగా సులభంగా జరిగిపోతుందని!"

"కాని ...సారీ ఆలిస్! మీ శ్రమంతా వృథాయే అనుకుంటాను." నేరస్తుడిలా అన్నాడు జయదేవ్.

"ఏం?" తృళ్ళిపడింది ఆలిస్.


"పద్మకి బిడ్డ తన రక్త మాంసాలు పంచుకు పుట్టడంతో చాలదు. ఆ బిడ్డను తనే కనాలట."


"ఆ!....అయితే... మీరు ...అంతా చెప్పేశారా?"

"సూటిగా చెప్పకుండా ఆమె ఉద్దేశం గ్రహించాను."

ఒక నిముషం అక్కడ భయంకరమయిన నిశ్శబ్దం ఆవరించింది.

తీవ్రంగా యుద్ధంచేసి....గెలిచామనుకుంటున్న క్షణంలో చిత్తుగా ఓడిపోతే ఏర్పడుతుందే నిరాశ....అటువంటి దావరించింది ఆలిస్‌ని సుషమనీ. ఆలిస్‌కయితే కన్నీళ్ళే వచ్చేస్తున్నాయి.





ఏమిటీ పరీక్షలు మాటిమాటికీ? ప్రతి విషయమూ సమస్య ఔతుందేం? -

"మరి-ఇప్పుడేం చేద్దాం"

"ఏమీ చేయవద్దు" అంది సుషమ. "భగవంతుని ప్రార్థిద్దాం"

"సుషా్మ" కోపంగా చూసిందామె

"ఔను. ఎదురవుతున్న ప్రతి ఆటంకమూ మనం ఊహించలేనిదే.... ఊహించనిదే కాని...అవి ఎంత చిత్రంగా ఉత్పన్నమవుతున్నాయో అంత చిత్రంగానూ సమసిపోతున్నాయి కూడా. ఎప్పటికప్పుడే ఏదో పరిష్కారం దొరుకుతూంది. అంటే...సమస్యలను సృష్టిస్తున్నవాడే సాయ్యం చేస్తున్నాడు కనుక మనం బుర్రలు బద్దలు కొట్టుకోవడం అనవసరం ఎప్పుడికేది జరగాలో అదే జరుగుతుంది మనం నిమిత్తమాత్రులం అనే వేదాంతాన్నాశ్రయించడం కంటె మనమిప్పుడు చేయగలిగేదేమీ లేదనుకుంటాను అందుకే - భగవంతుణ్ని ప్రార్థిద్దాం . మన పని సఫలం చెయ్యమని " సుషమ వేదాంతం చెబుతూంటే- ఆశ్చర్యంగానూ సరదాగానూ కూడా అనిపించింది జయదేవ్‌కి. చిన్నపిల్లలు పెద్ద మాటలాడుతున్నట్లు.

"అదికాదు-" ఏదో అనబోయింది ఆలిస్.

"ఏదికాదు? అయినా కానిదెందుకు .. అయినదేదో చెప్పు ..." నవ్వింది సుషమ.

ఆలిస్ ఏమీ అనలేదు. ఆమె దీర్ఘాలోచనలో పడినట్లు వెనక్కి వాలి కళ్ళు మూసుకుంది. "నువ్వు సీరియస్‌గా తీసుకోవాలి సుషమా! ఇప్పటికి మనం యీ కేసుమీద తక్కువ శ్రమ పడలేదు. జయదేవ్ తక్కువ ఖర్చు పెట్టలేదు. అదంతా వృధాయేనా?"

"భవిష్యత్తులో ఏం జరగబోతూందో ఇప్పుడెలా తెలుస్తుంది?"

"అయ్యో చెట్టు ఆకులలోనే తెలుస్తుంది. నాకేమిటో సందేహంగానే ఉంది. తీరా అంతా అయ్యాక . యీ బిడ్డని నేను కనలేదు. కనుక నాకక్కర లేదనేస్తుందేమో పద్మ?"

"బిడ్డని చూశాక... నిజం తెలిశాక... ఆమె అలా అనకపోవచ్చు. అయినా యిప్పుడు మనం చేయగలిగేదేముంది? దయామయి గర్భాశయంలో ప్రవేశపెట్టిన బిడ్డని చంపేస్తామా?"

"వద్దలాగ...." చటుక్కున అన్నాడు జయదేవ్.

"అందుచేత ఆ పిండాన్ని పెరగనివ్వవలసిందే. దట్సాల్. మిగిలిన కథ కాలపు తెరమీద వేచి చూడవలసిందే. కాలమే నిర్ణయిస్తుంది. ఉత్కంఠతాపూరిత మయిన యీ కథ ఎలా క్లయిమాక్స్‌కి రావాలో, ఎలా ముగియాలో" అంది సుషమ. నిజంగా ఆమె మనసులోని ఆలోచన వేరు ఆమెకు పద్మ తిరస్కరిస్తుందన్న అనుమానం అట్టే లేదు. ఎందుకంటే పద్మ స్త్రీ గొడ్రాలు. పిల్లల కోసం తహతహలాడుతూంది పురిటికందుని చూశాక .. ఆ శిశువు తన రక్త మాంసాలను పంచుకుని పుట్టిందే అని తెలిశాక .. బిడ్డల కోసం వాచిపోతున్న ఆమె హృదయం - ఎంతమాత్రమూ ఆ శిశువుని తిరస్కరించదు. సమస్యంటూ ఎదురయితే అది పద్మవేపునుంచి కాబోదు దయామయి వేపునుంచే కావడాని కవకాశాలెక్కువ. ఎలాగంటే....

తిన్నమ్మకి తిన్నకొద్దీ తీపి... కన్నమ్మకి కన్నకొద్దీ తీపి. ఇద్దరు పిల్లల తల్లి అయిన దయామయి....మూడో బిడ్డని ఎనిమిది మాసాలపైగా మోసి పునర్జన్మ అనిపించే ప్రసవ కార్యక్రమాన్ని నిర్వర్తించి....అంత బాధను భరించి కన్నబిడ్డను... పురిటికందును ఎవరికో శాశ్వతంగా యిచ్చెయ్యగలదా? ఆమె హృదయం అంగీకరిస్తుందా? పాలతో నిండిన ఆమె గుండెలు పురిటికందు పిల్పు కోసం పలవరించవూ? సలపరించవూ? కష్టపడి కన్న శిశువుని పరాయివాళ్ళ పాలు చేయగలదా ఆమె! నిజంగా ఆమె ఇవ్వనంటే ఎవరు మాత్రం చేయగలిగేదేముంది? దయామయి ఎక్కువ చదువుకోకపోయినా.... ఆ కాగితాలు, షరతులు ఎంత బలహీనమైనవో ఆమె గ్రహించలేదూ? ఆపాటి తెలివితేటలామెకుండే ఉంటాయి. కాకపోతే . ఆమె కొంత వివేకవతి చొరవ కలదీ కాకపోతే... సెంటిమెంట్లని కాదని .. వాస్తవ దృక్పథంతో, ఆర్థిక దృష్టితో తన గర్భాశయంలో మరొకరి పిండాన్ని ఎందుకు పెంచడానకి అంగీకరిస్తుంది? సెంటిమెంటుకంటె పిల్లల భవిష్యత్తు . ఆర్థిక వెసులుబాటూ ముఖ్యమనుకున్న దయామయిని వివేకం లేని దని ఎలా అనుకోగలం? అందుచేత సమస్యంటూ వస్తే దయామయివేపునుంచే వస్తుందేమో!

కాని...పద్మ గురించి కూడా ఆలోచించక తప్పదు నిజంగా జయదేవ్ ఆమెకోసం ఎంత ఆపాత్రయమూ, ఆత్రతా పడుతున్నాడని! అటువంటి భర్త.... మగవాడు...చాలా అరుదు. ఆమె కోరిక తీర్చేందుకతనే త్యాగానికయినా సంసిద్ధుడే. అతని ప్రేమతో సంతృప్తి చెందక పద్మేమో హిరణ్యాక్ష వరాలు కోరుతూంది. పెంపకానికొప్పుకోలేదంటే అర్థముంది బిడ్డ - తన రక్తమాంసాలు పంచుకు పుట్టాలన్న షరతు కోరినట్లే. ఆమె శరీరం విడుదల చేసిన అండమే- జయదేవ్ విడుదల చేసిన స్పెర్మటోజోవాతో ఫలదీకరణం చెందింది. కొండనెత్తి తన భుజాలమీద పెట్టమన్నట్లు...తన పెరగని గర్భాశయంలో బిడ్డ పెరగాలంటే ఎలాగ! అంతకీ ఆలిస్ ...అలోపతీ సర్జరీల ద్వారా ఏమయినా అవకాశం వుంటుందేమో ప్రయత్నించనే ప్రయత్నించి విఫలమయింది. తన హోమియోపతీ కూడా సాధించలేకపోయింది. విపరీతమయిన కేసు మరి. పద్మ మూర్ఖురాలు. లేకపోతే అంత మొండిగా ఆత్మహత్య చేసుకుందుకు ఎందుకు సిద్ధపడుతుంది బిడ్డలు కలగనంత మాత్రాన?

తండకు సేరు కుంటరు

డోర్నకల్ టేషన్ల
సుట్ట కాల్సుకుంట, బీడి పీల్సు కుంట
కూకుండె జనం
గుట్టల్ల బొల్లల్లబడి
రేసుకుక్కోలే
రైలు రాంగనే
వోరెన్రిజనం గొరెన్రిల్లెక్క ఎక్కుతరు
అడివంత గొట్టి భూమిల్ని సాగుజేసెటోల్లు
కట్టమెంత జేసిన కడుపు నిండనోల్లు
నడుము సుట్టు నైజాం సర్కారోపి
రుపాయల కందోరి
చేతులకు కోల్డా
పెట్టుకున్న మొగోల్లు
కాంచిడి, పెటియా

గుగిరి, టుగిరిలేసోక్కని
కాల్లకు వంకిడిలు కసేవో
చేతులకు బలియా
ముక్కున బురియా
నెత్తిన మాట్లా పెట్టుకున్న ఆడోల్లు
కట్టెలమోపు నెత్తి నెత్తుకొని
రైలెక్కంగనే తలుపుల దగ్గఅ ఏస్తరు
ఎవ్వల్ని ఎక్క నియ్యరు, దిగనియ్యరు
పూటకు తిండి లేక పోతే ఇంకేం జేస్తరు
తడకలపుడి నుండి పేతంపుడి దాక తండలు
తండలకు తండలు అంగట్ల కలుస్తరు
కొత్తగూడెం అంగట్ల కట్టెలమ్ముకొని

పూలు కొనుక్కోరు
పాత చింతపండు, కొంత మసాల
పావెడు మంచి నూనె
సోలెడు నూకలు కొన్కుంటరు
నెత్తిన మూటేసోక్కని
పొద్దుగూకి రైలు బండికి ఎన్కకు మర్లుతరు
శీకటిబడెతలకు తండకు జేరుకుంటరు
రైలు ఎంతో దూరం పోతది గని
అల్లుతండ దాటిపోదు
అల్లకు టిక్కట్లేదు
అల్లకు సదువులేదు
అల్లకు తిండిలేదు

* * *

కందోరి = మొలతాడు
కోల్డా = దండ కడియాలు
కాంచిడి = రవికె
పెటియా = ముసుగు
గుగిరి = నెత్తికి వుండె గుండ్రని బొడ్డెలు.
టుగిరి = ,, గున్నాలాంటివి.
వంకిడిలు. = కాళ్లకు గుండంగా వుండె లంబాడి కడాలు
బలియా = లంబాడి బొక్క గాజులు
బురియా = ముక్కు పుల్ల
మాట్లా = కుండ
కసేవో = కాళ్ల వంకర టింకరగా వుండె కడాలు.
(లంబాడోల్లవి)

శ్రీ టి. కృష్ణమూర్తి యాదవ్

ప్రస్తుతపు సమస్య పద్మే బిడ్డని కనాలి!

మెడికల్‌గా ఇది అసాధ్యమూ అసంభవమూ. మెడికల్‌గా కాక .. మరెలాగయినా యిది సాధ్యమౌతుందా?

"ఏది అనివార్యమో దానిని భరించక తప్పదు కదా! ...దయామయి గర్భంలోని బిడ్డ పెరగాలి. పెరుగుతుంది ఇంకా ఎనిమిది నెలల సమయం ఉంది. ఈలోగా ఏదయినా ఉపాయం స్ఫురిస్తుందేమో-పద్మ కోరిక కల్తీ లేకుండా-నూటికి నూరుపాళ్ళు తీరేలా."

"అసంభవమ్. అసాధ్యమ్-" అరిచింది ఆలిస్.

"ప్రభువుకి అసాధ్యము లేదు_"


కోపంగా చూసింది ఆలిస్

జయదేవ్ మౌనంగా వుండిపోయాడు. అతనికి యీ పరిస్థితి చిత్రంగా వుంది. ఆలిస్ సుషమల మధ్యనుండే అనుబంధం ఎటువంటిదో అతనికర్థం కాలేదు. సుషమ ఆలిస్‌ని గౌరవిస్తుంది. మీరు అంటుంది .. మళ్ళీ తనే ఆమను వేళాకోళం చేస్తుంది. ఏకవచన ప్రయోగం చేస్తుంది వీళ్ళిద్దరూ స్నేహంగానూ ఉంటారు, వృత్తిపరంగా ఒకరిమీద ఒకరు ఆధారపడనూ ఆధారపడతారు. ఒకరితో ఒకరు పోట్లాడుకుంటూనూ ఉంటారు చనువుగా. గంభీరంగానూ ఉంటూంటారు. చిత్రమయిన అనుబంధం.

"ఇప్పుడు డాక్టరు దగ్గరికి దేనికి?" కారు నడుపుతూ అడిగింది పద్మ.

"నా కళ్ళు...లైటుపడి ..." అన్నాడతను ఆలోచనలలోనే ఉండి. అతని కళ్ళు కొంచెం చూడగలుగుతున్నాయి కాని చాలా మంటగా అసౌకర్యంగా ఉంది. మేరీ నర్సింగ్‌హోమ్‌ని చేరుకుంది కారు.

(ఇంకా ఉంది)



అమ్మకోసం ఓ రోజు

తమిళ కథ:

అశోకమిత్రన్

తెలుగుసేత:

డాక్టర్ కొడసంటి పురుషోత్తం

మజ్జిగన్నం బాగా కలిపి ముద్దలు చేసి తింటున్నాడు రఘు. ఆఫీసుకు టైమవుతోంది. త్వరగా బయల్దేరాలి. అతని అమ్మ "ఏంరా! ఇవ్వాళ కాస్త త్వరగా ఇంటికి తిరిగొస్తావా?" అని అడిగింది.

"నావల్లకాదు పో" అన్నాడు. "గుత్తి వంకాయ దబ్బలు రెండు వుంచనా"



"ఏమీ అక్కర్లేదు పో" కసిరాడు. చేతులు కడుక్కుని, వరండాలోని అరుగుమీదున్న అరటిపండును ఒలిచి తిన్నాడు. చెప్పుల్లోకి కాళ్ళను దూరుస్తూ అడిగాడు. "ఏం, ఇవ్వాళ ఏదైనా విశేషమా అమ్మా?"

"ఏం లేదు. రాజకుమారిలో ఆడుతున్న సినిమా చాలా మంచిదిట. 6 గంటల ఆటకి వెళదామా అని పక్కింటావిడ అడిగింది. కాస్త ఆగి మళ్ళీ అంది. "చంద్రకి స్కూల్లో యేదో డ్రామా రిహార్సల్‌ట. నీ తమ్ముడు వై. ఎమ్. సి. ఎ. ని వదలి రావటానికే ఎనిమిది గంటలకి పైగా అవుతుంది." కాస్త ఆగి, సాగదీసి, ఈ ఇంటికి తాళంవేసి వెళ్ళలేమే మరీ ." ఆమె సినిమా పేరు చెప్పాక అంతదాకా మౌనంగా వింటున్న రఘు కస్సుమన్నాడు. "ఆ సినిమాలో పేద్దగా ఏమీ లేదు. చూడకపోతే కొంపలంటుకుపోవు."

"నువ్ చూశావన్న మాట."

"లేదు ...లేదని ఎన్నిసార్లు మొత్తుకోవాలి? దాన్ని నువ్వేం చూడక్కర్లేదు."


గడప దాటేంతదాకా అమ్మ సణుగుడు వింటూనే వున్నాడు రఘు.

మాంబలం స్టేషన్‌లో 9-27 రైలుకోసం దాదాపు రెండు వందలమంది కాచుకున్నారు. ట్రైన్ సమయానికి వచ్చింది. బీచ్ స్టేషన్‌లో దిగి తన ఆఫీసుకు చేరేటప్పటికి సరిగ్గా పది అయింది. పదకొండున్నర గంటలకు ఇంటర్వెల్. రఘు, కృష్ణమూర్తితోబాటు కాఫీ తాగేందుకు కాంటీన్ కెళ్ళాడు. ఉన్నట్టుండి కృష్ణ అడిగాడు. "మధ్యాహ్నం సినిమా కెళదామా?"

రఘు గుడ్లు తేలేశాడు. "మధ్యాహ్నమా?"

"ఆc....ఇవ్వాళ శనివారం కదా?" అరరే. అవును....తనకి శుక్రవారం అన్పించిదేమిటి?

"నెలాఖరుగదా ...డబ్బో మరి?" అని వాన్నాడు. కృష్ణ



ఖుషీగా ఓ పదిరూపాయల నోటు చూపించాడు. రఘు "సారీరా.... అమ్మ ఇవ్వాళ త్వరగా రమ్మంది నన్ను" అన్నాడు.

అటు తర్వాత కృష్ణ తనను నిర్బంధించలేదు. కౌంటర్ దగ్గర కొస్తూ మెల్లగా అన్నాడు.

"మనిద్దరి బిల్ నువ్వే పే చేసెయ్. ఈ పది నోటును మార్చ డానికి మనసు రావటంలేదు."

రఘు సరేనన్నాడు. ఓ పావలాను, రెండణాలను మేజామీద వుంచాడు. మేనేజర్ యిచ్చిన మిగతా ఒక్క అణాను జేబులో ఉంచుకొన్నాడు.

ఆ రోజు శనివారం కావడం ఒకందుకు మంచిదే అయింది. ఇంటికి త్వరగా వెళ్ళవచ్చు. పాపం ...అమ్మ కూడా ఓ సినిమా చూసి రానీ....

ఒకటిన్నరకల్లా ఆఫీసు పని ముగించుకుని రఘు బయటి కొచ్చాడు. మద్రాసు వర్తక ప్రపంచం అక్కడ రొదలతో గిరగిర లాడుతోంది. ఎటువేపు చూసినా మోటారు లారీలు, తోపుడు బళ్ళు, పెద్ద వ్యాపారులు, ఎగుమతి దిగుమతి ప్రతినిధులు, బాంకర్లు, బ్రోకర్లు, హార్బర్‌లో పని చేసేవాళ్ళు, తరతరాలుగ ప్లాట్‌ఫాంలో జీవనం సాగించే అలగాజనం - వీళ్ళందర్నీ చూస్తే రఘులో ఓ జలదరింపు పూసింది (వికసించింది). ఈ చోటు ఈ పగటివేళ ఎంత సజీవంగా వుంది. అందరూ చెమటను వెచ్చించి సంపాదించాల్సిందే. కొందరి చెమటబొట్ల ధర దాదాపు అణాలు ఇంకొందరి విషయాన లక్షల రూపాయలు. కృష్ణ చేతిలో డబ్బుంటే ధారాళ మనస్కుడే. రఘుని నిరాశ పర్చలేదు; పైగా భోజనం పెట్టించాడు మాట్నీ షోకి టైమయిపోవడంవల్ల కృష్ణ సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు రఘు మనసు, కడుపు రెండు నిండి వున్నాయి. నిదానంగా చైనా బజార్ రోడ్‌లో నడిచాడు. ఇంటికి అయిదు గంటలకు చేరితే చాలు. అమ్మ యింటినుంచి బయల్దేరేందుకు ఎక్కువ ముస్తాబు చేసుకోదు. ఇంటి నుంచి రాజకుమారి టాకీస్‌కు పది నిముషాల్లో చేరవచ్చు

రఘు రోడ్ దాటి హైకోర్టు గేట్ముందు నుంచున్నాడు తనకు ఆ చోటంటే ఎంతో ప్రియం. చైనా బజార్ రోడ్డుకి బీచ్ స్టేషన్‌కి సమాంతరంగా వున్న రోడ్డుకి ఎంత తేడా! హైకోర్టు నంటి పెట్టుకున్న చెట్ల నీడలో తిరిగాక ఎండలో నిలవడంవల్ల శరీరం తనంతట తానే పులకరించింది. చలికాలంలోనే మనకు ఎండయొక్క సొగసు, రుచి తెలుస్తుంది. అదీ నీడలో వున్న తర్వాత.

సమయం నాలుగు గంటలు కావచ్చింది. బీచ్ స్టేషన్‌వైపు నడక సాగించాడు. పొద్దు కుంకడం ప్రారంభమైంది కనుక నీడలు నిటారుగా వున్నాయి. వీధిలో వచ్చే పోయేవాళ్ళు, "ఏది కొన్నా నాలుగు లేక రెండు అణాలు" వ్యాపారులు రాను రాను ఎక్కువవుతున్నారు. పైగా శనివారం సాయంత్రం కావడంవల్ల జంటలు కోకొల్లలు! వాళ్ళలో ముప్పావువంతు ఆంగ్లో-ఇండియన్లు, ఇండియన్

క్రైస్తవులకు. టక్కున గుర్తొచ్చింది. అరె! అది క్రిస్మస్ వారం. హిందువులు జరిపే ఎన్నో జయంతులు - రామజయంతి, సాయిబాబా జయంతిలాటివి - కన్న ఒక్క క్రీస్తు పుట్టుకను క్రైస్తవులు ఎంత వైభవంగా జరుపుకుంటారు! క్రిస్టియన్స్ మీద అసూయ పుట్టింది.

* * * *

స్టేషన్ చేరుకొన్నాక ఎన్నడూ లేంది టికెట్ కలెక్టర్ రఘుని సీజన్ టిక్కెట్ చూపించమన్నాడు. తన మూడేళ్ళ రైలు ప్రయాణంలో ఇలా టి.సి. చెక్ చేయడం ఇదే మొదటిసారి. అదేదో మంచి కాలం. ఆ రోజు దాన్ని మరవకుండా ఇంట్లో వుంచి రాలేదు.

మూడో తరగతి పెట్టెలో కూర్చున్నాడు తనని ప్రత్యేకంగా ఆ పెట్టెకు రమ్మని కొక్కివేసి లాగింది ఓ ఎర్రచీర తీరా బండిలో ఎక్కాక తను మోసపోయాడనే తెల్సింది. అది చీరకాదు పంజాబీలు విశేషంగా వాడే సల్వార్-కమీజ్; పైగా దాని సొంతదారు ఏమంత పెద్ద అందగత్తె కాదు. ఆ పెట్టెలో ఆమెతోబాటు భర్త, ఓ పాప వున్నారు. ఆ జంట మధ్యవయస్కులు. ఆ పాపకింకా సంవత్సరం నిండకపోయినా చాల పుష్టిగా, అందంగా, బొద్దుగా వుంది. బాగా నడుస్తోంది. తన తలిదండ్రుల మాటలు అర్థం కాలేదేమో రఘుని చూసి ఓసారి మనోహరంగా నవ్వింది

కొద్ది కొద్దిగా పెట్టె మనుషులతో, సామానులతో నిండుకుంది. సమయం నాలుగుంపావు. ఇప్పుడు ఆ పాపకి రఘుకి మధ్య చాల మంది అడ్డు నుంచున్నారు. వాళ్ళలో చాలమంది బీడీలు తాగుతున్నారు. దాదాపు వారందరి దవడలు ఒకదానికొకటి ఒరుసుకుంటున్నాయి అయినా ఎందుకు బీడీలు కాలవాలి? పాపం అవసాన దశలో ఆ బీడీ లేందే స్పృహ తప్పి పడిపోతారేమో? ఎవరికి తెల్సు? నాన్న కూడా తన చివరిరోజున డాక్టరుకు తెలీకుండా రెండు వెంట్రుకలంత పొగాకు నోట్లో వుంచుకున్నాడు. వాటికి కాస్త రుచి చూడగానే పై లోకానికి వెళ్లారు.

* * *

రఘుకి ఏదో తప్పు అనిపించింది. తన ఎరికలో పావుగంటయినా రైలు బయల్దేరక పోవడం ఇదే మొదటిసారి. పెట్టెలోని మిగతావాళ్ళలో అసహనం మొదలయింది. ఇది గనక బయల్దేరితే మాంబలానికి ఇరవై అయిదు నిముషాలలో చేరుకోవచ్చు. స్టేషన్ నుండి ఇంటికి అయిదు నిముషాల దూరం నడక. అంటే అరగంట వ్యవధి మాత్రమే తనను ఇంటినుండి వేరుపరచాయి. అయినా బయల్దేరనంటుందేం? కారణం? పెట్టె దిగి మెల్లగా మిగతా ప్రయాణికులు గుంపులుగా నిల్చొని మాట్లాడుతుంటే వాళ్ళ వద్దకు వెళ్లాడు.

స్టేషన్ మాస్టర్, టికెట్ కలక్టర్ మొదలయిన వారిని ప్రశ్నలతో పీక్కుతింటున్నారు జనం. రఘుకి వివరాలు ఇట్టే అందినాయి. ఓ రైలు పట్టాలమీద అలకవూని పట్టాలనొదిలి కిందికి దిగింది. బీచ్ నుండి ఎలక్ట్రిక్ రైళ్ళు ఇక చాల గంటలకు గాని వుండవు. ఎవరో అడిగారు. "ఏం సార్! డబల్ లైన్ వుంది గదా! ఒకదానిలోనైనా ఈ బండిని వదిలేనేం?" ఆ రైలు ఉద్యోగి అయిదు నిముషాలబట్టి ఒకే రకం ప్రశ్నలకు జవాబిచ్చి, విసిగివేసారిపోయి వుండడంవల్ల కస్సుమన్నాడు.

"డబల్ లైనంటే ఏమిటి? వాటిమధ్య అరమైలు గాప్ వుందా? ఒక దారిలో బండి దిగితే అది ఇంకోదారిని సైతం ఆక్రమించుకొని, మూసేయటం లేదూ?"

* * *


రఘు త్వరగా స్టేషన్ వదలి బయటికొచ్చాడు. బస్సులో వెళ్తే ఇంటికి చేరడానికి చాలసేపు పడుతుంది. మరి గత్యంతరం? జేబులో సరిగ్గా ఆరు పైసలు మాత్రమే వున్నాయి. నించొని తన జేబులన్నిటిని వెదికి చూశాడు. లాభం లేదు. ఆ అణా కాంటీన్ వాళ్ళిచ్చిన చిల్లరే! పొద్దున్న అల్మైరానుండి జేబులో వేసుకొన్నపుడు కావలసినంత తీసుకొన్నట్టనిపించిందే! ఆరు అణాలు మాత్రమే తెచ్చానా? ఎంత తెలివిలేనితనం! ఛా...

రఘు వడివడిగా తన ఆఫీసుకు వెళ్ళాడు. ఎవరయినా 'ఓవర్ టైమ్' చేసేవాళ్ళుండినా వుండవచ్చు.

లేరు; ఎవ్వరూ లేరు. బయట వున్న ఇనప తలుపుకు తాళం వేసి వుంది. గూర్ఖా లేడు. అయినా వాడు రాత్రుళ్ళలో కాపలా కాయకపోతేనో ఎవ్వరైనా వాణ్ని తప్పు పట్టవచ్చు.

రఘులో దిగులు, భయం మెరిశాయి. ఎన్నడూ లేంది అమ్మ ఇవ్వాళ తనని (శీఘ్రంగా) త్వరగా రమ్మని కోరుకుంది. సినిమా చూడాలన్న చిన్న ఆశ. . . ఈ ఆశను సైతం నెరవేర్చలేనేమో!

ఆ వీధిలో ఆ సమయాన అన్ని తలుపులు మూయబడి



వున్నవి. రఘు స్నేహితులు, బంధువులు ఎనభై శాతం పైగా మాంబలంలోనే వున్నారు. తనకు తన ఆఫీసులో పనిచేసేవాళ్ళు తప్ప ఆ ప్రాంతంలో వాళ్ళెవ్వరితోను పరిచయం లేదు. ఆఫీసులో వున్న వారితోనైనా పరిచయాలు అంతంత మాత్రమే. పురసవాక్కంలో వున్న బాలకృష్ణ ఇంటికోసారి వెళ్ళాడు. రాజు అని ఇంకోతను. అతని ఇల్లు ఇక్కడే మింట్ వీధిలో వుండాలి. రెండు లేదా మూడు సందులు దాటాలి. ఇట్లా అవుతుందని తెలిసుంటే కృష్ణమూర్తి దగ్గర ఓ నాల్గ బాలు అప్పు తీసుకొని వుండవచ్చు. తప్పకుండా ఇచ్చేవాడే. కాని... ఇలా అవుతుందని ఎవరికి తెలుసు? పాపం .. అమ్మ తనకు మాత్రం ప్రియమైన గుత్తి వంకాయకూర రోజూ చేసి ఓ చిన్న కప్పులో వుంచేది. ఈ రోజు పొద్దున కూడా వడ్డించింది. తనే వద్దన్నాడు.

కాసేపు నడుస్తూ, కాసేపు పరుగెత్తుతూ రాజు ఇంటిని వెదకడం మొదలెట్టాడు. ఆ సాయంకాలాన అన్ని సందులు ఒకేలా ఉన్నట్టనిపించాయి. ఒక చదరపు అంగుళానికి దాదాపు వెయ్యిమంది పంచుకొన్న వున్న ఆ ప్రాంతాన రాజుని గురించి ఎవర్ని అడగాలి?

అయిదుంపావయింది. పాపం... అమ్మ ...ఎన్నడూ లేని ఆశ....ఏమౌతుందో? ప్రతిరోజు తను భోంచేశాక అరుగుమీద ఓ అరటిపండు తప్పనిసరిగా వుంటుంది. తన కడుపుకి, జీర్ణశక్తికి మంచిదట. తల్లికి తన బిడ్డ ఆహారంమీద ఎంత ఆక్కర!!

అమ్మయ్య...రాజు ఇల్లు దొరికింది! ఆ ఇంట్లో పన్నెండు కుటుంబాలు. యాభై మంది పెద్దలు. కనీసం వంద పిల్లలు. రఘు ఎలాగో రాజు వుంటున్న పోర్షన్‌కి వచ్చాడు. కూరగాయలు బేర మాడుతూ రాజు భార్య కంటబడింది. కాని ఆమె మాత్రం రఘు ఇంకెవర్నో వెదుక్కుంటూ వచ్చాడేమో అనుకుంది. ఆమె బుట్టలో వంకాయలున్నాయి. మరీ గొప్ప రకంవి కావు. కాని తన అమ్మ ఎటువంటి వంకాయనైనా లొంగదీసి అద్భుతంగా వండగలదు.... రఘు అడిగాడు.


"మిస్టర్ రాజు ఇంట్లో వున్నారా?"

"లేరే" అడిగిన ప్రశ్నకు క్లుప్తమైన జవాబు. ఇంట్లోకెళ్ళి వంకాయలావిడకు డబ్బు తెచ్చిచ్చింది. "ఎక్కడికి వెళ్లారు?" "తెలీదు" అంది. ఆవిడ చేతిలో కూరగాయలావిడ ఓ పావలా పెట్టింది. కాని అది జారి కిందపడింది. రఘు దాన్ని ఆకలిగా చూశాడు.

"ఎపుడొస్తారో తెలుసాండీ?" "చెప్పి వెళ్ళలేదే" అంటూ వంగి ఆ పావలాని కాస్త చేజిక్కించుకుంది. కూరగాయలావిడ నెత్తిన గంపను వుంచి, బయల్దేరడానికి ఆయత్తమయ్యాడు.

"మీరెవరు? వారు వస్తే ఏమని చెప్పమన్నారు?" మొదటిసారిగ రాజు భార్య స్వయాన రఘు ప్రమేయం లేకుండా మాటాడింది. రఘు "ఏం లేదులెండి. రఘు వచ్చినట్లు చెప్తే చాలు" అన్నాడు. అమ్మని తను ఎన్నోసార్లు కసిరాడు. ఇంటికి ఎవ్వరొచ్చినా తన అమ్మ వస పిట్టలాగా వాగేసేది! తనను వెతుక్కుంటూ ఇంటికెవ్వరయినా స్నేహితుడొస్తే ఇంక అంతే మరి. వాణ్ని కూర్చోబెట్టి, "నీ పేరు, వయసు, పెళ్ళయిందా లేదా, తోబుట్టువు లెందరు, మీ ఇంట్లో బొగ్గులు టి.యు.సి.ఎస్.లో కొంటారా, కట్టెల దొడ్డిలో కొంటారా" ఇత్యాది వివరాలు సేకరించేది. వచ్చినవాడు కాస్తా బేజారెత్తిపోయి, చాలా ప్రశ్నలకు జవాబులు తెలీక, మొహం తేలవేస్తాడు. కాని వారిద్దరి మధ్య ఓ కొత్త బంధం ఏర్పడుతుంది. ఇంకెప్పుడైనా రఘుని వెతుక్కుంటూ వస్తే అదే స్నేహితుడు తన అమ్మ గురించి అడక్కుండా వుండడు; వుండలేడు. తన తల్లికి రాజు భార్యకి కొండకి గుంటకి వున్నంత తేడా వుంది. అమ్మ ఏ పనిచేసినా అందులో ఓ ప్రత్యేకమైన తియ్యదనం వుంటుంది. కాని తను ఎన్నడూ లేంది ఓ రోజు సినిమా చూడాలనుకుంటే ఆ రోజే రఘు ఇంటికి త్వరగా వెళ్ళ లేదు. రైళ్ళు ఆగిపోతాయి. చేతిలో చిల్లర వుండదు. నేస్తం ఇంట్లో వుండడు. రాజు భార్య చేతిలోని పావలా తన చేతిలో వుంటేనా? హాయిగా ఇల్లు చేరుకోవచ్చు. ఆమెని ఎలా అడిగేది? రాజు వుంటే





భావశకలాలు

ఆలోచన్ల పావురాళ్ళు రివ్వున ఎగిరొచ్చి
భుజమ్మీద వాలగానే—
సుతారంగా పట్టుకుని వాట్ని
గేయాల పంజరాల్లో పెడతాను
గుడగుడమంటూ అవి నన్ను
కొరకబోతాయి;
రాత్రిళ్ళు కలల్లోకొచ్చి
కళ్ళు పొడవబోతాయి;

నా మస్తిష్కం చేటలో గింజలు
ధూర్తంగా ఏరుకు తినబోతాయి;
అర్థంగాని భాషలో ఏదో
నన్ను అనబోతాయి!
ఆలోచన్ల పావురాళ్ళు....

నా మెదడు బల్లుచుట్టూ
వూహల వుసిళ్ళు పరిభ్రమిస్తున్నాయ్!
చూస్తూండగనే రెక్కలు రాలిపోయి
నేలగూలి ఛస్తున్నాయ్!

లోకానికి ప్రతినిధికాల సూచీ యంత్రంలో
కన్నెపిల్లలాంటి చిన్న ముల్లువెంట
కాలేజీ స్టూడెంట్లా పడుతోంది పెద్దముల్లు
ఐక్యం అవడంలోనే జన్మ సార్థకతవుందని
నిశ్శబ్దంగా గొణుగుతూ;

ప్రతివాడు నేడు
మెదడు ప్రమిదలో ఆలోచన్ల నూనెపోసి
వూహల వత్తులు వెలిగిద్దామనే;
ఆశ్చర్యమూ, ఆనందమూ కలిగిద్దామనే!

నాకు ఎలాట్ చేసిన వత్సరాల్లో
కాలుడు యాభై గ్రీష్మాలు మింగాడు
నాలోని ఆదర్శాల, ఆవేశాల జీవుడు
కావిడిబద్దలా వంగాడు - లొంగాడు;

శ్రీ నర్సాపేట ఒత్సల

నాల్గు రూపాయలు సైతం అప్పుగా తీసుకోవచ్చు. పాపం-అమ్మ....

ఇక ఎంత ఆపసరపడ్డా, అవస్థపడ్డా ప్రయోజనం లేదని పించింది....ఇంత పెద్ద నగరంలో నాలుగణాలు అప్పిచ్చేవాడు లేడు- జనాభా మాత్రం ఒక కోటిట. ఆఁ ఉండదులే, పది లక్షలో? ఏమో! ఎందరుంటేనేం? పరిచయస్థుడు ఒక్కడు లేడు. చేతిలోని ఆరు పైసలు చిల్లిగవ్వకంటే హీనం. ఇంటిదాకా నడవాల్సిందే. బస్సులో కనీస దూరం కూడా ప్రయాణం చేయలేం. అందుకు ఏడు పైసలు కావాలి. పాపం ...అమ్మ....అయ్యో! తను ఎంతో మంచిది. తనో? హీనాతిహీనుడు; నీచుడు; క్రూరుడు. అమ్మ చూడాలనుకున్న సినిమాను తను మాత్రం చూడవచ్చు. కాని అమ్మ చూడకూడదు. "ఆ బోడి సినిమాను నువ్వు (మట్టుకు) చూడక్కర్లేదులే?" అనలేదూ తను? ఏం....అమ్మ అంత హీనురాలై పోయిందా తన దృష్టిలో? పాపం.... అమ్మకు కోపం రానే రాదు. ఇవ్వాళ మాత్రం తనని నోరారా తిడితే ఎంత సంతోషంగా వుంటుందో మరి!!

* * *

రఘు ఇంట్లో అడుగు పెట్టేసరికి బాగా చీకటి పడింది. తను ఎప్పటిలా ఇంటికి తిరిగొచ్చే టైమే. ఇంట్లో అమ్మ ఒంటరిగా కూర్చునుంది. తను ఆశగా, ఆత్రంగా అడిగాడు. "నువ్వు సినిమాకి వెళ్ళలేదా, అమ్మా?" ఆ ప్రశ్నకు అర్థమున్నట్టనిపించలేదు.

"ఎలా వెళ్ళను?"

అంతకంటె అమ్మ ఏమీ మాటాడలేదు. ఆమెకు బొత్తిగా కోప్పడ్డం తెలీదు.

రఘు చేతులు, కాళ్ళు, గుండె, రొమ్ము, తల....అన్నీ చెప్పరాని బాధతో విలవిలలాడాయి. "లేదమ్మా .. నేను త్వరగా రావాలనే అనుకున్నానమ్మా. ఇవ్వాళ రైళ్ళు ఆగిపోయాయి అమ్మా; బస్సులో వద్దామంటే చిల్లర చాలలేదమ్మా"—ఇంకా ఏమేమో చెప్పాలని వాని పెదవులు కంపించాయి. కాని చెప్పి ఏం లాభం? తన అమ్మ ఆశ సఫలమౌతుందా? ఆమె మట్టుకు నమ్మి తీరుతుందా?

చేతులు కాళ్ళు కడుక్కొని బాత్‌రూం నుండి రఘు బయటి కొచ్చాడు. అపుడు అమ్మ ఇలా అంది:

"ఫ్లాస్కులో వేడి టీ వుంచాను. తాగు."

(రచనా కాలం 1958)

సానుభూతి

ఎందరో వున్నారు మిత్రులు—
అయితే, ఎవరికివారు ఒంటరివారే!
నేనుకూడా
ఒంటరి తనపు బాధ
అనుభవిస్తున్నాను.
జీవితమంతా పువ్వులబాటే.
అయితే పెద్దపులి వెనుక నుంచి
ఫాలో చేస్తూనే వుంటుంది;
ఈ విషయం మనకు తెలుసు.
ప్రతినిత్యం వెనక్కి తిరిగి
పెద్దపులినిచూస్తూ
మనం నడిచే పువ్వుల బాటలో
ప్రయాణాన్ని
ఎలా ఎన్జాయ్ చెయ్యగలం?
రేపు మనల్ని ఉరి తీస్తారన్న నిజం తెలిసి
ఈరోజు వెయ్యి విట్లు విని.
సుఖపడేదేముంది!
జీవితంలో
చిన్నచిన్న సుఖాలూ
తాత్కాలిక సుఖాలూ ఎక్కువ.
కష్టాలూ సమస్యలూ
ఒకటి రెండే అయినా,
అవి శాశ్వతంగా వుండిపోయి
మన సుఖాలన్నిటినీ
మింగేస్తూ వుంటాయి.
అంటే మనం సుఖంగా లేమా?
సుఖంగానే వున్నాము. మన
కష్టాలు ఒకరికి తెలియదు.
మన కష్టం తీర్చుకోవటానికిగాను
మన సుఖాలన్నిటినీ
టోకుగా అమ్మేయవచ్చు.
అయినా ఎవరు
కొనుక్కుంటారు వాటిని?
కిరీటమూ భుజకీర్తులూ పెట్టుకొని
సముద్రంలో ఈత కొడుతున్నాను
(నీ లాగునే)!
పక్కన ఎన్నో పడవలు పోతున్నాయి
అయినా వాళ్ళదారి వాళ్ళది,

ఎవరూ ఎక్కించుకోరు.
ఎక్కించుకుంటే
వాళ్ళ పడవలో బరువు
ఎక్కువై పోవచ్చు.
కనుక మనం అరిచి లాభంలేదు,
ఈత కొడదాం!

* * * *

అజరామరం

జీవితం
చెట్టును అంటిపెట్టుకున్న ఆకు!
ఆ చెంపా ఈ చెంపా
ఎండా నీడా!
నీడకు మురిసి, చెట్టును
విడువనంటే కుదరదు;
ఎండకు జడిసి, చెట్టును
ఎడబాయటం జరగదు!

దుఃఖాలను సహించి
సుఖాలకు మౌనంగా పరవశించి
చెట్టుకు చేవనిచ్చి
గుట్టుగా రాలిపోతుంది ఆకు!

అంతటి త్యాగమే లేకపోతే,
ఇంతచెట్టు ఎలా అవుతుంది?
నవ్వులతో ఏడ్పులతో ఆకు పండిరాలటం
చెట్టు పెరగటంకోసమే!

శ్రీ కలువకొలను సదానంద

డా॥ శివలెంక ప్రకాశరావు

భావకవులు - ఛందో వైవిధ్యం

కవిత్వానికి ఛందస్సుకూ ఏదో అవినాభావ సంబంధం ఉందనిపిస్తుంది. ఆదిమ మానవుడు ప్రకటించిన ఛందోబద్ధమైన 'నృత్తగీత'మే (కొరెడ్ డాన్స్) కవితావిర్భావానికి మూలమని విమర్శకులు భావిస్తున్నారు. వాల్మీకి శోకమే ఛందోబద్ధ శ్లోకంగా రూపొందింది. మన వేదాలు ఛందోబద్ధాలే!

కాబట్టి భావ వ్యక్తీకరణకు ఛందస్సే అనుకూలమని తోస్తుంది. 'ఆవేశం, సౌందర్యం, ఓజస్సు' ఇత్యాది కవితా గుణాలన్నీ ఛందస్సునే అపేక్షిస్తున్నాయి. అంతేకాదు, కవిత్వానికి వలసిన 'లయ' ఛందస్సు ద్వారానే కలుగుతుంది.[1]

కాషాయాంబరాలు ధరించిన సన్యాసి సులభంగా గుర్తింపబడతాడు. అలాగే ఛందోబద్ధమైన కవిత్వం ప్రత్యేకంగా ఆకర్షింపబడుతుంది. అందుకే 'శబ్దాలకు ఛందస్సు అల్లెత్రాడులాంటిదనీ, అది పలుకులను ములుకుల్లా మర్మస్థానాలలో నాటుతుందనీ' రవీంద్రుడు అభిప్రాయపడ్డాడు.[2]

ఛందస్సు కవిత్వానికి ఒక సౌందర్యాపాదక హేతువు. గడ్డిపరక మీద ముత్యాల్లా మురిపించే మంచుబిందువుల్ని చేతిలోకి తీసుకుంటే వాటి సొగసూ, తళుకూ, రూపం నశించినట్లు ఛందస్సును తొలగిస్తే కవిత్వం కురూపి అవుతుంది[3] అని విమర్శకుల అభిప్రాయం.

కాని ఆధునిక కాలంలో ఛందస్సు ఆనుషంగికమనీ, కవితావిర్భావానికి అది ఒక అలంకారప్రాయమే కాని కారణం కాదనీ వాదం ఏర్పడింది.

దానికి తగ్గట్టుగానే ఛందస్సు లక్షణానుగుణంగాకన్నా లయబద్ధంగా ఉండడమే శ్రేయస్కరమని భావకవులు సిద్ధాంతీకరించారు. అందుకే గద్యపద్య సమ్మిశ్రితమైన పూర్వచంపూ ధోరణికి స్వస్తి చెప్పి, పద్యగేయ సమ్మిశ్రితమైన నూత్న పంథాను అవలంబించారు వీరు. దీనికి గురజాడ మార్గదర్శకుడు. దాంతో జాత్యుపజాతులతోబాటు, పూర్వరగడ భేదాలకు, ముత్యాలసరంలాంటి క్రొత్త పద్ధతులకూ, మాత్రా ఛందోబద్ధమైన గేయ ప్రక్రియకూ స్థానం ఏర్పరచబడ్డది.

భావకవులు అనుసరించిన ఛందోరీతులను కొన్ని విభాగాలుగా వింగడించవచ్చు.

1. యతిప్రాసలను పాటింపకుండడం.

ఉదా:- రాయప్రోలువారి 'దూతమత్తేభం'లో

'అధికారంబున నేమరిల్లి ప్రభు శాపగ్రస్తుడై యక్షుడొ
క్కడు కాంతా విరహార్తిలో జనకకన్యా స్నాన పుణ్యోదకం
బులు, ఛాయాతరు పీఫలన్ నవయుచుండెన్ రామగిర్యాశ్రమం
బులలో ప్రజ్ఞలు గ్రుంక భోగ్యమగు వర్షాంతంబు వీక్షించుచున్[4]

ఇత్యాది పద్యాలు మత్తేభవిక్రీడితాలయినా యతి ప్రాసల నియమం పాటింపబడక పోవడం గమనించాలి.

2. రెండు మూడు పాదాల వృత్తాలను రచించడం.

శివశంకరస్వామి ఎక్కువగా వీటిని రచించారు.

ఉదా :- 'భూమిందాకుచు మూర్ఛమానమగు నా పూగుత్తి యుద్వృత్తిలో
నామోదించును నాట్యపూర్వకముగా నాయాతవాతంబునన్[5]
(రెండు పాదాలు)

'తీయని యామ్రమధూరుహాతతిం గల పల్లవ పాళిమెక్కి యా
ప్యాయముగా వసంత సమయాద్భుత గానసుధా ప్రవర్షి యౌ
కోయిల యెట్లు పాడగలుగున్ శిశిరమ్ము న రమ్య కంఠమై'[6]
(మూడు పాదాలు)

చెప్పదగిన భావ విస్తృతికి తగ్గట్లు పద్యపాదాలు ఉండడంవల్ల వ్యర్థపదాలు ప్రయోగించే బాధ తప్పుతుంది.

3. తేటగీత్యాది పద్యాలను ఛందోలక్షణానుగుణంగా కాక, భావానుగుణంగా పాదవిభజన చేయడం.

ఉదా :- 'అంతదానినె, నా జీవితాశయమ్ము
పూవుగా వింతగా మారిపోయినటులు
పలచికొన్నార!
నా ప్రసవమ్ము నేను
నన్ను మనసార నా ప్రసూనమ్ము, కనులు...[7]
'ఈ విషమంపు గాడ్పు టలయింపుల
గ్రుచ్చిన దండ ఛిన్నమై
పూవులు రేకులూడి పడిపోయె
మిగిల్చితి ప్రేమ వాసనా
ప్లావిత తంతువిద్ది; యురిపైతువొ నామెడ
నీ ప్రవాళ రే
ఖా వరహస్త మందభయ కంకణ
మట్టు ధరింతువో ప్రభూ![8]

వీలయినంతవరకు భావాన్నిబట్టి పాదవిభజన చేయబడింది.

4. ఒక పాదాన్ని మధ్యలో ప్రారంభించి పద్యం కొనసాగించడం.

ఉదా :- జయము జయము
లలితమనోజ్ఞ కావ్యమంజుల లతాంత
మాలికాభరణా!...[9]

5. ఒక పద్యపాదాన్ని భావానుగుణంగా మధ్యలో విడిచిపుచ్చడం.

ఉదా :- నే గళమ్మార పాడుకొనిన యక్షాత
శోక గీతమ్ములం దీవె శోకగీతిని
ఊర్వశీ! ప్రేయసీ![10]

6. ఛందస్స్వరూపమేదొ స్ఫురణకు రానట్లు రచించడం.

ఉదా :- 'గురువుల యొద్ద నక్షరములు దిద్ది
మాటలు నేర్చి, ఐహికోశములు స్పృశించి
పెద్దల నేర్పులు పెక్కులు తిలకించి....
కరమ్ములు మోడ్చియుంటిఁ
గవినిగానిఁక దాసుడఁ గావుము ప్రభు![11]

ఇది నిజానికి ఒక సీసపద్యం. కాని ఆ రూపం కానరాదు.

7. ఒక లేఖను పద్యాలలో వ్రాయడం.

ఉదా :- 'ఆర్య, తాము వ్రాయు లేఖ అందినదీనాడె, వాంఛ

లాశలెల్ల విసర్జింప నభ్యర్థించెద మిమ్ముల....
ఒంటరిగా శాంతముగా నుండనిండు. సుందరాంబ.[12]

8. సంభాషించుకున్నట్లు పద్య రచన చేయడం.

ఉదా :- ఆవలి మేడను జూచుచున్నా
దనిమిషంబగు శూన్యదృక్కుల
మిత్రమా, ఆ వింత పురుషుని మీర లెరుగుదురా![13]

9. మంజరిని క్రొత్త గతిలో నడపడం.

ఉదా :- పూజారి సాంద్ర కర్పూరమ్ములందు
ప్రాజ్ఞ దీపాధోవలవమ్ముల యందు
మరుగు సన్ననిపాట
పొడుచు వెన్నెలతేట
కలవు తీక్కన పల్కు తెలుగు పల్కులకు[14]

ఇక్కడ 1, 2, 4 పాదాలు మంజరీ ద్విపదలు. 3 వ పాదాన్ని రెండు దళాలుగా రచించడం, ఒక్కొక్కదానిలో రెండు ఇంద్రగణాలు వాడడం గమనించాలి.

10. గేయస్ఫూర్తిని గూర్చి వృత్త రచన ఎక్కువగా చేయడం.

ఉదా :- లతాంతార్ద్రరాగమ్ములం దాటు తేటుల్
వసంతమ్ము కాంతి ప్రవాహమ్ములందున్.[15]

11. 'వెర్స్‌లైబర్' అనే పాశ్చాత్యవృత్త ఫణితిని చేపట్టడం - ఇది ఏ వృత్తానికీ, గేయానికీ చెందక పెక్కు వృత్తాల కలయికగా కనబడుతుంది. ఒక్కొక్కచోట సంస్కృత వృత్తంలా అనిపిస్తుంది. అటు గద్యమూ కాక, పద్యముగాక, ఎక్కడికక్కడ భావాన్ని బట్టి గతిని మార్చుకుంటూ నడుస్తుంది. దీన్ని మల్లవరపు విశ్వేశ్వరరావుగారు చేపట్టారు.

ఉదా :- ఓ నవయువతీ!
ఎవతెవు
నీవీరాత్రి నన్ను మేలుకొల్పావు!
ఏ తారా కోమలాంగివో నీవు
ఏ తేజస్స్నిగ్ధదేహవో కాని
నా స్వప్న ప్రాంతారాంతరాళంలో
నీ స్వర్ణాంకిత కింకిణీ క్వణాహ్వానం
రేకెత్తించి, నటించి, ప్రజ్వలించావే![16]

ఈ ధోరణి వాల్మీకి కాలంనుంచీ మనకు సుపరిచితమే!

ఉదా :- గాయంతి కేచిత్ప్రణమంతి కేచి
న్నృత్యంతి కేచిత్ప్రహసంతి కేచిత్
పతంతి కేచిద్విచరంతి కేచిత్
ప్లవంతి కే చిత్ప్రలపంతి కేచిత్!

పరస్పరం కేచి దుపాశ్రయంతే పరస్పరం కేచిదుపాక్రమంతే!
పరస్పరం కేచిదుపబ్రువంతే పరస్పరం కేచి దుపారమంతే!
ద్రుమాద్ద్రుమం కేచిదభిద్రవంతే
క్షితౌ నగాగ్రాన్నిపతంతి కేచిత్
మహీతలాత్కేచి దుదీర్ణ వేగా
మహాద్రుమాగ్రాణ్యభిసంపతంతి...[17]

వానరుల ప్రవర్తనకు తగినట్లుగా ఛందస్సు మార్చబడింది.

12. లయ విన్యాసానికి తగినట్లుగా మాత్రా ఛందోరీతులనూ, రగడ భేదాలనూ స్వీకరించి, నియమింపబడ్డ గణాలను కొన్నిచోట్ల గణాలు పెంచి లేక తగ్గించి యతి ప్రాసాది నియమాలను పాటించి లేక వదిలివేసి రచించడం—

అ) త్య్రస్రగతి : ఇది మూడు మాత్రాగణాల ఆవృత్తి కలది. హయప్రచార, తురగవల్గన, విజయమంగళ రగడలు ఈ గతిలో నడుస్తాయి. రూపక తాళబద్ధం ఇది.

హయప్రచార రగడకు ప్రతి పాదంలో 12 మాత్రలు వుంటాయి. ఆ సంఖ్యా నియమాన్ని మాత్రం పాటిస్తూ వివిధ రీతులలో రచించడం ఒక పద్ధతి.

ఉదా :- 'చెలియ! నిన్ను నీవు ముద్దు |
చేతులతో గూర్చినట్టి'[18] | 3 + 3 + 3 + 3 = 12

'యెరుగ వింత కలలోనా 3 + 3 + 2 + 4 = 12
మరుగు మరులు తిరుగు నెరలు'[19]

'మసక మసక వెన్నెలతో 3 + 3 + 3 + 3 = 12
మత్తిల్లిన పూగమ్ములు 4 + 2 + 4 + 2 = 12

పూగమ్ముల పెనుగొను తా 4 + 2 + 4 + 2 = 12
బూల లతా పల్లవములు[20] 3 + 3 + 3 + 3 = 12

అలాగే మాత్రా సంఖ్యను పాటిస్తూ పాదాంతంలో ఒకటి రెండు మాత్రలు తగ్గించి లేక పెంచి రచించడం మరో పద్ధతి.

ఉదా :- వీరుడెవడు రా
శూరుడెవడు రా ...
ఉసుగుల వేసిరించి జగతి
మసలకుండజేయు క్రూర
వ్యసనమ్ములతోడ బోరి
వశము గొనిన వాడు కాడా![21]

క్రీగీతలు గీసినచోట పల్లవిలో రెండు మాత్రలూ, చరణం మూడో పాదంలో ఒక మాత్ర ఎక్కువగా చేసి లయ కూర్చబడింది.

అలాగే—
కష్టపడ్డపాటులోనె - కాళ్ళనీళ్ళు దున్నుకొంచు
గతిక బలిసిన చవిటిపర్ర — గంగి మంగి గౌరి మారి
ఊరు పూడ్చి వస్తూ వుంటె - నలుగురి చూచి నవ్వుతు అడె
గట్టు మీదను బొట్టే యొకతె అట్టె - అట్టే అనుమనిచ్చ.[22]
క్రీగీతలు గీచినచోట ఒక్కొక్క మాత్ర ఎక్కువగా వాడబడింది.

అదేవిధంగా—
ఏటికోయి మన - చెలిమి - నీట చిత్తరువుల కలిమి
కలయె తెలుపు మన మనసుల - కలయిక నిజానిజాల.[23]

క్రీగీతలు గీచినచోట ఒక లఘువు తక్కువ. అక్కడ ఒక మాత్రాకాలం రాగం తీయాలి.

ఓహో కిన్నెరసానీ
ఓహో కిన్నెరసానీ
ఊహామాత్రము లోపల
నేల నిలువవే జవరాలా![24]

చివరి పాదంలో రెండు మాత్రలు ఎక్కువగా వాడబడ్డాయి. అంతేకాదు. ముత్యాల సరంలోలాగా నాల్గో పాదంలో కొన్ని మాత్రలు తగ్గించి రచించడం కూడా కద్దు. దీనిని బసవరాజు వారు 'పగడాల దండ' అని వ్యవహరించారు.

ఉదా :- చెట్టుదామ నల్లబాతె
పిట్టలన్ని గూళ్ళకేగు

చుట్టునెల్ల యెదలను బీ

కట్టు గ్రమ్మెదున్.[25]

దీనిని కృష్ణశాస్త్రిగారు కూడా ప్రయోగించారు.

ఉదా :- మలినభావ మౌక్తికమ్ము

మిల మిల నీ కనుల నిలువ

తళతళమని తారలు నదీ

యించునురా పాపీ![26]

త్ర్యస్రగతిని పలువిధాలుగా విడగొట్టి రచించి క్రొత్త ధోరణిని ప్రదర్శించడం కూడా భావకవులలో కానవస్తుంది.

ఉదా :- నల్లవాడే

గొల్ల

పిల్లవాడే

చెలియ

కల్లగాదే వాని

వల్లా జిక్కితినే.[27]

క్రీగీతలు గీచినచోట ఒక్కొక్క మాత్రాకాలం ఎక్కువచేసి క్రొత్తగతిని కూర్చడం జరిగింది. ఇదే ఖండగతిగా విడదీయవచ్చు. -నల్లవాడే గొల్ల ....

అలాగే-

మెట్టు మెట్టు

రాతి మెట్టు

కారు నల్ల

రాతి మెట్టు![28]

ఇత్యాదిగా గల గేయంలో ప్రతి పాదంలోనూ 6 మాత్రలే వాడబడడంతో ఒక ప్రత్యేక గతి ఏర్పడింది.

అ) చతురస్రగతి : ఇది నాలుగు మాత్రల ఆవృత్తి కలది. మధురగతి, హరిగతి రగడలు దీనికి ఉదాహరణలు. ప్రతి పాదానికి 16 మాత్రలుంటాయి.

ఉదా :- విడినరేకు గమి వడలిపోవునో

తొడిమ వీడి పెనుధూళిని రాలునో

చెడునో వికసించిన మధుశోభలు

బిడల పులకరింపొదవగనిపుడే

కోసి కొనుమ యీ కోయిల కుసుమము

కోరి విరిసె నీ కోసమె స్వామీ![29]

పై పాదాలలో నాలుగు మాత్రలను వివిధ రీతులలో విభజించడం జరిగింది.

కల కల లాడుచు

కిల కిల నవ్వుచు

కలకీ! నాతో

పలుకవేలనే![30]

అనడంలో నాలుగోపాదం చివర లయకోసం ఒక మాత్ర ఎక్కువగా చేర్చబడింది.

అదేరీతిలో శ్రీశ్రీ-

మరో ప్రపంచం

మరో ప్రపంచం

మరో ప్రపంచం పిలిచింది!

పదండి ముందుకు

పదండి త్రోసుకు

పోదాం పోదాం పై పైకి!

ఇక్కడ 8, 6 పాదాలలో 18 మాత్రలే వాడి క్రొత్తగతిని కూర్చడం జరిగింది.

అలాగే పాద విభజనంలో ఒక క్రొత్త లయను కల్పిస్తూ శ్రీశ్రీ మొదలయినవారు చతురస్రగతిని వాడడం గమనించాలి.

'కవితా! ఓ కవితా!

నా యువకాశల నవపేశల సుమ .తావరణంలో

నిను నేనొక సుముహూర్తంలో

అతి సుందర సుస్వప్నదనమందున

దూరంగా వినువీధుల్లో విహరించే[32]

మొదటి పాదంలో 10 మాత్రలే వున్నాయి. అక్కడ రాగానికి కొన్ని మాత్రల కాలం వదిలి ఒక్క ఊపున రెండో పాదం అందుకొని పాడడంలో ప్రత్యేకమైన శైలీ విన్యాసం గోచరిస్తుంది.

అలాగే-

'కుటిలాలక' వర్షా! నీ

స్ఫటికాంచిత జల వీణా

రటిత బిందు నిక్వణముల

నటియింపుము నదియింపుము

కుటిలాలక! నవవర్షా![33]

ఇత్యాదిగా గల పాదాలు 12 మాత్రలతోనే ఉండటం మరో లయ విన్యాసం.

అదేవిధంగా-

తురాయి పువ్వు తుళిమిలి కొప్పులో


సరాగ మాడిన సరసుడెవడే?

తురాయి పువ్వు త్రోవలో దొటికెను

సరాగమాడెడు చల్లనిగాలి-[34]

ఇత్యాదిగా గల పాదాలలో 'పువ్వు', 'గాలి' అనేచోట్ల ఒక్కొక్క మాత్రా కాలం రాగం తీయాలి.

విశ్వనాథవారి 'హాయని కిన్నెర యేడ్చెన్'[35] ఇత్యాదిగా గల 'కిన్నెర దుఃఖము' కూడా చతురస్రగతికి ఉదాహరణమే!



చతుర్మాత్రాగణాలలో జగణం వాడకూడదనే నియమాన్ని త్రోసిపుచ్చి భావకవులు నూత్నగతి వైవిధ్యాన్ని ప్రదర్శించారు.

ఉదా :- ఈ కుటీర ముఖద్వార
మిందే వ్రేలాడి సగము
వాడి విరహతోరణమ్మునై
పలవంత పడలి నేల జీ
రాడి యెన్నినాళ్ళు మనుదున్నో[36]

మూడో పాదంలో జగణంతోపాటు చివర రెండు మాత్రలు ఎక్కువ. అలాగే నాలుగో పాదంలో 18 మాత్రలు అయిదులో 14 మాత్రలూ వాడి మరో క్రొత్త నడకను కూర్చడం జరిగింది. అయినా ఇది చతురస్రగతియే. 'నేల జీరాడి' అన్నచోట చక్కని విరుపు ఉంది. అలాగే శ్రీశ్రీ

ఘొలాల నన్నీ
హలాల దున్నీ
ఇలాతలంలో హేమం పిండగ
జగానికంతా సౌఖ్యం నిండగ.[37] అంటాడు.

క్రీగీతలు గీచినవన్నీ జగణాలే. వాటివల్ల సాధించిన శైలీ విన్యాసం అద్భుతం.

అయితే—

వార్త చేరగనె - ప్రియురాలు
వచ్చెనెదురుగా - ప్రియురాలు[38]

ఇత్యాదిగా తల్లావజ్ఝలవారు మరో గతి వైవిధ్యాన్ని చవి చూపించారు.

8) ఖండగతి : 5 మాత్రల ఆవృత్తి కలది ఇది. ద్విరదగతి, విజయ భద్రము ఈ తెగవే. ఝంపెతాళం. భావకవులు ఎక్కువగా వాడినది ఖండగతియే. విశ్వనాథవారి 'కిన్నెరసాని పాటలు' ఎక్కువభాగం ఈ ధోరణియే. కృష్ణశాస్త్రి, అబ్బూరి ప్రభృతులు కూడ దీనిని విరివిగా ప్రయోగించారు.

ఉదా :- కెరటాలలో నుర్వు
తెరచాలులో నీటి
ఘొరజాలులో కిన్నె
రటు కదలి ఇటు కదలి
చిటి తరంగాలతోఁ - పొటి తరంగాలతో
నటనాలు మొదలెట్టెనే - క్రొన్నీటి
తుటుములా కదలాడెనే![39]

నది నడకలోని హొయలన్నీ పై పాదాలలో ప్రతిబింబిస్తున్నాయి.

అలాగే-

జ్ఞానావధులనేలు
నానందపుఁ బదాలు
దీనుల చుట్టాలు
క్లాంత మనశ్శ్రితలములు-
సరోజినీ గానకళకలములు[40]

అనడంలో మూడో పాదంలో 'దీనుల' అన్నచోట ఒక మాత్ర, నాలుగోపాదంలో 'దీనుల' అన్నచోట ఒక మాత్ర, నాలుగో పాదంలో '....లములు' అన్నచోట రెండు మాత్రలూ తగ్గినాయి. కాని 'క్లాంత', 'శ్రిత' అని ఊనికతో పలకడంలో ఆ రెండు మాత్రల కాలం సరిపోతుంది.

విశ్వనాథవారి 'కిన్నెరసాని' లాగా 'ఊర్వశి'ని ఖండగతిలోనే ఎక్కువగా నడిపించారు దేవులపల్లివారు.

ఉదా :- మున్నీటి తరగతులతు మిన్నేటి నురుగులతు
తరయు వెరజాటౌనెః విరని కౌగిలి నేనె!...
తొలి వియోగిని నేనె!
తొలి ప్రేయసిని నేనె!
అనాటికీ నాటికేను నీదాననే![41]

అయితే మరోచోట-

నీ
పెదవి చివురుల నొక ని
దుర యూర్పు విసరనీ
కాలాంత బలపదాచలా నిలముగ లో
కాల త్రుటిలో మాడ్చివేయు సుమ్మా![42]

అనడంలో మొదటి ఎత్తుగడలో, చివరి ముగింపులో ఒక ప్రత్యేకమైన లయ ప్రదర్శింపబడింది. 'ఆకులో ఆకునై ...'[43] ఇత్యాది గేయం కూడా ఈ 'గతి'లో నడిచిందే!

అలాగే కవికొండలవారు-

ఛందాయి తెరచాటు - చక్కన్ని చుక్క
తొంగిచూడే! నన్ను - పొంగి చూడే!'[44]
'ఈ కొండ ఈ యెండ, ఈ పెద్ద బాదువలో
చూపట్టు చెట్టు నీడెవ్వనికిః ఎవ్వనికిః
గోచి పెట్టుకున్న గోపడికి గోపడికి
గోటి బిళ్ళాడేటి పాపడికి పాపడికి.[45]

ఇత్యాది శైలీ విన్యాసాన్ని చవిచూపించారు.

మల్లవరపువారు చివరి పాదంలో తక్కువ మాత్రలు వాడుతూ-

తేలిపోయే చల్ల
గాలినే నా మురళి
నేలుకోమని సమ
ర్పించాను![46]

ఇత్యాదిగా రచించి మరో లయను కల్పించారు.

అలాగే నండూరివారు-

గోవుమాలచ్చిమికి కోటి దణ్ణాలు-
మనిసికైనా లేని మంచి పోకిళ్ళు-
యెంకితో కూకుండి
యింత సెపుతుంటే
తనతోటి మనివల్లె
తల తిప్పుతాదీ![47]

అనడంలో 1, 2 పాదాల చివరలో రెండేసి మాత్రలు, నాలుగవ పాదంలో 'యింత' తరవాత, 6 వ పాదం చివరలో ఒక మాత్ర కాలం రాగం కోసం విడిచి పెట్టడంతో మంచి లయ ఏర్పడింది.

ఈ) మిశ్రగతి : దీనికి 3 + 4 మాత్రలు వుండి, త్రిపుట తాళంలో నడిచే హరిణ, వృషభగతులు ఉదాహరణలు. అయితే నవీన ధోరణిలో-

గుత్తునాముత్యాల సరములు
కూర్చుకొని తేటైన మాటల
క్రొత్త పాతల మేలు కలయిక
క్రొమ్మెరుంగులు జిమ్మగా

అంటూ గురజాడవారు ఏ సుముహూర్తాన పలికారో ఆ ముత్యాలసరమే తరవాతి ఆధునిక కవులకు శిరోధార్యమయింది. ఇది 'శ్రీనివాసు భజింతునేనని, పూని కుజనుల పొంతబోవని విరతులను గావింపనిమ్ముల, హరిణగతి చెలువగు జగమ్ముల' (అనంత) ఇత్యాదిగా గల 'హరిణగతిరగడ'చ్ఛాయలో నడిచింది. అయితే ప్రతి పాదానికీ 3 + 4 = 7 మాత్రల గణాలు రెండు వున్నప్పటికీ యతి ప్రాసలు తగ్గింపబడ్డాయి. చివరి పాదంలో 7 మొదలు 14 మాత్రల వరకు ఉపయోగించవచ్చు. యతి ప్రాసలు ఐచ్ఛికం.

ముత్యాలసరానికి కన్నడంలోని 'భామినిషట్పది' లక్షణం కూడా సన్నిహితంగా కానవస్తుంది. (3 + 4 మాత్రల గణములు రెండు, ఆరు పాదాలలో వుండి, 3, 6 పాదాలలో 3 + 4 + 2 మాత్రల గణాలు అధికంగా చేరివుండటం దీని లక్షణం)

ఉదా :- ఎల్లలోకము లొక్క యిల్లై
వర్ణ భేదము లెల్ల కల్లై
వేలనెరుగని ప్రేమబంధము
వేడుకలు కురియ

అనే గురజాడ గేయం దీనికి సరిపోతుంది.

'గుమ్మడేడే' ఇత్యాది జానపద గేయం కూడా దీనికి ఉదాహరణప్రాయమే.

ఆధునికులలో ముత్యాలసరాన్ని కూర్చని కవి లేడనవచ్చు.

ఉదా :- 'శ్రీలు పొంగిన జీవగడ్డయి,
పాలు పాఱిన భాగ్యసీమయి
వ్రాలినది. ఈ భరతఖండము
భక్తి పాడర తమ్ముడా!'[48]

'తళుకు బంగరు తారలేలా?
తలకు మీరిన తలపులేలా?
వలచి పొందగ గగన సుమములు
కలయె జీవితము.'[49]


చివరి పాదంలో మాత్రలు ఎక్కువ తక్కువ ఉపయోగించడంలోనే విలక్షణత కానవస్తుంది. పై పాదాల్లో విశ్వనాథవారి 'కోకిలమ్మ పెళ్ళి' మొత్తం ముత్యాలసరమే!

అయితే మిశ్రగతిలోనే కొన్ని పాదాలలో ఒకటి రెండు మాత్రలు పెంచి కొందరు భావకవులు గతి వైవిధ్యాన్ని సంతరించడం విశేషం.

ఉదా :- అలింపు పాడెద నాంధ్రకోమలి
యార్ద్ర హైందవ గీతులన్
పాలింతునెల్లెడ భావ పుష్పిత
నవ్యశయ్యారీతులన్'[50]

1, 3 పాదాల మొదట రెండేసి మాత్రలు ఎక్కువ వాడి క్రొత్త లయ భేదాన్ని కూర్చాడు కవి.

'కాలకంఠుని నాగస్వరము కుబుసమూడ్చి పడగ బుస్సంది
రెండు నాల్కలు....
గండ మీసాలట్టు దూసింది - చెవులు మోసింది -
నాగసరమూదేది యెవరోయి? రాగమొలికించేది యెవరోయి?
కారునల్లని రాత్రి[51]



చివరి పాదంలో 'రాత్రి' అన్నచోట తప్ప (ఒక మాత్ర తక్కువ) మిగిలిన క్రీగీతలున్న చోట్లల్లో ఒక్కొక్క మాత్ర ఎక్కువ చేసి గతివైవిధ్యం కూర్చబడింది.

ఒంటిగా నుయ్యాల లూగితి వా
నా ముద్దుకృష్ణా
జంటగానను బిల్వదగదోయీ?[52]

క్రీగీతలు గీచినచోట రెండేసి మాత్రలు ఎక్కువ చేసి ఈ గీతం రచించబడింది. మిగిలిన గీతమంతా మిశ్రగతిలో వుండడంవల్ల దీనిని గుర్తించడం సులభం. లేనిచో పల్లవిని బట్టి ఖండగతి అని భ్రమించే ప్రమాదం లేకపోలేదు.

అలాగే-

'నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను .... 1 మాత్ర ఎక్కువ
ఎండాకాలం
గబ్బిలం వలె
క్రాగిపోలేద్రా?[53] .... 2 మాత్రలు ఎక్కువ

పై పాదాలలో చివరన ఒకటి రెండు మాత్రలు ఎక్కువ చేసి ఒక క్రొత్త నడకను నడిపించాడు శ్రీశ్రీ.

ఆయన రచించిన 'కుక్కపిల్లా - అగ్గిపుల్లా... ' ఇత్యాది పాదాలలో కూడా మిశ్రగతే క్రొత్త ధోరణిలో కానవస్తుంది. అయితే మరోకవి

ఈ కనుసన్న లెవరి కోసము
ఈ మధుగీతు లెందు కొరకో?[54]

అనడంలో ముత్యాలసరాన జగణం (క్రీగీతలున్నచోట) కూర్చబడి నడక కుంటుపడడం గమనించాలి.

ఉ) వచనగేయం: భావకవులలో కవి కొండలవారు 'వచనగీతిక' అనే పేరన ఒక వచన గేయాన్ని రచించారు. (1933)

నక్కాసామిగాడు - వాడొక మాలవాడు
రాజుగారి కవతంలో పాలేరువాడు,
వాడు పోయాడు - ఎంత కాలమైందో ఆ పోయి?....[55]

ఇత్యాదిగా వున్న ఈ కవిత క్రొత్త ధోరణిలో నడపబడింది.

అంతకు పూర్వమే దువ్వూరివారు 'లూరీ', 'మోహినీప్రకృతి'

(నైవేద్యము 1921-25) ఇత్యాది వచనగేయాలు రచించినట్టు కానవస్తుంది.

తరవాత ఇదే శ్రీశ్రీ, శిష్టా' నారాయణబాబు, పరాభిలాంటి అభ్యుదయ కవుల చేతుల్లో పలువోకగలు పోయింది.

భావకవితా యుగంలోనే మంజరీ ద్విపదలోనూ, మధ్యాక్కరలాంటి పాత ఛందోరీతులలోనే క్రొత్త హొయలు ఒలికించిన కవులు వున్నారు-

ఉదా :- ఓ విశాలాక్షినీ
శోభాతి పావనీ!
ఆరంభ పుణ్యక్షణముల సిశుడు విసిరిననాటి
నీయాది సౌభాగ్యమెటుల వెల్గెనో? భవదీయశాటి
యాకు పచ్చని యాకులో
పండువెల్తురు రేకులో — [56]

ఇత్యాది గేయంలో మొదటి రెండూ సీసార్ధపాదాలు, దీర్ఘపాదాలు యతి ప్రాసలు లేని మధ్యాక్కరపాదాలే!

ఈ విధంగా భావకవులు ఛందోవీధిలో స్వేచ్ఛగా విహరించి తమ 'సొంత గొంతు'ను వినిపించారు. 'పాత కొత్తల మేలు కలయిక'ను చవిచూపించి తరవాతి కవులకు మార్గదర్శకులయారు. ఒకరకంగా గేయ ప్రస్థానానికి రాచబాట తీర్చి దిద్దబడింది వీరి కాలంలోనే. ప్రజాశక్తిని ఉద్బుద్ధం చేసి రాజకీయ చైతన్యాన్ని పురికొల్పడం కోసం, దేశభక్తి గీతాస్రవంతి అవ్యాహతంగా సాగడానికి ఈ లక్షణమే దోహదకారి అయింది. గేయంలోని తూగూ, లయా పసిగట్టి భాషా భావాలు రెండూ పడుగు పేకల్లా అల్లుకుపోయే ధోరణి వ్యాప్తి చెందింది. గురజాడ ముత్యాలసరంతో ప్రాత ఛందోభేదాలైన ద్విపదలు, రగడలు గీతాలూ మళ్ళీ కొత్త ఊపిరి పీల్చుకున్నాయి. మాత్రాచ్ఛందస్సు అందలమెక్కింది. క్రమశః ఏ బంధాలూ లేని భావప్రధానమైన 'వచన కవిత'ను భాషామతల్లి ప్రసవించింది నేడు. వ్యావహారిక భాషకు ముఖ్యవాహిక అయింది అదే.

ఈ ఛందోవైవిధ్యానికంతకూ భావకవులే మార్గదర్శకులని గుర్తించాలి!

(భావకవులు - ప్రతిభావిస్ఫూర్తి' అనే నా పరిశోధన గ్రంథం(అము)నుంచి)

రిఫరెన్సులు

1. 'రిదిమ్ అండ్ మెషర్. ఎలివేటెడ్ టూ ఏ రెగ్యులారిటీ స్ట్రెస్ అండ్ ఫోర్స్, వెరీ డిఫరెంట్ ఫ్రమ్ దట్ ఆఫ్ రిదిమ్ అండ్ మెషర్ విచ్ కెన్ పెరివేడ్ ప్రోజ్ ఆర్ ఏ పార్ట్ ఆఫ్ ఇట్స్ పెర్‌ఫెక్షన్' - సాహిత్య దర్శనము - ఆచార్య కె. వి. నరసింహం -పు 77
2. రవీంద్ర వ్యాసావళి-2-పు 562
3. సా.దర్శ- పు 79
4. దూతమత్తేభం (1959) పు. 1
5. శివశంకరకృతులు (1952)-పు. సంపుటి -పు 246
6. అదే-పు 244
7. కృష్ణపక్షము (1975) - కృష్ణశాస్త్రి - పు 44
8. దీపావళి (1974) వేదుల - పు 85
9. కృ.ప - పు 74
10. ఇన్ని కల్పాలు - ఊర్వశి - కృ.శా. -పు116
11. భావ సంకీర్తనం-వేంకట పార్వతీశ్వర కవులు-కావ్యకుసుమావళి-3 -ద్వి. సం-పు 84
12. శివశంకరకృతులు పు. సం-పు. 145
13. అదే-పు 191
14. ఊహాగానము-ఇతర కృతులు-అబ్బూరి (1973) -పు 54
15. సాధుగీతి-అదే-పు 50
16. స్త్రీ-ఉదయిని-ఆగ 1936-పు 426
17. సుందరకాండ-వావిళ్ళ (1972) పు 270
18. గుర్తులు-బసవరాజు అప్పారావు గీతాలు-పు 81
19. మరపు-యెంకి పాటలు-పు 85
20. కవిత-ఊ.గా-ఇ.కృ - పు 143
21. పీరుడు - బస.అ.గీ-పు 42-43.
22. వాడు-కవికొండల వేంకటరావు గీతాలు (1960) - పు 100-
23. మరపు-యెంకి పాటలు (1953) పు 85.
24. కిన్నెరసాని పాటలు (1970) -పు 7.
25. కామాసుర-బస. అ.గీ-పు 129.
26. పాపి-కృ.ప-పు 69.
27. దొంగ కృష్ణుడు-బస.అ గీ-పు 20.
28. మెట్టు-బాపిరాజు గేయము-వైతాళికులు.
29. నీకోసమే-దీపావళి-వేదుల-పు 106.
30. పలుకవేంనే-బస-అ.గీ-పు 98.
31. మహాప్రస్థానం-శ్రీశ్రీ (1973) -పు 17.
32. అదే-పు 31.
33. నవపర్షా-కళ్యాణ కింకిణి-మల్లపరపు-పు 22.
34. కోకిలమగిడు-కవి. వేంక. గేయాలు-పు 19.
35. కిన్నె.సా.పా-పు 44.
36 ప్రవాసము-కృ.శా-పు 101.
37. మహా.ప్ర-పు 37.
38 పకుళమాలిక-శివ.శం.కృ.
39 కిన్నె.సా.పా-పు 23.
40. ఊ.గా.ఇ-కృ-పు 66.
41. కాలమె-కృ,ప.పు 119.
42 వద్దు కృ ప. పు 59.
43. కృ.ప పు 1.
44. చూడే-కవి. వేం గేయాలు-పు 34.
45. ఈ కొండ-ఈ యెండ-అదే-పు 69.
46 ఆకాశతార-కల్యాణకింకిణి-పు 44.
47. యెం పా-పు 140.
48. తమ్ముడా-ఆంధ్రావళి-రాయప్రోలు-పు 27.
49. చుక్కలు-కృ ప-పు 52.
50. పూజీ శిరీషములు-ఊ గా-ఇ.కృ.అబ్బూరి-పు 49
51. శివరాత్రి ప్రభ-కవి.కొం గీ (1961) పు 1.
52 వటపత్రశాయి-బసు.అప్పా.గీ-పు 25.
53 జయభేరి-మహా ప్ర-పు 21.
54. ముని మాపు సహదేవ సూర్యప్రకాశరావు.
55. కవి. వేం గేయాలు-పు ౪'-62.
56. పృధివీ ప్రశంస-ఊ గా ఇ కృ-పు 76.

భారతి

★ సాహిత్యాభిమానులకు చక్కటి అవకాశం!

చందాదారుగా చేరండి!

ఆదా చేయండి రు 11 దాకా!

ఏజంటు ద్వారా భారతి సంవత్సరం చందా రు. 48.

పోస్టు ద్వారా అయితే భారతి సంవత్సరం చందా రు. 51.

కాని మీరు రు 40 ముందుగా ఒకేసారి చెల్లిస్తే మీకు ఒక సంవత్సరం పాటు భారతి అందుతుంది!

★ అంటే రు. 11 దాకా ఆదా చేసుకోవచ్చునన్న మాట!

రు 40 చందా మొత్తాన్ని "ఆంధ్రపత్రిక" (గాంధీనగర్, విజయవాడ)కి మని ఆర్డరు ద్వారాగాని, డిమాండు డ్రాఫ్టు ద్వారాగాని పంప ప్రార్ధన ఏజెంటుకి గాని ఇతరులకి గాని చెల్లించ వద్దని మనవి

ఈ క్రింది కూపనుని నింపి డిమాండు డ్రాఫ్టుతో గాని, మనీ ఆర్డరుతో గాని జతపరచి పంపాలని మనవి

★ మీరు ఉన్నచోట ఏజెంటు ఉంటే ఏజెంటు ద్వారా భారతి సరఫరా చెయ్యబడుతుంది

★ ఏజంటు లేకపోతే భారతి మీకు పోస్టులో అందుతుంది!

★ చందా మొత్తాన్ని ఇతరులకి ఇవ్వరాదు! నేరుగా ఆంధ్రపత్రికకే చెల్లించాలి!



నేను "భారతి" మాస పత్రికకు చందాదారునిగా చేరదలుచు కున్నాను చందా పైకము రు 40 డి డి / ఎం ఒ. ద్వారా పంపుతున్నాను

పేరు . ______________________

చిరునామా ______________________

____

చందాదారుని సంతకం

చిన్న నవలల పోటీలో మూడవ బహుమతి రు.1,500/-లు పొందిన నవల

నది

ఎ.వి.వి.యస్.యస్.ప్రసాద్

మంచు తెరలు ఇంకా విడలేదు...

సుప్రభాతం ఆలపిస్తూ, ప్రకృతిని మేల్కొలుపుతున్నట్టు పచ్చని చెట్ల చిటారుకొమ్మల నుంచీ, చివురు రెమ్మల నుంచీ పక్షుల కిలకిల రవాలు...

కొద్దిదూరం వరకు మిత్రుడితోవచ్చి, వెనక్కి మళ్ళిపోతూ, వీడ్కోలుచెప్పే మిత్రుడిలా రైలు కూతకూసి వెళ్ళిపోయింది...

"తూరుపు సింధూరపు వన్నెలలో ఉదయరాగం ..." అన్నాడు మూర్తి చుట్టూచూస్తూ —



"ఇక్కడ్నుంచి దాదాపు ఓ మైలు నడవవలసి వుంటుంది. .." అన్నాడు ప్రసాద్.

"నేను ముందే చెప్పానుగా.... .... కనీసం బస్సు సౌకర్యం కూడాలేని ఈ వూళ్ళో వుండడం కష్టమని...." అన్నాడు వివేకానంద.

అతనికి మొదటినుండి ఈ వూరికి రావడం ఇష్టంలేదు. ఏ అజంతాకో, ఎల్లోరాకో అయితే ఉత్సాహంగా వుండేది.... వెళ్ళబోయేది పేరుపొందిన విహార స్థలంకాదు. పుణ్యక్షేత్రం కాదు. చిన్నపల్లె.



మిత్రులు మరీ బలవంతపెట్టే కాదనలేక బయలుదేరాడు.

తిలక్ ఏమీ మాట్లాడలేదు.

మెల్లగా నడక ప్రారంభించారు నలుగురు.

మంచులో నడవడం 'కొత్తగా' వుంది నలుగురికి. .. మిగిలిన ముగ్గురూ వేగంగా అడుగులు వేస్తున్నారు ... ఒక్క మూర్తి తప్ప!

మూర్తికి కుడిచేతిలో బట్టల సూట్‌కేస్.... ఎడం చేతిలో ఎయిర్‌బ్యాగ్... ఆ ఎయిర్‌బ్యాగ్ నిండా పుస్తకాలు. . ఎక్కడికి వెళ్ళినా తనతో పుస్తకాలు తీసుకెళ్తాడు.... పుస్తకాలు చదవడము అతని హాబీ.... .... పుస్తకాల్ని ఎవర్ని ముట్టుకోనివ్వడు....!

ఓ పుస్తకం చదివిన వెంటనే మిత్రుల్ని పట్టుకొని, బలవంతాన్న అందులోని (పుస్తకం లోని) వాక్యాలు చదివి విన్పించి మరీ ఆనందిస్తాడు.

తిలక్ అమృతం కురిసిన రాత్రి. కృష్ణశాస్త్రి కృష్ణపక్షం, బాపిరాజు శశికళ, నండూరి యెంకి పాటలు.... తరుచు చదువుతుంటాడు.

మంచి సాహితీ అభిమాని.

"ఇలా ఈ మట్టిరోడ్లమ్మట మట్టికొట్టుకుంటూ ఎంత దూరం నడవాలిరా?" విసుగ్గా అడిగాడు వివేకానంద.

"హడావిడి ప్రపంచంలోంచి నిశ్శబ్ద ప్రపంచంలోకి నడిచే దూరం... "

"పొద్దునే మొదలుపెట్టావా 'కొరడా దెబ్బలు'?" కోపంగా అన్నాడు వివేకానంద. మూర్తి మాటలు అతనికి నచ్చవు.

".... అదిగో.... .... అటు చూడండి...." మాటని మార్చేసి అటువైపు చూపెట్టాడు ప్రసాద్.

దూరంగా మంచుతెరల చాటునుండి మెల్లగా సాగిపోతోంది ఒంటెద్దుబండి.

నిముషంపాటు అలా చూస్తుండిపోయారు మిత్రులంతా ఆ దృశ్యం—

"ఎంత ప్రశాంతంగా సాగిపోతోంది" అన్నాడు మూర్తి. నిముషం తరువాత—

"సరేగాని ప్రసాద్.. .... ఇంతకీ ఈ వూళ్ళో చూడదగ్గవి ఏమైనా వున్నాయా?" వివేకానంద ప్రశ్నించాడు.

"వున్నారు."

"వున్నారా?"

"వూఁ"

"ఎవరు?"

"మనుష్యులు"

ప్రసాద్ మాటలకి మెల్లగా నవ్వి—

"పెద్ద జోక్ వేశావ్.... నేనడిగింది 'మానవ పదార్థాల్ని' గురించికాదు.... ప్రకృతి అందాల గురించి...."

"వున్నాయి...."

"ఏమిటి?"

"నిండుగా పరవళ్ళుతొక్కే గోదావరి...."

"ఇంకా...."

"నిశ్శబ్దంగావుండే కొండమీది కోవెల ..."

"ఇంకా...."

"పచ్చని కొబ్బరితోటలు, వెన్నెట్లో అందంగా మెరిసే రెల్లుచేలు...." అని ఆగి—

"ఎలాగు చూడబోతున్నావుగా కంగారెందుకు?" అన్నాడు ప్రసాద్.

వివేకానంద కాస్త కోపంగా—

"అసలీవూరు రావడాన్కి కారణం వీడు...." అన్నాడు తిలక్ కేసి వేలు చూపెడ్తూ—

తిలక్ మెల్లగా నవ్వి వూరుకున్నాడు.

తనకి నమ్మకం లేదు. కానీ ప్రసాద్ మరీ బలవంతపెడ్తే కదిలాడు. అంతే.

మనిషి యంత్రంగా మారి, ప్రతీది డబ్బు కోణంలోంచి చూస్తూ, ఒక రకమైన 'రొటీన్ జీవితాన్ని' గడుపుతున్న ఈ రోజుల్లో—

ప్రేమా, ఆప్యాయత, అనురాగం వున్నాయా ఎక్కడైనా?

"మనుష్యులలో ఇంకా ప్రేమవుంది...." అన్నాడు ప్రసాద్ ఆ రోజు.

"లేదు." అన్నాడతను.

"నీ జీవితంలో ప్రపంచంలో ఒకవైపునే చూశావు.... దీన్ని మించిన మరో అందమైన ప్రపంచముంది...." అన్నాడు ప్రసాద్.

తనేమి మాట్లాడలేదు.

తనతోవస్తే 'మరో ప్రపంచాన్ని' చూపెడ్తానన్నాడు ప్రసాద్.

తను కదిలాడు.

తన చిన్న జీవితానుభవాలు చెప్పిన చేదునిజం.... .... ఈ ప్రపంచంలో మనుష్యులు లేరు.

అంతా మృగాలే!

తనకి లక్షల ఆస్తివుంది. చిన్నప్పటినుండి దరిద్రమంటే ఎరుగడు.... తన తండ్రి పెద్ద బిజినెస్ మాగ్నెట్.... క్షణం తీరిక వుండదు ఆయనకి—

తల్లి....!

తన అందం చెడిపోతుందని, కన్నకొడుక్కి పోతపాలు పోయించిన 'మహాతల్లి' ఆమె—

తనకి తల్లిప్రేమ తెలీదు.... తండ్రిప్రేమ తెలీదు.... 'ఆయా' ప్రేమ తెలుసు.... ఆ ప్రేమ ఇచ్చేజీతం స్థాయిని మించేది కాదు.

లక్షలు ఆర్జించడంలో తండ్రి—

మహిళామండలి గొడవలలో తల్లి, తనగురించి పట్టించుకోలేదు.

తను పుట్టాడు— పెరిగాడు— అంతే!

ఏ మాత్రం మనుష్యుల అభిమానానికి నోచుకోలేదు. కాలేజీలో చాలా మంది మిత్రులుండేవారు. వారంతా తనచుట్టూ ఎందుకుచేరేరో తనకి తెలుసు.

తనని చూసికాదు వాళ్ళంతా తనకి మిత్రులయ్యింది ... తను ఓ పెద్ద బిజినెస్మ్యాన్ కొడుకు ... ఏ క్షణంలో ఏ అవసరం వస్తుందోనని దగ్గరకి చేరారు.

తిలక్ అభిప్రాయాలకి, అనుభవాలకి తోడు— సమాజమనే 'పత్రికలో' కన్పించే వార్తలొకటి— హత్యలు, దోపిడీలు.

దానవత్వం కరాళనృత్యం చేస్తోంది అడుగడుగునా—

....

తిలక్‌లో నాటుకుపోయిన "అభిప్రాయం" మరింత బలపడింది. అతని దృష్టిలో ఈ ప్రపంచంలో మనుష్యులు లేరు... అంతా నరరూపరాక్షసులు.

....

ప్రసాద్, వివేకానంద, మూర్తి ఎమ్.ఏ. లో తన క్లాస్‌మేట్స్. ఒకరోజు ఏదో సందర్భంలో తన అనుభవం చెప్పిన చేదు అభిప్రాయం చెప్తే—

"నో!.... నేనొప్పుకోను ..." ఈ ప్రపంచంలో యింకా ప్రేమా, అభిమానం.... మంచీ, నీతీ వున్నాయి...." అన్నాడు ప్రసాద్.

"నాకు నమ్మకంలేదు."

"నాకుంది నమ్మకం.... ఈ ప్రపంచం మొత్తం నాశనమై పోతున్న క్షణంలో కూడా ఇన్ని కోట్ల మందిలో కనీసం ఒక్కరైనా కనీసం ఒక క్షణమైనా నశించిపోతున్న 'మానవత' కోసం విలపిస్తారు...."

"ఈరొటీన్ ప్రపంచంలో అది అసాధ్యం...."

"డియర్ ఫ్రెండ్. ... నీ జీవితంలో ప్రపంచాన్ని ఒకే వైపునుండి చూశావ్.... ఈ హడావిడి.... ఈ గందరగోళం.... ఇదేకాదు ప్రపంచం.... దీన్ని మించినది.... ప్రశాంతంగా నిశ్శబ్దంగా వుండి, ప్రేమాప్యాయతలతో విలసిల్లే మరో ప్రపంచం వుంది...."

... ...

మెల్లగా నవ్వుకున్నాడు తిలక్.

ఇంకా,

ఈ బిజినెస్ వరల్డ్‌లో, ఈ మెటీరియలిస్టిక్ ప్రపంచంలో ప్రేమా? ఆప్యాయతా?

మంచీ? నీతా?

* * * * *

వూళ్ళోకి ప్రవేశించారు నలుగురు.

దూరంగా.... కొండమీద కోవెల స్వాగతం చెప్తున్నట్టుంది.

ఏదో పెళ్ళి వూరేగింపు సాగిపోతోంది. మంగళవాద్యాలు విన్పిస్తున్నాయి.

పెళ్ళికొడుకుని, పెళ్ళికూతురిని పల్లకిలో వూరేగిస్తున్నారు.

నునుసిగ్గు దొంతరలతో కొత్తపెళ్ళి కూతురి మోము.

పల్లకిముందు నన్నాయి మేళం. వెనుక కొందరు నడుస్తున్నారు.

తెలుగువారి సంస్కృతికి ప్రతిబింబమయిన పల్లకిని చూసేసరికి మూర్తి గుండెలలో ఏదో ఆనందానుభూతి..

శరీరం పులకరించిపోయింది. ..

చిన్నప్పుడెప్పుడో—

మామయ్య పెళ్ళికి పల్లకి చూసినట్టు గుర్తు.

మళ్ళీ ఇన్నాళ్ళకి—

"ప్రణయ పల్లకి పల్లకి—
ప్రణవశర వసంత వల్లిక పల్లకి—
శక్రచాప వక్రరేఖ పల్లకి—
మధుస్వప్న శాఖ పల్లకి—

ఆ వీధి మలుపు తిరిగేవరకు పల్లకినే చూస్తూ నడక కొనసాగించారు—

ఆ వూరి ప్రెసిడెంట్ ప్రసాదు మామయ్య. ప్రసాద్ వాళ్ళనిచూసి—

"రండిరా! రండి... ముందుగా వుత్తరమ్ముక్క రాస్తే, స్టేషన్‌కి బండి పంపించేవాణ్ణిగా...." అంటూ సాదరంగా ఆహ్వానించాడు ప్రసాద్ మామయ్య రఘురామయ్య.

"అనుకోకుండా బయలుదేరామ్ మామయ్యా ..." అన్నాడు ప్రసాద్.

" ...అమ్మ, నాన్న, చెల్లాయి క్షేమంగా వున్నారా ?"

"క్షేమమే మామయ్యా...." అని ఆగి—

"వీళ్ళంతా నా మిత్రులు ... తిలక్, మూర్తి, వివేకానంద...!" అంటూ పరిచయం చేశాడు మిత్రుల్ని.

"నమస్కారమండి...." అన్నారు వాళ్ళు.

"నమస్కారం.... ఇక్కడ మీకు కావలసినన్ని రోజులు వుండొచ్చు.... మీయిల్లే అనుకోండి ..." అని—

"ఉమా... కాస్త నీళ్ళు తీసుకురా...." అంటూ గట్టిగా కేకవేశాడు అరుగు మీదనుండి. ఆయన దంతధావన కానిస్తున్నాడు.

మొదట అందంగా గజ్జెల శబ్దం విన్పించి, తరువాత సింహద్వారం నుండి ఓరకంట బైటకిచూచి, విచిత్రంగా కళ్ళని తిప్పుతూ, చూపులతోనే ప్రసాద్‌ని పలకరించి, తండ్రికి నీళ్ళు అందించింది ఉమ.

"మామయ్యకి రెండు మైనస్సులు, రెండు ప్లస్‌లు" అని ప్రసాద్ ఏవో మాటల సందర్భంలో చెప్పిన విషయం గుర్తొచ్చింది మూర్తికి.

"....యిక్కడే నిలబడిపోయారేమిట్రా.... లోపలికి వెళ్ళండి.... ఉమా.... ఆ సావిడ పక్కనవున్న గదిదగ్గరకు తీసుకెళ్ళు...." అన్నాడు రఘురామయ్య.

పాతకాలంనాటి యిల్లు. పెద్దపెద్ద అరుగులు. ఎత్తైన సింహద్వారం. సింహద్వారానికి ఎదురుగా పెద్ద గ్రూప్‌ఫోటో. అటు గోడకి ఏవో ఫోటోలు క్యాలెండర్లు. ఇటువైపు గోడకి గంటల గడియారం. లోపలికి అడుగు పెడ్తుంటే గొప్ప 'థ్రిల్' గా వుంది మూర్తికి. తెలియని వారింటికి వచ్చినట్టు లేదు. యిదివరకు తాతయ్య బ్రతికున్నప్పుడు, తాతయ్యగారింటికి వచ్చినట్టు వుంది.

వాతావరణం ప్రశాంతంగా వుంది.

ఎక్కడినుండో లీలగా మురళీగానం విన్పిస్తోంది.

"....ఎమిటే మనింట్లో ఎవరైనా సంగీత సాధన చేస్తున్నారా....?" అని ప్రశ్నించాడు ప్రసాద్ ఉమని.

ఆమె నవ్వబోయి, బలవంతాన్న పెదవిచివర్న నవ్వుని బిగపట్టి—

" ...మనింట్లో అంత 'ఇది' కూడానా....?.... వైద్యనాధన్‌గారు వాయిస్తు న్నారు...." అంది.

"వైద్యనాధనా ?.... ఎవరాయన ?"

"....ఈ మధ్యే తమిళదేశం నుండి వచ్చారు.... రోజూ సుప్రభాతం దగ్గరనుండి రాత్రి జోలపాట వరకూ వాయిస్తారు...." అని అక్కడ్నుంచి కదిలింది.

రెండు నిముషాల తరువాత—

"ఒరేయ్ మొద్దులు... నిద్ర లేవండ్రా... ప్రసాద్ వాళ్ళు వచ్చారు..." అని విన్పించాయి ఉమ మాటలు.

"...ఏరా ప్రసాద్ బాగున్నావా....?.... వుత్తరం కూడా రాయకుండా వచ్చావ్... అమ్మ, నాన్న, అంతా కులాసాయేనా..." అంటూ పలకరించింది సీతమ్మ. అంతా క్షేమమే అన్నట్టు తలూపి మిత్రుల్ని పరిచయం చేశాడు.

"....చూడండి నాయినా.... మీరిక్కడేమీ మొహమాట పడక్కర్లేదు.... ఏది కావాలన్నా అడగండి.... ఓసేయ్ ఉమా ఆ వెధవలు యిద్దరూ నిద్ర లేచారా?... ఏదో కొత్త వాళ్ళింటికి వచ్చామనుకోకండి... ఏమండీ... ఆ పాలేరు వస్తే తోటలోంచి ఓ అరటిగెల తెప్పించండి.... ఏమనుకోకండి నాయినా.... మిమ్మల్ని పేర్లతోనే పిలుస్తాను..... ఆ రాజుగారికి చెప్పి ఇంకో శేరు పాలు తెప్పించండి... వస్తాను నాయినా... అవతల పనుంది..." అంటూ అక్కడ్నుంచి కదిలింది సీతమ్మ.

ఆవిడ మాటలకి, హడావిడికి మెల్లగా నవ్వుకున్నారు అంతా.

"...ఒరేయ్ ప్రసాద్... ఎలా వున్నావురా..." అంటూ వచ్చాడు శివం. రఘురామయ్య పెద్దకొడుకు.

"...బానే వున్నా... రామం గాడేడ్రా ?..." అని ప్రశ్నించాడు ప్రసాద్. రామం, శివం తమ్ముడు.

"నీకు తెలీదు కానీ... ఈ మధ్యవాడు సుద్ద బద్దకం గాడయిపోయాడు... ఆమధ్య తిరునాళ్ళలో రంగులరాట్నం ఎక్కి దానిమీద నిద్రపోయాడు......" అన్నాడు.

వాడిమాటలకి నవ్వాపుకోలేక పోయారు.

ఒకళ్ళ తరువాత ఒకళ్ళొచ్చి పలకరించడం...

విచిత్రంగా అన్పిస్తోంది తిలక్ కి !

స్నానాలు గట్రా కానిచ్చేసరికి, భోజనం సిద్ధంగా వుంది.

భోజనాలు కానిచ్చేసరికి ప్రయాణ బడలిక వలన ఆవలింతలు మొద లయ్యాయి...!

మెల్లగా గదికొచ్చి నిద్ర పోయారంతా.

భోజనాల లోపల మూర్తి, తిలక్, వివేకానందులకు తెలిసిన విషయా లేమిటంటే —


రఘురామయ్య ప్రసాద్‌కి స్వయాన మేనమామ. ఆయన భార్య సీతమ్మ. వాళ్ళకి ఇద్దరు ఆడపిల్లలు. ఇద్దరు మగపిల్లలు. పెద్దమ్మాయికి పెళ్ళిచేసి అత్తారింటికి పంపించారు. రెండో అమ్మాయి ఉమ. టెన్త్ వరకు చదివి మానేసింది. ఆడ సంతానం తరువాత మగ సంతానం. పెద్దవాడు శివం ప్రస్తుతం పదోక్లాసు చదువుతున్నాడు. రెండోవాడు రామం ఏడోక్లాసు.

మూర్తి ఆనందానికి అవధులు లేవు.

చాలా రోజుల తరువాత "నిండుగా" వున్న ఇంటికి వచ్చినట్టుంది.

వివేకానందకి—

ఉమని చూసిన క్షణంనుండి ఏదో మధురమైన అనుభూతి.... ఒక మంచి



స్నేహితురాలిని చూసినట్టుంది.

తిలక్ కి

ఏదో విచిత్రానుభూతి....

అంతా కొత్తగావున్నా... ఏదో చనువు!

*　　*　　*　　*　　*

తిలక్ లేచేసరికి, గుమ్మానికి ఎదురుగావున్న సావిట్లోని గోడగడియారం ఐదున్నర చూపెడ్తోంది...

గది నిశ్శబ్దంగా వుంది ఎవరూలేరు.

వైద్యనాథన్‌గారి మురళీనాదం విన్పిస్తోంది.

మెల్లగా బావివున్న వైపు అడుగులు వేశాడు.

మొహం కడుక్కొని, తల దువ్వుకొని—

అరుగుమీదికి వచ్చాడు.

"....రా!.... రా!.... నీ గురించే ఎదురు చుస్తున్నాం.... అలా తోటకేసి వెళ్ళొద్దామా? .. ఇందాకా నిద్రలో వున్నావని లేపలేదు..." అన్నాడు ప్రసాద్.

మూర్తి ఏదో పుస్తకం చదువుతున్నాడు. వివేకానంద కూడా అక్కడే వున్నాడు.

"కదలరా .. ఇప్పటికే ఆలస్యమయ్యింది..." అన్నాడు ప్రసాద్, మూర్తి కేసి చుస్తూ—

"... ఇదిగో చివరకొచ్చేసింది... చివరి పేజీ చివరి పేరా..." అన్నాడు మూర్తి.

".....అబ్బా.... ఇంత పుస్తకాల పురుగుకింద తయారయ్యా వేమిట్రా నాయినా.... బొత్తిగా యిరవైనాలుగు గంటలూ పుస్తకాలే...." అన్నాడు విసుగ్గా వివేకానంద.

"...నీకేం తెలుసురా... పుస్తకాలు చదవడంలో గొప్ప అనుభూతివుంది... ఎక్కడో ఓ మహానుభావుడంటాడు..... పుస్తకాన్ని తింటూ ఆ పురుగు అనుకుంటుంది "ఆహా! ఇంత రుచికరమైన పదార్థాన్ని తినలేని మానవజన్మ— ఏం జన్మని?"

వివేకానంద ఏమీ మాట్లాడలేదు.

మరో పావుగంట తరువాతా మిత్రులంతా తోటకేసి బయలుదేరారు. మధ్య దారిలో చాలామంది పలకరించారు ప్రసాద్‌ని.

"వూరి కిటువైవు తోటలు, కోవెల అటువైపు గోదావరి" అని చెప్పాడు ప్రసాద్.

తోట దగ్గరకి చేరారు.

పచ్చని కొబ్బరి తోటది.

పట్నాలలో కనిపించని పచ్చదనం కనిపించే సరికి 'కళ్ళ'కి పునర్జన్మ పొందిన అనుభూతి.

పాలేరు ప్రసాద్‌ని గుర్తుపట్టి,.. 'రండి బాబు.. రండి' అన్నాడు.

తోట మధ్యలో నులకమంచం వేసివుంది.

దానిమీద కూర్చున్నారు చుట్టూచూస్తూ—

లేగదూడ 'అంబా' అని అరుస్తోంది దూరంగా—

చెట్లకి పిచ్చుకగూళ్ళు వేలాడుతున్నాయి—

చిరుగాలి కెరటాల తాకిడికి పచ్చని ఆకులు మెల్లగా కదుల్తున్నాయి.

సింధూరపు కాంతితో ఆకాశం...

ఆకాశంలో తరలిపోయే పక్షుల గుంపులు...

ఏవో సందేశాలు మోసుకుపోతూ మేఘమాలికలు...

ప్రకృతి సంధ్యారాగం ఆలపిస్తోంది...

లేతగాలి స్పర్శకి శరీరాలు పులకించి పోతున్నాయి.....

మరో పది నిముషాల తరువాత పాలేరు కొబ్బరి బొండాలు తీసుకు వచ్చాడు—

బొండాలని కొడవలిలాంటి దాన్తో కోస్తూ—

కోసిన బోండాలని "మిత్రులకి" అందిస్తూ—

దూరంగా ఆకాశంలోకి తృప్తిగా చూస్తూ—

"...సూడండి బాబుగోరు మీ పట్నంలో ఇటాంటి అందమైన సాయింకాలం సూశారా...?" అన్నాడు స్వేచ్ఛా గాలులు పీలుస్తూ—

వాడి ప్రశ్నకి ఏమని జవాబు చెప్పాలో అర్థం కాలేదు. నిజమే! పట్నాల్లో ఇంత స్వచ్ఛమైన అందంకూడానా? ఓ అరగంట అక్కడవుండి-

తిరుగు ముఖం పట్టారు నీలి చీకట్లు ప్రపంచాన్ని అలుముకుంటుంటే అప్పుడే మెరుస్తున్న చిన్ని తారల్ని చుస్తూ—

ఆ రోజురాత్రి—

చాలా సేపటి వరకు నిద్ర పట్టలేదు తిలక్‌కి!

కిటికీలోంచి వెన్నెలని చుస్తూ—

ఆకాశంలో నక్షత్రాల్ని లెక్కబెడుతూ—

ఆ రోజు ప్రొద్దుటినుండి జరిగినది నెమరు వేసుకున్నాడు.... రైలు దిగడం... మంచులో నడక... మెల్లగా సాగిపోతున్న ఒంటెద్దుబండి... నన్నాయి మేళం... పల్లకీ... పెద్దపెద్ద అరుగులు.... సీతమ్మగారి హడావిడి.... శివం కొంటె మాటలు... వైద్యనాధన్ మురళీనాదం... సాయంత్రం... పచ్చని తోట... తోటలో మిత్రులతో... పాలేరు వేసిన ప్రశ్న... సంధ్యానమయం... తిరిగి వస్తూన్నప్పుడు రెల్లుచేలదగ్గర మూర్తి పాడినపాట... "ఆకులో ఆకునై... పువ్వులో పువ్వునై..."

చాలా సేపటికి పట్టింది అతనికి నిద్ర...!

*　　*　　*　　*　　*

మర్నాడు—

"డియర్ ఫ్రెండ్స్... ఇవాళ మనం పక్కవూర్లో "ఒకళ్ళింటికి" వెళ్ళబోతున్నాం... "వాళ్ళింటికి" అని ప్రత్యేకంగా ఎందుకు చెప్తున్నానో మీకు తరువాత అర్థం అవుతుంది..." అన్నాడు ప్రసాద్.

మిత్రులంతా తెమిలేసరికి మరో అరగంట పట్టింది.

శివంకూడా వాళ్ళతోపాటే బయలుదేరాడు బడి ఎగ్గొట్టి—

సాహెబ్ గుర్రపుబండి సిద్ధంగావుంది.

అందరూ బయలు దేరారు.

ఈ వూరునుండి పక్క వూరుకి దాదాపు మూడుమైళ్ళ దూరం.

గుర్రపుబండిలో ప్రయాణం పట్నాలలో పుట్టిపెరిగిన వివేకానంద, తిలక్ లకి కొత్తగా వుంది.

మూర్తికి తాతయ్య ఒళ్ళో కూర్చొని గుర్రపు బండిలో పక్కవూరు "జాతర" కెళ్ళిన సంఘటన జ్ఞాపకానికొచ్చింది.

ప్రసాద్‌కి మామూలే... శివం బండిలో వాగుతోనే వున్నాడు వసపిట్టలా..

వూరి పొలిమేరలలో చిన్న దేవాలయముంది.

"ఏమి సేతురాలింగా... నేనేమి సేతురాలింగా..." దేవాలయం మైక్రోఫోనులోంచి విన్పిస్తోంది.

చిన్న వూరది.

చెరువుగట్టు మీంచి వెళ్తోంది గుర్రపుబండి... చెరువులో నీళ్ళు సూర్య కాంతికి తళతళ మెరుస్తున్నాయి... కలువలు... తామరాకుల మీది నీటిబొట్లు ముత్యాల్లా మెరుస్తున్నాయి...

చెరువు గట్టునవున్న రావిచెట్టుక్రింద ఎవరో నలుగురు కూర్చొని మాట్లాడు కుంటున్నారు...

"నేడే చూడండి... పద్మశ్రీ టూరింగ్ టాకీసులో... గొప్ప పౌరాణిక చిత్రం...'రామాయణం'... తప్పక చూడండి..." సినిమాబండి వెళ్తోంది...

మరో ఐదు నిముషాల తరువాత ఓ యింటిముందు ఆగింది బండి. దిగారు అంతా.

"ఎవరూ?" అంటూ కళ్ళజోడు సవరించుకొని చూశాడొకాయన, అరుగు మీద పడక కుర్చీలో కూర్చొని వున్నాడాయన. విశాలమైన నుదురు. నుదుటన విబూది రేఖలు. విబూది రేఖలమధ్యలో కుంకుమ. పచ్చని శరీరం... వయస్సు అరవై వుండొచ్చు.

"నేను మేష్టారు... ప్రసాద్‌ని!" అని సమాధానమిచ్చాడు ప్రసాద్.

"ప్రసాదా?" గుర్తు తెచ్చుకోవడాన్కి ప్రయత్నిస్తున్నా డాయన.

"అదే మేష్టారు... పక్కవూరు సాంబన్నగారి మనవడ్ని..." అన్నాడు ప్రసాద్.

ఆయన క్షణం మౌనంగా వుండి, తరువాత గుర్తు తెచ్చుకున్నట్టు —

"...ఓహో... నువ్వా... రా... రా... వయస్సు పెరిగిపోయి... కళ్ళు సరిగ్గా ఆనట్లేదు... ఏమిటి ఈ మధ్య కన్పించడం లేదు... ఇటు వైపు రావడంలేదా..." అని ప్రశ్నించాడు.

"లేదు మేష్టారూ... ఎప్పుడొచ్చినా హడావిడిగా వచ్చి వెళ్ళడమే అవు తోంది..." అన్నాడు ప్రసాద్.

"...ఒసేయ్... అన్నపూర్ణా... రా!... రా!... పిల్లలొచ్చారు..." అని కేకవేశా డాయన,

లోపల్నుండి ఓ పండు ముత్తయిదువ వచ్చింది.

ప్రసాద్ వాళ్ళని చూసి... తెగ సంబర పడిపోయింది.

కాలం గడిచినట్టే తెలీకుండా... సాయింత్రం అయిపోయింది. భోజనాలకి వెళ్ళిపోతామన్నా, బలవంతాన్న ఆపుచేశారు. వయస్సులో ఎంతో భేద మున్నా, తమ నవ్వులో నవ్వుతూ, తమతో కేరింతలు కొడుతూ, ఉత్సాహంగా తమతో కలిసిపోయి మిత్రుళ్ళా ప్రవర్తించిన ఆ దంపతుల్ని చూసి ఆశ్చర్య పోయారు ముగ్గురూ.


చిన్నప్పుడు ఆయన ప్రసాద్‌కి చదువు చెప్పారు... ప్రస్తుతం రిటైర్డ్ అయి ఖాళీగా వున్నారు...!

బయలుదేరి వెళ్ళిపోతున్నప్పుడు ప్రసాద్‌తో ఆయన -

"ఏమిటోరా ప్రసాద్...ఈ మధ్య పిల్లల దగ్గరనుండి వుత్తరాలు రావడం లేదు... రోజూ పోస్టాఫీసుకి వెళ్ళడం... నిరాశగా వెనక్కి తిరిగిరావడం...

"ఎందుకు మేష్టారూ మీరు రావడం... నేనే వస్తే తెచ్చి యిస్తాగా" అంటాడనుకో పోస్ట్‌మేష్టారు... కానీ... ఏమిటోరా... వయస్సు సహకరించక పోయినా... మనస్సు వూరట ఆగదు... ఆతృత తగ్గదు... ఏ హృదయాన్ని చూసినా... పిల్లల దగ్గరనుండి... పక్షుల్లా రెక్కలు కట్టుకొని వుత్తరాలు వస్తాయేమోనని ఆశ... రిటైర్డ్ అయ్యాకా... ఇలాగే గడుపుతున్నాననుకో... ఒక్క ఉత్తరం వస్తే చాలు... అది పదిసార్లు తక్కువ కాకుండా చదువుతాము. వుత్తరాన్ని చూసేసరికి అన్నపూర్ణ కూడా ఎంత సంతోషిస్తుందనుకున్నావ్..." అంటూ చెప్పుకుపోయా రాయన కళ్ళలో తిరిగిన కన్నీళ్ళని బుజమ్మీది కండువాతో తుడుచుకుంటూ -

నా గురించి



పూరి పేరు: ఆకెళ్ల వెంకట వ్యాఘ్ర సాంబశివప్రసాద

పుట్టిన తేది: 7-9-1965

చదువు: ఈ ఏడాదే బి. కాం ప్యాసయ్యాను

అమ్మా, నాన్న: సుభద్ర, లక్ష్మీ నారాయణగార్లు.

చెల్లెలు: రాజ్యలక్ష్మి.

అన్నయ్య 'మూర్తి రాజా' ప్రోత్సాహంతో దాదాపు రెండేళ్లనుండి రచనలు చేస్తున్నాను. ఇప్పటివరకు దాదాపు ఇరవై రచనలు ప్రచురింపబడ్డాయి. కొన్ని రచనలు 'ఆకెళ్ల శివప్రసాద్' పేరుతో వ్రాశాను ఆంధ్రభూమి మాసపత్రిక, యోజన పత్రికలలో కథలకి బహుమతులు వచ్చాయి. సాధన సాహితి సమితి' వారు నిర్వహించిన కథల పోటీలో 'ఆచార్య తిరుమల'గారి అవార్డు వచ్చింది. నా మొదటి కథ 1980 లో ప్రచురింపబడింది, 1984 నుండి తరుచు రచనలు చేస్తున్నాను.

'ఒక ఝరిలాంటి అనుభూతి 'నది'ని రాయమని ప్రేరేపిస్తే 'నది నవలగా మార్చడాన్కి కష్టపడవలసి వచ్చింది. నవల్లో 'మూర్తి' పాత్రకి తగట్టు ప్రముఖుల కొటేషన్లు వుపయోగించడం జరిగింది వారికి కృతజ్ఞతలు.

నవల రాయడం ఇదే మొదటిసారి. మొదటి నవలకే బహుమతి యిచ్చినందుకు 'భారతి' వారికి కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాను. మొదటి నవల కనుక ఏవైనా తప్పులుంటే విజ్ఞులైన పాఠకులు, విమర్శకులు మన్నించండి.

—ఎ. వి. వి. యస్. యస్. ప్రసాద్.

అన్నపూర్ణమ్మగారి స్థితీ అంతే... చాలా కాలం తరువాత వచ్చిన ప్రసాద్‌ని వాళ్ళని వదలబుద్ధి కావడంలేదు.

బండి కదిలింది.

బండి వీధిమలుపు తిరిగే వరకు చుస్తూనే వున్నారు ఆ దంపతులు.

వూరి పొలిమేర్లు దాటింది బండి.

అప్పటివరకు మౌనంగావున్న తిలక్ ప్రశ్నించాడు.

"ఎంత మందిరా... మేష్టారుకి పిల్లలు...?" అని -

ప్రసాద్ మెల్లగా నవ్వి -

"నీకో గొప్ప నిజం చెప్పనా?" అన్నాడు.

ఏమిటన్నట్టు చూశారు మిగిలిన వాళ్ళుకూడా.

గుర్రం చకచకా పరుగులు తీస్తోంది.

"...నిజానికి ఆయనకి పిల్లలు లేరు..."

"అంటే?" అర్థం కానట్టు అడిగాడు వివేకానంద.

"ఆయన దగ్గర చదువుకున్నవాళ్ళే ఆయన పిల్లలు... వాళ్ళదగ్గరనుండే తరచు వుత్తరాలు వస్తుంటాయి..." అని క్షణం ఆగి -

"మీకు గుర్తుందా...? నేను ప్రతి నెల మొదటివారం, మూడోవారం తప్పనిసరిగా వుత్తరం రాయడం... నేను వ్రాసేది మేష్టారుకే..." అన్నాడు ప్రసాద్.

తిలక్ ముఖంలో స్పష్టంగా మార్పు కన్పించింది.

చిన్న షాకులాంటిది తగిలిందతనికి.

"తమ స్వంత బిడ్డల్నే సరిగ్గాచూడని ఈ కాలంలో... వేరేవాళ్ళ పిల్లల్ని తమ స్వంత బిడ్డల్లా చూసుకొనే వారున్నారా?" "వున్నారు!" అనుకున్నాడు నిశ్చయంగా తిలక్.

అందరి హృదయాలలో ఎవరో పరిచయంలేని వాళ్ళింటికి వెళ్ళినట్టులేదు.

ఏదో 'పుణ్య క్షేత్రాన్ని' దర్శించిన అనుభూతి.

* * * * *

కొండమీద కోవెల ప్రశాంతంగా వుంది.

నిశ్శబ్దం గీసిన చిత్రంలావుంది వాతావరణం!

అలయ ప్రాంగణంలో గడ్డిపూలు భగవంతుని పిలుపుకోసం ఆశగా ఎదురు చూస్తున్నాయి...!

ధ్వజస్తంభపు గంటలు గాలి అలల తాకిడికి మెల్లగా మ్రోగు తున్నాయి...

కొండమీంచి చూస్తే వూరంతా కనిపిస్తోంది.

కోవెల వున్న కొండ చుట్టుపక్కల పచ్చదనంతో కొబ్బరిచెట్లు...

పూల తోటలు... పంట పొలాలు...

దేముడికోసం తపస్సు చేస్తున్న ఋషుల్లా కదలకుండా వృక్షాలు...

ఏటుచూసినా హరితవర్ణ సౌందర్యము...

ఆటుపక్క...

పరవళ్ళు తొక్కుతూ గోదావరి గంభీరంగా హుందాగా...!

దూరంగా... సంధ్యకెంపులో మెరుస్తూ సూర్యుడు.

గూళ్ళకి చేరుకుంటున్న పక్షులు...

"ప్రకృతి గీసిన సౌందర్య చిత్రంలా వుంది పల్లెంతా -!

అప్పుడే ఎవరో భక్తులు వచ్చినట్టున్నారు. గంటల శబ్దం మెల్లగా విన్పిస్తోంది.

"అద్భుతం... ప్రపంచంలోని అందాలన్నీ కళ్ళముందు సాక్షాత్కరించి నట్టుంది..." అన్నాడు మూర్తి. అతని కళ్ళలో నీళ్ళు ముత్యాల్లా.

"ఈ ప్రపంచంలో ఇంత నిశ్శబ్దం వుందని... ఆ నిశ్శబ్దంలో ఇంత అందమూ, ఆనందము వున్నాయని ఇన్నాళ్ళకి తెలిసింది..." అన్నాడు వివేకానంద.

తిలక్ ఏమీ మాట్లాడలేదు.

దూరంగా ఆకాశంలో ఏదో అన్వేషిస్తూ సాగిపోయే పక్షుల్లా వున్నాయి అతని చూపులు.

"...నిజానికి నా దృష్టిలో... దేముడు వున్నాడా? లేడా?... అన్నది అప్రస్తుతం...కానీ...గుడికి రావడం మాత్రం ఒక మధురమైన అనుభూతి..." అన్నాడు ప్రసాద్.

ప్రశాంత నిశ్శబ్దం...

గంట తరువాత అక్కడ్నుంచి కదిలారు.

సిరిచీకట్లు అలుము కుంటున్నాయి. కొండదిగుతూ మెల్లగా అనుకున్నాడు తనలో తాను తిలక్ -

"నిశ్శబ్దమా! నీకు నా జోహార్లు"

* * * * *

"మీవూరు నాకు బాగా నచ్చిందండి....అన్నాడు వివేకానంద ఉమతో.

వచ్చినప్పటినుండి ఆమెతో మాట్లాడాలని ఎదురు చూస్తున్నాడు. కాని అవకాశం దొరకలేదు. ఇవాళ పొద్దునే తిలక్, మూర్తి, ప్రసాద్ తోటకేసి వెళ్ళారు.

తనని రమ్మన్నారు కానీ....కాస్త తలనొప్పిగా వుండడంవల్ల వెళ్ళలేదు. ఉమ ఏదో అల్లుతోంది.

వైద్యనాథన్ మురళీగానం విన్పిస్తోంది.

"ఎందుకు?" అని ప్రశ్నించింది ఆమె.

"... ఈ ప్రశాంతత....ఈ నిశ్శబ్దం....యివి పట్నంలో భూతద్దం పెట్టి వెతికినా దొరకవు....ఎప్పుడూ హడావిడే ...పొద్దున్న లేచింది మొదలు.... ... ఉరకలు పరుగులు....క్షణం తీరికవుండదు....ఏదో పని ఎప్పుడూ. జస్ట్‌రొటీన్‌గా సాగిపోతుంది జీవితం...." అన్నాడు వివేకానంద.

ఆమె క్షణం మౌనంగా వుండి —

"... ....ఏమో బాబు....మీకు ఆనందంగా హాయిగా వుండొచ్చు... కానీ మాకు సుద్ద బోరు...."

ఆమె మాటలకి ఆశ్చర్యపోయాడు వివేకానంద.

ఈ హాయి, ఈ ప్రశాంతం, ఈ నిశ్శబ్దం బోరా?

".. ఓ నెల పట్నంలో వుంటే మీరామాట అనరు...."

".. ఓ నెల ఇక్కడ వుంటే మీరూ ఆమాట అనరు........" అందామె మెల్లగా నవ్వుతూ—

"మీకో విషయం చెప్పనా?....నేను పుట్టింది, పెరిగింది పట్నంలోనే... కానీ—ఇక్కడకొచ్చిన ఈ రెండు రోజుల్లో అనుభవించిన 'థ్రిల్' ఎప్పుడూ అనుభవించలేదు....నిజానికి....అది"థ్రిల్" కాదు.....ఏదో చెప్పలేని ఆనందం లాంటిది...."

"మరో రెండు రోజులువుంటే మీకే తెలుస్తుంది...."

"ఈవూరు... ఈపూలతోటలు... పంట పొలాలు.... దూరంగా స్పష్టంగా కన్పించే సూర్యోదయం....సూర్యాస్తమయం.... నిశ్శబ్దాన్ని సంతరించుకున్న కొండమీది కోవెల... అడుగడుగున స్వచ్ఛత....పచ్చదనం...."

"... ఏమ్ స్వచ్ఛతండీ....ఎప్పుడూ అవే చెట్లు....అవే ఆకులు ...అదే సూర్యోదయము....అస్తమయము....ఇక కొండ మీది కోవెలంటారా?....కొండ నెక్కేసరికే వున్న శక్తంతా పోతుంది. నిశ్శబ్దంలో మీరు రాగాలు విన్పించే యేమో కానీ... నిశ్శబ్దాన్ని భరించడం కష్టం...."అందామె.

ఒకే 'స్థితిలో' యిద్దరూ....అనుభూతులు సమాంతరరేఖలు. మళ్ళీ ఆమె అంది—

'అప్పుడప్పుడు ..పట్నంకేసి వెళ్ళినప్పుడు అన్పిస్తుంది.... ఈ సందట్లో నలుగురితో కలిసి పోతూవుండిపోతే బాగుంటుందని అలా కలిసి మనలడంలో ఆనందం వుంది. ...."

"మీ మాటలు వింటుంటే నాకొకటి గుర్తొస్తోంది." అన్నాడు వివేకానంద.

"ఏమిటి?"

"దూరపు కొండలు నునుపు....'

"....కరెక్ట్ .. నేనూ ఆ మాటే అందామనుకున్నా యిందాకా...."అని నవ్వి—

"....కానీ....ఒకటి మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. .'అంది

ఏమిటన్నట్టు చూశాడు వివేకానంద.

"ఈ ప్రపంచంలో ప్రస్తుతం చాలామంది....హడావిడికి. పరుగుకి అల వాటు పడిపోవడం వలన....నిశ్శబ్దానికి చాలా దూరంగా వుండడంవల్ల.... ఒక్క మాటలో చెప్పాలంటే "ఒకరకమైన రొటీన్ జీవితాన్ని' గడుపుతుండ డంవల్ల.... " దొరకని ప్రశాంతతని పొందే ప్రయత్నంలో.... ...కొద్దిపాటి

ప్రశాంతత లభించినా కొండంత సంతోష పడ్తున్నారు...." అందామె. ఆమె మాటలకి మరోసారి ఆశ్చర్య పోయాడు వివేకానంద.

' హ్యూమన్ బి హేవియర్ " గురించి అంత స్పష్టంగా చెప్పినామె. అతని కళ్ళకి ఒక పెద్ద "సోషల్ సైంటిస్టు'లా కన్పించింది.

"....ఇంకా ఈ ప్రపంచంలో మంచి వుందంటారా?" చాలా సీరియస్‌గా అడిగాడు నిముషం తరువాత—

ఆమె వూహించని ప్రశ్న.

రెండు క్షణాలు నిశ్శబ్దం. లోపల్నించి సీతమ్మ కేక వినబడింది.

"చూసే కళ్ళని బట్టీ....?అని—

"....వస్తానండి....అమ్మ పిలుస్తోంది....' అని అక్కడ్నుంచి కదిలింది తన ప్రశ్నకి, ఆమె సమాధానం విని—

తను వేయవలసిన ప్రశ్న 'అది' కాదు అనుకున్నాడు వివేకానంద. తను వేయవలసిన ప్రశ్న—

.. .మంచి వుంది ...కానీ దాన్ని చూసే కళ్ళెన్ని?'

మర్నాడు—

ప్రొద్దునే నిర్ణయించు కున్నారు.

ఈరోజు ఎలాగైనా గోదారి తీరానికి వెళ్ళాలని—

రోజూ గోదారి తీరానికి వెళ్దామని బయలు దేరడం....ఏదో అనుకొని ఆటంకం ఏర్పడి....మానేయడం జరుగుతోంది. సాయంత్రం ఐదు అవుతుందనగా బయలు దేరారు నలుగురు. శివం యింట్లోవుంటే వస్తానని పేచీ పెట్టేవాడే కానీ....వాడు పక్కవూరు సంతకెళ్ళాడు. రామం బడినుండి వచ్చి నిద్రపోయాడు. గోదావరి తీరం చేరేసరికి దాదాపు అరగంట పట్టింది గోదావరి గట్టుకానుకొని పెద్ద మర్రిచెట్టుంది. చెట్టు క్రింద చిన్న గుడిలాంటిది వుంది.

గోదావరి పరవళ్ళు తొక్కుతూ, నిండుగా, గంభీరంగా, హుందాగా వుంది.



మెల్లగా గట్టుని తాకుతున్న అలలు....

దూరంగా. మెల్లగా సాగిపోతున్న తెరచాప పడవ....

లీలగా విన్పిస్తోంది పల్లెవాడి గుండె గొంతులోంచి కదలి, కదలి వస్తున్న పల్లె పదం. .

'లంకలోకి వెళ్దామా?" అడిగాడు ప్రసాద్.

"లంకా!" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు వివేకానంద. అతనికి పూరంతా కొత్తగా వుంది.

.. అదిగో.. ఆ దూరంగా ..గోదారి అవతల కన్పిస్తోంది చూశావా? ఆదే లంక ...'

' అటు ఎలా వెళ్ళడం?"

' పడవమీద . '

"ఇక్కడ పడవలాంటిది లేదుగా... ...." అన్నాడు గోదారి కేసి చూస్తూ వివేకానంద.

' మరో అరగంటికి ...పడవ యిటువైపు వస్తుంది."

" పడవెందుకు వస్తుంది? "

' సాయంత్రం. అరవుతుంటే పడవవాడు ఓసారి గట్టుదాకా వస్తాడు ." అన్నాడు ప్రసాద్.

"ఎందుకొస్తాడు!" వివేకానంద వేసిన ప్రశ్నకి విసుగ్గా చూశాడు మూర్తి.

'.. ఈ చుట్టు పక్కలవున్న వూళ్ళకి ఈ వూరు మధ్యలో వుంది.... గోదాంతీరం కూడ దీనికే వుంది....బళ్ళు దొరకని వాళ్ళు....ముఖ్యంగా కూలీ నాలీ జనం....పడవమీద గోదారిదాటి....లంకలోంచి నడుచుకు వెళ్ళిపోతుంటారు.....' అన్నాడు ప్రసాద్.

పడవకేసే చూస్తున్నారు అంతా—

మరికొద్ది సేపటికి—

తెరచాప పడవ మెల్లగా గట్టుకేసి వస్తోంది...


పల్లెపదం మరీ దగ్గరగా వస్తోంది.

పావుగంట తరువాత—

గట్టుచేరుకుంది పడవ....పడవలో యిద్దరున్నారు....ఒక ముసలతను ... మరో కుర్రాడు.

' దండాలుబాబు.. .లంకలోకి కానీ యెళ్ళాలేంటి?" అని అడిగాడు పడవ తాత.

"అఁ ..అఁ...." అన్నాడు ప్రసాద్.



పడవ ఎక్కారందరూ—

మెల్లగా అలలని తోసుకుంటూ కదిలింది పడవ—

'యాస'లో పల్లెపదం అందుకున్నాడు పడవ తాత.

' గంగమ్మ తల్లికి బెంగల్యా పూదండ
కాళిందికీ తెల్ల కల్వదండ .' అని —

ఆపదం అర్థం: గంగమ్మ తల్లి, కాళింది, గోదారితల్లి, సరస్వతిదేవి, కృష్ణవేణమ్మ, కావేరీ.. అందరు తల్లులారా.... పిల్లల్ని పాపల్ని చల్లగా రక్షించి. క్షేమంగా ఇల్లు చేర్చండి అని.

అలలమీద ఉయ్యాలలా వూగుతోంది పడవ...

పడవ కదలికకి—

పడవ తాత పల్లె పదానికి—

శీత గాలుల స్పర్శకి—

గుండెల్లో ఏదో పులకరింత!

పరవశం! ఆనందం!

" కొండగాలి తిరిగింది....గుండె వూసు లాడింది....
గోదావరి వరదలాగా కోరిక చెలరేగింది...."

మూర్తి పాటని ప్రతీసారీ వినుక్కునే వాళ్ళకి అక్షణంలో ఆ పాట—

మూర్తి గొంతుకూడా బాగుంటుంది అన్పించింది.

మెల్లగా లంక దగ్గర ఆగింది పడవ.

"....ఏమిటీ వాతావరణం ఇలా వుంది....వాన కానీ పడదుగా?' అన్నాడు అనుమానంగా ప్రసాద్ ఆకాశంకేసి చూస్తూ—

ఆకాశం మేఘావృతమై వుంది.

". ..వెధవ... అపశకునపక్షి ....ఏమిటా ఆకూతలు?" అన్నాడు కోపంగా మూర్తి. అతనికీవాతావరణం బాగా నచ్చింది.

అందరూ దిగారు పడవలోంచి—

ప్రసాద్ డబ్బులు యివ్వబోతే, తీసుకోలేదు పడవతాత. 'మరోసారి యిద్దరుగానిలెండి బాబు' అని తన దారిని తాను వెళ్ళిపోయాడు. కుర్రవాడికి పడవ కట్టి రమ్మనిచెప్పి—

మెల్లగా నడక ప్రారంభించారు నలుగురూ—

లంకంతా ఏవో గడ్డిపూలు....పిచ్చి మొక్కలు....

పచ్చిగడ్డిమీద నుండి పిల్లగాలి కెరటాలుగా వీస్తోంది....

సన్నని బాట....

మెల్లగా నడుస్తున్నారు....

" లంక కటువైపు చేరుకున్నాకా, కన్పించే దారిలోంచి మెల్లగా నడుచుకుంటూ వెళితే....మళ్ళీ మనవూరి పొలిమేరలు వస్తాయి. .." అన్నాడు ప్రసాద్, ఉత్సాహంగా నడుస్తూ—

మెల్లగా లేత చీకట్లు అలుముకుంటున్నాయి ...

నక్షత్రాలు వస్తున్న ఛాయలు ఎక్కడా కన్పించడంలేదు....

ఆకాశమంతా మేఘాలు....

చెట్ల పక్కలనుంచి, చిన్నచిన్న మొక్కలని తొక్కుకుంటూ నడుస్తున్న మిత్రులమీద మెల్లగా చినుకులు పడడం ప్రారంభించాయి.

మరో పది నిముషాల తరువాత...

చిరుజల్లు... !

ఆకాశంనుండి భూమికి ఏదో వర్తమానం తీసుకు వస్తున్నట్టు కురుస్తోంది వాన....

గడ్డిపూలమీద పడి చినుకులు "ఆనంద నాట్యం" చేస్తున్నాయి. నల్లని మబ్బుల చాటున బంగారు తీగెలా మెరిసే మెరుపు....

వచ్చేటప్పుడు వాతావరణం బానేవుంది గదాని గొడుగులు ఏమి తీసుకు రాలేదు....

ఇప్పుడెలా ?

చుట్టూ చూశారు.

భూమి ఆకాశం ఏకమైనట్టు కురుస్తోంది వాన..

నడకలో వేగం హెచ్చించారు...

చలిలో.

చలికి వణుకుతూ....

వానలో తడుస్తూ....

నడవడం కొత్తగావున్నా, శరీరాలు గజగజ వణుకుతున్నాయి.

'....అదిగో....అక్కడేదో కన్పిస్తోంది ... " అన్నాడు చుట్టూ చూస్తున్న మూర్తి, అటువైపు వేలు చూపెడ్తూ—

దూరంగా....

చినుకుల చాటున ...

పర్ణశాలలావుందో....గుడిసె;

అటువైపు అడుగులు వేయడం ప్రారంభించారు

ఐదు నిముషాల తరువాత అక్కడికి చేరారు.

పెద్ద గుడిసె....

గుడిసె తలుపు దగ్గరగా వేసివుంది....

చూరు క్రిందకి చేరారు... వానిని చూస్తూ-

చినుకులు చిందులు వేస్తున్నాయి.

" నేను ముందే అన్నాగా ....వానొస్తుందేమోనని...." అన్నాడు ప్రసాద్.

ఎవరూ మాట్లాడలేదు క్షణం—

చినుకుల శబ్దం స్పష్టంగా విన్పిస్తోంది—

"చాలా విచిత్రంగా వుంది యిదంతా . .కలా? నిజమా? అనే అనుమానం వస్తోంది ..."అన్నాడు వివేకానంద.

" నాకూ అంతే....మనం గోదారికి బయలుదేరడమేంటి? .. పడవ మీద ప్రయాణం చేసి లంక చేరడమేంటి? లంకలో చూస్తుండగానే వానేంటి? " అన్నాడు ఆశ్చర్యంగా మూర్తి.

'... నా జీవితంలోకూడా ఇదే మొదటిసారి. .లంకకొచ్చినప్పుడు వాన పడడం.... అన్నాడు ప్రసాద్.

" ...చిరుజల్లు పడ్తుంటే గొప్ప హాయిగావుందిరా... " అన్నాడు మూర్తి.

మూర్తి మాటలకి అడ్డుపడుతూ—

'.. .చిరుజల్లు పడ్తుంటే గొప్ప హాయిలేదు .. హాయి వుందను కోవడంలో ఆనందం వుంది." అన్నాడు వివేకానంద.

వివేకానంద మాటలని విననట్టు—

'....అవునా....ఈ క్షణంలో కొండమీది కోవెలలోవుంటే ఎలా వుంటుందంటావ్ ? అన్నాడు మూర్తి, విచిత్రంగా కళ్ళని తిప్పుతూ—

"..చూడు నాయనా మూర్తి ...ప్రస్తుతం మనమున్నది లంకలో. కోవెల దగ్గరకాదు..." అని నవ్వబోయి ఆగిపోయాడు వివేకానంద, గుడిసెలోంచి ఏదో అలికిడి విన్పించే సరికి—

"...ఎవరైనా వున్నారేమో గుడిసెలో..." అన్నాడు మూర్తి.

'. ఎవరుంటే మన కెందుకురా.. .వాన తగ్గాక మనం వెళ్ళిపోదాం అన్నాడు ప్రసాద్.

వాన క్రమేణా పెరుగుతోంది.

చూరు క్రింద నుంచున్నా చినుకులు పడ్తున్నాయి....

ఇంతలో—

'మీరాబాబు? అన్న స్వరం విన్పించింది.

గుమ్మంవైపు చూశారు పడవ తాత.

"...ఎంత సేపని వానలో తడుస్తారు....లోనికి రండి బాబు' అన్నాడు.

పడవతాత వంటిమీద చిన్న పంచెతప్ప ఏమీ లేదు. ముడతలు పడిన శరీరం చలికి వణుకుతోంది. వణకడం వల్ల వాడి చెవికున్న వెండిపోగు అందంగా కదుల్తోంది.

చలికి కంఠంకూడా వణుకుతోంది.

పడవతాత మరీ దగ్గరగా రావడంవల్ల. .స్పష్టంగా కన్పిస్తున్నాయి. అతని కళ్ళ దగ్గర. నుదుటిమీద జీవితపు అనుభవపు చాలుకు గీతలు.

వాడికేసి ఒక క్షణంచూసి—

గుడిసె లోపలికి అడుగుపెట్టారు.

గుడిసెకున్న మట్టిగోడలు మసిబారి వున్నాయి.

గుడిసె మధ్యలో హారికిన్ లాంతర్‌వుంది.... గోడలకి ఒక ప్రక్కగా బట్టలు కుప్పగా పడున్నాయి... మరోపక్క కొన్ని కుండలు. పాత్రలు....

ఇటువైపు చలికి ముడుచుకు పోతూ, రగ్గులాంటిది కప్పుకొని ఓ స్త్రీమూర్తి.

దీపపు వెలుతురులో ఆమె కళ్ళు మెరుస్తున్నాయి.... నుదుటన రూపాయి కాసంత ఎర్రటిబొట్టు. మనిషి నల్లగావున్నా....ఏదో గొప్ప ఆకర్షణ వుంది ఆమెలో... !

పడవ తాతతో పడవలో కన్పించిన కుర్రాడు కన్పించలేదు ఎక్కడా-

పడవతాతని మూర్తి మరీబలవంతపెడ్తే మరో పల్లెపదం అందుకున్నాడు.

' తొలకరి ఒక మబ్బు తొంగి చూచింది

మబ్బులో ఒక మెరుపు మెరిసి పోయింది."

పదం విని రగ్గులాంటిది కప్పుకొన్నామె కిలకిల నవ్వింది. ఎందుకంటే ప్రియుడి కోసం విలపిస్తూ ప్రేయసి పాడే పదమది.

పడవతాత తనూ హాయిగా నవ్వుకొని—

పదం కొన సాగించాడు-

' పెరటిలో ఒకజల్లు కురిసి వెలిసింది

జల్లులో నా మనస్సు జారిపోయింది"

వానచినుకుల శబ్దం వాడి పదానికి నేపథ్య సంగీతంలా వుంది. మూర్తి పాట వినడంలో నిమగ్నుడై పోయాడు.

ప్రసాద్ గుడిసె అంతా పరీక్షగా చూస్తున్నాడు.

వివేకానంద గుమ్మంలోంచి బైటికి చూస్తున్నాడు ...

తిలక్ ...

ఆమెకేసే చూస్తున్నాడు....

ఆమె అల్లిపువ్వులాంటి కళ్ళు మిలమిల మెరుస్తున్నాయి.

ఆమెకూడా తిలక్‌కేసి ఓరకంట చూస్తోంది.

ఎంతోకాలం నుండి పరిచమున్న మనిషిలా కన్పిస్తోంది

ఆమె తిలక్ కళ్ళకి—

వానతగ్గు ముఖం పట్టింది—

"....పదండిబాబు ...గట్టు వరకు దిగబెడతా...." అంటూ లేచాడు పడా లాపి—

"....రంగీ లేవే....ఆ దీపం పట్టుకొని నాతోరా....' అన్నాడు ఆమె కేసి చూస్తూ

ఆమె మెల్లగా లేచింది. రగ్గు కప్పుకొని, లాంతరు పట్టుకొని వాళ్ళతో పాటు కదిలింది.

చల్లగాలులు వీస్తున్నాయి.

చీకటి....

చంద్రకాంతి లేదు....

నక్షత్రాలు అక్కడక్కడ మిణుక్కు మిణుక్కు మంటున్నాయి. వానలో తడిసిన మట్టి వాసన పచ్చగడ్డి మీద నుండి వస్తోంది. అలవాటులేని దారి మూలాన్న కొన్త కష్ట పడ్తున్నారు నలుగురు- అలవాటుగా నడుస్తున్నారు, పడవతాత, రంగి.

పడవ కదిలింది....

తెరచాప మెల్లగా వూగుతోంది.

అలలు వురకలు వేస్తున్నాయి.

పడవకటు చివర లాంతరు పట్టుకొని ఆమె....

ఇటు చివర తిలక్

పదహారణాల పరువంలో వుందామె

వయస్సు తెచ్చిన అందాల కన్నా ఏదో ఆకర్షణ వుందామెలో.

గట్టు దగ్గర దిగి—

యింటికి చేరేసరికి —

రఘురామయ్య వాళ్ళు కంగారు పడ్తున్నారు.

రఘురామయ్య వాళ్ళకి జరిగిన విషయం వివరంగా చెప్పి, రాత్రి పన్నెం డవుతుండే నిద్రకుపక్రమించారు.

తిలక్ మనస్సులో—

ఆమె రూపం !

ఆ క్షణం నుండి —

ఆ క్షణంనుండి కాదు....ఆమెని చూసిన క్షణం నుండే తిలక్ జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమయ్యింది.

* * * * *

మర్నాడు—

వుదయం అందరూ లేచేసరికి ఏడు దాటింది.

రోజూ

నాల్గు ఇళ్ళ అవతల నుండి—

తీయగా—

అందంగా—

విన్పించే వైద్యనాథన్‌గారి మురళీగానం విన్పించడం లేదు. అలవాటుగా చేస్తున్న పని ఏదో చేయనట్టు అన్పించింది.

మొదటిరోజు—

(ప్రసాద్ వాళ్లు వచ్చిన మొదటి రోజు)—

అస్తమానూ మురళీగానం విన్పించే సరికి విసుగు అన్పించినా—

రెండో రోజునుండి....

అది అలవాటుగా మారి పోయింది.

జీవన నిత్య కృత్యాల్లో అది (మురళీగానం) ఒకటిగా మారిపోయింది.

సుప్రభాతం వింటూ లేవడం అలవాటు....

అలాంటిది ఈరోజు మురళీగానం విన్పించడం లేదు.

"ఏమే ఉమా....ఏమిటీవాళ మురళీగానం విన్పించడం లేదు....' అని అడిగాడు కాఫీ తీసుకొచ్చిన ఉమని ప్రసాద్.

ఆమె క్షణం ఏమీ మాట్లాడలేదు.

తరువాత—

మెల్లగా—

' నిన్నరాత్రి మీరు వచ్చేసరికి ఆలస్యమయినందువల్ల మీకు తెలీలేదు.

" ఏమిటీ?" ఆత్రంగా అడిగాడు ప్రసాద్.

మిగిలిన ముగ్గురూకూడా ఆమెవైపు ఏమిటన్నట్టు చూశారు.

ఆమె మెల్లగా నిట్టూర్చి—

" పాపం.... నిన్న సాయంత్రం మీరు వెళ్ళాక, ఆనందభైరవి ఆల పిస్తూ.... ఆలాపనలోనే అంతిమ యాత్ర సాగించారు...' అంది విషాదంగా-

గుండెలు చివుక్కుమన్నాయి అందరికీ-

తమకు ఏ మాత్రం పరిచయంలేని వ్యక్తి కోసం మొదటిసారిగా బాధ పడ్డారు అందరూ—

మౌనంగా రెండు కన్నీటి బొట్లు చెక్కిలిమీంచి జారి పోయాయి-

' ఒక్కసారిగా గుండె ఎందుకు గిలగిలలాడి పోయింది?' అని ప్రశ్నించు కున్నాడు తిలక్.

" తను మనిషి కనుక?' మనసిచ్చిన జవాబు-

మూర్తి విషాదంగా అన్నాడు—

' నువ్వులేవు నీ పాట వుంది. ఇంటి ముందు జాజిమల్లె తీగల్లో అల్లుకొని లాంతరు నన్నని వెలుతురులో క్రమ్ముకొని నా గుండెల్లో చుట్టుకొని గాలిలో ఆకాశంలో నక్షత్రం చివరి మెరుపులో దాక్కుని నీరసంగా నిజంగా వుంది. "

* * * * *

వారం రోజులు దాటింది అప్పటికే వాళ్ళువచ్చి—

ఆ రోజు
గోదారి గట్టుకి బయలు దేరారు....

అంతకు ముందు ఓ రెండుసార్లు వెళ్ళారు....!

ఆ రెండు సార్లు....

'తృప్తి'గా పడవ ప్రయాణం చేశారు....!

ఓ సారి లంకంతా నడుచుకు వెళ్ళారు....!

మరోసారి—

లంకలో కాసేపు తిరిగి వచ్చారు....,

ఈ రెండు సార్లు పడవతాత ద్వారా తెలిసిన విషయాలు ఏమిటంటే-

పడవతాత చాలా కాలం నుండి పడవ నడుపు తున్నాడు ...వాడి తండ్రి వాడి కిచ్చిన ఆస్తి ఆ పడవా ...ఆ గుడిసె....అప్పుడప్పుడు—

పండగలకి, పర్వ దినాలకి, తిరునాళ్ళకి చుట్టు పక్కల వూళ్ళల్లో గుళ్ళో బాజా వాయిస్తుంటాడు.... వాడికో కొడుకు.....కొడుకు కూతురే రంగి... ఓ సారి పుష్కరాల్లో పడవలో జనం ఎక్కువయి....అది తిరగబడడం వల్ల.. ప్రవాహంతోనహా కొడుకు కొట్టుకు పోయాడు....!

భర్త పోయిన కొన్నాళ్ళకే భార్యకూడా పోయింది.

అప్పటికి రంగి నెలల పసికందు.

" .. నా నంటి పాపా. నాకంటి పాపారంగి...వాడు 'మా బాబువున్నాడు' అనే ధైర్యంతో దీన్ని నాకు ఒగ్గేసినాడు ...నా పేణంలో పేణం బాబు.. బాబూ ముసలోడు ఏంటో కూస్తునాడను కోకండి... దాని కన్నీళ్ళు నావి బాబు... వాని బాధలు నావి బాబు.... ఈ సుకాలు, నా ఆనందాలు అన్నీ దానివిబాబు. ఈ సేతుల్తో గోదారమ్మ నన్ను పెంచింది.... నా సేతుల్తో నాను "రంగి"ని పెంచినానుబాబు...." అన్నాడోసారి పడవ తాత.

మరోసారి—

".... నా సిట్టి తల్లి.... జెళ్ళో కొండ మల్లెలు తురుముకొని, కళ్ళనిండా కాటుక దిద్దుకొని, బుగ్గన సిన్న సుక్కయెట్టుకొని....ఇంత...రూపాయికాసంత కుంకుమ దిద్దుకొని.... మెరిసేటి పూసలపేరు ఏసుకొని, పచ్చటి నేల మీంచి వస్తుంటే....సిమహాలక్ష్మి కళ్ళముందు కదిలి వస్తున్నట్టుంటుంది." అన్నాడు కళ్ళలో కదిలిన కన్నీటి చుక్కల్ని తుడుచుకుంటూ—

ఆ రోజు—

గోదారి గట్టు చేరేసరికి పడవ సిద్ధంగా వుంది.
పడవ మీద రంగి కూడా వుంది.
పడవ కదిలింది.
చాలా అందంగా వుంది రంగి.
'నాగమల్లి పూలతో నల్లని జడ నవ్వుతోంది.
పరవళ్ళ గోదావరిలా నిండుగా వుంది రంగి.
చేపల్లాంటి కళ్ళకి కాటుక-
పల్లకీలా వంగిన కనుబొమలు-
కాళ్ళకి వెండి కడియాలు-
అందంగా, పొందిగ్గావున్న అవయవ సౌష్టవం.
పడవ కటువైపు కూర్చుంది రంగి.
దూరంగా...
సూర్యాస్తమయం.
పక్షుల గుంపులు.
నీలి మేఘాలు సాగిపోతున్నాయి.
గాలి కెరటాల అలికిడి - !
అలల........ ఒరవడి - !
"....ఈ వయసులో యింకా ఏం కష్టపడతావ్ తాతా....?"
మిగిలిన వాళ్ళు ఆశ్చర్యపోయారు.
ఎవ్వరూ—
నిశ్శబ్దంగా వుండే తిలక్ వేసిన ప్రశ్న అది.

పడవ తాత ఓక్షణం మౌనంగావుండి, తెరచాప కేసి, 'కళ్ళెత్తి' చూసి-
"....యిది పెద్ద కట్టమా బాబు.... అయినా యింకెంత కాలం బాబు ?.... ....ఈ'సిన్నా'రి'ని ఓ అయ్య సేతిలో పెడ్తే.... ఇక ఏ కట్టాలు వుండవు బాబు.... అయినా నువ్వే సెప్పు బాబు ?.... బిడ్డని సాకడం తల్లికి కట్టమా బాబు ?...."

చివరి మాట తిలక్ హృదయంలో ఎక్కడ తగలాలో
అక్కడ తగిలింది.
ఏమీ మాట్లాడ లేక పోయాడు.
చిరు చీకట్లు లోకాన్ని అలుముకుంటున్నాయ్....
పడవ లంక వైపు వెళ్తుంటే....

"....ఇవాళ లంక కేసి వద్దు తాతా !........ కాసేపు ఈ గోదారిలోనే తిరుగుదాం...." అన్నాడు ప్రసాద్.

పడవ దిక్కు మార్చాడు.
గంటకు పైగా గోదారిలో—
అటు నుండి ఇటు—
ఇటు నుండి అటు—
తిప్పాడు పడవని !

మూర్తి పడవలో అటూ ఇటూ తిరుగుతూ, ఆకాశం కేసి, అలల కేసి, చూస్తూ.... మధురానుభూతిని అనుభవిస్తున్నాడు....!

వివేకానంద ఏదో ఆలోచిస్తున్నాడు.

అతని కళ్ళముందు ఆ రోజు వరకు జరిగిన సంఘటనలు



కదులుతున్నాయి.

ప్రసాద్‌కూడా ఏదో ఆలోచిస్తున్నాడు....

తిలక్....

తిలక్ మాత్రం....

రంగికేసి చూస్తోనే వున్నాడు ...!

రంగి కూడా అలలకేసి—

ఆకాశం కేసి చూస్తున్నట్టుగా —

కన్పిస్తున్నా, ఓరకంట తిలక్‌కేసి చూస్తోంది....!

ఆమె గుండెల్లో ఎన్నో భావాల పరవళ్ళు....

అతని గుండెల్లో అనురాగరస ఝురులు....

కళ్ళు....

కళ్ళు పలకరించుకుంటున్నాయి....!

ఆమె మెల్లిగా నవ్వితే—

అతని గుండెల్లో పువ్వుల పరిమళం!

ఆమె 'చిలిపి'గా చూస్తే—

అతని మనస్సులో ప్రేమ జల్లు కురిసినట్టు—

'పలుకు'లేని పలుకరింత కళ్ళది!

మాటలులేని మానసవీణ మూగది!

కళ్ళు కబుర్లు చెప్పుకుంటున్నాయి!

ఎదలోయల్లో అనురాగ స్వరాలు పలుకుతున్నాయి!

మనస్సును మించిన భాష లేదు!

గుండెను మించిన లిపి లేదు!

నిశ్శబ్దాన్ని మించిన 'రాయిబారి' లేదు!

పిల్ల గాలులు—

ఒక గుండె నుండి—

మరొక గుండెకి—

వర్తమానాన్ని తీసుకు వెళ్తున్నాయి. ..!

పడవ గట్టు చేరింది.

గుండెల్లో ఏదో బరువు.

అందరూ పడవ దిగారు.

పడవ వెనక్కి మళ్ళింది—

నలుగురు....

గట్టుమీద నిలబడి పోయారు....!

"....తాతా! తాతా!" గట్టిగా పిల్చాడు ప్రసాద్.

వెనక్కి చూశాడు పడవ తాత.

రమ్మన్నట్టు సైగ చేశాడు ప్రసాద్.

పడవ మళ్ళీ గట్టుచేరింది.

"....ఇదిగో తాతా... యీ డబ్బుంచు...." అంటూ పర్స్‌లోంచి పదిరూపాయలు తీసాడు ప్రసాద్.

"వుంచండి బాబు.... యిప్పుడేం తొందర...." అన్నాడు పడవ తాత. ప్రతిరోజూ అతను అలాగే అంటున్నాడు.

"లేదు.... తాతా.. రేపట్నుంచి మేము రాము" ఒక కఠోర నిజాన్ని చెప్తున్నట్టు వణికాయి అతని పెదవులు.

మాటల్లో వణుకు లాంటి ధ్వని.

క్షణ కాలం ఏమీ మాట్లాడలేదు పడవ తాత.

రంగి కళ్ళలో ఏదో మార్పు—?

క్షణం తరువాత పదిరూపాయలు తిరిగి యిచ్చేస్తూ—

"... వద్దుబాబు ... రోజూ ఒకళ్ళిద్దరు వస్తుంటారు.... అందరూ కేవలం పడవ మీద ఆగట్టు నుండి ఈగట్టుకి చేర్చే వాడిలా సూస్తారేకానీ....ఎవరూ.... యింత 'యిది'గా నాతో 'కలిసిపోరు'.... నల్లని నదీ తీరంలో ఓ ముసిలోడు, ఓ పడవ నడుపుకుంటాడు అని గుర్తుంచుకొండి బాబు... ఆదేసాలు... నాకు పెదపెద 'బాసలు'రావు బాబు... నాను పెద్దగా సదువుకోలేదు బాబు... కానీ... ఒక వినయం సెప్తాను బాబు... యెర్రిబాగులోడు యేదో సెబుతున్నాడను కోకండి... మంచిగా బతకండి బాబు... మారాజుల్లా బతకండి...." అంటూ వెళ్ళేశాడు పడవ తాత.

పడవ మెల్లగా కదిలింది.

అది నిశ్చలంగా నిర్మలంగా సాగిపోతోంది.

తెరచాప మెల్లగా వూగుతూ వీడ్కోలు చెప్తోంది.

ఆ రోజు రాత్రి—

కిటికీలోంచి వెన్నెల కన్పిస్తోంది.

తిలక్‌కి నిద్ర పట్టట్లేదు...

మెల్లగా లేచి...

తలుపు తెరిచి...

ఇల్లు వదిలి...

వెన్నెల్లో నడక ప్రారంభించాడు—

నదీతీరం వైపు....!

వెన్నెల్లో గోదారి—

పాల సముద్రంలా వుంది!

కళ్ళముందు....

ఎన్నో దృశ్యాలు....

జ్ఞాపకాల రూపకాలు....

మొదటిసారిగా గోదారి ఒడ్డుకు రావడం....

తెరచాప పడవ కదలిక....

మెల్లగా వీచిన పిల్లగాలులు....

లంక దగ్గర లంగరేసిన పడవ....

లంకలో నడక....

చుట్టూ పిచ్చి మొక్కలు....

గడ్డి పూలు....

వున్నట్టుండి కమ్మిన మేఘాలు....

చిరుజల్లు చిందులు....

చిన్న వర్షశాలలాంటి గుడిసె....

చూరు క్రింద మిత్రులతో వానలోకి చూస్తూ....

గుడిసె మట్టి గోడలు....

చిన్ని వెలుతురుతో లాంతర్....

పడవ తాత పిలుపు....

రగ్గు లాంటిది కప్పుకున్న రంగి....

చినుకుల శబ్దం....

వల్లె పదం....

కిలకిల నవ్వు రంగిది....

తిరిగి —

చీకటిలో....

వణుకుతూ....

మట్టి వానన....

ఆలస్యంగా యింటికి చేరడం....

ఒకరోజు

కొప్పులో పువ్వులు....

రూపాయి కాసంత బొట్టు....
రంగి నవ్వు—
తిలక్‌కి అర్థం కాని విషయం మరొకటుంది.
అదేమిటంటే....
ఇవాళ....

గోదారి గట్టు నుండి వస్తున్నప్పుడు...
తన కళ్ళల్లో ఎందుకు తిరిగాయి...
కన్నీళ్ళు ?
గోదారి గట్టు దిగి...
అలలని చేత్తో మెల్లగా తాకి....
వెన్నెట్లో గోదారిని చూస్తూ....
అలలతో అన్నాడు....

"....యు రిమెంబర్ మీ యాజ్ ఏ లింక్ అఫ్ యువర్ మెమోరీస్ చైన్.....!" అని !

* * * * *

మర్నాడు....
సాయంత్రమయింది....
ప్రొద్దుటి నుండి సాయింత్రం వరకు ఎలాగడిచిందో తెలీలేదు....
ఒకటే హడావిడి....
సామానుగట్రా సర్దుకొనే సరికి ఐదయ్యింది.
ఎంత వద్దన్నా వినకుండా సీతమ్మ పిండి వంటలు చేసింది.
కొసరి కొసరి వడ్డించింది.
రామమయితే ప్రొద్దుటి నుండి ఒక్కటే గొడవ —
ప్రసాద్ వాళ్ళతో వెళ్ళిపోతానని !
శివం కళ్ళలో కూడా—

బాధ తాలూకు భావం స్పష్టంగా అలుముకుంది !
ఉమ....
మనస్సులో ఏమనుకుంటోందో తెలీదు కానీ....
వెళ్ళిపోతారని తెలిసిన క్షణం నుండి ఆమె నవ్విన నవ్వు ఎందుకో 'సజీవంగా' వచ్చినట్టు కన్పించలేదు.... అతికి పెట్టుకున్నట్టుంది...
ఆమె కళ్ళచాటు నీలి నీడలు...! ?
ఉమని చూసే సరికి, ఆమె కళ్ళని, నవ్వుని చూసే సరికి వివేకానంద ఏదో మాటల కందని, పెదవి దాటని బాధ అనుభవిస్తున్నాడు....
(నిజానికి అది బాధ కాదు.)
(ఒక రకమైన నిర్లిప్తత ! ?)
గూడు వీడి ఒక పక్షి ఎగిరిపోతున్నప్పుడు
జంట పక్షి అనుభవించే బాధది.
పూవువాడి పోయేటప్పుడు గిలగిలమనే రెమ్మలా వుంది ఉమ.
మూర్తి.
మూర్తికి తాతయ్య చేయి పట్టుకొని మెల్లగా అడుగులో అడుగువేస్తూ శివాలయానికి వెళ్ళినప్పటి జ్ఞాపకాలు...
మధురమైన స్మృతిలాంటి ఈ అనుభూతి దూరమవుతుంటే....
ఆ బాధని ఓ మహాకవి కలం కన్నా —
సామాన్యుడి గుండె అందంగా చెప్తుంది !
ప్రసాద్...

తన నమ్మకాన్ని మిత్రులు కూడా దాదాపు నమ్మినందుకు తృప్తిగా వుండటానికి...!


తిలక్....
మిగిలిన వారందరికంటె ఎక్కువగా వుంది అతనికి బాధ....

మళ్ళీ....
ఈ నిశ్శబ్దతలోంచీ....
ఈ ప్రశాంతతలోంచీ....
ఈ ఆనందానుభూతిలోంచీ....
ఈ పులకింతలోంచీ....
ఈ మనోహర పరవశంలోంచీ....
ఈ మధురిమల మధురమైన మధురంలోంచీ....
ఈ చల్లని స్వేచ్ఛా గాలులలోంచీ....
ఈ ఆనందలోకంలోంచీ....
మళ్ళీ....
పరుగు వైపు....
హడావిడి వైపు....
రణగొణ ధ్వనులలోకి....
అశాంతిలోకి...
అలజడిలోకి....
గోలగోలగావుండే ప్రపంచంలోకి....
రొటీన్‌గా సాగిపోయే జీవితంలోకి....
ఏ విధమైన....
ప్రేమా....
అభిమానం....
అనురాగం....
లభించని....
అడుగడుగునా....
కృత్రిమతని....
కల్మషాన్ని....
కాలుష్యాన్ని....
కాఠిన్యాన్ని....
కల్గిన....
ప్రపంచంలోకి వెళ్ళాలి....!
అక్కడ....
ప్రేమ వుండదు.
బంధం వుండదు.
మెటీరియలిస్టిక్ లైఫ్.
'రూపాయి' చాటున తండ్రి....
మహిళా మండలి కార్యక్రమాల్లో.... తల్లి....
మళ్ళీ....
అలాంటి వాళ్ళందరినీ....
చూడాలి...
వాళ్ళతో కలిసిపోవాలి. ..
వాళ్ళతో జీవించాలి....
డబ్బుకి తప్ప మనిషికి, మనస్సుకి ఏ మాత్రం విలువ యివ్వని ప్రపంచంలోకి సాగిపోవాలి....
ఒక అందమైన వర్ణచిత్రం సౌందర్య ప్రతీకగా కళ్ళముందు కదలి....
ఒక స్వప్నంలా జాలిగా కరిగిపోతూ...
హృదయ విదారకంగా విలపిస్తున్నప్పుడు...
వేదనతో చలించి పోయినప్పుడు....
గుండెకోవెల ప్రాంగణంలో విన్పిస్తున్న సప్తస్వరాలు...
గాలి అలల తాకిడికి చెదిరిపోయినప్పుడు...
సాగే గోదారి పరుగు ఆగిపోయినప్పుడు....
కొండల్లోంచీ...
కోనల్లోంచీ....
అప్పటి దాకా ఆనందరాగాలు విన్న ప్రకృతి....
ఆ క్షణం నుండి....
విషాద స్వరాలు విన్నట్టు...
ఒక అనుభూతికి గుండె భాష వుంది కానీ....
గుండె భాషకి అక్షరరూపం లేదు....!

....

....

మెల్లగా నడక ప్రారంభించారు.
రఘురామయ్య రైల్వేస్టేషన్ వరకు బండి పంపిస్తానన్నాడు గానీ....
నరదాగా నడచి వెళ్దామని...
గంటముందే బయలుదేరారు .... రైల్వేస్టేషన్‌కి.
ఇక్కడ—
ప్రసాద్ ఒకవిషయానికి ఆశ్చర్యపోయాడు—
అదేమిటంటే—
వచ్చేటప్పుడు—
"....ఇలా ఎంతదూరం నడవాలిరా.... మట్టిరోడ్ల మట్టి కొట్టుకుంటూ అన్న వివేకానంద. నడవ డాన్కి ఉత్సాహం చూపాడు.
వీధి చివర కొచ్చారు....
వెనక్కి తిరిగి చూశాడు వివేకానంద....
పెద్దపెద్ద అరుగులు వున్న పాతకాలం నాటియిల్లు...,
గుమ్మంలో తమకి వీడ్కోలు చెప్తూ రఘురామయ్య కుటుంబం..
ఆటు పక్క....
ఉమ!
దూరంగా కన్పిస్తున్న .... ఆ కళ్ళల్లో ఏదో ఆర్తి ....
వసంతం కోసం నిరీక్షించే కోయిలలా ఆమె ....
ఆమెని చూసే సరికి—
గిర్రున కళ్ళలో నీళ్ళు తిరిగాయి!
కళ్ళు చెమ్మగిల్లితే మిత్రులు ఎవరైనా చూస్తారేమోనని
కళ్ళలో "ఏదో" పడ్డట్టు కళ్ళుతుడుచుకొని నడక సాగించాడు వివేకానంద.
మూర్తి మాత్రం ఎలా గ్రహించాడో....
ఆకాశం కేసి చూస్తూ —
మెల్లగా అన్నాడు —
"రెప్ప రెప్పని తడిపింది కన్నీటి చుక్క"ని.
పూరి చివర వరకు ఎవరూ మాట్లాడలేదు.
సన్నని బాట....
పచ్చటి పంట పొలాలు....
హరితవర్ణ సౌందర్యం ....
దూరంగా నీలాకాశంలో—
తరలిపోయే పక్షుల గుంపు మిత్రుల్లా—
వెనక్కి తిరిగి చూస్తే—
మిత్రులకి వీడ్కోలు చెప్తున్నట్టు కొండమీది కోవెల.
సాయంత్రం ప్రశాంతంగా నిశ్శబ్దంగా వుంది....





సూర్యాస్తమయిం....

కళ్ళముందు కరిగిపోతున్న సూర్యుడు....

సిందూరకాంతి....

అడుగులు ముందుకు పడుతున్నాయి కానీ .... మనస్సు మాత్రం పల్లెని వదలడం లేదు.

అప్పటివరకు మధురంగా విన్పించిన ఒక "రసార్ద్రగీతం" స్తంభించి పోయిన అనుభూతి అందరికీ!

వసంతం వెళ్ళిపోయి నప్పుడు మౌనంగా రోదించే కోయిల వేదన అది!

రైల్వేస్టేషన్ చేరారు!

మధ్యదారిలో ఎవరూ మాట్లాడలేదు.

అదేమి విచిత్రమో ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడే మూర్తి కూడా మౌనంగా వుండిపోయాడు....

స్టేషన్ అంతా ఖాళీగావుంది....

వేయి నిముషాల తర్వాత—

ఓ విచిత్రమైన సంఘటన జరిగింది!

రామం, శివం, సైకిల్ మీద రొప్పుతూ చేరుకున్నారు స్టేషన్‌కి—

ప్రసాద్ వాళ్ళు బయలుదేరిన పావు గంటకి బయలుదేరారుట—

తోటకెళ్ళి, కొబ్బరి బొండాలు పట్టుకొని, అడ్డదారిన స్టేషన్‌కి వచ్చారుట—

"....ఏమిటోబాబు.... మిమ్మల్ని చూడాలన్పించింది...."

అన్నాడు శివం సిమెంట్ బెంచీ మీద కూర్చుంటూ—

"...?..మీవూళ్ళో పెద్దపెద్ద రైలు లుంటాయి కదా.... బస్సుమీద బస్సు ఏంచక్కా భలేగావుంటుందేమ్?.... యీసారి నాన్నగారితో పట్నంవెళ్ళాలి ... మళ్ళీ ఎప్పుడొస్తారు?" అని ప్రశ్నించాడు రామం.

వాడి అమాయకమైన మాటలకి.... గుండెలు పులకించి పోతున్నాయి!!

రైలు వచ్చింది.

బోగి ఎక్కుతుంటే—

పెద్ద మనిషిలా "....వెళ్ళంగానే వుత్తరం రాయి...." అన్నాడు శివం.

రైలు కదిలింది.

రామం, శివం చేతులు వూపుతోనే వున్నారు.... చివరి బోగి దూరమయ్యే వరకు—

చిన్నస్టేషన్‌లో.... మెల్లగా చలికి వణుకుతూ.... చేతులు వూపుతున్న ఆ పిల్లల నిర్మలమైన మొహాలు... కళ్ళ ముందు.... కదుల్తోంది ఆదృశ్యం!

చెట్లు, పుట్టలు వెనక్కి నడుస్తున్నట్టగావుంది రైల్లోంచీ చూస్తుంటే—

"ఎలా వుందిరా 'టూర్'?" అడిగాడు ప్రసాద్.

క్షణం మాట్లాడ లేదు ఎవరూ...

గాలి వేగంగా వీస్తోంది....

"ఐలైక్ మీటింగ్ పీపుల్ హూమ్ ఐషల్ నెవర్ మీట్ ఎగైన్" అన్న ఓ మహానుభావుడి మాటల్లో గొప్ప అర్థముంది...." అన్నాడు వివేకానంద.

"నువ్వన్నది అక్షరాలా నిజం... మళ్ళీ జీవితంలో కలవని మనుష్యులతో కలవడంలో ఒక గొప్ప ఆనందముంది..." అన్నాడు ప్రసాద్.

"కొన్ని అనుభూతులు కలల్లా అన్పిస్తాయి.... అలాంటి కలల్లాంటి అనుభూతుల్లో ఇదొకటి... " అన్నాడు వివేకానంద. అతని స్వరంలో కాస్త బాధ.

ఓ నిముషం ఆగి—.

వివేకానందయే అన్నాడు....

"....ఎందుకో చేరువై దూరమవుతారు..." అని, రైలువేగం హెచ్చింది.

కంపార్ట్‌మెంట్‌లో పెద్దగా జనంలేరు.

గాలి గట్టిగా వీస్తోంది.... దూరంగా ఆకాశంలో అప్పుడే కళ్ళుతెరుస్తున్నాయి నక్షత్రాలు. ..

మేఘాల చాటున దోబూచులాడుతున్నాడు చందమామ.

"...ఇదివరకు .. . తాతయ్య బ్రతికున్నప్పుడు.... ప్రతి సంవత్సరం వేసవి సెలవులకి తాతయ్యగారింటికి వెళ్ళేవాణ్ణి ... నా వయస్సు వాళ్ళే కొంత మంది వుండే వాళ్ళు అక్కడ... మే మంతా కోతికొమ్మచ్చి, చెడుగుడు ఆడే వాళ్ళం.... చెట్లమ్మట, పొలాల గట్టుల వెంట పరుగులు పెట్టేవాళ్ళం..., చెరువులో ఈదేవాళ్ళం... ... ఆనాటి జ్ఞాపకాలు పునరావృత్తమై నట్టుంది..." అన్నాడుమూర్తి.

తిలక్... క్షణం మాట్లడలేదు.

క్షణం తరువాత—

"ఒక అందమైన స్వప్నం కళ్ళముందు కదిలినట్టుగా కదిలి... చూస్తుండగానే కరిగి పోయినట్టుంది.... అని ఆగి—

"బాధకోసమే పుట్టాను... బాధలోనే పెరిగాను.... కన్నీళ్ళే.. జీవితమంతా కన్నీళ్ళే..." అన్నాడు విషాదంగా.

"అబ్బ... మళ్ళీ ఇదేమిటా?" విసుక్కున్నాడు మూర్తి.

తిలక్‌లో ఏ భావమూలేదు.

"తిలక్! నీకో విషయం తెలుసా?...." అన్నాడు ప్రసాద్.

ఏమిటన్నట్టు చూశాడు తిలక్.

"ఒక మధురమైన జ్ఞాపకం.... ఒక జీవితం సాఫీగాసాగి పోవడాన్కి ఊపిరి... ప్రాణమూ.."

తిలక్ ఏమీ మాట్లడలేదు.

కొంతసేపు మౌనం తరువాత.

"...ఆవూరిలో.... ఆ గోదారిలో ... ... అలలమీద సాగిపోతున్న పడవలో.... దూరంగా సూర్యాస్తమయం అవుతుంటే... నల్లని వాల్‌జడలో నాగమల్లిపూలు తురుముకొని.,. పున్నమి చంద్రుడిలా నవ్వుతున్న రంగి నాకళ్ళకి కన్పిస్తోంది..," అన్నాడు తిలక్ కళ్ళుమూసుకుంటూ.—

"...మళ్ళీ. . ఎప్పుడైనా.... ఈ జీవితంలో... అలాంటి... అనుభూతి కల్గు తుందంటావా?" అన్నాడు విషాదంగా.

"ఎవరో కవి అన్నట్టు "మెనీపీపుల్ ఎంజాయ్ నథింగ్ ఆఫ్ దేర్ హ్యాపీనెస్ బట్ ఫీయర్ ఆఫ్ లాస్టింగ్ ఇట్" అన్నాడు,,. అలావుంది యివ్వుడు..." అన్నాడు మూర్తి.

తిలక్ మొహంలో ముగ్గురికీ స్పష్టమైన మార్పు కన్పించింది. వున్నట్టుండి అతనిలో ఆవేశం ప్రవేశించింది.

"...నో! ... నాకుకావాలి.... ఆ అనుభూతి శాశ్వతం కావాలి... నా జీవితాంతం మిగిలిపోవాలి.,." అన్నాడు ఆ వేశంగా, సూట్‌కేస్ అందుకుంటూ.

"... వచ్చేస్టేషన్‌లో దిగిపోతాను.... మళ్ళీ... ఆ వూరికి... ఆ గోదారితీరానికి.... ఆ పడవ మీద ప్రయాణం... రంగి..."

అతనిలో కలిగిన "భావసంచలనానికి" షాక్‌తిన్నారు మిత్రులు ముగ్గురూ-

"....వెన్నెట్లో గోదారి అలలకేసి చూస్తూ.... స్వచ్ఛమైన గాలులు పీలుస్తూ... అక్కడే వుండిపోతాను..." ఇంకా ఏదో చెప్పుకుపోతున్నాడు.

తిలక్‌లో కలిగిన "మార్పుకి"... ఆశ్చర్యపోయారు ముగ్గురూ. అతన్ని బలవంతాన్న అపుచేసి—

ప్రసాద్ అన్నాడు తిలక్‌తో—

"...ఆణిముత్యాల్లాంటివి అందమైన అనుభూతులు.... అలాంటి ముత్యాల సరమే జీవితం... ఒక అనుభూతిలోంచి మరొక అనుభూతిలోకి మనిషి జీవితం "నది"లా సాగిపోతుండాలి కానీ... ఒక్కచోటే నిశ్చలంగా నిలిచిపోకూడదు.."

తిలక్ ఏమీ మాట్లాడలేదు. మిత్రులందరికి నచ్చేగుణం అదే. మాటకి మాట సమాధానం చెప్దామని చూడడు ఎదుటివాడు చెప్పింది కూడా ఆలోచిస్తాడు.

మరో అరగంట తరువాత అడిగాడు ప్రసాద్‌ని—

"... మళ్ళీ అలాంటి "అనుభవం" ఎదురవుతుందంటావా?" అని ఆశగా.

ప్రసాద్ మెల్లగా నవ్వి.

"...నిరీక్షణలో గొప్పఅందముంది నేస్తం .. పట్నం, పల్లెఅని కాకుండా.. నీకు కన్పించిన ప్రతి మనిషిలో అన్వేషించు... తప్పకుండా ఎలాంటి "మనిషి" లోనైనా ఎక్కడోక్కడ ప్రేమా.. ఆప్యాయత కనిస్తుంది.." అన్నాడు ప్రసాద్.

తిలక్ మౌనంగా.... ఏదో ఆలోచిస్తున్నాడు.

ఆరోజు రాత్రి.

ఎక్కడో సూట్‌కేసు అడుగున ఎన్నోరోజుల నుండి ఏమీ రాయకుండా పడున్నడైరీ తీసి.

యిలారాశాడు.

"అనుభూతిలోంచి అనుభూతిలోకి "నది"లా సాగిపోయేదే జీవితం..."

దానిక్రిందే ఇలా కూడారాశాడు.

"...చల్లని పిల్లగాలులు... వెన్నెట్లో నదీతీరం... .. అలల మీద సాగిపోతున్న తెరచాప పడవ... గంభీరముద్రని దాల్చిన గోదావరి.... తరలిపోతున్న పక్షుల గుంపులు... సందేశాలుమోసుకుపోతున్న మేఘ మాలికలు... నిర్మలమైన నీలాకాశం... అప్పుడే కళ్ళు తెరుస్తున్న చిన్న నక్షత్రం... ప్రతి రెమ్మా... ప్రతికొమ్మా... ప్రతిపూవు... యింకా... యింకా.... ప్రకృతి సమస్తం.... మనిషిలో "ఇంకా అక్కడక్కడా" మిగిలివున్న మానవత్వం... నన్ను మనిషిగా మార్చాయి! స్తబ్దతతో వున్న నాకు, నిశబ్దంలో కొత్త రాగాలు మధురంగా విన్పించాయి—

నాకు "కొత్త ప్రపంచాన్ని" పరిచయం చేశాయి—

"ప్రవాహం లాంటి ఈ అనుభూతి నా జీవితాన్ని "నది"గా మార్చింది".

అనుభూతిలోంచీ, అనుభూతిలోకి సాగిపోతూ, "మనిషి" గానే మిగిలిపోనీ భగవాన్!"

[అయిపోయింది]

కొఱుకరాని కొయ్యలు!

"సనాతనం" ఛాందసమని
వెనక్కి నెట్టి
"నూతనం" కోసం
అఱ్ఱులుసాచి
ఓ మూడడుగులు ముందుకువేసి
ఎవ్వరికీ అర్థం గాకుండా
పోతున్నారు,
"వనిత"
"కవిత"!

* * *

అహంజానామి నూపురే !


సాహిత్య సుందరి
కేయూరాలు,
కుండలాలయిన
కావ్యాలు — ప్రబంధాలు
నే నెరుగను!
అనుపమయిన
వాటి తళుకు బెళుకులు
నాకు తెలియవు!
ఆమె నూపురాలయిన
మినీ కవితలే
నే నెరుగుదును!
మధురమయిన
వాటి గలగల రవళులే
నాకు తెలుసు!

* * *

యస్యనాస్తి సాహిత్యం

ఎవనిలో
సాహిత్యం "నదిలా" జల జల ప్రవహించదో,
ఎవనిలో
సాహిత్యం "శిఖలా" భగభగమండదో,
ఎవనిలో
సాహిత్యం "గాలిలా" రెపరెపలాడదో,
ఎవనిలో
సాహిత్యం "తారాపథంలా" మిలమిల ప్రకాశింపదో,
ఎవనిలో
సాహిత్యం "కొమ్మల రెమ్మల పువ్వుల మొక్కలా" గుమ
గుమలాడదో
వాడు
కులం గలవాడైతేనేం
గోత్రం గలవాడైతేనేం
పసిడి గలవాడైతేనేం
వ్యాసుడైతేనేం
గౌతముడైతేనేం
వ్యాశేంద్రుడైతేనేం
వానికి
నా మస్తకం వినమ్రమవ్వదు!
నా స్వాన్తం ఆధీనమవ్వదు!
నా కరద్వయం అంజలి ఘటించదు!

శ్రీ కె. కిశోర్‌బాబు
శ్రీ కె. అశోక్‌బాబు



(గత సంచిక తరువాయి)

18. చార్వాకుని మరణము

అది ప్రగాఢ నిశీధి ప్రకృతి నిబిడాంధకారమున మునిగి కన్నులున్న వారిని లేనివారి నొక్కతీరుగ నొనరించుచుండెను. ఆ ప్రగాఢాంధకారమున నిగూఢముగ నెవరో యిరువురు వ్యక్తులేదియో బరువును మోసికొనుచుఁ బోవుచుండిరి.

ఆ పోవుచున్న వ్యక్తులు రాజమార్గమునకు రాక సందు దారులనుండియే పోవుచుండిరి. మినుకు మినుకులాడు వీధి దీపపు వెలుఁగులో నిదానించి చూచినచో నిరువురు పురుషులొక మంచము గొనిపోవుచున్నట్లు గోచరించును. ఆ మంచము మీద మేలిముసుఁగుతో నొకరు పండుకొని యుండిరి. వారా వ్యక్తిని పుర బాహ్య మార్గమునుండి గొనిపోవుచుఁ జార్వాకాశ్రమము కడ నిలిచిరి. "పిట్ట పట్టుబడినట్లేనా?" యని లోపలినుండి యొక ప్రశ్న వచ్చింది "పట్టువడకేమగును?" అని బయటనుండి వీరు ప్రత్యుత్తరమిచ్చిరి. "లోనికి గొనిరండు" అని లోపలివారు పలుకఁగా వీరా మంచమును లోనికి గొంపోయిరి.

లోపల నక్కనయుఁ జార్వాకగురుండును మాత్రమే యుండిరి. ఆ భటులా మంచమును వారి ముందునిడి నమస్కరించి నిలుచుండిరి. "ఇఁక మీరు వెళ్ళుచు" యని అక్కన వారిని బంపిన పిమ్మట "గురూ! ఇదిగో నా మాట చెల్లించుకొంటిని నీవు కోరిన శారదను నీకు సమర్పించితిని. ఇఁక నేను పోయి నా గదిలోఁ బండుకొందునా?" యని యడిగెను. ఆ చార్వాక గురుడంగీకార సూచకముగ మహదానందభరితలోచనములను ద్రిప్పెను. అంతనాతఁడు ప్రక్కనున్న గదిలోనికిఁబోయి పండుకొనెను

పిమ్మట నాచార్వాకుఁడు "శారదా! మదీయ హృదయమయూర నీరదా! నా మీఁద దయ రాదా! ఆనాఁడాపదలో నున్న నిన్ను రక్షించిన విశ్వాసమైనను జూపవా! గురువునైన నన్ను సేవించుట పుణ్యమే గదా! కోమలీ! క్షణకాలమైన ప్రేమభిక్షను బెట్టుము" అనుచు నామె మేలిముసుఁగును దొలఁగించెను. ఆ మంచముపైనున్న స్త్రీమూర్తి కలవరపాటున మేల్కాంచి "ఛీ దుర్మార్గుఁడా! దూరముగ బొమ్మ"ని కసరికొట్టెను. అంతనాతఁడు "బేలా! మేలా! ఈ జాలమేలా! ఇది మనుమసిద్ధి పాలనము గాదు. ఆనాఁటివలె నీనాఁడు నీవు నన్నుఁ దప్పించుకొని పోఁజాలవు సుమా! ఇట్టి వ్యర్థ ప్రయత్నములను మానుము" అని యామె చేయి పట్టుకొనఁబోయెను. "ఛీ పాపి! పరస్త్రీలను బలాత్కరించుటయేనా నీ మతము"ని యామె చేయి విదలించుకొనెను. "ఓహో! వెలయాలికి పాతివ్రత్యమా! నీవు పరస్త్రీ వెట్లగుదవు? కాంతా! గురువులతో వాదించి గెల్వఁ గలవా?" యనుచుఁ బైఁబడెను.

అంత నా కాంతామణి కన్నులు జేవురించినవి. భ్రూయుగ్మము వంగినది. ఆ వీరనారి మొలలో గుప్తముగ నుంచుకొనిన బాకును దీసి చేతఁదాల్చి క్షణములో ప్రళయకాల కాళికాకృతిఁ బూని మండిపడుచు హుంకరించినది. ఆ హుంకారమునకు గురుదేవుని సర్వాంగములును గంపింప మొదలిడినవి. "అమ్మో" యని యాతఁడొక కేక పెట్టుసరికే యాతని తల బంతివలె నెగిరి యెదురుగా వచ్చుచున్న యక్కన నెత్తినిఁబడినది.

ఆ దారుణ దృశ్యము చూచుసరికక్కన ప్రాణములు ముక్కాకలు మువ్వీసమెగిరిపోయినవి. అదివఱకెన్నఁడును లేని గమనవేగము కాళ్ళకుఁ జేకూరినది. అట్లు పలాయితుఁడగుచున్న యాతని వెన్నంటి "ఛీ! తులువా! వెన్నిచ్చి పాఱుటయా వీరలక్షణము" అని హుంకరించుచు నా స్త్రీమూర్తి వానిని వెంట తఱుమ మొదలిడెను. కాని యతఁడు పట్టువడక పారిపోయెను.

ఆ స్త్రీమూర్తి యెవరు? నిజముగా శారదయేనా? ఆమెకింతటి ధైర్య సాహసములెక్కడనుండి వచ్చినవి? ఆ పౌరుషమెట్లు లభించినది? కాదు ఆమె శారద కాదు. మారన తొలినాఁడు చార్వాకునకును అక్కనకును జరిగిన సంభాషణఁ జెప్పినది మొదలు శారద మెలకువగనె యుండెను. అప్పటినుండియు యామె మంత్రి యింటనె రహస్యముగ నుండెను. ఆమెకు బదులు స్త్రీ రూపమున నున్న వ్యక్తి వీరభద్రుఁడే. ఆ విధముగా నాతఁడు చార్వాకగురునిఁ జంపి యక్కనను గొంత తడవు వెంబడించి తిక్కన మంత్రి యింటి దెసకు మరలెను. అతడింటికి వచ్చుసరికి మంత్రియు దండనాధుఁడును మంతనము లొనర్చుచుండిరి.

"చార్వాకుని కోర్కెఁ దుదముట్టించితివా?" యని మంత్రి యడుగఁగా నాతఁడు "చిత్తమ"ని జరిగిన విషయమంతయును బూస గ్రుచ్చినట్లు చెప్పెను. పిమ్మట నాముగ్గురకు నీవిధముగా సంభాషణ జరిగినది.

తిక్కన :- ఇక నీవొకసారి వెలనాఁటి సీమకు వెళ్ళి రాజుగారి క్షేమ మరయవలయును.

ఖడ్గతిక్కన :- శత్రువుల పీటకొక్కనిని బంపుట శ్రేయస్కరము గాదేమో నేను గూడఁబోదునా!

తిక్కన :- అట్లే చేయుదు. మాఱనను గూడ దగ్గరనుండనిందు. వాని మూలమున నిక్కడి కెప్పటి విషయములప్పుడే చేరగలవు.

వీర - ఇందఱు యొక్కసారిఁ గలిసియున్నచో రాజపురుషులను మానింపరు గదా!

తిక్కన :- ఆ విషయములో జాగ్రత్తగ నుండవలయును

ఖడ్గతిక్కన :- వీరభద్రా! నీకు స్త్రీ రూపము బాగుగా హత్తినది. మనము భార్యాభర్తలుగను మారన మన కుమారుఁడుగాను వేషములు వేసికొని యందు తిరుగుదమా?

వీర :- అట్లు తిరుగుటకన్న పగటి వేషముల మేళముగ సంచరించుట మంచిది. అట్లు వెళ్ళినచో రాజాస్థానమందును, రచ్చలందును యథేచ్ఛగాఁ దిరుగ వచ్చును. సందు గొందులందు దూరవచ్చును. ఇంటింటికిఁ బోవచ్చును. నలుగురిలో మసలవచ్చును.

తిక్కన :- ఈ యుపాయము లెస్సగా యున్నది. దానికి మీ మువ్వురే కాదు మరి ముగ్గురు నలుగురున్నను బాధ లేదు. మన మూలఘటిక కేతనను గూడ మీతోఁ గొనిపొండు. ఇంకను నవసరమైనచో విశ్వేశ్వర దేశికులను సందర్శించి వారి శిష్యుల సహాయము గూడ నభిలషింపవచ్చును.

ఖడ్గతిక్కన :- ఎందుకు? వారి తోడ్పాటవసరము లేదు. మేము మువ్వురమే చాలుదుము. లేకున్న కేతనను గూడఁ గొంపోయెదము.

తిక్కన :- అక్కడ మిక్కిలి జాగ్రత్తతో మెలఁగవలయును సుమీ- ఆవలించినఁ బ్రేవులు లెక్కపెట్టఁజాలు వారచ్చటి మంత్రి దండనాయకులు.

వీర :- చిత్తము.

తిక్కన :- మఱొక్క విషయము. అక్కడ శివలీలలనే ప్రదర్శింపుడు గాని విష్ణులీలకు సంబంధించిన వేషము నెన్నఁడును వేయవద్దు.

ఖడ్గతిక్కన :- ఏల?

తిక్కన :- ఆ రాజు వీరశైవుఁడు. విష్ణు కథలన్న లెక్కస పడును.

ఖడ్గతిక్కన :- అట్లే చేయుదును.

ఈ విధముగ వారి సంభాషణలు జరిగిన పిమ్మట వీరభద్ర మారన ఖడ్గతిక్కనలు ధాన్య కటకమునకుఁ బయనించిరి. ఆ సమయమునఁ దిక్కనామాత్యుఁడు ఖడ్గతిక్కనను రహస్యముగఁ బిలిచి "మీరు వెళ్ళుచున్నది శత్రుపురికి. అక్కడ మిక్కిలి జాగ్రత్తతో నుండవలెను, సాహసముఁజూపుట శ్రేయస్కరము గాదు. శత్రువు కంటఁబడినపుడు భీమునివలె నీవు శరీరము మఱచి ప్రవర్తించె



దవు. కావున నింతగా చెప్పవలసి యున్నది. నీ కోప మణచుకొనియే ముప్పును గొనిరాకుండ ప్రవర్తింపుము"ని చెప్పెను.

19. పగటి వేషములు

సుమారిరువది దినములనుండియుఁ బగటి వేషములు జనరంజకముగఁ బ్రదర్శింపఁబడుచున్నవి. హాలాహల భక్షణము, సతీవియోగము, దక్షాధ్వర ధ్వంసము, పార్వతీతపము, గిరిజా కల్యాణము, కుమార సంభవము మొదలగు శివలీలలే గాక, సిరియాళుఁడు, మార్కండేయుడు, తిన్నఁడు మొదలగు శివ భక్తుల లీలలుఁగూడ బ్రదర్శించుచు నావేషగాండ్రు ధరణికోట ప్రజలకు వినోదము నొనరించుచుండిరి.

అనాఁడమరావతీక్షేత్ర మాహాత్మ్యమును గూర్చి ప్రదర్శింపుడని ప్రజలు కోరిరి. తారకునిఁ గుమారస్వామి యెదుర్చుట. అతనిని గుమారుఁడు చంపఁజాల కుండుట వాని కంఠమునందలి లింగ మాహాత్మ్యమున వాఁడు చావలేదని యాతఁడు గ్రహించి తల్లింగమును ఖండించుట అమరులమరేశ్వరుని బ్రతిష్ఠించుట. మొదలగు విషయములను వారు హృద్యముగ నటించిరి. ఆ సందర్భమున నొక నటుఁడు రంభ వేషము వేసి యమరేశ్వరుని మ్రోల నటించి జనులను ముగ్ధ పరవశుల నొనర్చెను.

బహుమానములు పుష్కలముగ వచ్చినవి. రాజుగారి సందర్శనమునకుఁ బోయి పారితోషికము నందుకొని రెండు మూఁడు దినములలో వేఱొక గ్రామము పోదుమని వారు చెప్పుకొనుచుండిరి. రాజసభకు నేగుసరికిఁ గులోత్తుంగచోడుఁడు బయ్యనతో రహస్యముగ యాలోచన యొనర్చుచుండెను. "ఇప్పుడు దర్శనమిచ్చుటకు వీలులేదు మఱొకసారి రమ్మ"ని రాజుగారు సెలవిచ్చిరి. వారు వల్లెయనిరి. కాని కపటనము నచటనుండి కదలుటకు జాగొనర్చుచుండిరి- వారిని లక్ష్యము చేయక బయ్యనయుఁ గులోత్తుంగచోడుఁడును దమ ప్రసంగమును గొనసాగించుచుండిరి.

బయ్యన ;- మహారాజా! ఇంకెంతకాలమీ జాగు?

కులోత్తుంగ చోళుడు :- మిత్రమా! తొందర పడరాదు. స్వభావముచేతఁ గాకపోయినను వేషముచేత జంగముఁడగుటచే నాతఁడు దండవీయుఁడు గాఁడు. కాషాయ వస్త్రమును గట్టి కంఠమునఁ బ్రాణలింగమును బెట్టినంత కాలమాతని నేమియు ననరాదు.

బయ్యన :- అట్టి ధర్మమార్గమున నుపేక్షఁజేసినచో మన ప్రయత్న మంతయు వ్యర్థమగును. తిక్కనామాత్యుఁడీ కుట్రను గ్రహించినచో రాజును విడిపించుకొని మన సర్వాశయములను భగ్నము చేయఁగలఁడు.

కులోత్తుంగ చోళుఁడు :- అది యుత్త భ్రమ అక్కన చేసిన తంత్రము లకు ఫలితముగ నిష్పక్షపాతునికి రాజకీయములందు విముఖత గలిగినది. ఏదో యేకాంతయముగూడఁ గట్టించుకొనుచున్నాఁడఁట గాదా! జీవితశేషమును భక్తి తత్పరతలో గడుపునేమో! ఈ విషయములన్నియు నక్కన మూలమున నెప్పటి కప్పుడు తెలిసికొనుచున్నాను గదా! ఇఁక సమయముఁ జూచి యీ రాజును కూడ మాట దక్కించుకొనవచ్చును.

బయ్యన :- ఆలస్యము చేసిన నమృతము గూడ విషమగునందురు మిత్రమా! ఒక యుపాయమును జెప్పెదను వినుము. ఆ రాజునకు వెలయాండ్రన్న మక్కువ మిక్కుటము. అందును శారద యనునామెఁ బ్రాణప్రదము. కావున నిపుణయగు నొక వారకాంతనటకుఁ బంపిన నామె యాతనిని వశమొనర్చుకొని జంగమరూపును మార్చునేమో!

కులోత్తుంగ చోళుడు :- అట్లయిన శారదనే బంపుట మంచిది.

బయ్యన :- శారద యిటకు వచ్చునా! ఆమె యిరువది దినముల క్రిందట నొక కార్వాక గురునిఁ బంపి యెచటకో పాఱిపోయెనఁట. ఆమె యెచటనున్నదో తెలియలేదు. ఒకవేళ తెలిసినను ఆమెను దత్కార్యమునకు నియోగించుట ప్రమాదహేతువని నా భావము.

కులోత్తుంగ చోళుడు :- నమ్మకమున్న నాతినే పంపుట మంచిది గదా!

బయ్యన :- ఆ శారదవంటి యపురూప సౌందర్యవతి యీ వేషగాండ్రలో నొకతె గలదు. మొన్న రంభ వేషమును వేసిన యా కాంతను జూచి నేను శారదయేయని భ్రాంతి పడితిని. ఆమెను బంపినఁ గార్యము సిద్ధియగునేమో?

అని ఆ నటులవంకఁ దిరిగి "ఓయీ! మొన్న రంభ వేషమును వేసిన నాతి యెవతె" అని యడిగెను. అంత వారి యజమాని వేషములోనున్న కేతన లేచి "అయ్యా! మా మేళమున నొక వేశ్య కలదు. అమె బసలోనున్నది. ఏలిన వారి సెలవైనచోఁ దెప్పించెదమ"ని పలికి వారి యనుమతిని బడసి వీరభద్రుని విడిదికిఁ బంపెను. ఆ బాలుఁడు విడిదికేఁగి యలంకరించుకొని రంభాకృతినటకు వచ్చి నిలచెను.

కులోత్తుంగ చోళుడు :- సుందరాంగీ! నీ పేరేమి?

వీరభద్రుడు :- భద్ర.

కులోత్తుంగ చోళుడు ;- నీవల్ల మాకొక కార్యము కావలసి యున్నది.

అని పలికి యామెతో రహస్యముగఁ గర్తవ్యమును బోధించెను. ఆ నటుల సామర్థ్యము నిరుపమానము. తమ్ము బాగుగ నెఱిఁగిన బయ్యన కంటనే దుమ్ము గొట్టి పోల్చుకొన నవకాశములేకుండ మెలఁగుచుండ వెలనాఁటి చోళుఁడేమి గ్రహింపగలఁడు? "ఓసీ! సిద్ధిభూపాలుని వశమొనరించుకొని యాతని ప్రాణ లింగమును గాషాయాంబరములను తీయించినచో నీకుఁ గావలసిన పారితోషిక మిచ్చెదమ"ని వారు మరల మరల చెప్పిరి.

"క్షణములో నెట్టి సన్యాసినైనను సంసారిగ మార్చగలను. కామము చంపుకొనని యా కపట సన్యాసిని కైవస మొనర్చుకొనుటెంత సేపు. మఱి యేలిన వారి యనుగ్రహమే మాకొక పెద్ద పారితోషికము" అని మందహాస మొనరించెను.

రాజుకడ సెలవుఁ గైకొని భద్రుఁడు శారదాకృతితో మనుమసిద్ధికడకు వెళ్ళెను. మనుమసిద్ధి యున్నది నేరములు చేయువారుండవలసిన చెఱసాల కాదు. కాళ్ళను జేతులను సంకెళ్ళతో బంధించి సామాన్య దోషులను బెట్టునట్లినుపగజముల ఖైదులో వెలనాటి చోడుఁడాతని నుంచలేదు. మనుమసిద్ధియును దనవంటి రాజే. అదియునుగాక పూజనీయమగు జంగమ వేషములో నున్నాఁడు. పండితారాధ్యుఁడు వెలనాఁటి చోడులను శపించిన నాఁటినుండియు నా చోడులకు జంగములన్న భక్తితోపాటు భయముగూడఁ గుదురుకొన్నది. అందుచే రాజేంద్రుఁడు మనుమసిద్ధి రాజేంద్రునొక విశాలమగు రమ్యభవనమున నునిచెను. ఆ భవనమొక యుద్యాన వనమున నున్నది. ఆ వనము చుట్టును దాళప్రమాణమున గోడలున్నవి. రక్షక భటులెప్పుడును అందు విచ్చుకత్తులతో నప్రమత్తులై యుందురు.

అది వసంతకాలమగుటచేఁ దోటలోని చెట్లన్నియుఁ జిగిర్చి పూలగుత్తులతో నిండియుండెను. పిల్లగాలులా చిగురుటాకుల నడుమ మెల్లమెల్లగా సంచరించుచుండెను. ఆ పండువెన్నెల లెల్లవారికిని మేను పులకరింపఁ జేయుచుండెను. ఆ ప్రకృతి శోభ హృద్యముగఁ బ్రతివ్యక్తికి నానందముఁ గల్గించుచుండెను. దీన స్థితిలోనున్న మనుమసిద్ధిని గూడ నా వనలక్ష్మి సొంపు గొంతవఱకు నాకర్షించుకొనక పోలేదు. అతఁడు తన భవన ప్రాంగణమునఁ గూరుచుండి తత్ప్రకృతి వైభవమును దత్పరతతోఁ జూచుచుండెను. అంతలో శారద రూపమున వీరభద్రుఁడచట ప్రత్యక్షమయ్యెను.

"శోభనాంగీ! యెవ్వతెవీవు! దివినుండి భువి కుట్టిపడ్డ చంద్రరేఖవా? నన్ను ననుగ్రహింప నవతరించిన రంభవా? లేక నేత్రపర్వమగు శారదవేనా? శారదవే సంశయము లేదు. ఆ బెళుకుఁజూపులు - ఆ నునుజెక్కిట జెంగిలించు దరహాస రేఖ ఆ ఫాలభాగమున వర్తించు ముంగురుల సోయగము అన్యకాంతా దుర్లభ మనుచు నాతండింకను నేవియో పలుకుచుండ నాతఁడు "మనోహరా! మెల్లగి మాటలాడుఁడు నేను శారదనే! ద్వారరక్షకులను బ్రతిమాలి వారి కృపనెట్లో

సంపాదించుకొని మెల్లఁగ రాజాలితిని." అని అచటి భటులు వినునట్లు బలికి యాతని కేలుగీలించి లోనికి గొంపోయెను.

ఆమె శారద యగునా కాదా యని సంశయించుచు తన రాకను గూర్చి యచ్చెరువుతోఁ గ్రుచ్చి గ్రుచ్చి యడుగు రాజేంద్రునకు వీరభద్రుఁడు దాను శారదను గాదనియు, దద్రూపమున వచ్చిన వీరభద్రుఁడననియు, దన యుదంతమును సవిస్తరముగఁ జెప్పి "రాజా! నీ జంగమ రూపమే నిన్ను రక్షించు చున్నది. దీనిని విడువవద్ద"ని పలికెను. ఆ రాజేంద్రుఁడు తాను తిక్కనపై ననవసరముగ ననుమానపడినందులకు వగచి తన్ను రక్షించు భారమా మంత్రి పుంగవునిదే యని చెప్పుమని దీనముగ కోరెను.

అట్లు వీరభద్రుఁడు రెండు మూఁడుదినములు తన విడిదినుండి మనుమసిద్ధి కడకు రాకపోకలు సాగించుచుఁ దన యుద్యమము నెఱవేర్చిన పిమ్మట రాజు కడకు వచ్చి "అయ్యా! నా శక్తికొలఁదిని ప్రయత్నించితిని. ఆ రాజిప్పుడు వైరాగ్యస్థితినున్నాడు. తన రాజపదవికన్న నీ జంగమస్థితియే గౌరవప్రదముగ నున్నదఁట అవగింజంతబూచి. మేన నద్దుకొన్న నా కసమంత వెఱ్ఱి యుండు నందురు. దేవా! అబలను నేనేమి చేయగలను?" అని సెలవు దీసికొని మేళములోఁ గలిసి సింహపురికిఁ బయనించెను

మనుమసిద్ధి రాజును జంగమ రూపమునుండి తప్పించుటకు వెలనాఁటి చోడుఁడు బయ్యనాదులతో నాలోచించుచు వివిధ ప్రయత్నముల నొనర్చు చుండెను.

ఈ పగటి వేషములతోఁ గోటలోఁ బ్రవేశించుటవలన వారు కొన్ని రహస్య మార్గములను మాత్రము కనుఁగొనఁజాలిరి. అందొక మార్గము తద్దుర్గమున కనతి దూరముననున్న దుర్గమారణ్యము నుండి కోటలోనికి రహస్యముగఁ బ్రవేశింపవచ్చునని గూడ వారు భావించిరి.

20. ఆహ్వానము

రుద్రాంబ విశ్వేశ్వరుని దేశికుని మఠమునుండి యోరుగల్లు వచ్చిన పిమ్మటఁ దాను జైనులచేఁ జిక్కుటయుఁ దిక్కన వీరభద్రులు తన్ను రక్షించుటయు మొదలుగాఁ గల విషయములన్నియు సవిస్తరముగఁ దన తండ్రికిఁ జెప్పెను. గణపతిదేవుఁడా వృత్తాంతమునెల్ల విన్న పిమ్మటఁ దిక్కన మంత్రికిని, వీరభద్రునకును, విశ్వేశ్వర పుంగవునకుఁ దగిన బహుమానములొసఁగవలెనని సమకట్టెను. ఆతని యారోగ్యము సరిగ లేనందున వారి నాహ్వానించుట కొంచె మాలస్యమైనది. రుద్రాంబదేశికుని మఠమునుండి వచ్చి అప్పుడే నాల్గైదు మాసము లైనది. ఆ మధుమాసమున నెట్లయినను వారిని బిలిపింపవలెనని యామె పట్టుఁ బట్టెను. దేశికుని మంత్రిని శిష్య సహితముగ రమ్మని గణపతిదేవుఁడు వర్తమాన మంపుచు వీరభద్రునకుఁ బ్రత్యేకముగ నాహ్వానము బంపెను. మఱియును వివిధ దేశములనున్న పండితులకును వివిధ మత గురువులకును నాహ్వానములు పంపఁ బడినది.

నానా దేశములనుండియు విద్వాంసులు శిష్య బృందముతో నోరుగంటికేఁగుదెంచిరి. శివదేవయ్య మంత్రి వేయి కన్నులతోఁ గనిపెట్టుకొని వారికే లోటును రాకుండఁదగిన సౌకర్యములను గూర్చుచుండెను. విశ్వేశ్వర దేశికుడునుఁ దిక్కనార్యుఁడును సముచిత శిష్యగణము సేవింప నటకు విచ్చేసిరి. ఆ యాగంతుకలలోఁ జెలరేగు వివిధ శాస్త్రవాదముల ధ్వని పారావార ఘోషను బరిహసించుచున్నట్లుండెను.


ఆ మంత్రిపుంగవునకు శివదేవయ్య తన యింటికడనే విడిది నిచ్చెను. ఆతనికి సపర్యలొనర్చుటకుఁ బ్రత్యేకముగఁ గొందఱు దాసదాసీ జనములు నియోగింపఁబడిరి. వారి కవకాశ మీయక శిష్యవర్గమే గురుసేవ నొనర్చుచుండిరి. వేదధ్వనులు, శాస్త్రవాదములు, కావ్యప్రసంగములు ప్రవృద్ధములయి గణపతి దేవుని పేరోలగము నానా విధములగు మంజులాలాపముల నొనరించు పక్షిగణములతో నిండిన ఫలవృక్షముపలె మనోజ్ఞముగ నుండెను.

గణపతి దేవుఁడు భారత శ్రవణాసక్తి సూచనగా శివదేవయ్య ప్రక్క మందహాస దృక్కులను ప్రసరింపఁజేసెను. అంతనా మంత్రిపుంగవుఁడు సాదర పూర్వకముగ కవిబ్రహ్మను భారత పఠనము గావింపుమనెను. అందులకాతఁడు సమ్మతించి తన మధుర కంఠమెత్తి శ్లోకములను జదివి వ్యాఖ్యానింప మొదలిడెను.

అందలి యుద్ధ ఘట్టములను వినునపుడా వృద్ధరాజు మహోశ్చర్యచకితుఁడై పరమానందము నొందుచుండెను. వ్యాసభగవానుని రచనా నైపుణ్యమునకు మెఱుఁగు బెట్టుచున్న తిక్కనార్యుని వ్యాఖ్యాన చాతుర్యమాతని నానంద నిమగ్నునిగాఁ జేసినది. ఆ భారత యోధులతోపాటు తాను గూడ యుద్ధరంగములో నున్నట్లు పరవశుఁడయి యాతఁడొకొక్కతఱి కత్తి ఝుళిపించినట్లు చేయాడించును. శరములను సంధించుచునట్లు చేతులు జాచును సింహనాద మొనరించును. భుజాస్ఫాలనముఁ గావించును. వీరునిచే వ్యాఖ్యానింపఁబడిన వీరగాథ వీరులను మైమరపింపఁజేయుటలో వింత యేమున్నది కర్ణార్జునుల యుద్ధఘట్టములను, భీమ దుర్యోధనుల గదా యుద్ధ సందర్భములను, భీష్మద్రోణాదులు చూపిన శౌర్య పటిమను, అభిమన్యుఁడు ప్రకటించిన ధైర్య సాహసములను, వినునప్పు డాతఁడా వీరులలో లీనమగును. కథాపఠనము ముగించినను వ్యాఖ్యానమాపినను ఆ రాజేంద్రుఁడింకను మైమరచియే యుండును. ఆతని కన్నుల యెదుటనింకను యుద్ధము జరుగుచున్నట్లే భావించును. ఆ యానంద శువులనట్లే విడుచు చుండును.

"మేలు కవీంద్రా మేలు! రాజనీతిలో మీకున్న యపార పాండిత్యమెల్ల మీ వ్యాఖ్యానమున నిముడ్చుచున్నారే.

వ్యాసభగవానుని గ్రంథములో కన్న మీ వ్యాఖ్యానములోని కృష్ణుఁ డెన్నోరెట్లు రాజనీతిని బ్రకటించుచు రాయబార మొనరించుచున్నాఁడు. చతురోపాయములను బ్రయోగించి కార్యసాధనముఁ బొందుచున్నాఁడు ఏమి! యీ నాటకీయ శైలి! ఏమి! యీ రచనాచాతుర్యము! రాజసభలో నా కృష్ణపరమాత్మ యెంత చక్కఁగఁ బ్రసంగించెను. మెత్తనిమాటలతో వంశౌన్నత్య కథనముతో నెత్తుకొని యెంత చక్కగ శత్రువులను బెదరించుచున్నాఁడు! అయ్యో! అట్టి వాగ్రచనా చాతుర్యమును జూపినను గౌరవులు సంధికొడంబడలేదా! ఔను! ఎందులకొడంబడెదరు? అంతకుఁడాహ్వానింప వారెట్లొడంబడఁగలరు? ఓహో! యింతలో మఱొక్క భేదోపాయమా కర్ణునిఁ దమవైపు ద్రిప్పుకొనఁ జూచుచున్నాడే యా శ్రీకృష్ణుఁడు? ఎంత చక్కని యుక్తి వాని తెరమఱుఁగు గాథలను వెల్లడి చేయు చున్నాఁడు! ఆ కురురాజ్యాధిపత్యము నాశఁ జూపుచున్నాఁడు. అతని యగ్రజత్వము నంగీకరించుచున్నాఁడు" అని శివదేవప్రగడ శ్లాఘింప మొదలిడెను.



"కవిపుంగవా! ఇట్టి యుద్గ్రంథము నేల యాంధ్రీకరింపరాదు?" అని గణపతిదేవుఁడాప్యాయముగఁ బ్రశ్నించెను. రాజేంద్రా! నాకును నదియే కుతూహలముగ నున్నది. కేతనార్యుఁడు, విశ్వేశ్వరశంభుఁడు మొదలగు మిత్రులు గూడఁ బ్రోత్సహించుచుండిరి. కాని దీనినాంధ్రీకరించుట మాటలతోఁ బనిగాదు. తగిన పాండిత్య మవసరమను మాట యటుండనిండు, మొదట యజ్ఞము చేసి నిష్కల్మషత్వముఁ జేకూర్చుకొన్న పిమ్మటఁగాని యీ పంచమవేదమును ముట్టుటకే యర్హత లేద"ని యాతఁడు పలికెను. అందులకా వృద్ధరాజు పెదవుల నొక్కించుక మందహాస మంకురింప "అట్లే చేయుఁడు యజ్ఞమును జేసియే దీనిని రచింపవచ్చును." అని నవలక్ష నిష్కములను యజ్ఞ కుండలములను, బహూకరించెను. అతని యాదరాతిశయమునకా కవిపుంగవుఁడానంద భరితుఁ డయ్యెను.

తిక్కన కవీంద్రునకొక సాహిత్యమందే గాక యితర శాస్త్రములందును రాజనీతియందును వేదాంతమునందును ననన్యసామాన్యమగు పాండిత్యమున్నట్లు విశ్వేశ్వర దేశికు లుగ్గడించిరి. ఆ కాకతీయ రాజన్యుని ప్రార్థనమున నా మంత్రి పుంగవుఁడు ద్వైతాద్వైతతత్త్వములను విస్మృతిచిదచిద్వివేక లక్షణములను ధర్మాధర్మ పద్ధతులను రాజనీతి ప్రకారమును నెఱింగించెను. ఆ విషయములను జెప్పునపుడు భారతమందలి శ్లోకములనే లక్ష్యములుగ నిచ్చెను. ఇప్పు డప్రయత్నముగ భారత ఘట్టములతని నోటఁ బద్యరూపమునఁగూడ వెల్వడుచున్నవి. ఆ పద్యములకచటి వారెల్లరు నాశ్చర్యచకితులైరి. "కవీంద్రా! ఇంతటి అద్భుత ప్రతిభా శక్తిసంపన్నులై యుండియుఁ దీని నాంధ్రీకరించుట మాటలతోఁ బనిగాద"నుచున్నారా! యను పలుకులు శివదేవయ్య దరహసిత వదనమునుండి వెల్వడెను. "అతఁడు నివురుగప్పిన నిప్పు. అన్ని విషయముల నెఱుంగునుగాని గర్వపడనెరుఁగఁడు. వినయధురీణుఁ"డని దేశికుఁడు పలికెను. యజ్ఞమును చేసి మీరు భారత రచనకు మొదలిడుఁడు కృతినాయకునిగా..." అని గణపతిదేవుఁ డేదియో చెప్పబోవుచుండఁగా దేశికులు "ఇట్టి వేదతుల్యములగు గ్రంథములకు నాయకత్వమును వహించుటకు సర్వశక్తి సంపన్నుఁడైన భగవంతుఁడొక్కఁడే యర్హుఁడ"ని వచించెను. అందులకు తిక్కనార్యుఁడు "నాకును నట్లేయున్నది. ఈ మహాకావ్యము రచింపఁజాలుటకు నేనెవఁడను? ఆ పరమేశ్వరుఁడే నాచే నిది వ్రాయించుకొని నాయకత్వమును బడయఁగలఁడు" అని నిమీలిత నేత్రుఁడై పలికెను.

పిమ్మట రాజేంద్రుని యనుమతమున మతచర్చ ప్రారంభింపబడినది. తిక్కనార్యునకు బౌద్ధ జైనమత గురువులతో వాదము జరిగినది. హనుమకొండ, ఘంటసాల, భట్టిప్రోలు, అమరావతి మొదలగు స్థలములనుండి వచ్చిన బౌద్ధ జైన గురువులతో నాతఁడు వాదించెను. ఆ చర్చలోని వాద ప్రతివాదములు పండితజనాహ్లాదకరముగ నుండెను. ఆ మతాచార్యులెల్లరు నేకమైనను తిక్కన యుక్తికి సరియగు నుత్తరమీయఁ జాలకపోయిరి. వర్ధమాన, మహావీర, బుద్ధ భగవానుల యాశయములను ఆదర్శములను బూర్తిగ గ్రహింపఁజాలకున్నను పొట్ట పోషణ కొఱకు మాత్ర మాచార్య పదవులను స్వీకరించిన యా పండితమ్మన్యులు, నానా మతసారములను జీర్ణించుకొని త్రేనిచిన యా కవిబ్రహ్మతో వాదింపగలరా! అతని సిద్ధాంతములను బూర్వపక్షము చేయఁగలరా!

తుదకా బౌద్ధ జైనగురువులందరు నేకమయి కూడఁబలుకుకొని "మీ మతము హింస నంగీకరించుచున్న"దనిరి. "మీ వసదులందు హింస జరుగలేదు గదా!" అని కవీంద్రుఁడు రుద్రాంబనంతకు పూర్వము బంధించిన జైనగురువు వంకఁ జూచెను. సిగ్గుతోనతఁడు మోము వ్రాల్చెను. "ఈ యర్థములేని వాదన యేటికి హింస నెవరరికట్టఁగలరు. పుణ్య పాపములకు మూలము బుద్ధిగాని చేష్టలు గావు. వినుడు.

సీ॥ దివియలోఁబడుఁ బుర్వు దివియ యెత్తినవాని
 బాపంబువొందునే! యోపిదున్న
నాఁగేటి మొనఁజచ్చు నానావిధ ప్రాణు
 లన్నరు బొందునేయఘము? వారు
దమ పనుల్సేయ విధాత్ర వశమున నా
 యువు దెగినట్టి జంతువులు సచ్చు
నేము సంపితిమని యించుకేనియూనహం
 కారంబు వారికిఁ గలుగదట్లు.
గానమూ బెవారిఁ గల్మష మొందదు
పుణ్యపాపములకు బుద్ధిమూల
మని శివుండు మఱియనను హింసవోలినై
యధిక ధర్మమైన విధము వినుము.

అని యాతఁడు వారి వాదమును ఖండించెను. ఆశువుగ నతని నోట వెడలిన యా పద్యమున కచ్చెరువంది గణపతి దేవుఁడు తన గద్దెను దిగి యా కవీంద్రునిఁ గౌగిలించుకొని "పండితోత్తమా! ఈ బౌద్ధ జైనవాదములను ఖండించి హైందవమును బునఃప్రతిష్ఠించుచున్నారు" అని ప్రస్తుతించెను.

21. సత్కారములు

జైనుల బారినుండి తన ప్రియనందనను రక్షించినవారిని సత్కరింపవలె నని గణపతి దేవుఁడు సమకట్టెను. ఆ విధముగ సత్కారముఁ బొందవలసినవారు విశ్వేశ్వరదేశికులు, తిక్కనార్యులు వీరభద్రాఖ్యుఁడునని యాతఁడు గుర్తించెను. అందు ప్రథమ సత్కారము తిక్కనార్యునికిచ్చుట మంచిదని శివదేవయ్య సూచించెను.

రాజానుమతమున నా కాకతీయమంత్రి తిక్కనమంత్రికిఁ దన చేయూత నిచ్చి గొనివచ్చి రాజ ప్రక్క రత్నాసనము నాసీనుని గావించెను. గణపతి దేవుఁ డతనికిఁ బ్రణమిల్లి "ఆర్యా! రుద్రాంబ నాకుఁ బుత్రికయే యైనను బుత్రునితో సమానము. నా యనంతర మీమెయే యీ సామ్రాజ్యమున కధీశ్వరిగాఁ గలదని మేమాశించుచున్నాము. అట్టి మా యాశాంకురముతో మాకు ఋణము తీరుచున్న సమయమున భగవంతునివలెఁ బ్రాణదాన మొసంగిన మీకుఁ దత్తుల్యమైన ప్రత్యుపకృతి నేనేమి చేయఁగలను? అని పలుక నా కవీంద్రుఁడు "మహారాజా! ఈ విధముగ నన్నుంచుచున్నాను. మా రాజేంద్రుఁడిపుడు రాజేంద్రచోడునిచేఁ బట్టుపడియున్నాడు. నెల్లూరు పురమక్కన బయ్యనల వశమై యున్నందున సైన్యము మా స్వాధీనములో లేదు. మా రాజును రక్షింపవలెనని మిమ్ము వేడు చున్నాన"ని కూర్చుండెను.

అన నా కాకతీయ రాజేంద్రుఁడు "మహామంత్రీ! అస్త్రగురులైన యపర కుంభసంభవులు మీరు. సైన్యసహాయము లేకపోయినను ధరణీకోటను వశ మొనరించుకొనఁజాలు శక్తి మీకుఁ గలదు. అదియును గాక మీకడ విశ్వ నశ్య

సించిన యె శిష్యునిఁ బంపినను క్షణములో మీ కార్యమును సాధించగలఁడు. అయినను నాపై మీకుఁగల యనురాగముచే నా కృతజ్ఞతను జూపుకొనుట కిట్టి యవకాశమును గల్పించుచున్నారు. ఇదెంతపాటి పని. మఱియును వెలనాఁటి చోడుని దండించుట మాకును ముఖ్యావశ్యకమే. మూఁడేడుల నుండియు నాతఁడు మాకుఁ గప్పములు చెల్లింపలేదు, ఆ గర్వమునకుఁ గారణమేమియో! ఇప్పుడే రణభేరి మ్రోగింపఁజేసెద" ననునంతలో నా ప్రాంతమందలి శివాలయమునుండి ఘంటికారావములు వినవైనవి. పిమ్మట గణపతి దేవుఁడు శివదేవయ్య యనుమతి ప్రకార మెనిమిది గ్రామములను తిక్కకవీంద్రునకు బహూకరించెను. అందులకా కవీంద్రుఁడు సంతుష్టాంతరంగుఁడై లేచి "రాజేంద్రా! ఈ మంత్రి శివదేవుఁడే కాని శివదేవయ్య గాదు. వత్సరాజును యౌగంధరాయణునట్లు మిమ్మతఁడు రక్షించుచున్నాఁడు. ఈతని పురుషార్థసారమునందలి నీతి ననుసరించి రాజ్యపాలన మొనరించిన ప్రభువులకు మేలొదవున"ని వచించెను.

తిక్కనార్యుని యనంతరము సత్కరింపఁబడవలసినవాఁడు విశ్వేశ్వర దేశికుఁడు విశ్వేశ్వరుఁడు గణపతి దేవునకు దీక్షాగురుఁడును దైవసదృశుఁడును. ఆ శైవాగమనిధిని రాజపుంగవుఁడర్ఘ్యవిధముగ భజించి మీకుఁ గావలసిన యగ్రహారమేదియో సెలవీయుఁడని వినయపూర్వకముగ నడిగెను. అందులకాతఁడు సంతసించి "మహారాజా! నీ యౌదార్యము నేనెఱుఁగనిది కాదు. అడిగిన స్థలములలో నగ్రహారముల నెవరిత్తురు? అడిగితివిగానఁ జెప్పుచున్నాను. కంద్రవాటి యందలి మందర గ్రామమును మాకిచ్చినచో నది మా మతమునకు దగ్గరలో నున్నది. దాని రాబడివలనఁ బాఠశాలను, సత్రమును, వైద్యశాలను నభివృద్ధి లోనికిఁ దేవచ్చును" అని పలికెను.

ఆ మందర గ్రామము కృష్ణానది కుత్తరమున వెలనాఁటి విషయములో నున్నది. అది దేశికుని యాశ్రమమునకుఁ జేరువలో నున్నమాట వాస్తవమే. కాని గురుపుంగవుఁడు దాని నర్థించుటలో నున్న యంతరార్థము వేరు "గురుదేవా! అది వెలనాటి విషయములోనిది. కులోత్తుంగ రాజేంద్రుని జయించిన పిమ్మట గదా మీకీయఁజాలుదు" అని యా రాజన్యుఁడనగా" నట్లే కానిమ్ము నీవు మాకిప్పుడు వాగ్దానము చేసినఁ జాలును" అని ప్రత్యుత్తరమిచ్చెను. అందులకా రాజన్యుఁడంగీకరించెను. రుద్రాంబ దేశికునకు వెంగపూడియను మఱొక గ్రామమును మందరతోఁ గలిపి అప్పస్వామ్యముతోడను, పంటలతోడను, కృష్ణలోఁగల లంకలతోడను జేర్చి దానముఁ జేయవలెనని తన తండ్రిని కోరెను. ఆ రాజేంద్రు డందులకు సమ్మతించి యా రెండు గ్రామముల నిచ్చెదనని వాగ్దాన మొనరించెను.

ఇంకెవరిని సత్కరింపవలెన"ని గణపతి దేవుఁడు పుత్రికవంకఁ జూచెను. "వీరభద్రున"ని చెప్పవలెనని యామె యనుకొన్నది. కాని యా పేరు తన పెదవుల దాటి రానీయకుండ పెనులజ్జ పెనగులాడుచున్నది. ఆ బాలిక యారాసుతునివంక నొకసారి చూచి మందహాస మొనరించి తలవంచి యూరకుండెను.

లజ్జాన్వితయై యా బాలిక వీరభద్రుని పేరుఁజెప్పుట కట్టాలస్య మొనరింపనది గమనింపక విశ్వేశ్వరుఁడు రాజున కధర్వణుని గూర్చి చెప్పెను. "ఆ మహనీయుఁడే లేనిచో జైన వసదులలో జరిగిన విషయమే మనము తెలిసికొనలేము ఆ బ్రాహ్మణోత్తముఁడు తాను మతభ్రష్టుఁడైనను వైదికమత రక్షణకై పడుచున్న పాట్లు మనము గుర్తింపవలయును" అని పలికెను. జైనుఁడగుటచే నతనిని సత్కరించుటకు రాజు మొదట శంకించెను. కాని దేశికుని మాటయందలి విలువ వలన తుదకంగీకరించెను. "జైనులను గొందరిని చిత్రవధ చేయించినాము. కొందఱు బెదరి నలుదెసలకును చెదరి పరువులిడిరి. అందా యధర్వణుఁడెటు పోయెనో యెవరెఱుఁగుదుర"ని యా రాజనగాఁ దిక్కనార్యుడు "రాజేంద్రా! మీరు చెప్పినట్లు భయకంపితుఁడై యుండగా నాతని కభయమిచ్చి నా విడిదిలోనుంచితిన"ని పలికెను. రాజానుమతమున భటులతనిని సభకుఁ గొనివచ్చిరి. "అయ్యా! మీకేమి కావలయు?"నని శివదేవయ్య యడుగగా, నాతఁడు "ఆర్యులారా! నాకేమియు నక్కఱలేదు. జీవములతో నుండనిచ్చినఁ జాలును. అదియే నా మొదటి కోర్కె. నేను జైనమతావలంబినో వైదికమతాభిలాషినో యీ యాంధ్రావని గుర్తింపవలె ననునది నా రెండవ కోర్కె"యని పలికెను. రాజాతని కభయమిచ్చి యమిత ధన మొసంగి సత్కరించెను.

పిమ్మట గణపతి దేవుఁడు "అమ్మాయీ! ఇఁక వీరభద్రునే కదా! మనము గౌరవింపవలసినది" అని యడిగెను. అందులకా లలనామణి తల వంచుకొనెను. అతనినెట్లు సత్కరింపవలెనో యీ బాలిక యంతకుఁ బూర్వమే తన తండ్రికి దెలియజేసి యుండెను. తన ప్రాణములు రక్షించిన యా వీరకుమారునకుఁ దన హృదయ మర్పించియుండినట్లామె తన యక్క యగు గణపాంబచేఁ దండ్రి కంతకుమున్నే చెప్పించెను.

ఆ రాజపుంగవుఁడా రాజకుమారు జేరఁబిలిచి "నాయనా! వీరభద్రా! మీ తండ్రి మా యాప్తులలో నొకఁడు. నీవు మా పుత్రికను రక్షించి మా సఖ్యమునకు మఱింత సన్నిహితత్వమును జేకూర్చితివి. జరాభారముచే నాకు రాజకీయ వ్యవహారములను జక్కఁ బెట్టుకొనుట కష్టతరముగ నున్నది. కావున నీవు నా కుమారికను బరిణయమాడి యిచటనే యుండి రాజ్యపాలనయందుఁ దోడ్పడఁగోరుచున్నాను" అని పలికెను. ఆ పలుకులు విన్నంతనే యాతని హృదయ మానంద తరంగ డోలికల నూగులాడెను. అతఁడు కృతజ్ఞతాసూచకముగ శిరము వంచెను.

రాజేంద్రుఁడంతకుఁబూర్వమే నిరవద్యపురమునకు వార్త నంపియుండెను. వీరభద్రుని తండ్రి యిందుశేఖరుఁడు, తమ్ముడు మహాదేవుఁడును తరలి వచ్చిరి. "మమ్ముడమ్మను మహాదేవునకిచ్చి వివాహ మొనరించిన బాగుండున"ని మంత్రి శివదేవయ్య సూచించెను. రాణివాసము గూడ నా విషయము నామోదించెను. అచటి వారెల్లరును నట్లు చేసిన బాగుండునని భావించిరి.

అనతి కాలముననొక శుభదినమున భేరికా నినాదములును, దూర్యారావములును దిక్కుల నిండెను. వైదికజనాశీర్వాదములు మార్మ్రోగినవి. కవిపరేణ్యుల చతుర్విధ కవితా ప్రదర్శనలు విద్వజ్జనరంజకములుగా నుండెను. నాట్యకత్తెల నటనాపటిమ ఆనాహ్లాదకరముగా నుండెను. ఆ కల్యాణము గౌరీ కల్యాణమువలె, లక్ష్మీ నారాయణుల వివాహమువలె వైభవాస్పదముగ జరిగినది.

(ఇంకా ఉంది)

మమత

హృదయంలోనుండి ఆశాకెరటం ఉవ్వెత్తున లేచింది
సాగర కెరటంలా తీరాన్ని స్పృశించాలని కాదు
లోకంలోని ఆనందం చవిచూడాలని
పెదవులనుండి పలుకేదో ఎలుగెత్తి పాడింది
ప్రఖ్యాత గాయనిలా పేరొందాలనికాదు
కవితకు జీవం పోయాలని
కన్నుల చూపులు సునిశితంగా మారాయి
ప్రకృతికన్య అందాలను ఆస్వాదించాలనికాదు
పరమాత్ముని పనితనం పరికించాలని
కాలి అందెలు ఘల్లుఘల్లున మ్రోగాయి
నృత్యంలో ప్రావీణ్యం పొందాలనికాదు
నిశ్శబ్ద నిశీధిలో చైతన్యాన్నివ్వాలని
సుకుమార హస్తాలు చురుకుదనం సంతరించుకొన్నాయి
తనివితీర సోయగాన్ని తాకాలనికాదు
విధివంచితుల దుఃఖాశ్రువులను కరుణతో తుడవాలని

శాంతి



దీపిక

కొడవంటి కాశీపతిరావు

"ఏవిటీ...రచయిత గోపాలకృష్ణ మీరేనా..." అంటూ ఆశ్చర్యపోయింది దీపిక. ఆశ్చర్యాన్ని ఒక్క క్షణంలో విషాదం కమ్మేసింది. ఆ వెంటనే మనసులో చెలరేగుతూన్న ఆందోళనను తట్టుకోలేకపోయింది.

ఎర్రబడుతూన్న కళ్ళలోకి ఉబికుబికి రాబోతున్న కన్నీళ్ళూ, మండుతూన్న గుండెలోనుండి ఉరికురికి ముక్కుపుటాల ద్వారా గుప్పుమనబోతూన్న ఆవిరులు, భగభగమంటూన్న కడుపులోనుండి ఉడికుడికి ముఖం మీద పరుచుకుంటూన్న రంగులూ ...గబుక్కున లేచి బాత్‌రూమ్‌కేసి వెళ్ళింది దీపిక.

అక్క జీవితం ...అక్క రూపం ...అక్క ఆశయా...

మాడి మసైపోతే

వింటూ చూస్తూ ఏమీ చేయలేని తన అశక్తత, నిస్సహాయత, చేతగానితనం ఇన్నాళ్ళకి మళ్ళీ జ్ఞాపకానికొచ్చాయి. తల గోడకేసి దబ దబ బాదుకుంది. కళ్ళలోంచి కడుపులోని బాధను కసిగా కార నిచ్చింది. గుండెల్లో మంటను కసకొద్దీ ముఖంనిండా పరుచుకో నిచ్చింది.

పావుగంట గడిచేక శుభ్రంగా ముఖం కడుక్కుని తాజాగా వచ్చి స్టాఫ్ రూములో కూర్చుంది దీపిక.

"ఏవిటీ... మధ్యలో సడెన్‌గా వెళ్ళిపోయేరూ..." అనడిగేడు కృష్ణమూర్తి.

"అబ్బే...ఏం లేదూ..." అంటూ నవ్వింది దీపిక.

"ఈ స్కూలుకి మీరొచ్చి మూణ్ణెల్లే కదా అయ్యింది. అంచేత మీకు తెలియకపోవచ్చుకు గాని నా పేరు కె. గోపాలకృష్ణమూర్తి అయినా స్కూలు రికార్డుల్లో కేజీ కృష్ణమూర్తి అని వుంటుంది. పోతే రచనలు మాత్రం గోపాలకృష్ణ పేరుతో చేస్తుంటాను." అని వివరిస్తున్నాడు కృష్ణమూర్తి.

ఈలోగా బెల్లయింది.

"మీ రచనల గురించి తర్వాతెప్పుడైనా తీరిగ్గా చర్చించాలి. మీరే గోపాలకృష్ణ అని తెల్సిన తర్వాత వదుల్తాననుకున్నారా?" అంది దీపిక లేస్తూ.

ఉబ్బి తబ్బిబ్బయిపోయాడు కృష్ణమూర్తి.

"తప్పకుండాను. మీరెప్పుడూ నన్ను వదిలిపెట్టకూడదనే నేనూ కోరుకుంటున్నాను." నవ్వుతూ పొంగిపోతూ అన్నాడు కృష్ణమూర్తి.

బెల్ కావడంతో మరిన్ని మాటలు ఆశించిన కృష్ణమూర్తికి నిరాశే ఎదురయ్యింది. గుండెల్లో సందళ్ళకూ ముఖంలోని రంగులకూ పొంతన కుదర్చలేకపోతూన్న దీపికకు నిట్టూర్పే మిగిలింది.

క్లాసులో కూర్చున్న దీపిక గుండెల్లో చెలరేగుతూన్న సంచలనాన్ని తట్టుకోలేకపోతోంది. తెరలు తెరలుగా వస్తున్న దుఃఖం ఆపుకుంటూ పిల్లలకు వర్క్ ఇచ్చింది. ఆపైన దుఃఖానికి కారణమవుతున్న ఆలోచనలకే తావిచ్చింది.

ఎంతసేపటినుండో మనసులో ఏమూలనో చిన్నగా మెదులుతూన్న అక్క రూపం విశ్వరూపం దాల్చి ఎదుట నిల్చింది.

రాధిక!

అవునెంత చక్కనిదెంత చల్లని మనసుది!

ఏదా చక్కని రూపం? ఏమై పోయిందా చల్లని మనసు?

పిచ్చిగా పత్రికలు చదివేది. వేలంవెర్రిగా గోపాలకృష్ణ కథలను గూర్చి వినేవారికీ విననివారికీ మరీ మరీ చెప్పేది.

'మీ(మా) పత్రికలో ప్రచురింపబడ్డ గోపాలకృష్ణగారి కథ నా మనసునెంతో ఆకట్టుకుంది. మరిన్ని కథలు ప్రచురిస్తారని వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నాను'. అంటూ పత్రికలకు రాయడం ప్రారంభించిన ఉత్తరాల తోరణం గోపాలకృష్ణను తాకేవరకూ పెరిగింది.

గోపాలకృష్ణనుండి మొదటిసారిగా ఉత్తరం వచ్చినరోజున... రాధిక రాధిక కాదు. గోపాలకృష్ణుని దర్శనంతో సంతోషపు కొండెక్కిన గోపిక. ఒక్కో కథలోనూ గోపాలకృష్ణ వెలిబుచ్చిన ఉన్నతమైన ఆశయాలూ, ఉదాత్తమైన అభిప్రాయాలూ ఎత్తిచూపుతూ ఒత్తిపలుకుతూ వివరించేది.

ఇది కేవలం రాధికకు సాహిత్యం మీదున్న అభిమానం మాత్రమే అనుకున్నారంతా. కాని అది గోపాలకృష్ణ మీద ప్రేమగా మారుతుందని, ఆ ప్రేమముందు తల్లిదండ్రుల్ని, రక్తసంబంధాల్ని, కట్టుబాట్లని కూడా కాదని వెళ్ళిపోతుందని ఊహించలేకపోయారు.

రాధిక వెళ్ళిపోయేక పత్రికలకు రాసి గోపాలకృష్ణ అడ్రసు తెలుసుకుని వెళ్ళిన తల్లిదండ్రులకి నిరాశే ఎదురయ్యింది. గోపాలకృష్ణ బిచాణా ఎత్తేసాడు! రాధిక నిజంగా గోపాలకృష్ణను కోరుకుందని చెప్పి వుంటే కాళ్ళా వేళ్ళా పడయినా అతన్ని తెచ్చి పెళ్ళి చేసేవారం కాదా అనుకుంటూను, మాట మాత్రం మాతో చెప్పనైనా చెప్పేవు కాదు తల్లీ అని బాధపడుతూను, అతను నిజంగా రాధికను ఏలుకుంటున్నాడో లేదో అని అనుమానపడుతూను, నీ బ్రతుకేలాగే తీరు నేవిధంగా సాగుతున్నదో అని బెంగపడుతూను! తల్లీ తండ్రీ ఒకరినొకరు అనునయించుకుంటూను అనుకరిస్తూను మరణాన్ని ఆశ్రయించేరు.

ఆ తర్వాతెప్పుడో పోలీసువారిద్వారాను, పత్రికల ద్వారాను రాధిక ఆత్మహత్య గురించి తెలుసుకునే దురదృష్టం కలుగకుండానే వెళ్ళిపోయేరు వాళ్ళిద్దరూ.

మరి తను...?

యవ్వనం తెచ్చిన ఉత్సాహంతోనూ, కల్మషం దూరని మనసులో పొంగే ఆనందంతోనూ గంతులిడబోతోంది. జీవితంతోనూ కాలంతోనూ పోటీ పడుతూ పరుగులిడబోతోంది. అప్పుడప్పుడే చదువు ధ్యాసనుండి తలెత్తి రెండు కళ్ళతో లోకంలోకి చూడబోతోంది. ఆ క్షణంలోనే ఉద్యోగపు లోకంలో అడుగెట్టి రెండు



కాళ్ళమీదా నిలబడలేకపోతోంది.

రాధికక్కా, తల్లీ, తండ్రీ అంతా వరసగా కనుమరుగై పోవడంతో దీపిక కళ్ళల్లో దీపాలు ఆరిపోలేదూ? కాళ్ళలో రక్తం ఆవిరులై పోలేదూ? కడుపులో పేగులు తెగిపోలేదూ?

అవునవును.

యవ్వనం, ఉత్సాహం, అందం, ఆనందం ఇంకా ఏవేవి చూసుకుని వేడివేడిని మనసులో నింపుకుని జీవితంలో పరుగులెట్టాలని కాలంతో గంతులెయ్యాలని అనుకుందో అవన్నీ ఏమైపోయేయి? మరింక ఏ విషాదం, ఏ కల్మషం, ఏ కన్నీళ్ళు, ఏ బాధలు తన ఇంట్లోకి, తన కంట్లోకి తన మనసులోకి, తన వయసులోకి రాకూడదనుకుందో అవన్నీ ఒక్కుమ్మడిగా వచ్చెయ్యలేదూ?

మరటువంటప్పుడు ఈ దీపిక ఏమనుకుందేమనుకుంది? 'తన కుటుంబాన్ని నామరూపాల్లేకుండా చేసినవాణ్ని చీరెయ్యాలనుకో లేదూ ...? నరికేయాలనుకోలేదూ...? నిలువునా బూడిద చేయాలనుకోలేదూ...?

ఈనాడిప్పుడిక్కడిలా ఎదురయ్యేడు గోపాలకృష్ణ...కృష్ణమూర్తి అవతారంలో.

"ఏవిటి దీపికా...లాంగ్‌బెల్లయి చాలాసేపయినా ఏవిటిలా కూర్చుని వుండిపోయేరు. ముఖం చూస్తే మధుర స్మృతులేవో కదుల్తూ వున్నట్టున్నాయ్..." అని కృష్ణమూర్తి అంటున్నాడు కొంటెగా.

మనసులో ఏమున్నా ముసిముసిగా నవ్వింది దీపిక.

అంతేకాదు "మీ గురించే..." అని గోముగా అంది కూడా

వచ్చేపోయేడా మాటకి కృష్ణమూర్తి. తేరుకునేసరికి అరగంట పట్టింది. ఆ మధ్యకాలంలో దీపిక ఇంటికే చేరిపోయింది.

మర్నాడు స్కూలుకి రాగానే...

"ఒక్కమారిలా వస్తారా..." అన్నాడు కృష్ణమూర్తి. అందరికీ కాస్త దూరంగా వెళ్ళేరిద్దరూ.

"మీతో పరిచయమయ్యేక నా జీవితంలో లోటేమిటో తెలిసింది." అన్నాడు కృష్ణమూర్తి.

విని వూరుకుంది దీపిక.

"మీతో పరిచయమయ్యేక మీ గురించిన ఆలోచనల ప్రేరణతో మరిన్ని కథానికలు రాసేను." మళ్ళీ అన్నాడు మైమరచిపోతూ

విని నవ్వింది దీపిక

"మీతో పరిచయమయ్యేక మరో అమ్మాయితో జీవితాన్ని ఊహించుకోలేకుండా వున్నాను... తిరిగి అన్నాడు తీయగా.

విని అంది దీపిక.

"మన పరిచయం కాక పూర్వం అమ్మాయిలతో మీ జీవితాన్ని నేనూహించనా..." అని.

తడబడ్డాడు కృష్ణమూర్తి.

"గోపాలకృష్ణుడు చుట్టూ రాధికలూ, గోపికలూతో రాసక్రీడలు సలుపకుండా వుంటాడా..." అంది అతని ముఖంలోకే చూస్తూ.

తింగుతిన్నాడు. పాలిపోయిన ముఖానికి రక్తంరంగు పులుముకోవడానికి ప్రయత్నిస్తూన్నాడు కృష్ణమూర్తి.

"అదేవిటిలా అయిపోయేరు? అసలే మగవారు. అందులోకి కృష్ణనామధారులూ అందుకే అలా అన్నాను. కొంపదీసి నిజమేనేమిటి? ' అంది మళ్ళీ కవ్విస్తూను

"ఛ ఛ..." అని మాత్రం అన్నాడు కృష్ణమూర్తి.

"ఏదేమైనా నా గురించి మీరు తెలుసుకోకుండా, మీగురించి నేను తెలుసుకోకుండా మీరంతంత డైలాగులు మీ కథల్లోలా చెప్పేస్తే ఎలా. నా గురించి చెప్తాను. విన్నాక మీ డైలాగులు చెప్పండి. సంతోషిస్తాను...." అంది దీపిక.

"మా అక్కయ్య ఒకణ్ని ప్రేమించాననుకుని వెళ్ళిపోయి, మోసపోయి ఆత్మహత్య చేసుకుంది. అది భరించలేని నా తల్లిదండ్రులూ వెళ్ళిపోయేరు. పోతే ఇక్కడికొచ్చేక మీ గురించీ అలాంటి కథే విన్నాను. ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకోకపోయేసరికి ఆ పిల్ల ప్రాణం తీసుకుందని మన స్టాఫ్‌లోనే చెప్పుకుంటుండగా అనేకసార్లు విన్నాను...."

ఏవీ మాట్లాగలేకపోయేడు కృష్ణమూర్తి.

"డైలాగులు గుప్పించే నోరు మూగపోయిందేం కృష్ణమూర్తి గారూ.... చెడి ప్రాణం తీసుకున్న పిల్ల చెల్లెలిని చేసుకోవడానికి మీ సాహిత్యం తెచ్చిన సంస్కారం అడ్డుపడుతుందా? ఆదరిస్తుందా?" అని నిలవేసింది దీపిక.

"మీరిష్టపడాలేగాని... మన గతాలు ఏమైనప్పటికీ మిమ్మల్ని చేసుకోవడానికి నేను సిద్ధమే...." అన్నాడు నిబ్బరంగా కృష్ణమూర్తి.


"జీవితానికి ఒకసారి కాక నెలకోసారి పదిహేను వందల కట్నం జీతం రూపంలో తెచ్చి పోస్తే ఎవరయినా చేసుకుంటారు. అయినా మరొక్క నిజం చెప్తాను. విన్నాక అప్పటికీ సిద్ధపడితే ఇంకా సంతోషిస్తాను ..." అంది దీపిక అతని ముఖంలోకే చూస్తూ.

ఇరకాటంలో పడ్డట్టుగా ఇబ్బంది పడుతూన్న కృష్ణమూర్తి ముఖమే చెప్తోంది.

"రాధిక చెల్లెల్ని నేను " అంది దీపిక.

నోరు తెరచుకుని కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయేడు కృష్ణమూర్తి.

"అవును కృష్ణమూర్తిగారూ. ఇద్దరం కలిసే పనిచేస్తున్నాం కదా.... అనుక్షణం మీ కళ్ళ ఎదుట మెసుల్తున్న నాలో రాధికను చూస్తూనే వుంటారు. మీది నిజంగా నిష్కల్మష హృదయమే అయితే నిబ్బరంగా నన్ను చేపట్టగలరు లేదా అన్యాయమే చేసి వుంటే క్షోభకు గురయ్యే మీ హృదయమే ఆ విషయం చెప్తుంది. మీ నిర్ణయం ఆలోచించి చెప్పండి. నేను మాత్రం మిమ్మల్ని వదిలేది లేదు. వస్తాను...." అంటూ చరచరా క్లాసులోకి వెళ్ళిపోతూన్న దీపికను చూస్తూ బొమ్మలా వుండిపోయేడు కృష్ణమూర్తి. ☼



తెలుగుగంప

వీరేశలింగంగారి వివేకవర్ధనిలో వడ్డాది సుబ్బారాయుడుగారి పద్యాలు

సూక్తి సుధానిధి, కవిశేఖర అనే బిరుదులుగల వడ్డాది సుబ్బారాయుడు గారి చిన్నతనపు కవిత్వం ఎలాగుండేదో యీ పద్యాలనుబట్టి తెలుసుకోవచ్చు. శ్రీ శంకర భగవత్పాదులు, ఆయన శిష్యులు చెప్పిన భజగోవింద శ్లోకాల తెలుగు అనువాదం యీ పద్యాలు, కవిగారు పద్నాలుగేళ్ళ వయస్సుననే యీ పద్యాలు రచించారట. కాని వారికి 20 సం॥ల వయసు వచ్చేవరకూ ఈ పద్యాలు అచ్చుపడలేదు. వీరేశలింగం పంతులుగారి వివేకవర్ధని పత్రికకు వీటిని ప్రచురణకు పంపగా, పత్రికాధిపతి వీరేశలింగంగారు స్థలాభావం వల్ల కవిగారు రచించిపంపిన ఇష్టదేవతాస్తుతి మొదలైన పద్యాలు వదిలేసి తక్కినవి మాత్రమే ప్రచురిస్తున్నామని సంపాదకీయ వివరణతో యీ పద్యాలు ప్రచురించారు. ఇవి 1875 ఆగస్టు వివేకవర్ధనిలో ప్రచురితమైనాయి. ఇవి "ముక్తిదాయకము" అనే శీర్షికతో ప్రచురితం.

వడ్డాది సుబ్బారాయుడుగారు భక్తచింతామణి శతకం ద్వారా, వేణీ సంహారం నాటకానువాదం ద్వారా తెలుగునాట ప్రసిద్ధులు. భక్తచింతామణి 21 సార్లు ముద్రణ పొందడం ద్వారా ఆ శతకానికి తెలుగుదేశంలో గల ప్రాచుర్యం ఎటువంటిదో తెలుస్తున్నది. సుబ్బారాయుడుగారు 1854వ సం॥లో జన్మించారు. రాజమహేంద్రవరంలో చాలా సంవత్సరాలు వివిధ విద్యా సంస్థలలో ఉపాధ్యాయులుగా పనిచేశారు. రాజమహేంద్రవర ప్రభుత్వ కళాశాలలో కొద్ది సంవత్సరాలు ఉపాధ్యాయులుగా పని చేసినప్పుడు కళాశాల ప్రిన్సిపాల్ ఆస్వాల్డ్ జెన్నింగ్ కూల్డ్రే, సుబ్బారాయుడుగారు తరగతిలో తెలుగు చెపుతుంటే కళాశాల వరండాలో పచార్లుచేస్తూ విని సంతోషించేవారని చెపుతారు. ఆయన వేణీ సంహార నాటకంలో రంగస్థలంమీద వేషంకట్టి భీముడి పాత్రను చక్కగా పోషించేవారట. వసురాయుడని ప్రసిద్ధనామం వీరికి, "వాణీధవతుల్యుడు" వసురాయుడని చిలకమర్తి వడ్డాదివారి కవిత్వాన్ని మెచ్చుకుంటూ ప్రశంసించారు.

వివేకవర్ధని పత్రిక భావనామ సంవత్సర ఆశ్వయుజ మాసం అంటే 1874 అక్టోబరు నెలనుండి ధవళేశ్వరం కార్యస్థానంగా ప్రారంభమైంది. అంటే ఇవి నూటపది సంవత్సరాలనాటి వడ్డాది సుబ్బారాయుడుగారి పద్యాలు.

బ్రహ్మశ్రీ మహారాజరాజశ్రీ వివేకవర్ధనీ పత్రికాధికారులగు, కందుకూరి వీరేశలింగముగారి సన్నిధికి

అయ్యా !

సురుచిరవ్యక్త మదురరచన వచనామృతరసగంభీర వాగ్గుంభనా విలసితంబగు తావక పత్రికా శిరోరత్నంబునం దొకించుక యవకాశం బొసంగి మత్కృతంబులగు నీ పద్యంబులు హృద్యంబుగంగరుణించి ప్రకటింపం బ్రార్థన పూర్వకంబుగంగాంక్షించుచున్న వాడను. ఆ 1875 సం॥ ఆగస్టు 20 వ తేది, రాజమంద్రి.

చిత్తగించవలయును
భవద్విధేయుడు
వడ్డాది సుబ్బారాయుడు.

ఉ॥ శ్రీ కరహాసఫేనములచే,జెలువొంది సువాక్సుధానమ
త్సేకము జన్మభూమియయి శ్రీమదనంత ధరాధరోత్తమాం
గాకలిత ప్రదీపమణికాంత పదుండుగ భీరు దయ్యుభం
గాకుల వర్జితుండగు దయాంబుధి దాశరధిం దలంచెదన్.

ముక్తిదాయకము.

1\. తే. సన్నిహితముగ గాలము సంభవింప
నేరదిలడుకృఞ్కరణే యటన్న
మాట రక్షింపనందజ ఘోటకునిభ
జించు నిరతము మూఢుడ కించరొలగి

2\. చం. ధనమునుదెచ్చునాశ విడదాచి వితృష్ణనువచ్చు మంచితె
ల్విని నిజచిత్తమందునిచి వేడుక నీకులవృత్తి బొందు సొ
మ్మునసె మనంబునుల్లసిల మూఢుడ నీవొనరించు నిత్యము
న్మనుసల జీర్ణచేలుగతి మోదముతోడ హరిన్భజింపుమా.

3\. చం. వనితల పొక్కిళుల్చనుల పట్టువకున్గని మోహమందకే
దినమును మాంసము న్వసయునిట్టి పదార్థ వికారమంచునే
మనమున వానినెంచి మతిమంతుడవై ఘననీల దేహునా
వనరుహ నేత్రు మూఢమతి వాంఛతలర్పగవే భజింపుమా.

4\. ఉ. కంజదళంబునందు నుదకంబును బోలెను జీవనంబునెం
చం జపలంబుగా జగము సర్వము వ్యాధ్యభిమాన శోకపుం
బుంజములన్గ్రహింపబడి పొల్పుగనున్నదిగా నెరింగియూ
కంజదళాక్షు మూఢమతి కాంచనచేలునివే భజింపుమా.

5\. చ. అరయగ నెంతదాక ధనమార్జనసేయగ శక్తిగల్గునా
వరకును దన్నుజేరు బరివారము రక్తినినుండు సంతజ
ర్జరతను దైమనంగ నొనరైనను సేమముగాన కుందురీ
నరణి నెరంగి మూఢమతి సజ్జనమిత్రు హరిన్భజింపుమా

6\. చ. తనువున వాయువుల్ గలుగుదాకను జుట్టలు చెల్మిపేతురా
వెనుకను భార్యయైన గడుభీతిలు జూడగనట్టి యంగము
న్ననుగొన నిట్టికార్యమునకా యిటులుండగ మూఢచిత్తన
న్మునినుతుడైన శ్రీధరుని మోదముతోడ దగన్భజింపుమా.

7\. చ. విడిముడిగల్గ గల్గు జడుపింతియకాక సుఖంబులేకయు
న్గాడుకులవల్లనైననగు గోరముభీగతినేరికైనను
న్వీడువకవచ్చుగాన విడివిత్తముపైదియపేక్ష మూఢుడో
వెదగుదనంబుమాని శఠివేలుపు మేలొనగున్భజింపుమా.

8. ఉ. పిన్నతనాన క్రీడవలపించెడి యౌవనమందునన్నుల
న్నన్ననజేసి వృద్ధతనుమానక చింతనుజెంది యెవ్వడు
న్వెన్నునిగాననోడు దిగవేళలయందును మూఢ చిత్తమో
సొన్నవుచేలవాని గడుజొక్కుచు మిక్కిలియు న్భజింపుమా.

9. ఉ. ఎవ్వతెనీదు భార్యసుతుడెవ్వడు భ్రాంతిని జెందియున్న నీ
వెవ్వని వాడవెన్నగను నెక్కడనుండరు దెంచినాడవీ
నెవ్వగలున్న సంసృతిని నెంచగజిత్రము మూఢచిత్త నీ
విప్పిధమెంచితత్త్వము గ్రహించుచు గేశవుని న్భజింపుమా.

10. చ, వదలక సజ్జనాళి సహవాసముచేనగు జెల్మిలేమియ
య్యది దలగించు మోహమదియాతడు నిశ్చలతత్త్వమందు చెం
పొదవగదాన ముక్తియగు మూఢమతీమతి సమ్మతంబునం
గొదవలుదీఱ మాధవుని గూరిమితోడ దగన్భజింపుమా.

11. చ. వయసుగతింప గామమును, వారి దొరంగుడుబావి విత్తము
న్వ్యయమయిపోవ బంధుపరివారము లెట్టులనట్ల, తత్త్వసం
చయమెఱిగున్న వారికిల సంసృతి మూఢమతీ తలంపసం
శయములు దీఱ భక్తజన చందను శౌరిమది న్భజింపుమా.

12. చ. ధనజన యౌవనంబుల మదంబున నొందక సర్వమున్ క్షయం
బనితలపోసి మాయమయమైన జగంబునురోసి బ్రహ్మము
న్గనుగొనువానిజేసి కరుణామయుజక్రిని మూఢచిత్తనీ
వనయము నెమ్మనంబునను హాయిగనుండ వెసన్భజింపుమా.

13. చ. పవలును సాయము బ్రభాతమును న్నతువుల్మఱి న్మఱిన్
శుపిజనుదెంచి క్రీడగతినుండగ నాయువు వోవుగావున
న్సువిమలబుద్ధి దృష్ట పవనంబులువోవిడనాడి మూఢయె
క్కుడ తెలివిన్విధాత జనకుం దనుజాంతకుని న్భజింపుమా.

14. మ. మహివిద్యాధికులై చెలంగుచును శ్రీమచ్ఛంకరాచార్యులీ
మహితద్వాదశమంజరీ రచన బ్రహ్మధ్యానయోగోదిత
స్పృహులై యొప్పు ముముక్షులోకులకతి ప్రేమంబుగా దెల్పె స
న్నిహితాంతుండగు వ్యాకృతిజ్ఞునక సందేహంబుగా దత్త్వమున్.

ఇతి శ్రీ పరమహంస పరివ్రాజకాచార్యవర్య శ్రీ మచ్ఛంకరాచార్య వైయాకరణ సంవాదంబను ద్వాదశమంజరికా స్తోత్రము సమాప్తము. [ఇందు స్థలము లేక కృతికర్తయొక్క యిష్టదేవతా ప్రార్థనాదులు ప్రకటింపబడ వయ్యెను — పత్రికాధిపతి].

సేకరణ: శ్రీ అక్కిరాజు రమాపతిరావు

మల్లియ రేచన మొదటి తెలుగు గ్రంథ రచయితయా ?

మే 1986 భారతిలో "మొదటి తెలుగు గ్రంథ రచయిత - మల్లియ రేచన" అన్న వ్యాసము ప్రకటితము. వ్యాస కర్తలు శ్రీ పి. వి. పరబ్రహ్మ శాస్త్రిగారు వెల్లడించిన అభిప్రాయములు మంచి చర్చకు దారి తీయునవిగా ఉన్నవి. ఈ వ్యాసములోని చర్చనీయాంశములను ప్రధానముగా ద్విధా విభజించవచ్చును. 1) కవిజనాశ్రయ రచనాకాలము 2) కవిజనాశ్రయ కర్తృత్వము.

1) కవిజనాశ్రయ రచనాకాలము 11వ, శతాబ్దికి పూర్వమని "యాప్పిరంగలమ్ కారిలై" అను తమిళ గ్రంథము ననుసరించి పూర్వ పరిశోధకులు కొంతమంది అభిప్రాయపడినారు. ఈ తమిళ గ్రంథములో క్రింది వాక్యము కలదట.

"వాంచియార శెయిదవడమా చందవుం"

ఈ వాక్యమునుబట్టి వాంచియ- అను పేరుగల తెలుగు లక్షణ గ్రంథ కర్త కలడని తెలియుచున్నది. వాంచియ - అను గ్రంథ కర్త తెలియ రాకుండుటచే ఇతడు రేచియ - యై ఉండునని ఊహించినారు. ఇది ఎట్లున్న దనగా, అశోక శాసనములోని "అంటికిని" అన్న పేరుగల వ్యక్తి యెవరో తెలియరాకుండుటచే, అతడు మాసిడోనియా రాజుగా అంటిగోనస్ గొనాటస్" అని చరిత్ర కారులు చేసిన నిర్ణయమును పోలియున్నది. తెలియని వ్యక్తిని తెలిసిన యెవడో అయి ఉండునని ఊహించుటతో ఆగక, అతడే అతడని నిశ్చయించి, చరిత్రల్లుట జరిగిన దన్నమాట. అట్లే వాంచియారును రేచియారుగా నిశ్చయించి, రేచన 11వ, శతాబ్దికి ముందటి వ్యక్తి అని నిశ్చయించుట జరిగినది. ఇందలి అను పపత్తులు.

1) వేరే ప్రతులలో రేచియార్-అని కలదో లేదో పరిశోధించకుండానే, ఒక నిర్ణయమునకు వచ్చుట.

2) తమిళ గ్రంథమును, కవిజనాశ్రయముతో తులనాత్మక పరిశీలన చేసి, ఆ తమిళ గ్రంథకర్త నిర్దేశించిన వ్యక్తి కవిజనాశ్రయ కర్తయే అని సోపపత్తికముగా నిరూపింపకపోవుట.

3) ఆ తమిళ గ్రంథము 11వ, శతాబ్దికి ముందటిదేనా ? ముందటిదే అయినచో 'ఎంత ముందటిది ? అని పరిశీలించి, దాని కాలమును ఋజువు పర్చకయే, దానిపై ఆధారపడి రేచన కాలమును నిర్ణయించుట.

పై అనుపపత్తులకు సరియగు సమాధానము లొసగి, తమిళ గ్రంథకర్త పేర్కొన్న తెలుగు రచయిత కవిజనాశ్రయ కర్తయే అని నిరూపించనంత వరకు, రేచన కాలము 11వ, శతాబ్దికి ముందటిదనుటకు వీలులేదు.

ఇట్టి స్థితిలో, శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారు, రేచన కాలము 940-50 మధ్య భాగమని నిరూపించుటకు యత్నించుట, ముదావహము. కాని, వారి అభిప్రాయములు కూడ విమర్శ సహములుగా కానరావు. కవి జనాశ్రయ రచనలో రేచనకు సహాయుడై వాచకాభరణుడు పంపకవి తమ్ముడగు 10వ శతాబ్దపు జినవల్లభుడని శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారభిప్రాయ పడ్డారు. కాని రేచనకు సహాయుడైన వాచకాభరణుడు భీమనాగ్రసుతుడని, కవి జనాశ్రయములో కలదు. జినవల్లభుడు భీమన రెండవ కుమారుడేగాని, అగ్రసుతుడు కాదు. ఇక్కడ కొన్ని పద్యములు లుప్తములయి ఉండునని ఊహించుట సరికాదు. ఉపలబ్ధములయిన ఆధారమునుబట్టి నిర్ణయములు చేయవలెనేగాని ఊహాపోహలతోకాదు. లుప్తభాగములలో మన అభిప్రాయముల కనుకూలము లగు విషయములున్నవని ఊహించుటయు ఋజువాదముకాదు. పాశ్చాత్య. చరిత్ర కారులిట్లే భారవేలుని శాసనములోని శిథిల భాగములో, తమ వాదమునకు అనుకూలమయిన కాలమున్నట్లుగా ఊహించి, చారిత్రిక కాలమును తారుమారు చేసియున్నారు. (భారతి 1983 ఏప్రెల్ సంచిక) ఊహాపోహలతో, కవి జనాశ్రయము 940-50 మధ్య రచితమనుట పరిగ్రాహ్యము కాదనక తప్పదు.

కవి జనాశ్రయములోని "అమరంగ వేల్పులచే, గబ్బము సెప్పియకాదె" అన్న పద్యము మడికి సింగన సకల నీతి సమ్మతములో ఉదాహృతము. (కవిజ-పీఠిక) మడికి సింగన కాలము 1375-1435. (ఆం. త) కవిజనాశ్రయము సకల నీతి సమ్మతముకంటె పూర్వ రచన అని దీనివలన స్పష్టపడుచున్నది. సకల నీతి సమ్మత రచనా కాలము 1415 ప్రాంతము కావచ్చును.

కవిజనాశ్రయము, కావ్యాలంకారచూడామణికంటె పూర్వ రచన అని

కొంతమంది అభిప్రాయము. కావ్యాలంకార చూడామణి రచనా కాలము 1402-1407 మధ్యననుట నిశ్చితము. కనుక, కవిజనాశ్రయ 1400 సంవత్సరమునకు ముందటిదని చెప్పవచ్చును. కావ్యాలంకార చూడామణియే ప్రాచీనమను మతాంతరమును గ్రహించినచో కవిజనాశ్రయ రచనా కాలము 1410 ప్రాంతము కావలసి వచ్చును.

కవిజనాశ్రయములో మధ్యాక్కరకు నాలుగవ గణాద్యక్షరము యతిస్థానముగా నిర్దిష్టము. యుద్ధ మల్లుని బెజవాడ శాసనములోని మధ్యాక్కరలకు ఐదవ గణాద్యక్షరము యతి స్థానముగా ఉన్నది.

"స్వస్తి నృపాంకుశాత్య స్తవత్సల సత్యతిణేత్ర"

శాసన కాలము : 898-934 (ప్రా. శా.) శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారు చెప్పినట్లు కవిజనాశ్రయ రచన 940-50 మధ్య భాగమున జరిగి యున్నచో, యతి స్థానము నాలుగవ గణాద్యక్షరముగా నిర్దిష్టమగుట, జరుగదు. దీనిని బట్టియు, కవిజనాశ్రయము 10వ. శతాబ్ది రచన కాదని తెలియుచున్నది. నన్నయ మధ్యాక్కరలకు ఐదవ గణాద్యక్షరమే యతి స్థానముగా ఉన్నది. కనుక, నన్నయ తరువాతనే మధ్యాక్కర యతి స్థానంలో మార్పు వచ్చి యుండును. తిక్కనాదులు మధ్యాక్కర వాడలేదు. ఎఱ్ఱన అరణ్యపర్వ శేషములో మాత్రమే వాడెను. నాలుగవ గణాద్యక్షరమునకు యతి మైత్రి కూర్చిన వాడెఱ్ఱనయే. కావున, కవిజనాశ్రయ మారణ్యపర్వ శేషమునకు తరువాతి కాలములోనిదే అని గ్రహించవలసి ఉన్నది. ఎఱ్ఱన కాలము 1280-1350. అరణ్యపర్వశేష రచనా కాలము : 1320 ప్రాంతము. కనుక, కవిజనాశ్రయము 1320 తరువాతి రచనయే అనవలెను.

అరణ్యపర్వ శేషమునకు ముందటి కావ్యములలో కాని, శాసనములలో కాని,నాల్గవ గణాద్యక్షరమునకు యతిమైత్రి పాటించిన మధ్యాక్కరలు లభించు నంత వరకు, అరణ్యపర్వ శేషమునకు కవిజనాశ్రయము తరువాతిదే అనక తప్పదు.

కాగా, కవిజనాశ్రయ రచనా కాలము 1325-1400 మధ్యనని నిర్ణయించవచ్చును.

(2) కవిజనాశ్రయ కర్తృత్వము :- కవిజనాశ్రయము రేచన కర్తృకమే అనియు, భీమకవి కర్తృత్వమును తెలుపు పద్యములు ప్రక్షిప్తములనియు, శ్రీ పరబ్రహ్మశాస్త్రిగారభిప్రాయ పడ్డారు. కాని, జైనుడగు రేచనపై శివ భక్తుడగు భీమకవి గ్రంథ రచన చేయుటను సహించ లేక, జైనులు రేచన కర్తృత్వమును తెలుపు పద్యములను ప్రక్షిప్తము చేసి, భీమన పద్యములను తొలగించి యుండవచ్చుననికూడ ఊహించ వచ్చును. కాన, ఈ రెండు రకములయిన ఊహలు సరి కావు. గ్రంథస్థ నిదర్శనములనుబట్టి కవిజనాశ్రయము భీమన రేచనల ఉమ్మడి రచన అని నిశ్చయించ వచ్చును. ఎట్లు నిశ్చయించవచ్చునో పరిశీలింతము.

కవిజనాశ్రయము సరస్వతీస్తుతితో ఆరంభమయినది. జైనుడగు రేచనయే, గ్రంథకర్త అయినచో అతడు గ్రంథారంభమును జినస్తుతిలోనే చేసి ఉండును. కాన, గ్రంథారంభము చేసినవాడు భీమకవియేకాని రేచన కాడు. రేచనపై కవిజనాశ్రయమును రచింతునని భీమన చెప్పిన పద్యములు ప్రక్షిప్తములు కావని దీనివలన తెలిసికొన వచ్చును.

ఇట్లు గ్రంథ రచనకుపక్రమించిన భీమకవి సంజ్ఞాధికారమును పూర్తి చేసి, పిమ్మట యతిచ్ఛందోధి కారమును పూర్తిచేసినట్లు క్రింది గద్యమువలన గ్రహింపనగును.

"కవిజనాశ్రయచ్ఛందంబునందు యతిచ్ఛందోధికారము సంపూర్ణము".

ఈ గద్యము 'వ' ప్రతిలో కలదు. దీనిలో రేచన కర్తృకత్వమునకు సూచనలేదు.

కవిజనాశ్రయమును భీమనాగసుతుడగా వాచకాభరణుడు సహాయుడుగా రేచన రచించినట్లు చెప్పు పద్యములు మూడు, కవిజనాశ్రయములో కలవు. ఈ పద్యములు యతిచ్ఛందోధికారం ముగిసిన తరువాత, ప్రాసాధికార ప్రారంభములోనివై ఉండవలెను. ఈ ప్రాసాధికార భాగములోనే, "జననుత భీమ తనూజా" అన్న పద్యము కలదు. ఇది భీమకవి పద్యముకాదు. ఎందుకనగా, భీమకవి రేచనపై గ్రంథ రచన చేయుదుననెనుగాని, భీమతనూజునిపై కాదు.

ఈ పరిశీలనవలన, యతి ప్రాసాధికారమను పేర ముద్రితమయిన భాగములో యతులకు సంబంధించిన భాగము భీమన కృతమనియు, ప్రాసలకు సంబంధించిన భాగము రేచన కృతమనియు చెప్పవచ్చును.

ప్రాసాధికారము నుండి గ్రంథ రచనకుపక్రమించి రేచన, కవిజనాశ్రయములో కొన్ని అధికారములను రచించెను. మరి కొన్ని అధికారములు భీమన రచించెను. ఈ విషయమును నిర్ధారణ చేయుటకు గ్రంథస్థ సాక్ష్యములు కలవు.

కవిజనాశ్రయము భీమన రచనగా ఆరంభమయినది. గనుక, రేచన తాను వ్రాసిన అధికారముల ప్రారంభమున ఆ యధికారము తాను వ్రాయుచున్నానని తెలుపు పద్యములను చేర్చుకొనెను. ఎట్లనగా—

(1) యతిచ్ఛందోధికారము :- "యతిచ్ఛందో లక్షణము ... కవిజనాశ్రయుండొనరించున్"అని ఈ అధికార ప్రారంభంలో రేచన చెప్పికొనెను.

(2) అర్ధ సమవృత్తాధికారం :- "రేచన.... ఒనరించు నర్థసమవృత్తములన్"అని ఈ అధికార ప్రారంభములో రేచన చెప్పికొనెను.

(3) విషమవృత్తాధికారం :- "రేచడు.... విషమ వృత్తంబులు సెప్పు" అని ఈ అధికార ప్రారంభములో రేచన చెప్పికొనెను.

(4) జాత్యధికారం :- "రేచన...., చెప్పు జాతి లక్షణ మొసరన్" అని ఈ అధికార ప్రారంభములో రేచన చెప్పికొనెను.

(5) షట్ప్రత్యయాధికారం :- "కవిజనాశ్రయుడు.... షట్ప్రత్యయముల నొగి నెఱిఁగించున్" అని ఈ అధికార ప్రారంభంలో రేచన చెప్పికొనెను.

(6) దోషాధికారం :- "సుకవి జనాశ్రయుండెఱిఁగించుఁ గృతులనగు దోషంబుల్" అని ఈ అధికార ప్రారంభంలో రేచన చెప్పికొనెను.

ఇట్లు రేచన కర్తృత్వమును తెలుపు పద్యములు, కొన్ని అధికారముల ప్రారంభముల లేవు. అవేవనగా—

(1) సంజ్ఞాధికారం
(2) యతిచ్ఛందోధికారం (యతిప్రాసాధికారంగా ముద్రణములు)
(3) వియతిచ్ఛందోధికారం
(4) ఉద్ధరమాలా వృత్తాధికారం

ఏ గ్రంథ కర్తయు, "ముద్దముద్దకు నారాయణా" అన్న సామెతగా, ప్రతి పరిచ్ఛేద ప్రారంభమున ఈ పరిచ్ఛేదమును తాను చెప్పుచున్నామని

ప్రకటించుకొనదు. అట్లు ప్రకటించుకొనువాడు, కొన్ని పరిచ్ఛేదముల ప్రారంభమున, అట్లు ప్రకటించుకొనుట మానదు. కావున, రేచన కర్తృత్వ మును సూచించు పద్యములుగల అధికారములు రేచన కృతములనియు, తక్కి నవి భీమన కృతములనియు నిరాక్షేపముగా నిశ్చయించ వచ్చును.

కాగా, గ్రంథస్థ నిదర్శనములనుబట్టి కవిజనాశ్రయం భీమన రేచనల ఉమ్మడి రచన అనుట కరతలామలకం.

“మల్లన వాదాంగద చూడామణి” అను తెలుగు లక్షణ గ్రంథమున్నట్లు కీ॥ శే॥ నిడదవోలు వారు తెలిపియున్నారు. (కవిజ - పీఠిక) వాదీంద్ర శబ్దమునకు వాదాంగ, వాగీంద్ర, వాదాంగద- అను రూపాంతరములు కన్ప ట్టును. (అప్పక 1-5) కావున, వాదీంద్ర చూడామణి కర్తయగు మల్లనయే, రేచన తండ్రియగు మల్లియ అగునేమో! రేచన సహాయుడగు భీమనాగ్ర సుతుడు, 1369లో, బసవ పురాణమును కన్నడించిన భీమకవి కొడుకగునేమో! ఇవివట్టి ఊహలు మాత్రమే. చరిత్రలలో ఊహలు, శాస్త్రములలో అర్థాపత్తి, కొంత వరకు అవసరపడు చుండును. సత్యాసత్యములు భావి పరిశోధనల వలన తేలవలసినదే.

వేములవాడ భీమకవి 14వ, శతాబ్దివాడన్న పరిశోధకుల అభిప్రాయమే సరియయినదనియు, 12వ, శతాబ్ది అను పరిశోధకాభిప్రాయం సరికాదనియు గ్రహింపనగును.

కవిజనాశ్రయం భీమన రచనల ఉమ్మడి గ్రంథం. రచనా కాలము 14వ, శతాబ్ది. కాన, మొదటి తెలుగు గ్రంథ రచయిత మల్లియ రేచన కాదనుట స్పష్టము.

సంకేతాక్షర వివరణ

అప్పక	అప్పకవీయము	కవిజ	కవిజనాశ్రయము
ఆం. క.	ఆంధ్రకవి తరంగిణి	ప్రా. శా.	ప్రాచీనాంధ్ర శాసనములు

శ్రీ వంతరాం రామకృష్ణారావు, నిడదవోలు.

తిప్ప - త్రిపురాంతక

జనవరి (1986) “భారతి” లో “తిప్ప” శబ్దోత్పత్తి క్రమము అనే వ్యాసము మీద శంకరగంటి రమాకాంత్ (శ.ర.కా.) గారు “తిప్ప శబ్దము త్రిపురాంతక శబ్దభవము” అని వ్రాసిన వ్యాసము చదివి, ఈ వివరణను వ్రాయు చున్నాను.

“సంస్కృత శబ్దములు భ్రష్టమై కుదించుకొని తద్భవములైనట్లు తెలుగు పదములుకావు” అని నేను నా వ్యాసమున వ్రాసిన వాక్యము శ.ర.కా. గారికి సదాగ్రహము కల్గించినది. “సంస్కృత శబ్దములంటే ఎందుకో వారి కంత అసహ్యము” అని అడుగుచున్నారు. రమాకాంత్‌గారూ, నేను సంస్కృత శబ్దములు భ్రష్టమగు విషయమును చెప్పితిని కానీ, ఆ భాషమీద అసహ్యము వలన కాదండీ "సంస్కృత శబ్దాలు పామరుల నోటిలోపడి భ్రష్టమై కుదించు కొనిపోయాయి" అనేది మీ వాక్యమే సుడీ. శ్రేష్ఠమైనది భ్రష్టమగును. సంస్కృత శబ్దాలు వింతవింతగ భ్రష్టమగుచున్నందునే ఇన్ని భాషలు, ఇన్ని శబ్దములు పుట్టినవి. ఇట్టియెడల లాఘవత్వము సంస్కృతముది కాదు. తద్భవ భాషలది. ఇసుకూలు, అసుపత్రి అపభ్రంశ రూపాలని శ.ర.కా. గారను చున్నారు. ఇవి ఇంగ్లీషు భాషా భ్రష్టరూపములా కాదా చెప్పండి. శబ్దములు భ్రష్టములగుటకు మన అవిద్యయే హేతువని వారనుచున్నారు. గ్రామీణులే ఎందుకు, పట్టణవాసులైన శ.ర.కా. గారే “త్రిపురాంతక” అనే పెద్ద సంస్కృత సమాసమును నుండి “తిప్ప” శబ్దమును అవతరింపజేయుటకు “త్రిపురాంతక” ను ఎన్ని విధములైన భ్రష్టములకు లోనుజేసి దానిని ఫజీతు పట్టించిరో చూపించెదను.

శ.ర.కా. గారు ఇట్లనుచున్నారు.

“త్రిపురాంతక శబ్దమ్ము జనవ్యవహారములో అదిరేపాన్ని కోల్పోయి తిపురాంతక, తిప్రాంతక, తిప్ప అని అయి ఉంటుంది.”
త్రిపురాంతక > తిపురాంతక > తిప్రాంతక > తిప్పరాంతక > తిప్పాం తక > తిప్పన అనియు ఇచ్చిరి.

త్రిప, తిప్పగ మారుటకు ఉపపత్తుల జూపిరేకాని త్రిప - తిప్రగ మారు టకు మార్గమేది ?

“త్రిప్ప”, “తిరుప” అగుటకు అవకాశమున్నది. “తిరుపురాంతక” ఉదా: గురుప్రసాద > గురు పరసాదలోవలె

“శ్రీ” శబ్దము “సిరి” అయి “తిరి” — “తిరు” అయినదిట్లే అని తెలియునది.

“తిరుప” శబ్దము వచ్చిన తర్వాత “తిప్ప” శబ్దము రానేవచ్చును. ఉదా: “ర్ప”, “ప్ప” అగుటకు ఉదాహరణములు: సర్పము - సప్పము, అర్పణము - అప్పనము, కూర్పాసము - కుప్పసము మొ॥

చెప్పవచ్చినదేమన “త్రిపురాంతక” శబ్దమునుండి “తిప్ప” శబ్దమును భాషాశాస్త్రరీత్యా రాబట్టుట ద్రావిడ ప్రాణాయామమే అగును. మరి రావిపాటి తిప్పన్న తేడా? అందురేమో! అంతెందుకు అవచితిప్పయ్య సెట్టిని శ్రీనాథుడు తన “హరవిలాస కావ్యములో అవచి త్రిపురారి అనికూడా పేర్కొన్నాడు. (చూ. “హరవిలాస” అవతారిక) త్రిపురాంతకునికి తిప్పన్న అనే పేరుండ వచ్చును. “తిప్ప” నుండి త్రిపురాంతకునికి ఆ పేరు వచ్చి యుండవచ్చు. కాబట్టి “తిప్ప” న్న శబ్దమునకు వేరే మూలము వెదకి కొనవలసి వచ్చును. కొండన్న, కొండయ్య, కొండమీది రాయుడు, నల్లగుంటయ్యల మాదిరి ఎత్తయిన ప్రదేశము (“తిప్ప”) మీద వెలసిన దైవము తిప్పన్న, తిప్పయ్య కావచ్చును ఈ వాదము ప్రకారము తిరుమలవాసుడు, శ్రీశైలవాసుడు కూడా తిప్పన్న, తిప్పయ్యలే. ఇది చెప్పుటకే నేను “శబ్దోత్పత్తి క్రమము వ్రాసితిని. ఇప్పుడు “తిప్ప” శబ్ద మూలమేది? అంటే, “ఎత్తయిన ప్రదేశము”, “చిన్న కొండ అను అర్థముగల “తిప్ప” శబ్ద మూలమేది అను ప్రశ్న రాకమానదు. “తిప్ప” శబ్దము “ద్వీప” శబ్దభవమని నేననుకొందును. తక్కువ మట్టములో నీరుండగ, మధ్య కొంచెము ఎత్తులోనుండు భూభాగమును “ద్వీపము” అందురు.

“ద్వీపము” ప్రాకృతములో “దీబ” అగును. దీబ > దిబ > దిబ్బ అగును. ‘దిబ్బ’ శబ్దములోని సరళములు పరుషములై “తిప్ప” అయినవి. అనగా, ద్వీప > దీబ > దిబ > దిబ్బ > తిప్ప.

పిండితార్థమేమంటే దిబ్బ, తిప్ప శబ్దములు పర్యాయపదములైనవి అని క్షేత్రనాథునకు భౌగోళికముగ పేరువచ్చిన పద్ధతికిది తార్కాణ; ఉదా: బదరీ నాథ, కేదారనాథ.

ఇక శ ర.కా. గారి ఇతరవాదములకు సమాధాన మిచ్చుచున్నాను.

“తిరు” అను పదమునకు “శ్రీ” సమానార్థక మెట్లగునో అని వా సందేహము.

“తిరు“ శబ్దము “శ్రీ” శబ్ద భవమని నేను భారతి (నవంబరు 1983 పుట 63) చూపించినాను. శ.ర.కా. గారు పేర్కొన్న తిరుమణి, తిరుమంత్రము తిరువారాధనము, తిరుపణ్యారము, తిరువిశక్కులోని అన్ని “తిరు”లకు ‘శ్రీ’ యనియే అర్థము. శ్రీరంగమునకు తిరువరంగం అనిపేరు. శ్రీ శేషము ఒక వస్తువు ముందు శ్రీ యని పలికిన పవిత్రత వచ్చును. కావున ఆ వస్తువ శ్రేష్ఠము. ఒక ఆధునిక మహాకవి తన కావ్యమును, శాస్త్రీయ స్పృహతో

మొదలిడి భూదేవిని ప్రార్థించుచు "శ్రీమత్కందుకమట్లు గుంద్రమయి" (చూ. రాణాప్రతాపసింహ చరిత్ర) అని వ్రాసినాడు.

శ.ర.కా. గారన్నట్లు శ్రీశైలమునకు తిరుమల అనే ప్రసిద్ధిలేదు. అటులనే తిరుమలకు శ్రీశైలము అనే ప్రసిద్ధీలేదు. అసలుకు వేంకటాచలము శ్రీశైలమే. కానీ శ.ర.కా. గారి బస్సు కండక్టరుకు చప్పున అర్థమగునట్లు, అరవలు ఏనాడో దానిని ''తిరుమలై" [శ్రీశైలము] అని మార్చివేసిరి. అటులనే శ్రీశైలము అరవలపాలయితే "ఉత్తర తిరుమలై" అయిపోవుననుటలో సందేహము లేదు. "మహాదేవ" శబ్దము "మాదన్న" గా మారినదన్నారు శ.ర.కా. గారు. "మహాదేవ" ముచ్చటగ మూడక్షరాలకు కుదించవలసిన, "మాదేవ" అగును కానీ "మాదన్న" ఎట్లగును? కన్నడ జానపద గీతాలలో "మాదేవా" అనియే మాడెదరు. "మాదన్న", "మాదయ్య" శబ్దములకు "మాధవన్న", "మాధవయ్యా" శబ్దములు మూలములగుట కెక్కువ అవకాశమున్నది. "యాదవగిరి" లోని "వ" లోపించి "యాదగిరి" అయినట్లు. "మహాదేవ" శబ్దమునుండి "మాద" శబ్దమును శ.ర.కా. గారు ఎట్లు రాబట్టెదరో చూడవలెను.

"త్రి"

కవుల కవి-శ్రీరంగం నారాయణబాబు

రుధిరజ్యోతిలో "కవి" అన్న గీతంలో కవి పలుకులు వినండి

మృత్యువాసంగే
మాతృకరమ్ముల
విధవ కానుపు
పెదిమల
వైలుగై వెలిగి
నలుపెక్కింది సంధ్య

ఎంత బీభత్సమైన వర్ణన! హైందవ సమాజంలో విధవ కాన్పు నొందడం బీభత్సం. యవ్వనంలో, పతి చనిపోయి, విధవై, యవ్వనపు శరీరతత్వం హార్మోనులు రేకెత్తించిన శారీరక తాపం తట్టుకోలేక, ఇంకొకడితో కూడితే, కాన్పు వస్తే, సంఘం కోరలకి భయపడి, తన చేతులతో తానే, తన అంకురాన్ని నలసేనపురాయి ఆయేటట్టు నలిపేస్తుంది స్త్రీ. నలిపివేయకముందు అంకురం పెదిమలు ఎర్రగానే వెలుగుతాయి. నలిపేసిన తరువాత మ్మాతం నల్లగా అయిపోతాయి. ఇలా ఎర్రగా వెలిగి నల్లనైపోయిందంటున్నాడు కవి. ఇటువంటి వర్ణన ఆధునిక తెలుగు కవులెవ్వరూ కవితగా 'గానం చేయలేదు.

ఈ సందర్భంలో రుధిరజ్యోతితో యింకొక చోట మాటలు వినండి.

మృత శరీర
ఆక్రమణ
అరుణారుణ
రక్తశిక్త
మోముతోడ
"మా అమ్మే చంపింది
మా అమ్మే చంపింద"ను
మౌనముగ
గాజుకళ్ళ
పుంటుపిల్ల.

సంఘం నిబంధనలకి వ్యతిరేకంగా, "ఇల్లెజిటిమేట్‌గా" పిల్లను కన్న ఒక తల్లి సంఘం సర్పపరిష్వంగానికి భయపడి ఆ పిల్లను చంపి కుండలో పెట్టి అవతల పారేసిన అతి బీభత్స దృశ్యం కవి నారాయణబాబు వర్ణిస్తున్నాడు. యీ పలుకులు చదువుతూ వుంటే నేను విజయనగరంలో యింటర్మీడియట్ చదువుతున్న రోజులలో ఒకరోజు నా కంటపడిన సంఘటన జ్ఞాపకం వస్తుంది.

విజయనగరం వెలుటూరివారి వీధిలోంచి కాలేజీకి వెళుతున్నాను. వెలుటూరివారి వీధి పెద్ద కానాలోకి జనం తొంగి, తొంగి చూస్తున్నారు. కుతూహలంతో నేనూ చూసేను. కుండలో ముద్దులొలుకుతున్న ప్రాణంలేని బిడ్డ మావితోసహా కనిపించింది. పాపం! అనుకొని, కరిగి, కదిలిపోయేను.

చిన్నతనంనుంచి నారాయణబాబు తిరుగుబోతు. ఆ తిరగడంలో నారాయణబాబుకు యిటువంటి బీభత్స సంఘటనలు, దృశ్యాలు, ఎన్నో తటస్థపడి వుంటాయి. ఈ వాస్తవిక సంఘటనలను తన కవితలో ఉదహరిస్తున్నాడు, లోకం బీభత్సం వర్ణిస్తూ! — ఇంకా అంటున్నాడు మనిషి.

ఖేదం రేపి
రోదసి నిండి
విశ్వగళమ్మున
హాలాహలమై
విస్తరిల్లినవి
చీకటులు
నల్లని త్రాచుకోరలు
తెల్లని మశూచికుండలు
గగనమ్మున .
తారలు

లోకంలో ఎటు దృష్టి సారించినా బీభత్సమే చూస్తున్న కవికి, ఆకాశంలో విషంలా అలముకుంటున్నా చీకటులు, నల్లత్రాచులా కనబడటం, నక్షత్రాలు, ఈ నల్లత్రాచు తెల్లకోరలులాగ, బాధపెట్టే, తెల్లని మశూచి కుండలులాగ అనిపించడం సహజం. చూపరుని మనసులో ఖేదం రేగడం సహజమే!

దేవదానవులు అమృతం కోసం క్షీరసాగరం మధిస్తున్నప్పుడు మొట్టమొదట హాలాహలం పుట్టింది. ఆ హాలాహలాన్ని శివుడు మ్రింగితే శివుడి గర్భంలోని పద్నాలుగు లోకాలు అట్టుడికినట్టవుతాయని సర్వమంగళ, పార్వతీదేవి, శివుడి కంఠాన్ని అదిమిపడుతుంది. గరళం శివుడి కంఠసీమలోనే వుండిపోయి తెల్లని శివకంఠాన్ని నల్లగా మారుస్తుంది. ఇందుకే శివుని కంఠసీమ నల్లగా చిత్రించడం, శివుడు గరళకంఠుడనటం! ఇది హైందవ పురాణ శివరాత్రి మహాత్మ్యం. ఈ గాథను తన కవితలో ప్రయోగించుకున్నాడు నారాయణబాబు. నిశిరాత్రి రెండు గంటల సమయం వర్ణించడానికి "విశ్వగళమ్మున హాలాహలమై విస్తరించినవి చీకటులు" అనడం. యిందుకే పౌరాణిక చైతన్యాన్ని అవసరాన్నిబట్టి జాగరితమొనర్చడం గమనార్హం,

ఇంకా ముందుకు పోతే

జట్కా గుర్రం
కాలం మెళ్ళో
రెండు గంటలు
మ్రోగినవి.

కాలగమనాన్ని జట్కా గుర్రం గేలపింగ్ వేగంతో పోల్చడం విశిష్టం. ఈ కాలం గుర్రం మెడలో మ్రోగిన రెండు గంటలు, రాత్రి రెండు గంటల సమయం. ఈ రాత్రి రెండు గంటల సమయంలో తన చక్షువులకి కనిపించిన ప్రకృతిని వర్ణిస్తున్నాడు నారాయణబాబు. గమనించండి.

చచ్చిన తల్లి శవం
మెళ్లో గజ్జెల
పట్టెడతో
ఉల్లాసంగా
ఆడుకొనే

పసిపిల్లాడులా
గాలి!

తెలుగు సీమలో ఆడపిల్లలు, పాంజేవులు చప్పుడుచేస్తూ నడవటం లక్ష్మీ దేవి పెద్దక్క, పెద్దమ్మ జేష్ఠాదేవి దారిద్ర్యదేవతకి చిహ్నంగా పరిగణిస్తారు. "గజ్జెల పట్టెడ" దారిద్ర్యదేవతకు చిహ్నం. ధనికవర్గం స్త్రీ తల్లి మెళ్లో నాను తాడుంటుంది. దారిద్ర్యంలో మగ్గుతున్న తల్లి మెడలో నూలుదారాలతో పెన వేసిన (పట్టెడ) తాడు పసుపుకొమ్ముతో సహా వుంటుంది, మంగళప్రదంగా. ఇది హైందవ, ముఖ్యంగా తెలుగువారి ఆచారం. ఈ దారిద్ర్యంతో మగ్గి చనిపోయిన తల్లి మెడలో పసుపుతాడుతో ఆడుకుంటున్న అశుభం, శుభం తెలియని పసిపిల్లాడు గాలి పీస్తుందని అంటున్నాడు కవి. గాలికి ధనికుడూ, దరిద్రుడూ ఒక్కడే! నిజంగా, గాలి, అశుభం. శుభం తెలియని పసిపిల్లాడే, ఎంత భీభత్స దృశ్యం వర్ణిస్తున్నాడు కవి.

ఒళ్ళు తెలియని
పుళ్ళ బాధతో
వెక్కి వెక్కి
ఏడ్చినది
చుక్కల ఆకాశం,

మసూచి పట్టినవాంకి, ఒళ్ళు తెలియదు బాధతో వెక్కి వెక్కి ఏడుస్తారు. కుంపటి పెట్టే బాధతో, భీభత్స దృశ్యాన్ని తిలకించిన కవికి చుక్కల ఆకాశం ఒళ్ళు తెలియని పుళ్ళ బాధతో వెక్కి వెక్కి ఏడ్చినట్టుగా అనిపించటం అతిశయోక్తి కాదు. నూటికి నూరుపాళ్ళు వాస్తవికత.

సద్యోఫలితం
విద్యుద్దీపం
వెలుగున
గదిలో
ఖ్యాతి గడించే
గీతం వ్రాసి
ప్రేయసి కంకిత
మీయాలంటూ
మూతి బిగించి
చేతులు నులుముతూ
కూచున్నాను.

అంటున్నాడు నారాయణబాబు.

సద్యోగర్భం అనేమాట తెలుగువారికి విదితం. ఉదాహరణకి కుంతీదేవి తన యౌవ్వనం సూర్యోపాసన ఫలితంగా గర్భమొందడం సద్యోగర్భం. అలాగే విద్యుద్దీపం సద్యోఫలితం అంటున్నాడు కవి. ఇక్కడ థామస్ ఆల్వా ఎడిసన్ భావపరంపర విద్యుద్దీపంగా ఫలించిన శాస్త్రచరిత్ర జ్ఞాపకం వస్తుంది పరితకి.

సమాజం భీభత్సంతో నృత్యం చేస్తూ వుంటే ఈ విద్యుద్దీపం కాంతిలో, గదిలో, రాత్రి రెండు గంటల సమయాన సామాజికత వాస్తవికత మరచి, ఆ మలినపు శృంగారము పేరిట ఆంగ్ల కవుల ప్రభావంతో ఖ్యాతి గడించే గీత మొకటి వ్రాసి ప్రేయసి కంకితమివ్వాలని చేతులు నులుముతూ! మూతి బిగించు కున్నావా కవీ! అని ఆనాటి భావకవిని ఎద్దేవా చేస్తున్నాడు నారాయణబాబు.

నారాయణబాబు కవిత నుదహరిస్తూ ఆచార్య రోణంకివారి మాటలు.

"జీవితం మంగళప్రదం కావాలని అతి ప్రాచీనకాలంనుంచీ కవులంతా వాంఛిస్తూనే వున్నారు. కావ్యాలలోని వస్తువులను మంగళప్రదంగా భావించి మంగళాంతం చేసినంత మాత్రాన ఇది సిద్ధించదు.

కంటికి కనిపించేదంతా బాగానే ఉందనుకొని అందులోని చెడును తల పెట్టక మంచిని మాత్రమే వర్ణించితే అది దోషమే. చెడును గ్రహించి దానిని ఎదిర్చి చూపాలి. జీవితములోని కాఠిన్యమును బయట పెడుతున్నప్పుడు భీభత్సతను సూచించే పై గీతాలవంటివి రచియింపక తప్పదు. మాలిన్యాన్ని కప్పిపుచ్చుకోవడములో అది మటుమాయం కాదు. దానిని బహిర్గతం గావించాలి. వస్తువును సామాజిక విమర్శనాదృష్టితో తరచి చూడవలసి వుంటుంది. సమాజాన్ని ఎక్కడకక్కడ వాస్తవికవాద లక్షణం. ఈ లక్షణం నారాయణబాబు కవితలో విమర్శించడం ప్రస్ఫుటం. "ఇమేజిస్టు" కవితకు ఇతడు ప్రాణం పోసేడు. శబ్దార్థములతో కుదించి సొగసైన విగ్రహాలను నిర్మించే కుశలత ఇతని పద్ధతి. పది మాటలలో చెప్పవలసినది ఒక్కమాటలో చెప్తాడు. రోణంకివారి యీ మాటలు గమనార్హం.

ఆధునిక తెలుగుకవి శ్రీశ్రీ తన వర్గంవాడైన నారాయణబాబుని సమ్మరీగా డిస్మిస్ చేసినా ప్రాచ్య పాశ్చాత్య కవిత తత్వం, కవితారీతులు, వాటి గతిలో మార్పులు, కుణ్ణంగా ఆకళించుకొని, అనుభూతి నొందిన సాహిత్య విమర్శకుడు ఆచార్య రోణంకివారు, శ్రీరంగం నారాయణబాబును కవులకవిగా వర్ణించటం (పొయెట్స్ పొయెట్) అత్యంత సమంజసం. నిర్ద్వంద్వం. నిర్వివాదం.

జీవితమంతా భీభత్స దృశ్యాలని తిలకిస్తూ అట్టడుగు వర్గంవాడిగానే జీవించి అసువులు బాసిన అట్టడుగు వర్గం ప్రతీక, కవులకవి శ్రీరంగం నారాయణబాబుకి నా జోహార్లు,

ఈ వ్యాస రచనకు ప్రోత్సాహమిచ్చిన ఆచార్య రోణంకి అప్పలస్వామి గారికి నా కృతజ్ఞతలు.

శ్రీ వి. ఉ. వి. ప్రసాదరావు

తొలితెలుగు వ్యవసాయ పత్రిక కృషి

విజ్ఞానప్రచార ప్రసారసాధనాల్లో పత్రికలకుగల ప్రాధాన్యం ఇంతింతన రానిది. ప్రజల్లో సాంస్కృతిక చైతన్యం జాగృతం చెయ్యటంలో, వైజ్ఞానిక దృక్పథం వ్యాపింప చెయ్యటంలో ఈనాడు పత్రికలు బాధ్యతాయుతమైన పాత్ర వహిస్తున్నవి. తెలుగు పత్రికోద్యమం నూటయాభై ఏళ్ల ఉజ్జ్వల చరిత్ర గలది. వేలాది పత్రికలు పుట్టి ఆంధ్రుల్లో రాజకీయ, సాంస్కృతిక చైతన్యం కలిగించి అదృశ్యమై పొయ్యాయి. కాగా కొన్ని దశాబ్దాలనుండి ఇంకా వెలువడుతున్న పత్రికలుకూడ తమ బాధ్యత నిర్వహిస్తున్నాయి.

మనదేశం వ్యవసాయ ప్రధానమైనది. అజ్ఞానం, దారిద్ర్యం, మూఢ నమ్మకాల మధ్య నలిగిపోతున్న రైతును మేలుకొలిపి. అతన్ని వెలుగుబాటలో పయనింపచేసేందుకు ఎందరో మహానుభావులు లోగడ ప్రయత్నించారు. రైతుల మనోవికాసం కోసం, వ్యవసాయ పరిజ్ఞానాభివృద్ధి కోసం కొందరు వ్యవసాయ వార్తలకు ప్రాధాన్యమిచ్చే పత్రికలనే నడిపారు. రైతు పత్రిక (1904) వ్యవసాయము (1910), రైతు (1918) రైతాంగము (1928) రైతుపత్రిక (1929) స్వతంత్ర రైతు, సేద్యపు విద్య, కృషీవలుడు (1932) కృషి (1942) పాడిపంటలు (1948) మొదలగు పత్రికలు వెలువడి రైతు జ్ఞానాన్ని పెంపొందించేందుకు ఎంతో కృషి చేశాయి. "తెలుగు జర్నలిజం అవతరణ వికాసం" అనే సిద్ధాంత వ్యాసంలో డా. వి. లక్ష్మణరెడ్డి "కృషి అనే పత్రిక 1904 జూన్ నాటికే వున్నట్టు జూన్ 1904 కల్పలత పేర్కొన్నది" అని వ్రాశారు (పేజీ 249) డా. వి. లక్ష్మణరెడ్డిగారి 420 పేజీల తెలుగు జర్నలిజం చరిత్రలో ఒకే ఒక్క పంక్తికి నోచుకొన్న ఈ 'కృషి' తెలుగు రైతు సర్వతోముఖాభివృద్ధికి పాటుబడిన మహత్తరమైన పత్రిక. తెలుగులో వెలువడిన తొట్టతొలి వ్యవసాయ పత్రిక.

M. N. 385.

శ్రీ

కృషి

పెనుగొండ వ్యవసాయసంఘపువారి మాస పత్రిక.

THE KRISHI.

A MONTHLY JOURNAL, BEING THE ORGAN OF THE PENUKONDA AGRICULTURAL SOCIETY,

Mainly devoted to Agriculture and Diffusion of Useful Knowledge.

Yearly Subscription Re. 1 with Postage.	సంపుటము ౧.	[illegible] 1904.	సంచిక ౧౧.	చందా సంవత్సరము ఒంటెకాలిలో ౧ ఒకరూపాయ.

The Late Mr. J. N. Tata.
గతించిన 'తాతా'గారు.

కడచిన సెప్టెంబర్ "కృషి" సంచికయందు పట్టుపురుగునుగూర్చి వ్రాసినపుడు, బెంగుళూరుబసవాపురము నొద్ద, 'తాతా'యను ఘనుఁడు పట్టుయంత్రమునమర్చి పనిచేయుచున్నాఁడని ముచ్చటించియుంటిమి. ఈసుజనుఁడు ఈనెల 19 తేదిన జర్మనీదేశమున కాలధర్మము నొందెను. ఈదుఃఖవార్త దేశమున అపారానివ్యసనమును సంభవింపచేసియున్నది. ఈయన బొంబాయికి చేరిన పారసీకుఁడు. 1839సంవత్సరమున జన్మించి 65 ఏండ్లు బ్రదికి పేరుగాంచినవాఁడు. హిందూదేశపు ధనికులలో గణనకెక్కినవాఁడు. మహాయుదారి. ఈయన చేసినపలపనులగూర్చి ముందుసంచికయందు విపులముగా వ్రాయనెంచియున్నాము. ఈఘనునిమృతికి వగచుచుండు బంధుకోటికిని ఆశ్రితులకును స్వదేశీయులకును

త్రికరణ పురప

త్రియు నై

Malerosepuram.
మేలురాజపురము.
మేలుబంతిపొలము.

ఇంతకుముందు సంచికయందు మదరాసు దొరతనపువారు కోస్తాయందు అక్కడక్కడ సేద్యపుబళ్లను నెలకొల్పను ఉత్తర్వుచేసియున్నారనియు, అట్టిబళ్లు 5-6 అంటినిమాత్రము మొదట పరీక్షార్థమై స్థాపింపను చాటర్టన్ (Mr: A. Chatterton) దొరగారిని ఆజ్ఞాపించినారనియు సూచించియుంటిమి. మేలురాజపురమునందుండు సేద్యపుబడిన్ని అందుకు జంటగానుండు పొలమును చూచినపిమ్మట దొరతనపువారికి ఈసేద్యపుబళ్ల క్రొత్తయుక్తి మనసునకు తట్టినట్లున్నది. కనుక [illegible] గూర్చియుఁ బొలమునుగూర్చియుఁ దీనిని నెలకొల్పినఘనునిఁ గూర్చియు కొంత వివరింతము.

మేలురాజపురమనునది ఒక క్షుద్రగ్రామము. చెంగల్పట్టుజిల్లాలోనున్నది. ఆన్ద్రూ (Mr. Andrew) అనుయొకపాదరీదొరగారు 1893 సం॥ మేనెలలో

మద్రాను ప్రెసిడెన్సి గవర్నరు అంప్టహిల్ అనంతపురం జిల్లా పెనుగొండకు విచ్చేసిన సందర్భంలో పెనుగొండ వ్యవసాయ సంఘం ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమంలో, ఆ తెల్లదొరచేత 'కృషి' పత్రిక ఆవిష్కరింపబడింది. 'కృషి' మొట్టమొదటి సంచిక 1903 జూలైలో వెలువడింది. పెనుగొండ వ్యవసాయ సంఘ ఆధ్వర్యంలో వెలువడిన ఈ 'కృషి' పత్రిక సంపాదకులు స్వాతంత్ర్య సమరయోధుడు, సాహిత్యవేత్త న్యాయవాది అయిన శ్రీ టి. శివశంకరం. ఎనిమిది పేజీలతో, ముద్దులొలికే అక్షరాలతో నెలనెలా మద్రాసులో అచ్చయి వెలువడే 'కృషి' పత్రిక తెలుగు, తమిళ, కన్నడ ప్రాంతాల్లో పరిచితం అయివుండేది. శ్రీ టి. శివశంకరం గారి శిష్యులు అయిన అనంతపురం నివాసి శ్రీ. కె. ఆదెప్ప (రిటైర్డు సబ్ ట్రెజరీ ఆఫీసరు) గారి అధీనంలో వున్న 22 కృషి సంచికలను (1904 ఏప్రిల్ నుంచి 1906 జూన్ వరకు) చూసే అవకాశం నాకు లభించింది. ఈ పత్రిక నాలుగైదేళ్లు వెలువడి అదృశ్యమయిందని శ్రీ కె. ఆదెప్ప నాతో అన్నారు.

'కృషి' పత్రికలో వ్యవసాయానికి సంబంధించిన వార్తలకు, వ్యాసాలకు ప్రాధాన్యం వుండేది. సాగునేల నిర్మాణం, గొట్టపు బావులు, చూపుడు సంతలు నీరు కట్టుట, జలధారములు, పట్టు పురుగు, వ్యవసాయ విద్య - ఇవి ఒక సంచికలో వెలువడ్డ విషయాలు. భారతదేశంలోని వివిధ రాష్ట్రాల్లోను, విదేశాల్లో జరిగే వ్యవసాయ పరిశోధనల గురించి, అక్కడి రైతుల స్థితిగతుల గూర్చి, పాడి-పంటల గూర్చి మౌలికరచనలు, అనువాద రచనలు 'కృషి' సంచికల్లో ప్రచురింపబడేవి. రాజా మంత్రి ప్రెగడ భుజంగరావు బహద్దూరు రాసిన 'నీలిమందు' అనే వ్యాసం 'కృష్ణాపత్రిక' నుండి గ్రహింపబడి 'కృషి' ఏప్రిల్ - మే - జూన్ 1905 సంచికలో ప్రచురించబడింది. 'కృష్ణాజిల్లా గెజిట్' లోని వ్యాసం 'ప్రొద్దుతిరుగుడు పువ్వు' అనే పేరుతో అనువదింపబడి 1906 జనవరి 'కృషి సంచికలో అచ్చయింది. 'కృషి' పత్రికలోని రచనలు గ్రాంధిక భాషలో వెలువడినా సులభంగా బోధపడేవి. కొన్ని రచనలు వాడుక భాషలో కూడ అచ్చయ్యేవి.

'కృషి' పత్రిక ప్రచురణసంస్థ అయిన పెనుగొండ వ్యవసాయసంఘంకు శివగంగ మఠాధిపతులు ఇచ్చిన ఇనాము భూమి పరీక్షా వ్యవసాయక్షేత్రం (ఎక్స్‌పెరిమెంటల్ అగ్రికల్చరల్ ఫారం) గా వుపయోగపడేది. ఇచ్చట ఆధునిక వ్యవసాయరీతులు, పంటలపైన ప్రయోగాలు జరిగేవి. ఈ సంఘం తమిళ, కన్నడ ప్రాంతాల్లోని వ్యవసాయ సంఘ అధికారులతో వుత్తరప్రత్యుత్తరాలు జరుపుతూ తన సంఘసభ్యులైన 'కృషి' చందాదారుల విజ్ఞానాభివృద్ధికై పాటుపడుతుండేది. చెగల్పట్టు జిల్లాలోని మేలురాజపురంలో "అన్‌రూ" అన్నే పాదిరీ వ్యవసాయక్షేత్రం స్థాపించి హరిజన బాలురకు, యువకులకు వ్యవసాయం, ఇతర వృత్తి శిక్షణను ఇచ్చే ప్రయత్నాన్ని 'కృషి' సంపాదకులు 1904 మే సంచికలో ముక్తకంఠంతో ప్రశంసించారు. హిందూపురం సభ్యుడు భోగిరెడ్డి దక్షిణ ఆర్కాటు జిల్లాలోని కొత్తరకపు నేల శెనగ విత్తనాలు నాటించి 60 మణుగులు పండించిన విధానాన్ని సంపాదకులు 1905 ఏప్రిల్ సంచికలో స్తుతించారు. విశాఖపట్టణ వ్యవసాయ సంఘం ఏర్పడిన ఘటనను ప్రశంసిస్తూ, దానికి వుజ్జ్వల భవిష్యత్తు కోరడం ఆగష్టు 1904 'కృషి' లో చూడవచ్చును,

'కృషి' పత్రికలలో వ్యవసాయేతర విషయాలు కూడ క్లుప్తంగా ప్రచురింపబడేవి. అయితే రాజకీయాలు మాత్రం ప్రస్తావింపబడేవి కావు. 1904 మార్చి 'హిందూసుందరి' (కాకినాడ) గూర్చి 1904 ఏప్రిల్ 'కృషి' లో వివరంగా సమీక్షించారు సంపాదకులు. 1906 ఫిబ్రవరి 'కృషి' సంచికలో 'స్త్రీ విద్య' గూర్చి చక్కని వ్యాసం చూడవచ్చును. పెనుగొండ నివాసి శ్రీ యన్. కూరత్తాళ్వార్ భూగోళ సంబంధ విషయాల గురించి కథాత్మక శైలిలో వ్యాసాలు రాసి 'కృషి' లో ప్రచురించేవారు. శ్రీ యన్. కూరత్తాళ్వార్ 1906 ఏప్రిల్ - మే 'కృషి' లో పెనుగొండ గురించి రాసిన వ్యాసంలోని ఈ పంక్తులు పరిశీలించండి :

"కోటలో బ్రాహ్మణ మతస్థులు విశేషము. పేటలో మహమ్మదీయ మతస్థులు విశేషము. దీనికి దక్షిణమునను, ఉత్తరమునను ఊట బావులును, ఉపేంద్రి నదియును నొక చిన్న వంకయు నున్నది. ఇంత యుండియు వర్షము క్రమము తప్పినప్పుడంతయు నిక్కడ నీళ్ల కఱవు విశేషము." పెనుగొండ నీటి కటకట ఆకటకట శ్రీకృష్ణదేవరాయల కాలము నుండి వస్తున్నదే కదా !

మొట్టమొదటి తెలుగు వ్యవసాయ పత్రిక 'కృషి' కొన్నేళ్లపాటే వెలువడ్డా, రైతు వ్యవసాయ విజ్ఞానాన్ని విస్తరింపచేసి, అతనిలో ఆధునిక శాస్త్రీయ దృక్పథం కలిగింపచేసి కాలగర్భంలో కలసిపోయింది. తెలుగు పత్రికారంగ వికాసానికి తోడ్పడిన పత్రికలు ఎన్నో రాయలసీమనుంచి వెలువడ్డాయి. కాని పరిశోధకులు అవైపు దృష్టి మళ్లించక పోవటం విచారకరం.

శ్రీ ఘట్టమరాజు

వృత్తివిద్యాలు-ఒకపరిశీలన

నేటి మన విద్యావిధానంలో విద్యకు ఉపాధికి సంబంధంలేదు. బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన విద్యావిధానం ఇంకా కొనసాగుతున్నది. విద్యకు ఉపాధికి సంబంధం లేకపోవడం వలన డిగ్రీలపై మోజు పెరుగుచున్నది. విద్యార్థులు డిగ్రీలపై మొగ్గుచూపకుండా చేయడానికి జూనియర్ కళాశాల స్థాయిలో వృత్తి విద్యలను ప్రవేశపెట్టాలి. 1964 సం॥ లో వచ్చిన కొఠారి కమిషన్ వలన, 10+2+3 విద్యావిధానం మన రాష్ట్రంలో 1969లో ప్రవేశపెట్టినారు. దీనిలో మొదలియార్ కమిషన్ వలన వచ్చిన 12 ఏళ్ళ పాఠశాల విద్యను రద్దుచేశారు. అంటే 12 ఏళ్ళ పాఠశాల విద్యలో వున్న 9, 10, 11, 12 తరగతులలో వున్న డైవెర్సిఫైడ్ కోర్సులను రద్దుచేయడం జరిగింది. 10+2+3 విధానంలో 10 ఏళ్ళ వరకు ఆప్షనల్ సబ్జెక్టులు వుండకుండా అందరకు సమానమైన విద్య వుంటుంది. తర్వాతవున్న 2 సం॥ ల విద్యను ఇంటర్మీడియేట్ విద్యగా ప్రవేశపెట్టారు. ఇక్కడ విద్యార్థులకు ఆప్షనల్ సబ్జెక్ట్‌లు వుంటాయి. అయితే ఇంటర్మీడియేట్‌స్థాయి విద్యలోనే వృత్తి విద్యలను ప్రవేశపెట్టవచ్చును. ఎందుకంటే పాఠశాల విద్యలోనే వృత్తి విద్యలను ప్రవేశపెడితే మంచి ఫలితాలు రాలేదని కొన్ని ఇతరదేశాల అనుభవాలుకూడ మనకు కనిపిస్తాయి. కొఠారి కమిషన్ నివేదికలోని సారాంశాన్ని ఈ విధంగా పేర్కొనవచ్చును. సామాజిక, ఆర్థిక పారిశ్రామిక రంగాలలోని మానవశక్తి అవసరాలకు అనుగుణంగా ఉన్నతవిద్యారంగంలో కోర్సులను ప్రవేశపెట్టాలి, పని అనుభవాన్ని, సాంఘిక సేవను సాధారణ విద్యలో భాగంగా చేర్చాలి. జాతీయ విద్య, పరిశోధనా శిక్షణమండలి (ఎన్.సి.ఆర్.టి.), వృత్తివిద్యల ఆవశ్యకతను, మానవ వనరుల వినియోగావశ్యకతను స్పష్టంగా పేర్కొన్నది. హయ్యర్ సెకండరీ స్థాయిలో (ఇంటర్మీడియేట్ స్థాయి) వృత్తి విద్యలను ప్రవేశపెట్ట డానికి రెండు ప్రధానమైన కారణాలను పేర్కొనవచ్చును.

1) వృత్తి విద్యలను ప్రవేశపెట్టి మానవ వనరులను సద్వినియోగం చేసుకోవడం.

2) వృత్తి సంబంధమైన తరిఫీదు నివ్వడం వలన, ఉద్యోగావకాశాలను మెరుగుపరచడం.

ఈ విధంగా జాతీయ విద్యావిధానావశ్యకతను దృష్టిలోవుంచుకొని 6వ ప్రణాళికా కాలంలో మన రాష్ట్రంలో 1979 సం॥ లో 16 రకముల వృత్తి విద్యలను ప్రవేశపెట్టారు. ఈ వృత్తి విద్యలు ప్రధానంగా 3 తరగతులుగా విభజించవచ్చును.

1) ఇంజనీరింగ్, సాంకేతిక విద్య

2) వ్యవసాయము, పశుపోషణ, గృహసంబంధ విద్య (హోమ్‌సైన్స్)

3) ఫార్మసీ విద్య

ప్రారంభంలో ఈ వృత్తి విద్యలను 22 కళాశాలల్లో ప్రవేశపెట్టారు. 1980-81 సం॥లో ఈ వృత్తి విద్యలు 48 కళాశాలలకు (జూనియర్, డిగ్రీ) విస్తరించాయి. ఈ సంవత్సరములోనే 20 ప్రైవేట్, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశపెట్టుటకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. 1982-83 సం॥ లో ఈ వృత్తి విద్యలను ప్రవేశపెట్టిన కళాశాలల సంఖ్య 129 కి పెరిగింది. ఈ విధంగా వృత్తి విద్యలుగల కళాశాలల సంఖ్య పెరిగినప్పటికి, విద్యార్థుల సంఖ్య పెరగడంలేదు. ఈ వృత్తి విద్యలలో చేరుటకు విద్యార్థులు శ్రద్ధ కనపరచడం లేదు. ఈ విషయాన్ని ఈ క్రింది పట్టికద్వారా గమనించవచ్చును.

సం॥	ప్రవేశపెట్టిన కోర్సులు	కళాశాలలు	సెక్షన్‌లు	మొత్తం సీట్లు	వాస్తవంగా చేరిన విద్యార్థులు
1979-80	16	22	33	660	516
1980-81	20	56	82	1610	1350
1981-82	20	82	110	2210	1550
1982-83	21	88	116	2290	1376
1983-84	21	129	184	3680	3021

పై పట్టికనుబట్టి చూస్తే విద్యార్థులు వృత్తి విద్యలలో అంతగా శ్రద్ధ కనపరచడం లేదని తెలుస్తున్నది. 1982-83 సం॥ లో 670 జూనియర్. కళాశాలల్లో మొదటి సం॥లో చేరిన విద్యార్థుల సంఖ్య 1.86 లక్షల. వృత్తి విద్యలలో 1376 మంది విద్యార్థులు మాత్రమే వున్నారు. వాణిజ్యము, వ్యాపార నిర్వహణ కోర్సులు తప్ప మిగతా కోర్సులు సాంకేతిక సంస్థల సహకారంతో నిర్వహించ బడుచున్నవి. ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌ల నుండి కొంతమందిని డిప్యూటేషన్ పద్ధతిపై నియమించుటకు ప్రభుత్వం నిశ్చయించింది. ఇంకా ఈ కోర్సులకు ప్రభుత్వం ఎక్కువ మొత్తంలో నిధులు సమకూర్చవలసి వున్నది.

జాతీయ విద్య శిక్షణామండలి (ఎన్.సి.ఆర్.టి.) 1981 సం॥లో వృత్తి విద్యల తీరును పరిశీలించింది. 1983 సం॥లో వి.ఆర్. రెడ్డి అధ్యక్షతన ఒక కమిటీనికూడ మన ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ ఈ క్రింది సూచనలు చేసింది

1. ప్రత్యేకమైన కోర్సులకు ప్రత్యేకమైన బోర్డులను ఏర్పాటు చేయడం.
2. కోర్సులను ప్రవేశపెట్టేముందు వాటికి సంబంధించిన సర్వేచేయడం.
3 వున్న కోర్సులను మళ్ళీ పునర్వవస్తీకరణ చేయడం.
4 ఈ కోర్సులలో చేరిన విద్యార్థులకు పై చదువులకు అవకాశం ఇవ్వడం.

పై సూచనలను బట్టి ప్రస్తుతమున్న వృత్తి విద్యలలో ఈ క్రింది అంశాలను సవరించవలసి వున్నది.

1. వృత్తి విద్యల ప్రాముఖ్యతను గుర్తించక పోవడం.
2. ఈ కోర్సులకవసరమైన బోధన, ఇతర వస్తుసామాగ్రి సౌకర్యాలు లేకపోవడం.
3. ఉపాధికి వీలుగా ఈ కోర్సులను గుర్తించకపోవడం.
4. [illegible] నుంచి క్రమముగా విద్య లభ్యం కాకపోవడం.

[illegible] విద్యలు ప్రవేశపెట్టినప్పటికి ఉపాధికి అవకాశాలు లేనపోవడం వలన విద్యార్థులు వృత్తివిద్యలలో చేరలేకపోతున్నారు. సాధారణ కోర్సులలో సీట్లు లభ్యం కాకపోతేనే విద్యార్థులు వృత్తివిద్యలలో చేరుతున్నారు. ఉపాధికి సంబంధంలేని విద్యవలన విద్యార్థులకు చదువుపట్ల శ్రద్ధ వుండడం లేదు. విద్యార్థులయొక్క అశ్రద్ధ అధ్యాపకుల అశ్రద్ధకు దారితీస్తుంది. విద్యార్థులకు ప్రత్యామ్నాయంగా విద్యావకాశాలు లేనందున వున్నటువంటి కోర్సులలో చేరుతున్నారు. ఆర్ట్స్ గ్రూపులలో చేరే విద్యార్థులకు జీవితలక్ష్యం వుండదని చెప్పవచ్చును. కొద్దిమంది సైన్స్ విద్యార్థులకు మాత్రమే ఒక లక్ష్యం వున్నట్లు కనబడుతుంది. దీనికి కారణమేమిటంటే విద్యాసంస్థలకు ఉద్యోగావకాశాలు వుండే పరిశ్రమలకు, సంస్థలకు సంబంధం లేకపోవడం, మన దేశంలో ఐ. ఐ. టి., ఐ. ఐ. ఎమ్. లాంటి విద్యాసంస్థలకు పరిశ్రమలకు, ఉద్యోగ సంస్థలకు మాత్రమే సంబంధం వున్నదని చెప్పవచ్చును. అంటే ఇక్కడ ఉపాధికి విద్యకు సంబంధం వుందని చెప్పవచ్చును. ఈ విధంగా కొన్ని సంస్థలకే కాక ప్రభుత్వ విద్యాసంస్థలన్నింటికి ఉపాధికి సంబంధం వుండాలి. ఈ విధంగా వున్నట్లయితే ప్రైవేట్ సంస్థలకు (వైద్య, ఇంజనీరింగ్ కళాశాలలకు) డిమాండ్ కూడ తగ్గుతుంది. ఈ విధంగా ప్రభుత్వం విద్యార్థులకు వేతన ఉద్యోగాలకైనా, స్వయం ఉద్యోగాలకైనా అవకాశం వుండే విద్యలను ప్రవేశపెట్టాలి. వృత్తి విద్యలను ప్రవేశపెట్టుచున్నపుడు ఉపాధి అవకాశాలను దృష్టిలో వుంచుకోవలసి వుంటుంది. ఉదాహరణకు బ్యాంకింగ్ పరిశ్రమలో ఏటా 4,000 క్లర్కులు, 4,600 ఆఫీసర్‌లు అవసరం అవుతారు. బ్యాంకింగ్ కోర్సులను ప్రవేశపెడితే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. ఈ బ్యాంకింగ్ కోర్సులు చదివిన విద్యార్థులకు మాత్రమే ఎంపికలో మొదట అవకాశాలు వుండాలి. అయితే ప్రభుత్వం ఉపాధికి ఏ రంగాలలో ఏ ప్రాంతాలలో అవకాశాలు వున్నాయో సర్వే చేయాలి. జిల్లావారిగా తీసుకుంటే జిల్లా ప్రణాళికాధికారులను గణాంకశాఖాధికారులను ఉపయోగించుకొని జిల్లాలోవుండే అవకాశాలను తెలుసుకొనవచ్చును. సామాజిక అవసరాలను ప్రభుత్వం గుర్తించాలి. వృత్తివిద్యలు సామాజికావసరాలను తీర్చేవిధంగాను, ఉద్యోగావకాశాలను పొందేవిధంగా వుండాలి. వృత్తివిద్యలను, ఉపాధికి వీలైనవిగా ప్రత్యేకంగా గుర్తించాలి. మన రాష్ట్రంలో వృత్తి విద్యలలో గృహ సంబంధమైన కోర్సులను (హోమ్‌సైన్స్) బాలికలకు ప్రత్యేకంగా ప్రవేశపెట్టారు. ఈ కోర్సును ప్రభుత్వం టి.టి.సి. కి సమానమైనదిగా గుర్తించడం వలన టీచర్ ఉద్యోగాలు పొందగలిగారు. ఈ విధంగా ప్రభుత్వం వృత్తివిద్యాకోర్సులను ఉపాధికివీలుగా గుర్తించడం వలన విద్యార్థులు ఉద్యోగావకాశాలు పొందగలుగుతారు. వృత్తి విద్యలను పరిశీలించితే ఈ అంశాలు ముఖ్యమైనవిగా కనిపిస్తాయి.

1) వివిధ ప్రాంతాలలో, రంగాలలోవున్న అవకాశాలను, సామాజిక అవసరాలను సర్వేచేయడం.
2) విద్యార్థులకు వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు సంబంధం వుండే విధంగా చూడడం.
3) ఉపాధికి, ఉత్పత్తికి వున్న పాఠ్యాంశాలను ప్రవేశపెట్టడం.
4) ఉపాధికి అవకాశమున్న శ్రమ సాంద్రతగల చిన్నతరహా పరిశ్రమలకు సంబంధించిన అంశాలను నేర్పడం.
5) వృత్తివిద్యలను ఉపాధికి అర్హమైన కోర్సులుగా ప్రభుత్వం గుర్తించడం
6) ప్రణాళికలలోనే ఉద్యోగితతోకూడిన అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకోవడం
7) వృత్తివిద్యల్లో చేరిన విద్యార్థులకు పై చదువులకు అవకాశం ఇవ్వడం.
8) వృత్తి విద్యలకవసరమైన నిధులు, వస్తుసామాగ్రి, అధ్యాపకులు వుండే విధంగా చూడడం.

ఈ మధ్యలోనే మన జాతీయ ప్రభుత్వం కూడ విద్యావిధానంలో మార్పులను కోరుచున్నది. 7వ ప్రణాళికలో విద్యకు ప్రాముఖ్యం ఇవ్వడం జరుగుచున్నది. డిగ్రీ విద్యలకు కాక వృత్తి విద్యలకు ప్రోత్సాహం వుంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. వృత్తి విద్యలను వ్యవసాయ, . పరిశ్రమలు,

కమ్యూనికేషన్ రంగాలలో సమన్వయం చేయడం మరియు ఉత్పాదనను పెంచడం ప్రభుత్వ ఉద్దేశ్యం. ఈ విధంగా చేయడంవలన సామాజిక, ఆర్థిక, పారిశ్రామిక రంగాలలోని మానవశక్తి అవసరాలకు అనుగుణంగా విద్యా రంగాలలో కోర్సులను ప్రవేశపెట్టాలన్నా కొఠారి కమిషన్ లక్ష్యం నెరవేరుతుంది.

అధోజ్ఞాపికలు

1. ఎడ్యుకేషన్, మాన్‌పవర్ అండ్ ఎకనమిక్ గ్రోత్ స్ట్రాటెజీస్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్.

   ప్రెడరిక్ హార్బిసన్, ఛార్లెస్ మెయర్స్.

2. ఒకేషనలైజేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ అట్ ప్లస్ టు స్టేజ్ ఇన్ ఎ.పి. రెట్రాస్పెక్ట్ అండ్ ప్రాస్పెక్ట్.

   జె.ఏ. అసోసియేషన్ రిపోర్ట్.

3. ఒకేషనల్ ట్రయినింగ్ ఫర్ బ్యాంక్ స్టాఫ్ ఎన్. వేగల్.

(ది హిందూ డేట్ 19.1-85)

శ్రీ జి. లక్ష్మయ్య


లేఖ

"వడ్డమాను స్తూపము - చారిత్రక అవశేషములు" - కొన్ని సూచనలు

జూన్ 1986 భారతిలో డా॥ ఇంగువ కార్తికేయ శర్మగారు వడ్డమాను స్తూపము మౌర్యుల కాలపు స్తూపమని సహేతుకముగ నిర్ణయించుట హర్షనీయము. ఈ నిర్ణయమునకు భంగకరములు కాకపోయినను, ఆ వ్యాసమున వారు చేసిన ఒకటి, రెండు ప్రతిపాదనలు సహేతుకములు కావని మా అభిప్రాయము. అవి-

1. దామకస పద నిర్ణయము : కొండచెరియపై గల శాసనము (1వ ఛాయాచిత్రము, ఎస్టాంపేజి కాపీ ఫోటో[1])లో 8వ అక్షరమును డా.టి.వి.జి. శాస్త్రిగారు 'సో' అని చదివి, అప్పటిరాజు సోమకుడని నిర్ణయించగా. శ్రీ శర్మగారు 'డా' అని చదివి, డామకుడని నిర్ణయించిరి. ఆ అక్షరమును పరిశీలించగా దాని కుడిప్రక్క మధ్య భాగాన అర్ధచంద్రాకారపు రేఖ స్పష్టముగా గోచరించుచున్నది. కాని ఆ రేఖ ఎడమ చివరి భాగము ఏ కారణము వలననో ప్రధాన భాగముతో కలియలేదు. అందువలన ఆ అర్ధచంద్రాకారపు రేఖను విస్మరించి శ్రీ శర్మగారు ఆ అక్షరమును 'డా' అని నిర్ధారించిరి.

(ఆ రేఖను ఈ క్రింద చూపిన చిత్రములో పరిశీలింప నగును.)



ఆ అర్ధచంద్రాకారపు రేఖతో కలిపి చదువగా ఆ అక్షరము "సొ" అని తెలియదగును. అదే శాసనముగల 6వ అక్షరమయిన "స"తో పోల్చిచూచిన ఈ విషయము నిర్ధారణయగును. అంతేకాక అదే కాలమునకు చెందినదని వారు చూపిన కుడ్య స్తంభిక శాసనమున గల "స" అను అక్షరమును పరిశీలించినను ఈ విషయము స్పష్టమగును. కాబట్టి ఆ పదము 'దామక' అనికాక 'సొమక' అనియే చదువవలయును. శ్రీ శాస్త్రిగారు ఆ అక్షరము 'సో'గా చదువుట కూడా పొరపాటే. ఆ అక్షరముపై కుడిప్రక్కకు మాత్రమేగలగీత "దీర్ఘ" చిహ్నమే గాని "ఒత్వ" చిహ్నముకాదు. "ఒత్వ చిహ్నమైనచో ఇరుప్రక్కలకు కొంత విస్తరించబడి యుండును. కనుక ఆ రాజు "సొమకుడు" అని తెలియనగును.

2. దమక - దమ్మకడ :- రాజ దమక నామము అతని రాజధానికి సంక్రమించుట వలన దమ్మకడ నామము ఏర్పడినదని శ్రీ శర్మగారి యూహ. ఈ యూహకు ఆధారము పైన పేర్కొనిన శాసనమున గల దామకుడని వారు నిర్ణయించిన రాజ నామము మాత్రమే. కాని దమ్మకడ, దమ్మకట, దనకడ పదములు దమక నామమునుండి గాక 'ధమ్మ' అను ప్రాకృత పదమునుండి ఏర్పడెననుట సమంజసము. అమరావతి శాసనములలో ధంఞకడ[3] (ዐ⅂+ᒧ) లేక ధంఞకట[4] (ዐ⅂+ᑕ) అను రూపములు గలవు, ఇందలి అనునాశికము 'మ్' అని గాని 'న్' అనిగాని చదువునపుడు ధమ్మకడ ధన్నకగ లేదా ధమ్మకట ధన్నకట రూపములు పొందును. ధమ్మకడ పదమునుండి దమ్మకడ రానగును. బౌద్ధధర్మము విలసిల్లిన ప్రదేశమగుటవలన ధమ్మకడ లేక ధమ్మకడయని పిలువబడెను. కాని 'దమక' పదముతో సంబంధము గలదను వీరి యూహ సహేతుకము కాదు.

3 ధరణికోట : "విశాలమైన ప్రశస్తిబడసిన సామ్రాజ్యపు కోట పట్టణములుండుటచే ధరణికోటగా సాతవాహనుల కాలమునుండి ఖ్యాతి చెందినది" అని వ్రాసారు -కాని వజ్రాయన బౌద్ధ సంప్రదాయము ప్రకారము ధారణిని మంత్ర తంత్ర కాలచక్రములతో భూస్థాపితము చేసి, ఆపై కోట నిర్మించుటచే ధారణికోట అని పిలువబడి కాలక్రమమున ధరణికోటగా మారినది. ధారణియనగా దావీదువంటిది, (మంత్ర పూతమైన యంత్రములు పెట్టెడి లోహపు గొట్టము.) ఈ విషయము డా. బి ఎస్. ఎస్. ఎల్. హనుమంతరావుగారు తమ రెలిజియన్ ఇన్ ఆంధ్రాలో స్పష్టముగా తెలియపరచిరి కాబట్టి 'ధరణికోట' అనుపేరు వజ్రాయన సాంప్రదాయ సిద్ధము.

ఈ మా అభిప్రాయములు చారిత్రక సత్యములను నిర్ధారణ చేయుటకు సహకరించగలవను నమ్మకముతో ఈ విమర్శ వ్రాయవలసి వచ్చినది. సహృదయులు పరిశీలింతురుగాక.

బి. రమేష్ చంద్రబాబు
ఎస్. నారాయణమూర్తి

సూచనలు

రాయిపైని అచ్చుగీతలు చాల కానవచ్చుచున్నవి. ఇక 'స' యను చదువుచున్నవారు 'ᒥ' యిట్టి స్వరూపమునకు కలశియున్నదనే '◡' యర్థచంద్రాకారపుభాగము రాతిపైనున్న కొన్ని పగుళ్ళ గీలుగానే తోచుచున్నవి. అక్షరముతో చేరలేదు. స్వయంగా నీ ప్రదేశమునకు పోయి, అచ్చటి రాతిపైని శాసనమును - రాయిపైనున్న యితర గీతలను నిశితముగా పరిశీలించిన పిమ్మటే నేను ఈ యక్షరమును 'ద' గా నెరిగియుంటిని, ఇదే ప్రదేశమునుండి కుండ పెంకులపైని మరికొన్ని చిన్న శాసనములున్నవి. ఈ 'ద' కూడ యున్నది.

బౌద్ధస్తూపముగా నెరిగినందుకు సంతోషము.

ఇక ధమ్మకడ, ధాన్యకడ, శ్రీధాన్యే యనుపేర్లు ధరణికోటగా మారియుండ ననును. ఇచ్చట కేవలము బౌద్ధము మాత్రమేగాదు శైవము హింది క్రీ. శ. 1వ శతాబ్దినుండి యుండెను చూడుడు నా వ్యాసము భారతి నవంబరు 1980 పుటలు 50-57. ఒక్క ధమ్మకడయే కాదు. శ్రీ ధాన్యకటక ... శాసనములందు గలదు. అసగా వ్యాపారరీత్యా కూడా యిచ్చటి పుపట్టణము దేశ విదేశములతో సంబంధము యుండియుండెను పుళుమావి ధనకట ... నేహి గానొక శాసనమున యెరుంగుదుము. ఇదివరలో శ్రీ హనుమంతరావుగారు అమరావతి-యను నామము అమరావతినుండి వచ్చియుండెనని వూహించిరి. అట్లే పెక్కు విధముల స్థల నామముగూర్చి చర్చలు జరుగుచుండెను. కాని యివన్నియు నిశితముగా చెప్పజాలకున్నాము. అట్లేనేను డామకుడు పాలించిన "కడ, లేక కట, కన, దమ్మకడ". యని వూహించుమాటలు తప్పులేదు.

డా. ఇంగువ కార్తికేయశర్మ

గ్రంథ విమర్శలు

నారాత్మచక్రం

[శ్రీ తల్లాప్రగడ ప్రకాశరాయడుగారు. ప్రచురణ: గాంధేయ సమాజ సేవాసంస్థ, గాంధీక్షేత్రం, అవనిగడ్డ-521128, కృష్ణాజిల్లా. మూల్యం. ఆరవై రూపాయలు. పుటలు 296]

ఇది తల్లాప్రగడవారి అనుభవాలకూ, జ్ఞాపకాలకూ సంబంధించిన గ్రంథం. వారి కుమార్తె ప్రోత్సాహంవల్ల రచించిన గ్రంథం. వీరి రచనను గూర్చి విని, శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారి పుత్రులు బుద్ధప్రసాద్, వారియొద్దనుండి తమ సంస్థ తరపున ప్రచురణకు స్వీకరించారు. గ్రంథనామం కూడా వారే సూచిస్తే, రచయితకు ఆమోదయోగ్యమయింది.

అసలు ఈ ఆత్మకథలనేవి సాధారణంగా ప్రపంచప్రసిద్ధిని కాని, దేశప్రసిద్ధిని కాని, కనీసం రాష్ట్రప్రసిద్ధిని కాని పొందిన వ్యక్తులు వ్రాసుకునేవి. వారి జీవితాల్లో అనేక సంఘటనలుంటాయి. అవి, ప్రజల జీవితంతో, ఏదో విధంగా ముడివడి వుంటాయి. అందుచేత ప్రజలకు వానిమీద ఆసక్తి వుంటుంది. అందుచేత ప్రచురణకర్తలు వానిని అచ్చువేస్తే, వారికి ద్రవ్యలాభమూ, ప్రజలకు ఉపయుక్త విషయలాభమూ వుంటాయి. కొందటి ఆత్మకథలు, ఒక నవల సాగినట్లుగా సాగిపోతవి. వాఙ్మయంలో కూడా వాటికి ఒక ప్రత్యేక స్థానం వుంటుంది.

అయితే, ఇతరులు ఆత్మకథలు వ్రాసుకోకూడదనే నిషేధం లేదు. అలా చాలామంది వ్రాసుకున్నారు కూడా. వారి జీవితంలోనూ కొన్ని సంఘటనలు ఆసక్తికరమైనవి వుంటాయి. ముఖ్యంగా తత్కాలీనమైన సంఘం అందులో ప్రతిబింబిస్తూ వుంటుంది. ఏ యితరమైన గ్రంథాలలో అంతగా కనరాని పల్లెటూళ్ళ జీవన విధానం, ముఖ్యంగా స్వరాజ్యం రాకముందు ఒక తరంవారి స్థితి అందులో ప్రతిఫలిస్తుంది. అందులో కూడా తెలిసికోవలసిన విషయాలెన్నో వుంటాయి. ప్రకాశరాయుడుగారి ఆత్మకథ ఈ కోవలోనిది.

వారి జీవితంతో ముడివడియున్న, అప్రసిద్ధులయిన, ప్రసిద్ధులయినవారి అధ్యాపకులు వారి జీవితంమీద ఎట్టి ప్రభావం కలిగించినదీ ఆనాటి స్కూళ్ళ నిర్వహణ పద్ధతులెలా ఉండేవీ (టంగుటూరు, తణుకు స్కూళ్ళు) ఆనాటి అనుభవాలూ, అలాగే కాకినాడ, రాజమండ్రి కళాశాలల అనుభవాలూ, కలకత్తాలో యమ్. ఎ. చదువు అనుభవాలూ, బ్రహ్మసమాజంలో ఉద్దండులతో పరిచయాలు ఇందులో వివరింపబడినై. 1907-8 ప్రాంతంలోని వందేమాతరోద్యమం వారిని ఆకర్షించింది. మోడరన్ రివ్యూ పత్రికా సంపాదకులయిన రామానంద ఛటర్జీని, నిరాడంబరుడై, యూనివర్శిటీ వరండాలలో సంచరిస్తూ వుంటే, ప్రొఫెసర్లు పాదాలపై ఒరిగిపోతూ వుండే మన్ననలందుకొనే వైస్ ఛాన్సలర్ అసుతోష్ ముఖర్జీని, కళాశాలాధికారులు ప్రిన్సిపాల్ పదవి చేపట్టమని కోరగా, తనకంటె పెద్దలున్నారని దానిని నిరాకరించిన ఈశ్వరచంద్ర విద్యాసాగరుని, తన పాదరక్షలకు పాత నులకత్రాడును తన నౌకరు కట్టాడనే విషయం కూడా గమనించకుండా, వుండే పెద్ద యూనివర్శిటీ ఇంగ్లీషు ప్రధాన ప్రొఫెసరు స్కాచ్ 'స్టీఫెన్'ను ఎంతగానో ప్రశంసించారు. స్టీఫెన్ తనకవసరమైన డబ్బు మాత్రమే తీసికొని మిగిలినది యూనివర్శిటీకి జమ కట్టివేసేవారట!

పల్లె జీవితం అంటే రచయితకు ఇష్టం. సొంతంగా కూరగాయలు కాపించుకోవడం ఇష్టం. గాంధీగారి సిద్ధాంతాలంటే ప్రాణం. పశువులను గురించి ఒక ప్రకరణమే వ్రాశారు. అధ్యాపకవృత్తిని కొంతకాలం చేశారు. తర్వాత వారు అర్జీ పెట్టకుండానే మద్రాసు సంయుక్తరాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న టంగుటూరి ప్రకాశంగారు వీరిని అనంతపురం జిల్లా టెక్స్టైల్ కమీషనరుగా గెజిటెడ్ ఆఫీసరుగా నియమించారు. ఆనాటి దైనిక పత్రికను చూచి ఒక మిత్రుడు వీరికి చెప్పేదాకా తెలియదు. ఆ ఉద్యోగపు అనుభవాలు చెప్పి అప్పుడు వున్న తెల్లవారిలో కొందరి "నిజాయితీని వీరు ప్రశంసించారు. గరిమెళ్ళవారి దీనావస్థను గురించి వ్రాశారు. వారు నమ్మిన విషయాలను చిత్తశుద్ధితో చెప్పారు.

"మాంసాహారులు మాంసంమీద రోతపుట్టి, శాకాహారానికి మరలడం ఒక ఉత్తమ సంస్కారంగా ప్రపంచంలో పరిగణింపబడినది. కాని. వద్దన్నవాళ్ళకు కూడ కాస్త కాస్త రక్తమాంసపు తిండిని అలవాటు చేయాలన్న 'గోరా' సిద్ధాంతాన్ని వ్యాఘ్రాలు కూడ హర్షించవు" అనీ, "దేశమంటే మట్టికాదోయ్. అనే మాట ఒక దృష్టిలో నిజమైనా, అది మట్టే మనుషులూ కూడానని కలిపే చెప్పుకోవాలి." అనీ. "ఇప్పుడు, ఇండియా పొలిటీషియనులు అనుభవిస్తున్న స్వరాజ్యం కోసం గాంధీ పుట్టలేదు" అనీ చెప్పారు. గ్రంథం చివరిభాగంలో కొన్ని ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అక్కడక్కడ ఇంగ్లీషు కొటేషన్సు

కూడా వున్నవి. గ్రంథంలో గాంధీయుగం జీవియొక్క పే సంస్కారం చక్కగా వెల్లడి అవుతుంది. చక్కగా చదివింపగల గ్రంథం. వార్ధక్యంలో జ్ఞాపకం తొన్నడు వ్రాయడంచేత, బహు విషయాలు చెప్పవలెననే తపన ఉండడంచేత ఒక ప్రకరణం చెప్పవలసిన విషయాలు మరొకచోట చెప్పడం జరిగింది. చెఱకు వంకరపోయినా తీపి తగ్గదు కదా! గ్రంథాలయాలలో వుండవలసిన గ్రంథం.

పైడిపాటి సుబ్బరామశాస్త్రి

కృష్ణరాయ విజయము

[కవి : కుమారధూర్జటి. ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్ - 4, వెల : రు. 4. సంపాదకుడు : డా. సి. వి. రామచంద్రరావు]

సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీ కృష్ణదేవరాయల దిగ్విజయమును వర్ణించు పద్యకావ్యమిది. కర్త కుమార ధూర్జటియను నామాంతరము కల వేంకటార్యుడు.

ఈకవి భరద్వాజసగోత్రుడు. ఆపస్తంబ సూత్రుడు. పాకనాటి ఆర్వేల వంశజుడు. తనను ధూర్జటి పౌత్రునిగా ప్రకటించుకొనినాడు. ఓరుగంటి కాశీపతి శిష్యుడు. తలిదండ్రులు లక్ష్మాంబిగా కాశయామాత్యులు. ఇతడు పోలనమంత్రి, గుర్వమాంబికలకు దత్తపుత్రుడు, ఈ కవి క్రీ. శ. 1680 ప్రాంతంలో జన్మించాడని సంపాదకుల సమంజస భావన. ఇతడు ఇందుమతీ పరిణయం, సావిత్రీ చరిత్రకూడా రచించాడని తెలుస్తోంది. ఇతడు నూజవీడు ప్రభువైన నారాసింహాప్పారావు ఆస్థానమునందుండెడి వాడనుటకు ఆధారములున్నవి. కృష్ణరాయ విజయమును మాత్రము ఇతడు ఆర్వీటి చిన వేంకటాద్రి ప్రేరణతో వ్రాసినాడు. ఈ చిన వేంకటాద్రి 18వ శతాబ్ద ప్రథమ పాదంలోని వాడు. కనుక యీ కావ్యరచనకూడా క్రీ. శ. 1705-10 మధ్య జరిగివుంటుంది. ఎందుకంటే యీకావ్యరచనా కాలానికి కుమార ధూర్జటికి 25-30 సంవత్సరాల వయస్సు వుండి వుంటుంది.

శ్రీరామునికి అంకితముగా రచించిన యీ నాలుగా శ్వాసాల కావ్యం శ్రీ కృష్ణరాయల విజయగాథ. రాయ వాచకానికి పద్యకృతి. అయినా రాయవాచకంలోని అనేక విషయాలను యీ కవి తాకలేదు. అంతేకాక ఛందోబంధ నిబంధనార్థమో. ఏమోకాని, కొన్ని చారిత్రిక సత్యాలను వక్రీకరించాడు కూడ. అందువల్ల యీ కావ్యం చారిత్రిక ప్రమాణాలకు నిలువదు కాని నాటి జీవన సరళిని తెలుసుకోవటానికి పనికి వస్తుందని పలువురు పండితుల, పరిశోధకుల భావన.

మొదటి ఆశ్వాసమున వీరనరసింహరాయలపాలన, విజయనగర వర్ణన వున్నాయి. రెండవ ఆశ్వాసంలో వీరనరసింహుని ధార్మికత, విద్యారణ్య స్వామిని గూర్చిన అతనిప్రశ్న, దానికి డిండిమభట్టు సమాధానం వున్నాయి. పిమ్మట వీర నరసింహరాయలు తన కుమారుడైన కృష్ణరాయని పట్టాభిషేకం రాయలపాలన, దిగ్విజయ యాత్రా సంకల్పము వర్ణితములు. మూడవ ఆశ్వాసము రాయల దిగ్విజయయాత్ర, నాల్గవ ఆశ్వాసమున రాయలు గజపతి పుత్రి తుక్కాదేవిని వరిణయ మాడవలెననుకొనుట, వారి వివాహము, విజయనగరమునకు పునరాగమనము నిబంధితములైనవి.

అర్థగాంభీర్యము, శబ్దాడంబరము పడుగు పేకలుగా నేసిన కావ్యమిది వీనిలో శబ్ద వైచిత్రికే పెద్దపీట.

" అంత వసంత మెంతయు(ననంత ఘనాంత కాంత వ
న్యాంతిక దాంతురీజవదనంత లతాంత నితాంత కాంతి తో
సంత శకుంత సంతతి హ్వసంత: సంతత చింతితార్థ భా
స్వంతము పొల్చెనా విరహ వంతులకెంతయు వింత వింతగాన్ "
(4—41)

ఈ పద్యం వెనుకనుండి నన్నయగారి వసంతం గుబాళిస్తోంది కదూ!

అలాగే మరొక పద్యంలోనుండి రామరాజ భూషణుని ముద్ర తొంగిచూస్తోంది.

" మధురసాధిక సుధామధురసారోల్లస
న్మధురసావల్లరి మహిమతోడ
సురసాలతుల్య భాసుర సాలవన మధ్య
సురసాల జంబీర తరులతోడ " (1—54)

ఇత్యాదిగా సాగే సీసపద్యం. అలాగే తుంగభద్రను వర్ణించిన పద్యం యితని శబ్దాకారాన్ని ప్రకటిస్తుంది.

రంగత్తుంగ తరంగ ఘుంఘుమరవ ద్రాఘిష్ఠ శైలాంత రా
భంగ గ్రావ పరస్పరోత్కషణ భిద్యద్గ్రాహ పాఠీన సా
రంగా నీక కుళీర హంస బక చక్రి క్రౌంచవన్యోత్థమా
తంగ ధ్వన్యరీ కృతాఖిల సముద్రం తుంగభద్రానదిన్"
(2-26)

ఇతనికి మావి చిగురులు ' సారెకు సారెకుం గుసుమ సాయకు(డధ్వగ రాజి గుండియల్, దూషగ వేగ(జేవెదలి దూసి వెసన్ జలిపించు రక్తసిక్తారుణ నూతనాయుధములై " గోచరించినవి.

ఇక చారిత్రక విషయానికి వస్తే కృష్ణదేవరాయలను వీరనరసింహరాయల కుమారునిగా వర్ణించటం, వీరనరసింహరాయలను విజయనగరరాజుల పరంపరలో యిరువదవ వానిగా పేర్కొనటం కుమార ధూర్జటి లోపాలు. కృష్ణరాయలు వీరనరసింహుని సోదరుడు. వీర నరసింహుని దాకా 29 మంది రాజులు విజయనగరాన్ని పాలించారని రాయవాచకం తెలుపుతోంది. మరొక విచిత్రం: ధూర్జటి పౌత్రుడనని చెప్పుకున్న ఈ కవి కృష్ణరాయల ఆస్థాన కవుల ప్రశంసలో ధూర్జటి పేరు స్మరింపక పోవటం విచిత్రంకాదూ: ఆర్వీటి చిన వేంకటాద్రి చేత మాత్రం చెప్పించాడు. (1-29)

భార్గవదేవ

పురోగతి అంచున
(కథల సంపుటి)

[రచయిత: అడిగోపుల వెంకటరత్నమ్ ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్, కారల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 520 002. మేలుప్రతి వెల: రూ. 8-00.]

1972-'76 సంవత్సరాలమధ్య ఆంధ్రజ్యోతి వారపత్రిక, ప్రగతి వార పత్రికల్లో ప్రచురింపబడిన 15 కథలను ఈ సంపుటిలో ప్రచురించారు. ఈ కథల్లో మనసుమర్మం, సైకోసిస్, మారిన మనసు అనే కథలు కన్నడ భాషలోకి అనువదింపబడినవి. ఇందులో మరలా మొదటి రెండు కథలూ మలయాళంలోకి అనువదింపబడినవి. కన్నడ, మలయాళ భాషా పత్రికల్లో ఆ కథలు పచురింపబడ్డాయి.

ఈ కథల సంపుటి మనసు మర్మం, దేశంలో ఓ గూడెం, పురోగతి అంచున, సైకోసిస్, ఏది అసలైన న్యాయం, భార్యాభర్తలాట, తీర్పు, తప్పెవరిది?, రిటైరైన మర్నాడు, మారిన మనసు, జీవితం పూలపాన్పు కాదు, మలుపు, అంటుమొక్క, అక్కయ్య కాపురం, నల్లచీర అనే కథలు వరుసగా వున్నాయి.

యుక్తవయస్సు వచ్చిన నెలరోజుల లోపల వయసుమళ్ళిన వారితో అనుభవం పొంది, కొంతకాలం తరువాత సెక్స్ పరిచయం లేకపోతే తలనొప్పి వచ్చే ఆస్కారం వుంది. వెంటనే పెళ్ళి జరిగితే తలనొప్పి దానంతటదే తగ్గిపోతుంది. ఒక సైకాలజీ ప్రొఫెసర్ ఒక తలనొప్పి ఆడపేషంట్ రోగానికి విరుగుడు ఈ విధంగా చెప్పి సఫలీకృతుడవుతాడు. అదే మొదటి కథ మనసు మర్మం.

నిరుపేదల బాధలు, చావులు, మనుమలు, తాగుబోతు తనాలు మొదలైన విషయాలను కన్నులకు గట్టినట్లు వర్ణించే కథ దేశంలో ఓ గూడెం. కరువొచ్చి జనం మూకుమ్మడిగా చస్తే, తన సారాయి వ్యాపారం సాగేదెట్లాగా అని దిగులుపడిన ఏడుకొండలు ఇందులో కనిపిస్తాడు.

పురోగతి అంచున మూడోకథ. ఇదే పుస్తకం పేరుగూడా: కు[illegible]లను మరచిపోయి ప్రేమలోపడ్డాడు గౌతమ్. పిల్లతండ్రి అతణ్ణి [illegible]దాతో కొట్టి, పైగా డాక్టర్‌కి లంచం ఇచ్చి అతణ్ణి చంపించాడు. ఇదే పురోగతి అంచున. మానసికంగా షాక్‌తిని సైకోసిస్ అనే జబ్బుకు గురియైన యువతికి పెళ్ళిచేసి జబ్బుకుదిర్చే కథ సైకోసిస్. ఒక కోర్టులోనే [illegible]డురకాల న్యాయాల కథ ఏది అసలైన న్యాయం. పరాయి స్త్రీని తన పెళ్ళాం అనిచెప్పి పల్లిగా మోసగించి నగను కాజేసుకెళ్ళే కేడీ కథ భార్యాభర్తలాట. న్యాయస్థానాల్లో తీర్పులు ఎలా వుంటాయో వ్యంగ్యంగా విమర్శించే రచన తీర్పు. ప్రభుత్వాసుపత్రిల్లో మందునీళ్ళు పోయించుకోడానికి పేదలు బయట సీసాలు కొంటుంటారు. ఆ సీసాలు శుభ్రం చేయాలని నిరక్షరాస్యులైన ఆ పేదలకు తెలియదు. ఒక కాలేజీవాళ్ళే యాసిడ్ సీసాలను కడక్కుండా అమ్మితే ఇక సామాన్యుల సంగతి చెప్పేదేముంది. చివరకు అమాయకుల ప్రాణాలకు ముప్పుతెచ్చే ఈ విధానంలో తప్పెవరిదని చెబుతాం? తప్పెవరిది కథయిదే: పదవిలో ఉన్నప్పుడు అధికారాన్ని వెలగబెట్టి ఇంట్లోవాళ్ళకి కష్టం అనేది తెలీకుండా చేసిన పెద్దమనిషి రిటైరయిన తరువాత, ఆ హంగులన్నీ లేకపోతే కుటుంబ సభ్యుల ప్రవర్తనను వర్ణించే కథే "రిటైరైన మర్నాడు". తనకు మనసిచ్చిన విద్యార్థిని మనసును మార్చి, ఆమెకు బంధువుల అబ్బాయితో వివాహం అయ్యేట్లు చేసిన సైకాలజీ ప్రొఫెసర్ తెలివి తేటల కథ మారిన మనసు. రచయిత్రిల అభిప్రాయం మారడం అనే విషయాన్ని గూర్చి ఆలోచనాత్మకంగా వ్రాసిన కథ జీవితం పూలపాన్పుకాదు. ఇంకో సైకాలజీ ప్రొఫెసర్ తెలివితేటల వర్ణన 'మలుపు'. దొంగగా మారిపోయి ఎప్పుడో చిన్నప్పుడు వదిలేసిన తన కూతుర్[illegible]ం తిరిగివచ్చి, ఆమెను పెంచినవాడినే డబ్బుకోసం చంపి, కూతురు వలనే పోలీసులకు చిక్కిన ఓ తండ్రికథ "అంటుమొక్క". బావగారిని గూర్చి గొప్పగావిన్న వ్యక్తి అక్కయ్య కాపురాన్ని చూచి ఆనందిద్దామని పోతే, బావ ఎంత భయంకరుడో చూడవలసివచ్చిన కథ అక్కయ్య కాపురం. తనను కోరుకున్న స్త్రీని పెండ్లి చేసుకుందామని మనసు మార్చుకొని తిరిగివస్తే ఆమె సముద్రగర్భంలో కలిసిపోయి, దారిలోనే ఆమె చీర కనబడటం "నల్లచీర" లో కథ.

పై విధ్యమున్న ఇతివృత్తాలతో, ఎక్కడా విసుగుపుట్టకుండా అడిగోపుల వెంకటరత్నమ్‌గారు ప్రతి కథనూ తీర్చిదిద్దారు. ప్రతి పాత్రా చైతన్యవంతమై పాఠకుల కన్నుల ఎదుట ప్రత్యక్షమవుతుంది. ఎక్కువ కథల్లో సైకాలజీ విషయాలను స్పృశించి, ఈ రచయిత తెలుగు కథానికా సాహిత్యానికి ఒక

కొత్త అందాన్ని చేకూర్చిపెట్టారు. ఈ కథానికల సంపుటి ప్రచురణ ప్రశంసార్హంగా ఉంది.

పులిచెర్ల సాంబశివరావు

కావ్యసమీక్ష

(రచయిత-శ్రీకర్ల రాజశేషగిరిరావు; ప్రకాశకులు - మారుతీ బుక్ డిపో-గుంటూరు-8; మూల్యము - రు. 6/-)

ఎం. ఏ. (సంస్కృతము) పరీక్ష వ్రాసినపుడు తయారుచేసికొనిన వ్యాసముల సంపుటి ఈ కావ్యసమీక్ష. 'తెలుగు విద్యార్థి' పత్రికలో ప్రచురితములు'-

మూడు, నాలుగు భాషల్లో ఉన్నతస్థాయిని పట్టములు పుచ్చుకున్న రావుగారు శ్రద్ధగా చదివిన చదువును నిర్దుష్టంగా నిర్వివాదంగా ఉపయోగించుకున్న సరస్వతీపుత్రులు.

ఈ వ్యాససంపుటి 'కావ్యము-దాని లక్షణము' - అనే శీర్షికతో ఆరంభించి కావ్యము-దాని సుగుణములు' - అనే శీర్షికతో ముగిసే పది వ్యాసాలతో వున్నది.

వాటిలో రససిద్ధాంతము నలుగురు లాక్షణికుల మతమును వివరిస్తూ చివరకు అభినవ గుప్తుని సిద్ధాంతానికి పట్టం కట్టింది.

కావ్యాత్మను చెప్పడంలో వామనుని పిడివాదాన్ని నిరసించి ఆనంద వర్ధనుని ధన్యాత్మకతను వివరిస్తూ చెప్పడం సర్వాత్మనాసర్వులకూ అంగీకార్యమే. కాలక్రమాన రచయిత ఆత్మను గుర్తించి ఆత్మసిద్ధాంతం ప్రముఖ స్థానాన్ని పొందిందంచే ప్రత్యాఖ్యానం వుండదు.

వర్తమానకాలమున వర్ధమాన రచయితలు ప్రాచీన గ్రంథాలను చదివే ఓపిక లేకపోవుగాక! శేషగిరిరావుగారి యీ వ్యాససంపుటిని చదివి ముఖ్యంగా దోషప్రకరణాన్ని చదివి అర్థం చేసుకుని సత్కావ్య నిర్మాణానికి సంసిద్ధులు కాగలరని నా అభిప్రాయం.

ఏది దోషం? ఏది గుణం? అనేది తెలిసి కావ్యరచన చెయ్యాలి కదా! దానికి యీ చిన్ని సమీక్షాగ్రంథం చక్కగా ఉపయోగిస్తుందని నొక్కి వక్కాణిస్తున్నాను. అయితే యీ సూచన ప్రాచీన పద్ధతిననుసరించే రచయితలకే.

కొన ఊపిరితో వున్న సంస్కృతభాషను ఉద్ధరించే పద్ధతి తెరచాటుగా వున్న కాలంలో ఇంకా ఇలాటి సమీక్షలు వేస్తున్నందుకు ఆనందించేవారుండకపోరు.

రాజతరంగిణి

అష్టమ తరంగము (ప్రథమ విభాగము)

(రచయిత-శ్రీ రెంటచింతల లక్ష్మినరసింహశాస్త్రి, కావ్యలక్ష్మి పబ్లిషర్స్ లాలాగుడా, సికింద్రాబాద్ 500 017, మూల్యము: రూ. 8-00)

చరిత్రలను చెప్పే కావ్యాలు చాలా తక్కువగా కనిపిస్తాయి. ఉన్నవాటిలో విక్రమాంక దేవచరిత్ర వినుతికెక్కింది. దానిని పోలినదే కల్హణరచితమైన 'రాజతరంగిణి'-

కాశ్మీర రాజ్యపాలకుల చరిత్రను చక్కగా సప్రమాణంగా వ్రాసిన కల్హణుడు కవిచరిత్రలో గణనీయుడూ మాననీయుడూ అంటారు.

ఈ రాజతరంగిణి ఇంతకుమునుపు వచనానువాదరూపాన వెలిసింది. ప్రస్తుతం శ్రీ లక్ష్మినరసింహశాస్త్రిగారు గద్యపద్యాత్మకంగా అనువదిస్తూ చివరి తరంగం వరకూ వచ్చారు. విశిష్టమైన ప్రయత్నం.

ఈ భాగమందు ఇద్దరన్నదమ్ముల చరిత్ర ప్రధానంగా ఉన్నది, అన్న ఉచ్చలుడు. ఆరంభంలో అన్నివిధాలా అందరికీ మాననీయుడుగా ప్రవర్తించిన బుద్ధిమంతుడు.

ధనికునకూ వర్తకునకూ గలిగిన వివాదం అతి బుద్ధికుశలతతో తీర్చాడు. తొలినాళ్ళలో తన ప్రవర్తనచే రఘువంశపు రాజులను తలపించినవాడు. ఎంతవానినైనా తారుణ్యం దారితప్పించి సంఘ విరోధిని చేస్తుందనడానికి ఉచ్చలుడు ప్రథమోదాహరణం - ఆ విధాన చెడిపోతాడు.

తమ్ముడు సుస్సలుడు అలాకాక చివరకు సర్వాధిపతియైన నృపతి అవుతాడు.

ఈ గ్రంథం నేటి ప్రజాపాలకులు చదవాలి - తామెలా ప్రవర్తించాలి? ఎలా ప్రవర్తించకూడదు? అనేది తెలుస్తుంది.

శాస్త్రిగారి కవిత సొంపైన ధారతో అనడానికి వినడానికి నింపుగా వింపుగా వున్నది. ఛందఃపద్ధతిలో విశేషించి అఖండయతి కనిపిస్తుంది. అది అంత సముచితంగా నాకు తోచలేదు.

> 'ఇతర రాజులు, ధూర్వహించె. దినారములు,
> జపతపాదులు-' లాంటి ప్రయోగాలను సవరించవలసి వుంటుంది.

ఈలాటి పుటకలకేమిగాని మిగతా గ్రంథభాగం కూడా త్వరలో వెలింది ప్రకటించి చరితార్థులు కావాలని ఆశిస్తున్నాను

ఈ గ్రంథ ముద్రణకు తిరుపతి దేవస్థానంవారు ఆర్థిక సాహాయ్యం చెయ్యడం సముచితం.

యామిజాల పద్మనాభస్వామి

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phone: 75667 & 61247.